

# నవ వసంతం -2

# తెలుగు వాచకం

## ఏడో తరగతి

(తెలుగు, ఆంగ్ల మాధ్యమాలకు)

**Free**

K6U2E9


తెలంగాణ ప్రభుత్వం

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్

బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా

ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించడానికి

పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా

కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా

CHILD LINE 1098 NIGHT & DAY

24 HOUR NATIONAL HELPLINE

1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి

IN ANY EMERGENCY


DIAL 100

TELANGANA POLICE

www.tspolice.gov.in


@ Telangana State Police




రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ

తెలంగాణ, హైదరాబాదు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ



SCERT TELANGANA

# తెలంగాణ

ఘన తెలంగాణను
కన్నావురా బాల !
మన తెలంగాణ కత
విన్నావురా బాల !!

పోరాట పటిమకు
పురిటిల్లు మన నేల !
ధిక్కార గళమెత్తు
ధైర్య శాలుర నేల !!

సమ్మక్క సారక్క
సమరాంగణపు హేల !
పాపన్న గోల్కొండ
పీఠమెక్కిన నేల !!

కొమురం భీమన్న
గుదుపలేపిన నేల !
దొడ్డి కొమురయ్య లేచి
దుడ్డు లేపిన నేల !!

చాకలి అయిలవ్వ
రోకలెత్తిన నేల !
తొడగొట్టి దొరలను
తరిమివేసిన నేల !!

సురవరం కవులను
నిదురలేపిన నేల !
షోయబుల్లాఖాను
స్మృతిని మరువని నేల !!

గోదావరి కొంగు
బంగారు మన నేల !
కృష్ణమ్మ ఒడిలోన
కేరింతల హేల !!

బాలఘాట్ శిఖరాల
పారాడు మన నేల !
కందికల్ గుట్టల
అందుకొన్న నేల !!

వేయి స్తంభాలయం
విలసిల్లిన నేల !
కాకతీయుల కీర్తి
తోరణమ్ముల హేల !!

రామప్ప గుళ్ళలో
నాట్యకత్తెల హేల !
నాగిని నగిశీలు
నృత్యమాడిన నేల !!

బసవ గీతాలతో
పరవశించిన నేల !
భక్తి పద్యావళి
పరిమళించిన నేల !!

బతుకమ్మ ఆటలో
బతుకు చూపే నేల !
పీర్ల పండుగలో శాంతి
పొర్లి పారే నేల !!

శివసత్తు లెగిరెగిరి
చిందులేసే నేల !
బోనాల పర్వంపు
భోగాలు గల నేల !!

చెరువులు కుంటలు
ఒరచి పారే నేల !
భూమాత స్తన్యమ్ము
పొంగు బావుల నేల !!

హిందువులు ఉర్సుల్లో
చిందులేసే నేల !
ముస్లింలు గుళ్ళలో
ముడుపు కట్టే నేల !!

కులగోడలన్నింటి
కూల్చి వేసిన నేల !
వరసలు కలుపుక
పిల్చుకొను మన నేల !!

ఈ మట్టి నొకమారు
పుట్టియున్న చాలు !
ఈ మట్టిపై కాలు
పెట్టియున్న చాలు !!

నవ నాదులందున
నవరసమ్ముల పొంగు !
నవ జీవనమ్మెత్తు
భావమ్ము ఉప్పొంగు !!

ఘన తెలంగాణను
కన్నావురా బాల !
మన తెలంగాణ కత
విన్నావురా బాల !!

పూర్వికుల త్యాగాలు
తీర్చవల్సిన ఋణం !
దీని పునర్నిర్మించి
తీర్చుకొందుము తృణం !!

– వెలపాటి రామరెడ్డి

## విద్యార్థులకు సూచనలు

పిల్లలూ!...

- మీరందరూ ధారాళంగా చదవగలగాలి. తెలిసిన దాని గురించి సొంతంగా రాయగలగాలి. ఒకవేళ మీరు చదువడం, రాయడం చేయలేకుంటే మీ ఉపాధ్యాయుని సాయంతో చదువడం, రాయడం నేర్చుకొండి.
- మీకోసం మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు పుస్తకాన్ని రూపొందించారు. మీ పుస్తకంలో మీరు నేర్చుకోవలసిన సామర్థ్యాల గురించి ఒక పేజీలో ఇచ్చారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి మీరు వీటిని చేయగలగాలి. వాటిని తప్పకుండా చదువండి.
- ప్రతి పాఠం ప్రారంభంలో బొమ్మ/పద్యం/విషయం ఉంటుంది. వాటి గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పండి.
- 'విద్యార్థులకు సూచనలు' అనే శీర్షికన ఉన్న సూచనలు చదివి అర్థం చేసుకొని పదాల అర్థాలు తెలుసుకొండి.
- మీ ఉపాధ్యాయుడు పాఠంలోని విషయం గురించి బోధించేటప్పుడు తప్పనిసరిగా మీకు తెలియని పదాలు, వాక్యాలు, విషయాల గురించి ప్రశ్నించండి, చర్చించి తెలుసుకొండి.
- తరగతిగదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు కూడా పాల్గొనాలి, మాట్లాడాలి, అవసరం అయితే ప్రశ్నించాలి.
- పాఠం తర్వాత 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలు ఉన్నాయి. వీటిని మీరు సొంతంగా చేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీ మెటీరియల్, ప్రశ్నల జవాబులు చూసి రాయకూడదు. ఒకవేళ అట్లా రాస్తే ఫార్మేటివ్ మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.
- పాఠంలోని ప్రాజెక్టుపనులు, ప్రశంసకు సంబంధించిన అభ్యాసాలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎట్లా చేయాలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకొండి. వీటిని చేసిన తర్వాత మీరు ఎట్లా చేశారు? ఏం చేశారు? ఏం నేర్చుకున్నారు? మొదలైనవి మీ సొంతంగా చెప్పవలసి ఉంటుంది.
- సృజనాత్మకతలోని అంశాలను ఎట్లా చేయాలో తరగతిగదిలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకొండి. సూచనల ఆధారంగా మీరు తరగతిలో రాసి చూపించాలి. దీనిపైన చర్చ జరిగిన తర్వాతనే మీ నోటుపుస్తకాలలో రాయాలి.
- చదవడం, పదజాలంలోని అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటి గురించి మాత్రమే ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకొండి.
- అభ్యాసాలలో ఇచ్చిన 'భాషను గురించి తెలుసుకుందాం'లోని వ్యాకరణాంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థమయ్యేలా సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకొండి.
- ప్రతిపాఠంలో చివరకు 'నేనివి చేయగలనా?' అనే పేరుతో పట్టికలో కొన్ని వాక్యాలు ఉన్నాయి. ఒక్కొక్క వాక్యాన్ని చదువండి. చేయగలిగితే 'ఔను' వద్ద, చేయలేకుంటే 'కాదు' వద్ద '✓' పెట్టండి. వీటిలో మీరు చేయలేనివాటి గురించి మీ ఉపాధ్యాయుడి సహాయంతో పునరభ్యాసం చేయండి.
- ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదువండి. వాటి గురించి మాట్లాడండి.
- చుక్క గుర్తున్న పద్యాలను మీరు తప్పనిసరిగా కంఠస్థం చేయాలి.
- పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను, గ్రంథాలను పాఠశాల గ్రంథాలయానికి వెళ్ళి అడిగి తీసుకొని చదువండి.
- మీరు తప్పనిసరిగా నిఘంటువును ఉపయోగించడం అలవాటుచేసుకోండి. వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, కథల పుస్తకాలు వంటివి చదువడం అలవాటుగా చేసుకొండి.
- కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం – అభినయంచేయడం, పద్యాలను కంఠస్థం చేసి రాగ భావయుక్తంగా పాడడం వంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధనచేయండి.
- మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, నినాదాలు, కరపత్రం, సంభాషణ, పోస్టరు తయారీ వంటివి రాయగలగాలి.
- సృజనాత్మకతలోని అంశాలను మీరు రాసిన తరవాత ఒక పుస్తక రూపంలో సంకలనంచేసి తరగతిలో ప్రదర్శించండి.

SCERT TELANGANA

# నవ వసంతం - 2

## తెలుగు వాచకం (తెలుగు, ఆంగ్ల మాధ్యమాలకు)

## ఏడో తరగతి

### సంపాదకమండలి

**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాల, వరంగల్

**వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.

**సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.

**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

### సమన్వయం, విషయనిపుణులు

**సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,**
సలహాదారు, విద్యా సంస్కరణలు,
పాఠశాల విద్యాశాఖ,
హైదరాబాద్, తెలంగాణ.

**ముఖచిత్రం : కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. కుర్మేడు, నల్లగొండ జిల్లా.

### పాఠ్యపుస్తక ప్రచురణ సమితి

**ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**కె. కృష్ణమోహన్ రావు**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.

క్యు.ఆర్. కోడ్
బృందం

N5Z9K8

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

**"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"**

**తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్**



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

© Government of Telangana, Hyderabad

*First Published 2015*
*New Impressions 2016, 2017, 2018, 2019, 2020, 2021*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22**

SCERT TELANGANA

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Khairatabad, Hyderabad,
Telangana.

# ముందుమాట

2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్రను తెలిపే విధంగా పాఠాలు ఉండాలని నిర్ణయించింది. ఇందుకోసం కవులు, రచయితలు, భాషావేత్తలు, క్షేత్రస్థాయి విషయనిపుణులతో ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు ప్రస్తుతం అమల్లో ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించి తెలంగాణ సాహిత్యం, సంస్కృతి ప్రతిబింబించేటట్లు పాఠ్యపుస్తకాలను రూపొందించారు. తెలుగు సాహిత్యంపట్ల అవగాహన ఏర్పడడానికి ఇతర ప్రాంతాలకు చెందిన కవులు, రచయితల పాఠాలను కూడా పొందుపరిచారు.

భాషాసామర్థ్యాలు, సృజనాత్మకత, మానవీయ విలువలు పెంపొందించడానికి వీలుగా తెలుగు వాచకాలను రూపొందించారు. దీని ద్వారా పిల్లల్లో అవగాహన చేసుకొని ప్రతిస్పందించే సామర్థ్యాలతోపాటు స్వీయ రచనాశక్తి పెంపొందుతుంది. గ్రామసౌందర్య చిత్రణ, వృద్ధులపట్ల వైఖరి, నైతికవిలువలు, మాతృప్రేమ, విద్య ఆవశ్యకత, దేశభక్తి, కళ, శ్రమ సౌందర్యాలు, సామాజిక సమరసత, సాంస్కృతిక విలువలు మొదలైన ఇతివృత్తాల ఆధారంగా పాఠాలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని కవుల రచయితల ప్రాచీన, ఆధునిక సాహిత్యాల నుండి పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. గేయం, కథాకావ్యం, ఖండకావ్యం, వ్యాసం, శతకం, ఆత్మకథ, జానపద చారిత్రక గేయకథ, పద్యం, రేడియో ప్రసంగం, వచనకవిత, బుర్రకథ, కథానిక మొదలైన ప్రక్రియల్లో పాఠ్యాంశాలున్నాయి. విస్తారపఠనానికై తెలంగాణ ప్రాంత స్ఫూర్తిదాతలైన రుద్రమదేవి, ఆరుట్ల కమలాదేవి, శాస్త్రీయ పరిశీలనను పెంపొందింపజేసే www.శారదవి.కామ్, మన సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకోవడానికి మనపండుగలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి అద్భుతమైన సెలవులు మొదలైన అంశాలను ఉపవాచకంగా పెట్టారు. ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి, తెలంగాణ కళలు, కళాకారులపట్ల అభిరుచి, ఆదరణ కలిగించడానికి ఈ వాచకం తోడ్పడుతుంది.

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకనుగుణంగా **"ఇవి చేయండి"** శీర్షికతో అభ్యాసాలున్నాయి. ఆలోచించడం, ప్రతిస్పందించడం, అభిప్రాయాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, సహేతుకంగా వివరించడం, అన్వయించడం, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా వ్యక్తీకరించడం వీటి స్వభావం. పిల్లలు పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి వీలుగా ప్రాజెక్టుపనుల వంటివి చేర్చారు. ఇవి స్వీయ అధ్యయనాన్ని, అదనపు / పరామర్శ గ్రంథాలను సంప్రదించడాన్ని ప్రోత్సహించేటట్లు ఉన్నాయి. పాఠంలోని విషయాన్ని అవగాహన చేసుకోవడానికి వీలుగా సందర్భోచిత అర్థాలను 'పదాలు-అర్థాలు' పేరుతో పుస్తకం చివర చేర్చారు. వీటిలో వీలయినంత మేరకు తెలంగాణలో వినియోగించే పదజాలాన్ని పొందుపరిచారు.

ఉపాధ్యాయులు సోపానక్రమం ప్రకారం పాఠాన్ని బోధించడానికి వీలుగా పాఠంలోని విషయాలను పొందుపరిచారు. గద్య, పద్య పాఠాలను వేర్వేరుగా ఇవ్వకుండా పాఠాల స్వభావం, నిడివి ఆధారంగా వరుస క్రమంలో ఉంచారు. వ్యాకరణ సూత్రాలను సులభంగా ఆకళింపు చేసుకునేటట్లు ఉదాహరణలు పొందుపరిచారు. భాషోపాధ్యాయులు పాఠంలోని విషయాన్ని నేరుగా బోధించకుండా పాఠ్యాంశం ముందున్న అంశాలతో ప్రారంభించాలి. తర్వాత పాఠ్యాంశాన్ని చర్చలు, ప్రతిచర్చల ద్వారా అవగాహన కల్పించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. అభ్యాసాలపై సాధన చేయించాలి. పాఠ్యాంశంలోని జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సందేశాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైన చర్చద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహకారి మాత్రమే. పరామర్శ గ్రంథాలను, పాఠశాల గ్రంథాలయాన్ని తాను వినియోగించుకుంటూ పిల్లలు వినియోగించుకునేలా భాషావాతావరణాన్ని కల్పించాలి.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. కాబట్టి భాషాపరంగా లేదా ఇతర అంశాల గురించి విజ్ఞులు ఇచ్చే సలహాలు, సూచనలను ఎస్.సి.ఇ.ఆర్.టి. స్వీకరించి తగు చర్యలు చేపడుతుంది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి **గౌ॥ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు**గారికి, విద్యాశాఖామంత్రి **శ్రీ కడియం శ్రీహరి**గారికి, విద్యాశాఖా పూర్వమంత్రి **శ్రీ జి.జగదీశ్ రెడ్డి** గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వ సంచాలకులు **శ్రీ ఎమ్.జగదీశ్వర్** గారికి, ప్రస్తుత సంచాలకులు **శ్రీ టి.చిరంజీవులు** గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి **శ్రీమతి రంజీవ్.ఆర్.ఆచార్య** గారికి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు **శ్రీ కె.వి.రమణాచారి**గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదక మండలి సభ్యులు, విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాల సాధనకు దోహదపడి ఉత్తమ వైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది : 31-01-2015 **సంచాలకులు**

స్థలం : హైదరాబాద్. రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

# పాఠ్యపుస్తక సమీక్ష మరియు అభివృద్ధి కమిటి సభ్యులు

## విశ్వవిద్యాలయ స్థాయి

**ఆచార్య రవ్వా శ్రీహరి,** పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ జి. బాలశ్రీనివాస మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ జిల్లా.

## విద్యావేత్తలు, విషయనిపుణులు

**డా॥ చుక్కా రామయ్య,** విద్యావేత్త, హైదరాబాద్.
**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాల, వరంగల్
**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట, మెదక్ జిల్లా.
**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కరీంనగర్ జిల్లా.
**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ.
**డా॥ ముదిగంటి సుజాతారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకురాలు, ఆర్.బి.వి.ఆర్.ఆర్. కళాశాల, హైదరాబాద్.
**వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.
**సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.
**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి,** సలహాదారు, విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్, తెలంగాణ.
**కె. కృష్ణమోహన్ రావు,** ప్రొఫెసర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**ఎం. దీపిక,** ఉపన్యాసకురాలు, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**కె.రాజేందర్ రెడ్డి,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**తల్లావజ్ఝల మహేష్‌బాబు,** ఉపన్యాసకుడు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్.


## క్షేత్ర స్థాయి

**పల్లెర్ల రామమోహన రావు,** యస్.ఎ., తెలుగు, జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.
**వి. చెన్నయ్య,** యస్.ఎ., తెలుగు, జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.
**వొజ్జల శరత్ బాబు,** తె.పం., ప్ర.ఉ.పా.(బాలుర & బాలికల), సీతాఫల్‌మండి, హైదరాబాద్.
**అవుసుల భానుప్రకాశ్,** యస్.ఎ., తెలుగు, జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.
**కందాడై రంగరాజు,** యస్.ఎ., తెలుగు, జి.ప.ఉ.పా., రంగాపురం, రంగారెడ్డి జిల్లా.
**ఎల్.ఎమ్. ప్రసాద్,** తె.పం., ప్ర.ఉ.పా., హిమాయత్ నగర్, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.
**పల్లి మాధవి,** తె.పం., భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాద్.

SCERT TELANGANA

## క్యూఆర్ (QR) కోడ్‌ను వినియోగించే విధానం

- ఈ పాఠ్య పుస్తకంలో ఇలాంటి క్యూఆర్ కోడ్‌లను పొందుపరిచారు.
- ఈ క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించడం ద్వారా మీరు పాఠాలకు చెందిన ఆసక్తికరమైన ఆడియో, వీడియోల ద్వారా అదనపు సమాచారాన్ని మీవద్దగల మొబైల్, ట్యాబ్లెట్ లేదా కంప్యూటర్ల ద్వారా వీక్షించవచ్చు.

| సోపానం | వివరణ |
|---|---|
| **ఎ)** | **క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలను ఆండ్రాయిడ్ మొబైల్ లేదా ట్యాబ్లెట్‌లో వీక్షించుటకు :** |
| 1 | మీ యొక్క మొబైల్ / ట్యాబ్లెట్‌లోని **Play Store** పైన క్లిక్ చేయండి. |
| 2 | సెర్చ్‌బార్‌లో **DIKSHA** ను టైప్ చేయండి. |
| 3 | <br>తెరపైన ఇలా కనిపిస్తుంది. |
| 4 | **INSTALL** పైన క్లిక్ చేయండి. |
| 5 | విజయవంతంగా INSTALL చేసిన తరవాత యాప్‌ను తెరవడానికి **OPEN** పైన క్లిక్ చేయండి. |
| 6 | 'తెలుగు'ను ఎంపికచేసుకొని క్లిక్ చేయండి. |
| 7 | 'కొనసాగించడానికి' క్లిక్ చేయండి. |
| 8 | విద్యార్థి / ఉపాధ్యాయులు రెండింటిలో మీకు చెందిన దానిని ఎంపిక చేసుకోండి. |
| 9 | కుడివైపున ఉన్న క్యూఆర్ కోడ్ చిహ్నం స్కానర్‌ను క్లిక్ చేయండి. తరువాత మీ పాఠ్యపుస్తకంలో ముద్రించిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయండి. (లేదా) సెర్చ్ బార్ నందు (🔍) క్యూఆర్ కోడ్ కింద ముద్రించిన కోడ్‌ను టైపు చేయండి. |
| 10 | క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలు కనిపిస్తాయి. |
| 11 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |
| **బి)** | **క్యూఆర్ కోడ్‌లో అనుసంధానించిన విషయాలను కంప్యూటర్‌లో వీక్షించుటకు -** |
| 1 | **https://diksha.gov.in/telangana** అను లింక్‌ను ఓపెన్ చేయండి. |
| 2 | **Explore DIKSHA-TELANGANA** పైన క్లిక్ చేయండి. |
| 3 | పాఠ్యపుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్ కింద ఉన్న కోడ్‌ను టైపు చేయండి. |
| 4 | ఈ కోడ్‌కు అనుసంధానించిన విషయాలు కనిపిస్తాయి. |
| 5 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

# ఉపాధ్యాయులకు సూచనలు

- ఉపాధ్యాయుల పనిభారాన్ని, పనిదినాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణకు వీలుగా పాఠ్యాంశాల సంఖ్యను తగ్గించి రూపొందించిన వాచకం ఇది. ఒక నెలలోని పనిదినాలను దృష్టిలో పెట్టుకొని మాసవారీగా పాఠాలను కేటాయించారు.
- **'ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యా'లను** తప్పనిసరిగా చదువాలి. **'విద్యార్థులకు సూచన'**లను ముందుగా మీరు చదువాలి. వాటిని మీ పిల్లలతో చదివించాలి. వారికి అవి అర్థమైనాయో లేదో పరిశీలించాలి.
- ఈ వాచకాన్ని 180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. వీటిలో 168 కాలాంశాలు పాఠ్యాంశాల బోధనకు, మిగతా కాలాంశాలను ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 14 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో **'ఆలోచించండి మాట్లాడండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనలు'** శీర్షికన ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాలకు రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించడానికి పాఠంలోని విషయం నిడివిని బట్టి రెండు నుండి నాలుగు కాలాంశాల వరకు కేటాయించుకోవాలి. ఇందుకనుగుణంగా పాఠాన్ని విభజించి రోమన్ అంకెల్లో సూచించారు.
- **'ఇవిచేయండి'** లో ఇచ్చిన అభ్యాసాలలో **విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం** అభ్యాసానికి 1 కాలాంశం, **ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం** అభ్యాసానికి 1 కాలాంశం, **స్వీయరచన** అభ్యాసానికి 2 కాలాంశాలు, **సృజనాత్మకత / ప్రశంస** అభ్యాసానికి 1 కాలాంశం, **పదజాలం, వ్యాకరణాంశాలకు** కలిపి 2 కాలాంశాలు, **'ప్రాజెక్టుపని'**ని ప్రదర్శింపజేసి చర్చించడానికి 1 కాలాంశాన్ని కేటాయించుకోవాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **'ఆలోచించండి - మాట్లాడండి'** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **'విద్యార్థులకు సూచనలు'**లోని అర్థసంగ్రహణకృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల పిల్లలకు అవగాహన కల్పించడానికి చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శనా పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయా పాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో **'ఆలోచించండి-చెప్పండి'** అనే పేరుతో గడిలో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడగాలి. ఆలోచించి జవాబులు చెప్పమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేలా చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేటట్లు చేయాలి. పిల్లల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడం జరగాలి.
- **'ఇవిచేయండి'**లోని అభ్యాసాలు పిల్లల భాషాసామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేటట్లు చూడాలి.
- పిల్లలు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించాలి. గైడ్లు, స్టడీమెటీరియళ్ళు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసి రాయడాన్ని పూర్తిగా నిషేధించాలి. ఎందుకంటే పరీక్షల్లో పుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగానే రావు. ఇట్లాంటి స్వభావం కలిగిన ప్రశ్నలు వస్తాయి. పాఠంలోని అభ్యాసాలను సొంతంగా రాయగల్గిన పిల్లలు మాత్రమే వీటికి సమాధానాలు రాయగల్గుతారు.
- **'స్వీయరచన'** అభ్యాసంలోని లఘుసమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటిపనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా, వాక్యాలు, పదాలు, అక్షరదోషాల పరంగా సరిచేయాలి.
- **'సృజనాత్మకత/ప్రశంస'** కు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తరువాత వీటిని వ్యక్తిగతంగా రాయమనాలి. **'ప్రాజెక్టు పనుల'**ను కూడా ఇదేవిధంగా నిర్వహించాలి.
- పాఠం పూర్తి కావడమంటే **'ఆలోచించండి మాట్లాడండి'** అనే ఉన్ముఖీకరణ అంశంతో మొదలుకొని పాఠంలో చివర ఇచ్చిన **'సూక్తి'** వరకు అన్ని అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి అవగాహన కల్పించడం. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తయారుకావాలి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

- ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

1) తరగతి 2) సబ్జెక్టు (విషయం) 3) అవసరమైన కాలాంశాల సంఖ్య

4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

5) మాసవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

1) పాఠం పేరు 2) అవసరమైన కాలాంశాల సంఖ్య 3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

5) ఉపాధ్యాయుడి తయారీ (సంసిద్ధత), అదనపు సమాచారసేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి –

I. **ఉపోద్ఘాతం** : పలుకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ.

II. **పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల ప్రకాశ పఠనం, ఉపాధ్యాయుల ఆదర్శ పఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన.

III. **'ఇవి చేయండి'** ఆధారంగా సామర్థ్యాల సాధన.

- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకూడదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్‌లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకునేటట్లు చూడాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.
- **క్యూఆర్ కోడ్ వినియోగం** – పాఠ్యాంశాలలోని విషయాలను ప్రభావవంతంగా, అర్థం చేసుకోవడానికి, భాషాసామర్థ్యాల మీద పట్టు సాధించడానికి వీలుగా ఈ పుస్తకంలో **QR (Quick Response)** కోడ్‌లను చేర్చి బలోపేతం చేసారు. **QR** కోడ్‌లో అనుసంధానించిన విషయాలను స్మార్ట్ ఫోన్‌లో చూడవచ్చు లేదా **LCD** ప్రొజెక్టర్ / కె-యాన్ ప్రొజెక్టర్ ద్వారా తెరపై ప్రదర్శించవచ్చు. **QR** కోడ్‌లలో ఉన్న సమాచారం చాలా వరకు వీడియోలు, యానిమేషన్స్ మరియు స్లైడ్‌ల రూపంలో ఉంటుంది.
- ఈ అదనపు సమాచారాన్ని **QR** కోడ్ వినియోగం ద్వారా విద్యార్థులకు అందించి వారి భాషాసామర్థ్యాలను పెంపొందించవచ్చు.
- ప్రతి పాఠంలో రెండు **QR** కోడ్‌లు ఉంటాయి. పాఠం ప్రారంభంలోని **QR** కోడ్‌ను వీక్షించడం ద్వారా పాఠ్యాంశ విషయం పట్ల అవగాహన ఏర్పడుతుంది. అలాగే సామర్థ్యాల సాధనకనువైన సూచనలు లభిస్తాయి. రెండవ **QR** కోడ్ **'ఇవి చేయండి'** అనే శీర్షిక వద్ద ఉంటుంది. వీటిలో అదనపు ప్రశ్నలు, కృత్యపత్రాల వంటివి ఉంటాయి. వీటి ద్వారా విద్యార్థులకు అభ్యసన ఫలితాలకు అనుగుణంగా అభ్యాసం కల్పించవచ్చు. కాబట్టి ఈ **QR** కోడ్‌లను విద్యార్థులు కూడా వినియోగించేలా చేయాలి. తద్వారా ఆసక్తికరమైన ఆహ్లాదకరమైన బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించవచ్చు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

## వందేమాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
పుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

## జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

## ప్రతిజ్ఞ

– పైడిమర్రి వేంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT TELANGANA

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్,
విద్యాప్రణాళిక, పాఠ్య పుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**వొజ్జల శరత్ బాబు,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**పల్లెర్ల రామమోహన రావు,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**ఎల్.ఎమ్. ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.

**కొండు జనార్దన్,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా. మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా.

**పసునూటి సాంబయ్య,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా. జగ్గయ్యపేట, వరంగల్ జిల్లా.

**డా॥ బి.వి.యస్.స్వామి,** ఉపాధ్యాయుడు,
జిల్లా విద్యా శిక్షణా సంస్థ, కరీంనగర్ జిల్లా.

**మద్రిపెల్లి శ్రీనివాసు,** యస్.ఎ., తెలుగు,
ప్ర.బా.ఉ.పా. (ఉర్దూ మీడియం), ముకరంపుర, కరీంనగర్ జిల్లా.

**అవుసుల భానుప్రకాశ్,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**కందాడై రంగరాజు,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**వి. చెన్నయ్య,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**అల్వాల లక్ష్మణమూర్తి,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా. ఊరుకొండపేట, మహబూబ్‌నగర్ జిల్లా.

**దొడ్లె శారద,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా. ఎడపల్లి, నిజామాబాద్ జిల్లా.

**మద్ది వనజారెడ్డి,** యస్.ఎ., తెలుగు,
ప్ర.ఉ.పా., గడ్డి అన్నారం, హైద్రాబాద్ జిల్లా.

**మహ్మద్ షరీఫ్,** యస్.ఎ., తెలుగు,
జి.ప.ఉ.పా. ముదిమాణిక్, మెదక్ జిల్లా.

**పెద్దింటి అశోక్‌కుమార్,** ఉపాధ్యాయుడు,
యు.పి.ఎస్. రామాజీపేట, కరీంనగర్ జిల్లా.

**బెజ్జారపు వినోద్ కుమార్,** యస్.ఎ.,
జి.ప.ఉ.పా., గాగిల్లాపూర్, కరీంనగర్ జిల్లా.

**సయ్యద్ మతీన్ అహ్మద్,**
జి.ప.ఉ.పా., జూలూరు, నల్లగొండ జిల్లా.

## చిత్రకారులు

**కూరెళ్ళ శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా. కుర్మేడు, నల్గొండ జిల్లా.

**బి. కిషోర్ కుమార్,** ఉపాధ్యాయుడు,
యు.పి.ఎస్. ఉట్కూర్, నల్గొండ జిల్లా.

**కె.బాబు,** ప్రధానోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా. వజ్జిపల్లి, నిజామాబాద్ జిల్లా.

**కూరెళ్ళ రాఘవాచారి,** డ్రాయింగ్ మాస్టర్,
జి.ప.ఉ.పా. నకిరేకల్, నల్గొండ జిల్లా.

**బి.వి.ఆర్. చారి,** చిత్రకారుడు
అకడమిక్ అసిస్టెంట్, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్

**టి.వి. రాంకిషన్,** డ్రాయింగ్ మాస్టర్
జి.ప.ఉ.పా. దుద్దెడ, మెదక్ జిల్లా.

**వడ్డేపల్లి వెంకటేష్,** ఉపాధ్యాయుడు,
పి.ఎస్., సోమవరం, నల్గొండ జిల్లా.

**దాసి సుదర్శన్,** చిత్రకారుడు,
నాగార్జునసాగర్, నల్గొండ జిల్లా.

**చెంచల వెంకటరమణ,** ఉపాధ్యాయుడు,
పి.ఎస్., టేకుమట్ల, నల్గొండ జిల్లా.

**పి. అందాళమ్మ,** చిత్రకారిణి
అంబర్‌పేట, హైదరాబాద్.

**డి.టి.పి., లే ఔట్ & డిజైనింగ్ : మల్లంపాటి కృష్ణారావు, రశ్మి గ్రాఫిక్స్,** హైదరాబాద్.



SCERT TELANGANA

# ఆశించిన అభ్యసన ఫలితాలు

**తెలుగు**
**7వ తరగతి**

## విద్యార్థులు ఇవన్నీ నేర్చుకుంటారు....

- వివిధ సామగ్రిని చదువుతూ రచయిత యొక్క భావాలను అర్థం చేసుకొంటూ వాటికి తమ అనుభవాలను జోడిస్తూ సమ్మతిని, అసమ్మతిని తెలియజేస్తారు.
- చదివిన విషయాన్ని మరింత అవగాహన చేసుకోవడానికి ప్రశ్నిస్తారు, చర్చిస్తారు.
- సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు, జానపద గేయాలు, పోస్టరు, ఆత్మకథలు మొ॥ వాటిని గురించి చర్చించగలరు, ప్రశంసించగలరు.
- విభిన్న స్థానిక / సామాజిక విషయాలపై, ప్రకృతి వైపరీత్యాలపై తార్కికంగా తమ అభిప్రాయాలు వ్యక్తపరుస్తారు.
- పాఠ్యాంశాన్ని అక్కడక్కడ చదివి పాఠంలోని కీలక అంశాలను చెప్పగలుగుతారు.
- కథలు, కవితలు చదివి వాటి రచనా శైలి గురించి అర్థం చేసుకుంటారు
- పాఠ్య విషయాన్ని చదువడం, అర్థం చేసుకొనే సందర్భంలో కలిగే ఇబ్బందిని అధిగమించడానికి తోటి విద్యార్థుల యొక్క,ఉపాధ్యాయుల యొక్క సహకారం తీసుకుంటారు. అవసరమైన చోట్ల నిఘంటువు, చిత్రాలు, ఇంటర్నెట్ మొ॥ సామగ్రిని వినియోగిస్తారు. సహాయం తీసుకుంటారు.
- భాషలోని సూక్ష్మాంశాలు / భాషాసూత్రాలు, కొత్త పదాలు మొదలగు వాటిని ఉపయోగించగలరు.
- వివిధ సందర్భాలలో / అవసరాలకు అనుగుణంగా ఇతరులు చెప్పిన భావాలను సరియైన పద్ధతుల్లో అర్థం చేసుకోవడం / చెప్పడం / రాయడం / వ్యక్తపరచడం. ఉదా: తన వీధిలో వేరే వేరే వృత్తుల పనులు చేసే వారితో మాట్లాడడం.
- తెలుగు భాషలో లభించిన విభిన్న రకాలైన పఠన సామగ్రి. ఉదా: కథ, ఇంటర్నెట్‌లో లభ్యమయ్యే సామగ్రిని అర్థం చేసుకొని చదువడం మరియు వాటిపై తన ఇష్టాయిష్టాలను రాతపూర్వకంగా, బ్రెయిలీలో, సంకేత భాషలో చర్చించడం.
- తమ అనుభవాలను తమ సొంత మాటల్లో రాయగలరు.
- విభిన్న విషయాలు మరియు ఉద్దేశాలకు అనుగుణంగా పదాలు, వాక్యాలు, జాతీయాలు, సామెతలు, విరామ చిహ్నాలను మరియు వ్యాకరణ సూత్రాలను ఉపయోగించగలరు.
- విభిన్న సున్నితమైన అంశాలు / విషయాల గురించి మౌఖిక, లిఖిత, సంకేత రూపంలో తర్కించి అర్థం చేసుకొని వ్యక్తపరచడం.
- గోడ పత్రిక, పత్రికలు మొ॥ వాటికోసం రకరకాల పఠన సామగ్రిని సమకూర్చుకొని రాస్తారు మరియు వాటిని సంకలనం చేసి దానికి సంపాదకీయం రాస్తారు .

విద్య మా హక్కు
సర్వశిక్షా అభియాన్

పాఠశాల విద్యా శాఖ,
తెలంగాణ ప్రభుత్వం

NCERT


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

# 7వ తరగతి

## విషయసూచిక


| క్ర.సం | పాఠం పేరు | కవి / రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | నెల | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | చదువు | కొఱవి గోపరాజు | విద్య ఆవశ్యకత | కథాకావ్యం | జూన్ | 2 |
| *2. | నాయనమ్మ | | వృద్ధులపట్ల వైఖరి / కుటుంబ విలువలు | కథానిక | జూలై | 10 |
| 3. | శతక సుధ | శతక కవులు | నైతిక విలువలు | శతకం | జూలై | 20 |
| *4. | అమ్మ జ్ఞాపకాలు | టి.కృష్ణమూర్తి యాదవ్ | మాతృప్రేమ | వచన కవిత | ఆగష్టు | 32 |
| 5. | పల్లె అందాలు | ఆచ్చి వేంకటాచార్యులు | గ్రామసౌందర్యచిత్రణ | కావ్యం | ఆగష్టు | 42 |
| 6. | ప్రేరణ | డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం | వ్యక్తిత్వ వికాసం | ఆత్మకథ | సెప్టెంబరు | 54 |
| 7. | శిల్పి | గుఱ్ఱం జాషువా | కళాసౌందర్యం | ఖండకావ్యం | అక్టోబరు | 64 |
| *8. | గ్రామాలలోని వేడుకలు క్రీడావినోదాలు | దేవులపల్లి రామానుజరావు | సాంస్కృతిక విలువలు | రేడియోప్రసంగం | నవంబరు | 72 |
| 9. | ఏకులం? | చెరబండ రాజు | సామాజిక స్పృహ | గేయం | నవంబరు | 84 |
| 10. | సీత ఇష్టాలు | | బాలికా విద్య | బుర్రకథ | డిసెంబరు | 92 |
| 11. | శ్రీలు పొంగిన జీవగడ్డ | రాయప్రోలు సుబ్బారావు | దేశభక్తి | గేయం | జనవరి | 106 |
| *12. | రాణి శంకరమ్మ | | చారిత్రక వీరగాథ | గేయకథ | ఫిబ్రవరి | 116 |


## ఉపవాచకం


| | | | |
|---|---|---|---|
| 1. | అద్భుతమైన సెలవులు | జూలై | 128 |
| 2. | రుద్రమదేవి | ఆగష్టు | 133 |
| 3. | మన పండుగలు | సెప్టెంబరు | 140 |
| 4. | www.శారదవి.కామ్ | నవంబర్ | 147 |
| 5. | ఆరుట్ల కమలాదేవి | డిసెంబర్ | 156 |
| | పదాలు-అర్థాలు & విశేషాంశాలు | | 160 |


గమనిక : 1. పాఠంలో ★ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.
2. విషయసూచికలో * గుర్తుగల పాఠాలను కాంపోజిట్ కోర్సువారు చదువాల్సిన అవసరంలేదు.

SCERT TELANGANA

# 1. చదువు

- కొఱవి గోపరాజు

## చదువండి - ఆలోచించండి - చెప్పండి

తే॥గీ॥ ఆటలాడు వేళలయందు నాడవలయు
జదువుకొనఁదగు వేళలఁ జదువ వలయు
నట్లుకాకున్న నారోగ్య మంతరించు
దాన, మేధస్సు బలహీన మౌను సుమ్ము.

U3I1S8

## ప్రశ్నలు

1. ఆటలు ఎందుకు ఆడుకోవాలి? ఎప్పుడు ఆడుకోవాలి?
2. ఏ సమయంలో చదువుకోవాలి? ఎందుకు?
3. ఆటలు ఆడకుండా టీ.వీ చూస్తూ కూర్చుంటే ఏమౌతుంది?
4. చదువు సరిగ్గా చదువుకోకుంటే ఏమౌతుంది?

## పాఠం నేపథ్యం / ఉద్దేశం

ఒకప్పుడు ఉజ్జయిని రాజ్యానికి రాజు విక్రమార్కుడు. అతని తర్వాత కాలంలో భోజరాజు ఆ రాజ్యాన్ని పరిపాలించాడు. భోజరాజు విక్రమార్కుని కథలు అనేకంగా వినేవాడు. ఆ కథల్లో కమలాకరుని కథ ఒకటి. కమలాకరునికి చదువు పట్ల ఎటువంటి ఆసక్తి లేదు. తండ్రి త్రివిక్రముడు చదువు గొప్పతనాన్ని తెలుపుతూ కొడుకును మందలిస్తాడు. మందలించిన విధానం, కమలాకరుడు మారిన పద్ధతి, ఈ పాఠంలో ఉన్నది.

చదువు యొక్క ఆవశ్యకతను తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'కథాకావ్యం' ప్రక్రియకు చెందినది. వివిధ కథల సమాహారకావ్యం కథాకావ్యం. దీనిలో వస్తువు ప్రధానం. రమణీయ కథన విధానం కలిగిన కావ్యమే కథాకావ్యం. నీతిని, వ్యవహార దక్షతను కార్యకుశలతను, ఉత్తమగుణాలను పెంపొందించే కథలు ఇందులో ఉంటాయి.

కొఱవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక చతుర్థాశ్వాసంలోనిదీకథ. భోజరాజుకు తొమ్మిదవ సాలభంజిక ఈ కథను చెప్పింది.

## కవి పరిచయం



15వ శతాబ్దం

కొఱవి గోపరాజు తల్లిదండ్రులు కామాంబిక, కొఱవి కసవరాజు. గోపరాజు నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ ప్రాంతంవాడు. నాటి పల్లికొండ సంస్థానాధీశుడు, మహారాజు రాణా మల్లన ఆస్థాన పండితుడు. సాహిత్యంతోపాటు రాజనీతి, ఛందస్సు, యోగం, జ్యోతిషం మొదలైన శాస్త్రాలలో ప్రవీణుడు. అందరికీ సులభంగా అర్థమయ్యే విధంగా కథలు చెప్పడం ఈయన ప్రత్యేకత.

## విద్యార్థులకు సూచనలు

- ★ పాఠంలోని బొమ్మలు చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- ★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- ★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- ★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**చదువు మనిషిలో వివేకాన్ని మేల్కొలిపి విజ్ఞానవంతుడిని చేస్తుంది. విజ్ఞానం వల్ల వినయం, పరోపకారబుద్ధి, లౌక్యం, ధర్మనిరతి, ఆదర్శజీవనం వంటి ఉత్తమగుణాలు అలవడుతాయి. తమ పిల్లలు ఉత్తమ పౌరులుగా మారాలని తల్లిదండ్రులంతా కోరుకుంటారు. చదువుపట్ల నిర్లక్ష్యం వహించే పిల్లల గురించి ఎంతో బాధపడతారు. విక్రమార్క మహారాజు యొక్క పురోహితుడైన త్రివిక్రముడు, తన కొడుకు కమలాకరుడు సరిగ్గా చదువుకోవడం లేదని మథనపడ్డాడు. కొడుకుకు ఎట్లా హితవు పలికాడో పాఠం ద్వారా తెలుసుకుందాం!**

SCERT TELANGANA



# I

ఆ.వె॥ భట్టి మంత్రి; సైన్యపాలి గోవింద చం
ద్రుఁడు; త్రివిక్రముడు పురోహితుండు;
నప్పురోహితునకు నాత్మజుండగు కమ
లాకరుండన నవివేకి గలఁడు. 1

కం॥ ఆ కమలాకరుఁ డా కమ
లాకర సాదృశ్యముగ జడాశయుఁడై నన్
శోకము మదిఁ బొదలంగ వి
వేకము పుట్టింపఁ దండ్రి వెరవున దూఱెన్. 2

కం॥ చుట్టములకుఁ దలిదండ్రుల
కెట్టి యెడం బ్రియము నెఱపనెడపని చదువుల్
గట్టిగ నెఱుఁగని పుత్రుఁడు
పుట్టుట కులమునకుఁదెవులు పుట్టుటచుమ్మీ. 3

కం॥ విను ముత్తమమగు పుట్టువు
గనుపట్టెడు నట్టిరూపు గల మోదుగుఁ బూ
వును మూర్ఖుండును బ్రబలెడు
వనమున భవనమునఁ దగిన వాసన గలదే. 4

**ఆలోచించండి - చెప్పండి**

★ అవివేకి లక్షణాలు ఏమై ఉంటాయి?

★ కవి కమలాకరుడిని జడాశయుడు అన్నాడుకదా! ఇట్లా అనడం తగినదేనా? ఎందుకు?

★ 'చదువురాని పిల్లలు వంశానికి తెగులు' అన్నాడు కవి. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

# II

★ కం॥ పరులకు సోదరులకు భూ
వరులకుఁ గొనరాదు సర్వవశ్యము తానె
వ్వరి కిచ్చినఁ గోటి గుణో
త్తర వృద్ధి భజించు విద్య తన ధన మెపుడున్. 5

★ కం॥ పరభూమికిఁ జనుచోఁ ద
స్కరులకు నగపడదు వ్రేగుగా దెచ్చట నె
వ్వరినైన హితులఁ జేయును
ధరలో మఱి విద్యఁ బోల ధనములు గలవే. 6

SCERT TELANGANA

ఉ॥ గద్యముఁ బద్యముం బెనుపఁ గైకొను టొండె, ధ్రువాప్రబంధసం
పద్యుతుఁ డౌట యొండె, మృదుభాషలఁ బ్రొద్దులు పుచ్చుటొండె, లో
కోద్యమ లక్షణం బెఱుఁగు టొండె, గడున్భజియించుఁగాక యే
విద్యలు నేరఁడేనిఁ పశువే యగుఁ గాదె గణించి చూచినన్. 7



## ఆలోచించండి - చెప్పండి

- ★ తాను నేర్చిన చదువు ఇతరులకు పంచితే కోటిరెట్లు పెరుగుతుంది. దీనిని ఎట్లా సమర్థిస్తారు?
- ★ 'చదువు దొంగలకు కనిపించదు' చర్చించండి.
- ★ అందరూ మెచ్చుకోవాలంటే మనం ఏయే చదువులు చదవాలి?

## III

★ శా॥ సంగీతంబుఁ గవిత్వ తత్త్వమును సౌజన్యంబు భావంబు స
త్సాంగత్యంబు నెఱుంగడేని భువి నాశ్చర్యంబుగా వాలమున్
శృంగ ద్వంద్వము లేని యెద్దతఁడనం జెల్లుం దృణం బాతఁడ
య్యాంగీకంబున మేయఁ డాపసుల భాగ్యం బిచ్చుటం గల్గుటన్. 8


సీ॥ అనుచు నెగ్గించిన నా కమలాకరుం
డభిమానియై తన యాత్మలోన
విద్యలు నేర్చి వివేకినై కాని యీ
జనకు వక్త్రము చూడననుచు వెడలి
కాశ్మీర దేశంబు కడ కేఁగి యొక యోర
జంద్రకేతుండను సంజ్ఞఁ బరఁగు
నుత్తమ ద్విజుఁ గొల్చియుండగా నాతండు
క్రమమున సిద్ధ సారస్వతంబు

తే.గీ॥ కరుణ నొసఁగిన నతఁడు సాంగంబు గాఁగ
నాల్గు వేదములును గావ్య నాటకములు
దర్శనంబులు నీతిశాస్త్రములు దివిరి
కలయ సంగీత సాహిత్య కళలు నేర్చి 9

వ : అభిజ్ఞుండై గురునానతి వడసి తిరిగి
దేశ విశేషంబులం జూడంజరియించుచు... 10

## ఆలోచించండి - చెప్పండి

- ★ పశువులకు, మనుషులకు తేడాలేమిటి?
- ★ కమలాకరుని తీరుగా మీరెప్పుడైనా ప్రతిన పూనారా? ఎందుకు?
- ★ కమలాకరుడు గురువుకు సేవచేస్తూ విద్యను నేర్చుకున్నాడు. మీరు మీ ఉపాధ్యాయులకు ఏయే సేవలు చేస్తారు?



SCERT TELANGANA

## తాత్పర్యాలు

1. విక్రమార్క మహారాజుయొక్క మంత్రి భట్టి. ఆ రాజు వద్ద గోవిందచంద్రుడనే సైన్యపాలకుడున్నాడు. విక్రమార్కుని పురోహితుడు త్రివిక్రముడు. ఆ పురోహితునికి కమలాకరుడనే కొడుకున్నాడు. అతడు అవివేకి.

2. కమలాకరం అంటే జలాశయం. అది నిశ్చలంగా ఉంటుంది. ఆవిధంగానే కమలాకరుడు జడాశయుడు. ఎటువంటి ఆశయం లేకుండా స్తబ్ధంగా ఉన్నాడు. కొడుకుని చూసి తండ్రి మనసులో దుఃఖించాడు. కొడుకును వివేకిని చేయాలని ఈవిధంగా మందలించాడు.

3. చుట్టాలకు, తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించే చదువులు పిల్లలు నేర్చుకోవాలి. అటువంటి చదువులు నేర్వని కొడుకులు వంశానికి తెగులు వంటివారు.

4. చక్కని రూపం ఉన్నా కూడా మోదుగుపువ్వు సువాసనలు వెదజల్లలేదు. అట్లాగే ఉత్తమమైన జన్మ, ఎంత మంచి రూపమున్నవాడైనప్పటికీ మూర్ఖుడు కుటుంబంలో వెలుగును నింపలేడు.

5. పూర్తిగా తన అధీనమైన విద్యను ఇతరులు, అన్నదమ్ములు, రాజులు తీసుకోలేరు. మనం ఎవ్వరికిచ్చినా కోటిరెట్లు పెరుగుతుంది. అందుకే విద్య ఎప్పుడూ మన సొంత ధనం.

6. వేరే ప్రాంతాలకు వెళ్ళినపుడు విద్యాధనం దొంగలకు కనబడదు. అది మనకు భారం కూడా కాదు. ఎక్కడనైనా ఎవ్వరినైనా మనకు హితులను చేస్తుంది. అందువల్ల ఈ భూమిపై విద్యకు సమానమైన ధనం మరొకటి లేదు.

7. వచనకావ్యాలు, పద్యకావ్యాలు చదువాలి. లేదా ధ్రువాప్రబంధ సంపదను (సంగీత నాట్య సాహిత్య జ్ఞానాన్ని) పొందాలి. లేదా మంచి మాటలు మాట్లాడుతూ పొద్దు గడపాలి. లేదా లోకజ్ఞానమైనా పొందాలి. ఇవి ఏవీ చేయకుండా ఎవరిని ఎంత సేవించినా ఏ చదువులూ నేర్చుకోనివారు పశువుల వంటివారే.

8. సంగీతం, కవిత్వంలోని సారం, మంచితనం, మనసులోని భావం, సజ్జనుల తోడి స్నేహం వీటిని గ్రహించలేని వాడిని భూమిపై తోక, కొమ్ములు లేక తిరుగాడే ఎద్దు అని అనవచ్చు. అటువంటివాడు గడ్డిమేయకపోవడం అనేది పశువుల పాలిటి అదృష్టమని చెప్పాలి.

9. తండ్రి వ్యంగ్యపు మాటలకు కమలాకరుడు అభిమానపడ్డాడు. విద్య నేర్చుకొని వివేకియైన తరువాత కాని తండ్రి ముఖం చూడనని మనసులో అనుకున్నాడు. కాశ్మీరదేశంలోని చంద్రకేతుడు అనే ఉత్తమ బ్రాహ్మణ గురువును చేరి సేవ చేశాడు. ఆ పండితుని ద్వారా క్రమంగా నాలుగు వేదాలు, వేదాంగాలు, కావ్యనాటకాలు, దర్శనాలు, నీతిశాస్త్రాలు, సంగీత సాహిత్యకళలు నేర్చుకున్నాడు.

10. ఆ తర్వాత గురువుగారి అనుమతితో దేశంలోని విశేషాలు చూడాలని బయలుదేరాడు.

(ఈవిధంగా తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, ఎవ్వరు నిందించినా కోపాన్ని తెచ్చుకోరాదు. దానిని ప్రేరణగా తీసుకొని ఎదగాలి అని పాఠ్యాంశ భావం).


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## ఇవి చేయండి

X2N8Y7

## I వివి, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. అందరికీ చదువు అవసరం అని తెలుసుకున్నారు కదా! అయినప్పటికీ ఇంకా మన సమాజంలో కొంతమంది పిల్లలు చదువుకోవడం లేదు. దీనివల్ల వాళ్ళు ఏమేమి కోల్పోతున్నారు? వాళ్ళకూడా చదువుకోవాలంటే మనమేం చేయాలి?

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది భావం వచ్చే పాదాలు పద్యాల్లో ఎక్కడ ఉన్నాయో చూసి రాయండి.**

అ. చదువు నేర్చుకోని కొడుకు వంశానికి తెగులు కలిగిస్తాడు.

ఆ. విద్య ఎవ్వరికిచ్చినా కోటిరెట్లు వృద్ధి చెందుతుంది.

ఇ. ఈ భూమిపై విద్యతో సమానమైన ధనం ఉందా?

ఈ. ఏ చదువూ నేర్వనివాడు పశువుతో సమానం.

**2. ఈ కింది పద్యాన్ని చదువండి. భావం రాయండి.**

కం॥ చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గల్గున్
చదువగ వలయును జనులకు,
చదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ! – (పోతన భాగవతం)

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. చదువు నేర్వని వారిని కవి వేటితో పోల్చాడు?

ఆ. త్రివిక్రమునికి చదువు పట్ల గల భావాలు ఎలాంటివి?

ఇ. కమలాకరుని స్వభావం ఎటువంటిది?

ఈ. చదువు రాకపోతే ఏయే కష్టాలు కలుగుతాయో ఊహించి రాయండి.

SCERT TELANGANA

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

చదువు పాఠ్య సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

బాగా చదివేటట్లు మిమ్ములను ప్రేరేపించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాయండి. (లేదా) చదువు ఆవశ్యకత తెలిపేటట్లు కొన్ని నినాదాలు రాయండి.

## V పదజాల వినియోగం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు సరైన అర్థాలు రాయండి.**

అ. పశువులు <u>శృంగాలతో</u> పొడుస్తాయి.

ఆ. శ్రీకృష్ణుని <u>వక్త్రము</u> చిరునవ్వుతో శోభిస్తుంది.

ఇ. <u>తృణము</u> తిని ఆవు పాలిస్తుంది.

ఈ. ఉత్తమమైన <u>పుత్రుడు</u> తల్లిదండ్రులకు కీర్తి తెస్తాడు.

**2. కింది పదాలను వివరిస్తూ రాయండి.**

అ. మృదుభాషలు    ఆ. సారస్వతము

ఇ. సౌజన్యభావం    ఈ. సత్సాంగత్యం

**3. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

అ. ధర = .........................., ..........................

ఆ. ఆత్మజుడు = .........................., ..........................

ఇ. వనం = .........................., ..........................

ఈ. శోకం = .........................., ..........................

## VI భాషను గురించి తెలుసుకుందాం

**భాషాభాగాల గురించి కింది తరగతుల్లో తెలుసుకున్నారు కదా! కింది పేరాను చదవండి. అందులోని భాషాభాగాలను గుర్తించి పట్టికను పూరించండి.**

మా ఊరి చెరువు గట్టున సంగమేశ్వర దేవాలయం ఉన్నది. పచ్చని ప్రకృతిలో పక్షుల కిలకిలారావాలతో అలరారే ఆ ప్రాంతమంతా శోభాయమానంగా ఉంటుంది. అక్కడి వనంలో జింకలు, కుందేళ్ళు

SCERT TELANGANA

తిరుగాడుతుంటే సుందరంగా ఉంటుంది. సూర్యోదయ సమయంలో ఎఱ్ఱని సూర్యకిరణాలు నీటి అలలపై ప్రతిబింబిస్తున్నప్పుడు ఆ అద్భుతదృశ్యాన్ని చూడటానికి రెండుకండ్లు చాలవు. అబ్బో! ఈ సౌందర్యాన్ని వర్ణిస్తూ పత్రికల్లో ఎన్నో కథనాలు వచ్చాయి. ఆహా! ఆ కథనాలు చదువుతూంటే మనస్సు ఆనందడోలికల్లో తేలిపోతుంది కదా!

| నామవాచకం | సర్వనామం | విశేషణం | క్రియ | అవ్యయం |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |

## ప్రాజెక్టుపని

చదువు ప్రాముఖ్యత తెలిపే పద్యాలు / పాటలు సేకరించి, నివేదిక రాసి తరగతిలో చదివి వినిపించండి.

## నేనివి చేయగలనా ?

- ★ పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదువగలను. అవును / కాదు
- ★ ఇచ్చిన వాక్యాలకు చెందిన పద్యపాదాలను పాఠంలో గుర్తించగలను. అవును / కాదు
- ★ చదువు ఆవశ్యకత గురించి సొంత మాటల్లో రాయగలను. అవును / కాదు
- ★ చదువుగురించి ప్రేరణకల్గించినవారికి కృతజ్ఞతలతో లేఖ/చదువు ఆవశ్యకత తెలిపేటట్లు నినాదాలు రాయగలను. అవును / కాదు


## సూక్తి

కన్నులు లేనివాడు అంధుడు కాదు,
విద్యా విహీనుడు అంధుడు.
– క్షేమేంద్రుడు

SCERT TELANGANA

# 2. నాయనమ్మ

బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



SCERT TELANGANA

ప్రశ్నలు

1. పై బొమ్మలో ఎవరెవరున్నారు?
2. బొమ్మలో ఏం జరుగుతున్నది?
3. ముసలమ్మకు సేవలు చేస్తున్నవారు ఎవరై ఉంటారు?
4. మీ ఇంట్లో ఉండే వృద్ధులకు మీరు ఎట్లాంటి సేవలు చేస్తారు?

T4A6X8


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠం ఉద్దేశం

వృద్ధులపట్ల సానుకూలవైఖరి పెంపొందించుకోవాలి. వారిని వెక్కిరించకుండా, అవమానించకుండా జాగ్రత్తగా సేవలు చేయాలి. ఒకవేళ మనవల్ల తప్పు జరిగితే పశ్చాత్తాపంతో క్షమాపణ అడగాలి. మానసిక పరివర్తన కలగాలి. పిల్లలు ఈర్ష్యాభావం విడిచిపెట్టాలని, పెద్దలకు ఎటువంటి అపకారం చేయకూడదని, వారిపట్ల గౌరవభావంతో మెలగాలని తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'కథానిక' ప్రక్రియకు చెందినది. క్లుప్తత, సరళత, పాత్రలకు తగిన సంభాషణలు, ఆకట్టుకునే కథనం కథానిక ప్రత్యేకత. మానవతా విలువలను తెలియజెప్పే కథానిక ఇది.

## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.

★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.

★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.

★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**కాలాలు మారినా ఏళ్ళు గడిచినా భారతదేశంలో ఇప్పటికీ కుటుంబవ్యవస్థ నిలిచి ఉన్నది. 'అందరి సుఖంలో నా సుఖం ఉన్నది. వారికోసమే నా జీవితం' అనే భావన భారతీయ కుటుంబానికి ప్రాతిపదిక. అమ్మానాన్నలు, అక్కాచెల్లెళ్ళు, అన్నాతమ్ముళ్ళు, తాతయ్యనాయనమ్మ... ఇదే కుటుంబం. ఇది సుఖసంతోషాల వాకిలి. ఆనందాల లోగిలి. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల ఒడిలో ఒదిగిపోవడం చిన్న పిల్లలకైతే మహాసరదా. వారికి ఆత్మీయంగా సేవలు చేసి దీవెనలు పొందాలి. పిల్లలు పరస్పరం అభిమానాన్ని, ఆప్యాయతను పంచుకుంటూ సేవాభావంతో ఉండాలనే స్ఫూర్తి ఈ పాఠం చదివి పొందుదాం...**

SCERT TELANGANA

# I

రవి వాళ్ళ ఇంట్లో అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లె ఇంకా ఒక ముసలి అవ్వ ఉంటారు. ముసలి అవ్వ రవికి నాయనమ్మ.

నాయనమ్మకు కండ్లు సరిగ్గా కనిపించవు. మోకాళ్ళు కూడ అరిగిపోవడంతో నడవడం కూడా కష్టమైంది.

నాయనమ్మను చూడటానికి వచ్చిన వాళ్ళందరూ 'ఏం అవ్వా! మంచిగున్నవా?' అని అడిగితే 'ఏం మంచిగుండుడు బిడ్డా! ఎవళ్ళకూ పనికిరాని బతుకు' అని అనేది.

"ఏం కాదులే అవ్వా! అన్నింటికీ ఆ దేవుడున్నాడు" అని వచ్చినవాళ్ళు అంటుంటే అవ్వ ముఖం వెలిగిపోయేది. వాళ్ళంతా తలవంచి దండం పెడుతుంటే "సల్లగుండు బిడ్డా" అని దీవించేది.

అవ్వ పండుకునే మంచం మీద పరుపు, మెత్త, చెద్దరు ఇంకా కొన్ని బట్టలుంటాయి. పక్కన బల్లమీద యాదగిరి నరసింహస్వామి పటం, ముందర జపమాల ఉంటుంది. నాయనమ్మకు రోజూ మాలను చేతితో పట్టుకొని జపం చేయడం అలవాటు.

మంచానికి రెండుదిక్కులా ఏమేం వస్తువులు ఉంటాయో అవ్వకు తెలుసు. ఎంత రాత్రి నిద్రలేచినా చీకట్లోనే ఆ వస్తువులను చేత్తోటి అందుకుంటుంది.

అవ్వ మంచానికి ఒక దిక్కు నీళ్ళబిందె, చెంబు ఉంటాయి. దూప అయితే చెంబుతోని నీళ్ళు ముంచుకొని తాగుతుంది. మంచానికి ఇంకో దిక్కు చెప్పులుంటాయి. మంచం దిగితే చూడకుండనే కాళ్ళను చెప్పుల్లో పెట్టి తొడుక్కుంటుంది.

అవ్వ అంటే ఇంట్లో అందరికీ ఇష్టం. ఆమెను బంగారంలెక్క చూసుకుంటారు. రవివాళ్ళ అమ్మ, నాన్న పొద్దున్నే నాయనమ్మకు స్నానం చేయించడానికి పట్టుకొని తీసుకుపోతారు. స్నానం చేయించినంక మళ్లా మంచంమీద కూచుండబెట్టినపుడు నాయనమ్మ ముఖంమీద నీళ్ళచుక్కలు మెరుస్తూ ఎంతో అందంగా కనబడుతాయి.

రవివాళ్ళ అమ్మ నాయనమ్మ తలను దువ్వెనతో దూస్తూ నాయనమ్మ నొసలుమీద ముద్దుపెట్టుకుంటుంది. మంచం పక్కన బీరువాలో నాయనమ్మ మందులుంటాయి. ఏమందు గోలీలు ఎప్పుడు వేసుకోవాల్నో నాయనమ్మకు తెలుసు. రవివాళ్ళ అమ్మగానీ, నాన్న గానీ మందులు వేయబోతే "నాకు చాతనయితది బిడ్డా... నేనేసుకుంట" అంటుంది.

**ఆలోచించండి - చెప్పండి**

- 'సాధారణంగా పిల్లలు నాయనమ్మను ఇష్టపడతారు' ఎందుకు?
- "ఏం కాదులే అవ్వా! అన్నింటికీ ఆ దేవుడున్నడు" అని ఇంటికి వచ్చినవారు అనటంలో ఆంతర్యమేమిటి?
- 'సల్లగుండు బిడ్డా' అని ఏయే సందర్భాలలో అంటారు?


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## II

రవికి నాయనమ్మ అంటే ఎంతో ఇష్టం. నాయనమ్మకు ఏదైనా పని చేసిపెట్టడమన్నా, నాయనమ్మ చెప్పే కథలు వినడమన్నా, నాయనమ్మ దగ్గర హాయిగా నిద్రించడమన్నా ఇష్టం. రవికేకాదు అతని తమ్మునికి, చెల్లెకు కూడ నాయనమ్మ అంటే ఇష్టం. నాయనమ్మ కూడ పిల్లలు బడినుంచి ఇంటికి ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తుంది.

ఒకరోజు వాళ్ళింటికి కరీంనగర్ నుండి చుట్టాలు వచ్చారు. వాళ్ళు దగ్గరి చుట్టాలు. వాళ్ళ కొడుకు శేఖర్, రవి ఒకే ఈడువాళ్ళు. ఒకరితో ఒకరు కలసి ఆడుకోవడమంటే వాళ్ళకు చాలా ఇష్టం. కలిసి ఎగురుతారు, దుంకుతారు, ఆడుతారు, ప్రపంచం మొత్తం మర్చిపోతారు. శేఖర్ వస్తున్నాడని రవి ఎగిరి గంతులు వేశాడు. శేఖర్ అయితే ఎప్పుడు రవి దగ్గరకు పోదామా, ఎప్పుడు రవితో కలసి ఆడుకుందామా అని ఆతృతతో ఉన్నాడు.

శేఖర్ వాళ్ళ అమ్మా నాన్న తమ్మునితో కలసి ఇంటికిరాగానే రవికి ఎంతో సంబురమైంది. ఇద్దరూ కలసి కొంచెంసేపు ఆడుకున్నారు. కాని కొంతసేపటికి రవి ఆటను ఆపేసి నాయనమ్మ దగ్గరకు పోయాడు. రవి తనతో ఆడుతున్న ఆటను ఆపి వాళ్ళ నాయనమ్మ కోసమని పోవడం శేఖర్‌కు నచ్చలేదు. రవి వస్తాడేమోనని శేఖర్ చూసిండు. కానీ రవి నాయనమ్మకు అవసరమైన సహాయం చేసుకుంటూ అక్కడనే ఉన్నాడు.

ప్రతిరోజూ రవి నాయనమ్మ దగ్గరనే ఎక్కువసేపు ఉండడం, తనతో ఆడుకోవడానికి రాకపోవడం శేఖర్‌కు నచ్చలేదు. చాలా కోపం వచ్చింది. "రవీ! నీతో ఎన్నో ఆటలు ఆడుకోవాలని ఎంతో ఆశతో వచ్చాను. నాతోపాటే ఎందుకు ఉండవు"? అని అడిగాడు శేఖర్.

"నాయనమ్మకు పనులు చేసుకోవడం చాతనయిత లేదు. అందుకని నాయనమ్మ దగ్గరనే ఉండాలి. రేపు మొత్తం నీతోటే ఉంటలే" అన్నాడు రవి.

తెల్లవారి లేవగానే తయారయి, శేఖర్‌ను తోలుకోని స్నేహితుల ఇంటికి వెళ్ళాడు రవి. అందరూ కలసి బడిలో ఆటస్థలానికి వెళ్ళి చిర్రగోనె, దాగుడుమూతలు, కబడ్డి ఎన్నో ఆటలు ఆడుకున్నారు. ఆ రోజు శేఖర్ ఎంతో సంతోషంగా ఉన్నాడు. కానీ మాపటికి ఇంటికి రాంగనే నాయనమ్మతోటే ఉన్నాడు రవి. శేఖర్‌కు ఇంకా బాధగా అనిపించింది.

**ఆలోచించండి - చెప్పండి**

- ★ మీరు ఏయే ఆటలు ఆడుతారు?
- ★ మీతో ఆడడానికి వస్తానన్న స్నేహితుడు రాకపోతే మీకేమనిపిస్తుంది?
- ★ కలసి ఆడడంలో ఉన్న ఆనందం ఎటువంటిది?
- ★ మీరు ఎవరికైనా, ఎప్పుడైనా సహాయంచేశారా? ఎట్లాంటి సహాయం చేశారో చెప్పండి.

## III

తెల్లారేసరికి నాయనమ్మకు బాగా జ్వరం వచ్చింది. రవి బాధపడ్డాడు. జ్వరంలో నాయనమ్మ మూలుగుతుంటే రవికి ఏడుపు వచ్చింది. శేఖర్ దగ్గరకు వచ్చి ఏడ్చాడు. ఇంకో రెండురోజులూ రవి నాయనమ్మ దగ్గరే ఉండి ఆమెకు సేవ చేసాడు. రవి మాత్రమే కాదు వాళ్ళ ఇంట్లో అందరూ నాయనమ్మతోటే ఉన్నారు.

రెండురోజుల్లో నాయనమ్మకు జ్వరం తగ్గింది. కానీ చాతగాకుండా ఉండడంతో నాయనమ్మ పనులకు సహాయం చేసుకుంటూ రవి ఆమె దగ్గరనే ఉండిపోయాడు.

SCERT TELANGANA



ఎప్పుడు చూసినా రవి నాయనమ్మ దగ్గరనే ఉండడంతో శేఖర్‌కు నాయనమ్మ మీద కోపం వచ్చింది. తనతోపాటు రవిని ఆడుకోనీయకుండా చేస్తున్నది నాయనమ్మనే అని ఆమెమీద ద్వేషం పెంచుకున్నాడు.

రవి నాయనమ్మకు మందులిస్తూ సేవలుచేస్తూ ఉండేవాడు. రవి సేవలు చూస్తున్నకొద్దీ శేఖర్‌కు కోపం పెరిగిపోయింది. ఏదో ఒకటి చేయాలనుకున్నాడు.

ఒకరోజు పగటిపూట నాయనమ్మ నిద్రపోయింది. చుట్టుపక్కల ఎవరూ లేకుండా చూసి నాయనమ్మ మంచానికి రెండు దిక్కులా ఉన్న వస్తువులను మార్చాడు. బిందె, చెంబు ఉన్న దిక్కు చెప్పులను, చెప్పులు ఉన్న దిక్కున బిందెను ఉంచాడు. తర్వాత ఏమి తెలియనట్లు దూరంగ కూచుని నాయనమ్మనే చూడసాగాడు.

**ఆలోచించండి - చెప్పండి**

★ జ్వరం వచ్చినపుడు ఇంట్లో అందరూ నాయనమ్మతోనే ఉన్నారుకదా! దీనివల్ల నీవు ఏమి గ్రహించావు?


★ శేఖర్ నాయనమ్మపై ఎందుకు ద్వేషం పెంచుకున్నాడు?

★ నీకు ఎప్పుడైనా ఎవరిమీదైనా కోపం వచ్చిందా? ఏ సందర్భంలో వచ్చిందో తెలుపండి?

ఈ విషయం తెలియని నాయనమ్మ నిద్రలేవంగనే చెప్పులు ఉండే దిక్కునుంచి కిందికి దిగింది. కాని అక్కడ చెప్పులకు బదులు బిందె ఉండడంతో దానిలో కాలు ఇరుక్కుని కింద పడింది. ఆమె బాధతో అరిచింది. ఆమె అరుపులు విని ఇంట్లో అందరూ ఉరుకుతూ వచ్చారు. అందరూ ఎంతో ఆందోళన పడుతూ నాయనమ్మను పైకిలేపి మంచంమీద పడుకోబెట్టారు.

డాక్టరు వచ్చి పరీక్షలు చేసి కాలు విరిగిందని చెప్పాడు. ఎక్స్-రే తీయించాడు. నాయనమ్మ తొడఎముక విరిగిందని డాక్టరు చెప్పాడు. ఆపరేషన్ చెయ్యాలి, కానీ ఇంత పెద్ద వయసులో ఆపరేషన్ చేస్తే ప్రాణానికే ప్రమాదం అని డాక్టర్ చెప్పడంతో అందరూ బాధపడ్డారు.

అసలు చెప్పులు ఉండేచోట బిందె ఎవరు పెట్టారో ఎవరికీ అర్థం కాలేదు. పనిమనిషి మతిమరుపుతో అట్లా చేసిందేమోనని అనుకున్నారు.



SCERT TELANGANA

# IV

నాయనమ్మ నెలరోజులు దవాఖానాలోనే ఉన్నది. రవితోసహా అందరూ ప్రతిరోజూ దవాఖానాకు పోతున్నారు. నాయనమ్మకు తొందరగా నయం కావాలని దేవునికి మొక్కారు.


తన అమ్మానాన్నలతోసహా ఇంట్లో అందరూ నాయనమ్మ ఆరోగ్యం గురించి బాధపడుతుంటే శేఖర్‌కు కూడా బుగులైంది.

'అయ్యో! నాయనమ్మకు ఈ కష్టం కలగడానికి కారణం నేనేకదా! ఏదైనా అనుకోనిది జరిగి నాయనమ్మ ప్రాణాలకు ప్రమాదం జరిగిఉంటే' అని ఆలోచించగానే అతనికి చాలా బాధగా అనిపించింది. ఇంకోసారి 'ఇట్లాగే మా అమ్మకు కూడా జరిగి మా అమ్మ కాలు విరిగి ఉంటే' అనుకోంగనే అతనికి చాలా ఏడుపు వచ్చింది. ఎవరూ ఓదార్చలేనంత ఏడుపు వచ్చింది. అందరితో కలిసి మునుపటితీరుగ మాట్లాడలేకపోయాడు. ముభావంగా ఉండిపోయాడు. శేఖర్ ఇట్లా ఎందుకు ఉంటున్నాడో ఎవరికీ అర్థంకాలేదు. శేఖర్‌ను మామూలు మనిషిని చేయడానికి రవి ఎంతగానో ప్రయత్నించాడు. రవి ఎంత పిలిచినా అతనితో ఆడుకోవడానికి పోలేదు.

**ఆలోచించండి - చెప్పండి**

- ★ శేఖర్ పశ్చాత్తాపపడ్డాడుకదా! మీరు ఏయే సందర్భాల్లో పశ్చాత్తాపపడ్డారో చెప్పండి?
- ★ శేఖర్ అందరితోని మాట్లాడడం తగ్గించి ముభావంగా ఉండిపోవడానికి కారణాలు వివరించండి?
- ★ నాయనమ్మ క్షమించినా శేఖర్ ఎందుకు ఏడ్చాడు?

కొద్దిరోజులకు నాయనమ్మను ఇంటికి తీసుకు వచ్చారు. నాయనమ్మ కాలుకు కట్టుతో మంచంమీదనే ఉండిపోయింది. శేఖర్‌కు నాయనమ్మను చూస్తే దుఃఖం వచ్చేది. ఆమె దగ్గరకు పోయి ఆమెనే చూసుకుంటూ కూచునేవాడు.



అట్లా విచారంగా కూర్చున్న శేఖర్‌ను నాయనమ్మ పిలిచేది. తన దగ్గరున్న పళ్ళు తినమని ఇచ్చేది. దానిమ్మ గింజలను ఒలిచి శేఖర్ నోట్లో పోసేది.

అట్లా చేస్తున్న ప్రతిసారీ శేఖర్‌కు ఏడుపువచ్చేది. ఆరోజు



SCERT TELANGANA

నుండి అతడూ రవివలె నాయనమ్మకు ప్రతి పనిలో సహాయం చేయసాగాడు. నాయనమ్మ అతడిని రవిని చూసినట్లుగానే ప్రేమగా చూడసాగింది. నాయనమ్మ తనను ప్రేమగా చూస్తున్నకొద్దీ శేఖర్‌కు తాను చేసినతప్పు గుర్తుకొచ్చి ఏడుపువచ్చేది. ఆ ఏడుపునుండి ఎట్లా తప్పించుకోవాలో అతనికి తెలువలేదు.

ఒకరోజు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నాయనమ్మ ఒడిలో తలవాల్చి ఏడ్చాడు శేఖర్.

"ఏమయింది?" అడిగింది నాయనమ్మ.

"నాయనమ్మా! నీమీద కోపంతోని చెప్పుల స్థానంలో బిందెను పెట్టింది నేనే" అని భోరున ఏడ్చాడు.

నాయనమ్మ ఏమనలేదు. "నాయనమ్మా! నాకు రవితోని ఆడుకోవడమంటే బాగా ఇష్టం. కాని రవి ఎప్పుడూ నన్ను విడిచిపెట్టి నీతోనే ఉంటే నాకు కోపం వచ్చింది. అందుకే అట్లా చేసిన. ఇంక నువ్వు కొట్టినా నాకేం బాధలేదు" అన్నాడు ఏడ్చుకుంట. నాయనమ్మ శేఖర్‌ను దగ్గరకు తీసుకున్నది. అతని కన్నీళ్ళు తుడిచి నవ్వింది. నాయనమ్మ నవ్వంగనే శేఖర్ ఏడువడం ఆపాడు.

"అంతా మంచే జరిగిందిరా... నేను కష్ట పడడం చూసి నీలో మార్పువచ్చింది. రవి నాతోనే ఉండడంతో నీకు నామీద ఈర్ష్య కలిగింది. ఇప్పుడా ఈర్ష్య పోయింది. ఈర్ష్య అనేది మనిషి మనసుకు విషం వంటిది. నువ్వింక అందరితో కలిసి ఆడుకో... సంతోషంగ ఉండు" అంటూ శేఖర్ వీపుమీద తన అరచేత్తో రాస్తూ ఓదార్చింది.

## ఇవి చేయండి

Z3D9F4

### I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. రవి, శేఖర్ ఇద్దరిని గురించి తెలుసుకున్నారుకదా! వీరిద్దరిలో ఎక్కువమంది పిల్లలు ఎవరివలె ఉంటారు? ఎందుకు?

2. నాయనమ్మ కథను సొంత మాటల్లో చెప్పండి?

### II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది పేరా చదువండి. ముఖ్యమైన పదాలు రాయండి.**

ఒక శివరాత్రినాడు శివుడిని దర్శించడానికి జనం సముద్రంలాగ వచ్చారు. ఆ జనసమ్మర్థంలో కండ్లు సరిగా కనపడని ఒక వృద్ధురాలు కాలుజారి పడిపోయింది. ఆమె చేతిలోని గిన్నె గోతిలో

SCERT TELANGANA

పడింది. నుదుటిమీద దెబ్బతోని అవ్వ స్పృహతప్పింది. ఎవ్వరూ ఆ ముసలమ్మను పట్టించుకోలేదు. అందరూ శివుడిని చూడడానికి ఎగబడ్డారు. కాని ఇద్దరు ఆడపిల్లలు చూశారు. ఆమెను లేవదీసి కూర్చోబెట్టారు. దుమ్ముధూళి దులిపి గాయానికి కట్టుకట్టారు. చల్లని నీళ్ళు తాగించారు. శివపూజకు తెచ్చిన అరటిపండ్లను తినిపించారు. "బంగారుతల్లులారా! సేవచేసి నా ప్రాణం కాపాడారు" అని అవ్వ ఆనందబాష్పాలు రాలుస్తూ ఆ పిల్లల్ని దీవించింది.

ఉదా : జనసమ్మర్థం, దీవించటం

1. .................. 2. .................. 3. ..................

4. .................. 5. .................. 6. ..................

**2. కింది వాక్యాలు చదవండి. వీటిలో మీరు 'అవును' అని అనుకొనే వాటికి '✓' లేకుంటే (✗) గుర్తు పెట్టండి.**

అ. నాకు ముసలివాళ్ళంటే బాగా ఇష్టం. (   )

ఆ. నేను ముసలివాళ్ళకు ఎప్పుడైనా పనులను చేసిపెడుతాను. (   )

ఇ. ఎవరి వస్తువులనైనా నాకిష్టమైతే తీసుకొంటాను. (   )

ఈ. ఇంటికి వచ్చిన చుట్టాలు, పిల్లలతో ఎప్పుడూ కలిసి ఆడుకుంటాను. (   )

ఉ. ముసలివాళ్ళకు మంచినీళ్ళివ్వడం, మందులు ఇవ్వడం వంటివి చేస్తాను. (   )

ఊ. అమ్మానాన్నలకు పనులలో సహాయం చేస్తాను. (   )

ఎ. ఎవరైనా నాతో ఆడుకోకుంటే నాకు కోపం వస్తుంది. (   )

ఏ. నావల్ల ఎవరికైనా బాధకలిగితే, నేనుకూడా బాధపడుతాను. (   )

ఐ. నేను చేసిన తప్పులను ఒప్పుకుంటాను. (   )

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. రవి, శేఖర్ మంచిమిత్రులుకదా! నీకున్న మంచి మిత్రుడెవరు? ఎందుకు?

ఆ. మీరు వృద్ధులకు ఎటువంటి సేవలు చేస్తారో తెలుపండి.

ఇ. 'కుటుంబంలో తాత, నాయనమ్మ ఇట్లా అందరూ కలిసి ఉండాలి'. ఎందుకో రాయండి.

ఈ. 'ఈర్ష్య అనేది మనిషి మనసుకు విషం వంటిది' దీన్ని సమర్థిస్తూ రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబు రాయండి.**

శేఖర్‌లో మార్పు రావడానికి కారణాలు ఏమిటి? నేటి కాలంలో కొంతమంది వృద్ధులు వృద్ధాశ్రమాల్లో ఉంటున్నారు. ఈ దుస్థితికి కారణాలు వివరించండి.



SCERT TELANGANA

## IV సృజనాత్మకత / ప్రశంస

వృద్ధులకు సేవచేయవలసిన అవసరాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

## V పదజాల వినియోగం

**1. ఈ కింది పదాలకు అర్థాలు పట్టికలో వెతికి రాయండి.**

అ. అంధులు, ద్వేషం, జ్ఞాపకం, తుంటరి, జపమాల, ఆతృత

| | | |
|---|---|---|
| పగ | గుర్తు | గుడ్డివారు |
| జపం చేసుకునే మాల | అల్లరి చేసేవాడు | తొందరపడు |

**2. పాఠాన్ని చదువండి పట్టికలో సూచించిన పదాలను వెతికి రాయండి.**

| ఆటకు సంబంధించినవి | ఆసుపత్రికి సంబంధించినవి | కుటుంబ పదాలు | అన్యభాషా పదాలు |
|---|---|---|---|
| | | | |

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలను సరైన విభక్తి ప్రత్యయాలతో పూరించండి.**

అ. నాయనమ్మ ...................... మందులు వేసుకోవడం చాతనవుతుంది.

ఆ. కోపం ............................. ఇట్లా జరిగింది.

ఇ. శేఖర్ .............................. రవి ఎదురుచూశాడు.

ఈ. అందరి ........................... కలిసి ఆడుకో!

**2. కింది వాక్యాల్లో క్రియలు గుర్తించి పక్కనే రాయండి.**

అ. రాజు ఆసుపత్రికి వెళ్ళాడు. .....................................

ఆ. శ్రావ్య పుస్తకం చదివి నిద్రపోయింది. .............................

ఇ. మధు మైదానంలో పరుగెత్తుతున్నాడు. .............................

ఈ. సంతోష్ భోజనం చేసి సినిమాకు వెళ్ళాడు. ..........................

పై వాక్యాల్లో రెండు క్రియలున్న వాక్యాలు ఏవి? ఆ రెండు క్రియల్లో భేదం గమనించారా?

ఉదా॥ 'ఆ' వాక్యంలో 'చదివి, నిద్రపోయింది' అనే రెండు క్రియలు ఉన్నాయి కదా!


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

ప్రతి వాక్యంలోనూ చివర ఉన్న క్రియలు పని పూర్తయిందని తెలుపుతున్నాయి. ఇట్లా పని పూర్తయినట్లు తెలిపే క్రియలను "సమాపక క్రియలు" అంటారు. వాక్యం మధ్యలో ఉన్న క్రియలు పని పూర్తికాలేదని తెలుపుతున్నాయి. పని పూర్తికానట్లు తెలిపే క్రియలను "అసమాపక క్రియలు" అంటారు.

**3. కింది వాక్యాల్లో సమాపక, అసమాపక క్రియలు గుర్తించండి.**

అ. చెంబుతో నీళ్ళు ముంచుకొని, తాగుతుంది.

అసమాపక క్రియ .......................... సమాపక క్రియ ..........................

ఆ. ఆటను ఆపివేసి నాయనమ్మ వద్దకు వెళ్ళిపోయాడు.

అసమాపక క్రియ .......................... సమాపక క్రియ ..........................

ఇ. పరీక్ష చేసి, కాలు విరిగిందని చెప్పాడు.

అసమాపక క్రియ .......................... సమాపక క్రియ ..........................

ఈ. దగ్గరకు తీసుకొని, కన్నీళ్ళు తుడిచింది.

అసమాపక క్రియ .......................... సమాపక క్రియ ..........................

## ప్రాజెక్టుపని

మీ ప్రాంతంలోని ఒకరిద్దరు వృద్ధులను కలవండి. ఏయే పనులవల్ల వారికి సంతోషం కలుగుతుందో తెలుసుకుని నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి. **(లేదా)**

మీ ప్రాంతంలోని తాత, నాయనమ్మలతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్న కుటుంబాన్ని కలిసి, వారితో మాట్లాడండి. మీకెట్లా అనిపించిందో నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా?

★ నాయనమ్మ కథను సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు

★ ఇచ్చిన వాక్యాలను చదివి ఆచరించే వాటిని గుర్తించగలను. అవును / కాదు

★ కారణాలను వివరిస్తూ రాయగలను. అవును / కాదు

★ వృద్ధులకు సేవ చేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ లేఖ రాయగలను. అవును / కాదు


**సూక్తి**

**ఈర్ష్య లేకపోవడం, దానగుణం, ప్రియభాషణం, సేవాభావం ఇవే విజయానికి సోపానాలు.**

SCERT TELANGANA

# 3. శతక సుధ

## బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



R5X4W5

### ప్రశ్నలు

1. పై బొమ్మలో ఎవరెవరున్నారు? ఏమి చేస్తున్నారు?
2. శిష్యులు ఏమి అడిగి ఉండవచ్చు?
3. గురువుగారు ఏం చెప్పుండవచ్చు?
4. మీకు తెలిసిన కొన్ని నీతివాక్యాలు చెప్పండి.

### పాఠం ఉద్దేశం

శతకాలు నైతికవిలువలను పెంపొందింపజేస్తాయి. సమాజ నడవడికను, లోకం పోకడలను తెల్పుతాయి. రేపటి సమాజానికి మానవతా విలువలను అందిస్తాయి. మంచి చెడుల విచక్షణను నేర్పుతాయి. భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. శతక పద్యాలలోని నైతిక విలువలను తెలుపుతూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ పాఠం ఉద్దేశం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకం నూరు/నూటికిపైగా పద్యాలతో ఉంటుంది. సాధారణంగా శతకపద్యాలలో పద్యానికి 'మకుటం' ఉంటుంది. ఇవి 'ముక్తకాలు'. అంటే ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది.

ప్రస్తుత పాఠంలో సుమతి, దాశరథి, నరసింహ, నృకేసరి, వేమన, నగ్నసత్యాలు, శ్రీ శ్రీనివాస బొమ్మల, యాదగిరి లక్ష్మీనరసింహ శతకాలలోని పద్యాలున్నాయి.

## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలు చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.

★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.

★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.

★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## కవుల పరిచయాలు



(13వ శతాబ్దం)

**1. సుమతి శతకం – బద్దెన.** లౌకికనీతులను అతిసులువుగా కందపద్యాల్లో ఇమిడ్చి సుమతి శతకాన్ని రాసిన కవి బద్దెన. (వేములవాడ చాళుక్యరాజు భద్రభూపాలుడే బద్దెన అని చరిత్రకారుల అభిప్రాయం) ఈయన 'సుమతి' శతకంతోపాటు 'నీతిశాస్త్ర ముక్తావళి' అనే గ్రంథాన్ని రాశాడు.

**2. దాశరథి శతకం – కంచెర్ల గోపన్న.** రామదాసుగా పేరుపొందిన కంచెర్ల గోపన్న 'దాశరథీ కరుణాపయోనిధీ' అన్న మకుటంతో శతకాన్ని రాసి, భద్రాచల శ్రీరామచంద్రునికి అంకితమిచ్చాడు. ఖమ్మంజిల్లా నేలకొండపల్లికి చెందిన ఈయన కీర్తనలు ఇప్పటికీ తెలుగువారి నాల్కలపై నాట్యమాడుతూనే ఉన్నాయి.



17వ శతాబ్దం


SCERT TELANGANA



18వ శతాబ్దం

**3&4. నరసింహ శతకం మరియు నృకేసరి శతకం - కాకుత్థ్సం శేషప్పకవి.** జగిత్యాల జిల్లా ధర్మపురి నారసింహునికి తన జీవితాన్ని అంకితం ఇచ్చిన సత్కవి. నరహరి శతకం, ధర్మపురి రామాయణం, ఈయన రచనలు. జనవ్యవహార నుడికారాలు, పదబంధాలు, లోకోక్తులను పద్యరూపంలో వ్యక్తీకరించిన నరసింహశతకం ఈయనకు అమిత కీర్తిని తెచ్చిపెట్టింది.

**5. వేమన శతకం - వేమన.** వేమన పద్యం రాని తెలుగువాళ్ళు ఉండరు. సహజకవిగా ప్రసిద్ధిపొందాడు. కడపజిల్లాకు చెందిన ఈయన పద్యాలలో - నీతి, లోకజ్ఞానం, మానవతా విలువలు ఉంటాయి. జన వ్యవహారశైలిలో, తేలికైన ఉపమానాలతో పద్యాలు రచించడం వేమన ప్రత్యేకత.



17వ శతాబ్దం

**6. నగ్నసత్యాలు శతకం - రావికంటి రామయ్యగుప్త.** 'కవిరత్న' ఈయన బిరుదు. ఈయన పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవాడు. గౌతమేశ్వర శతకం, గీతామృతం, వరద గోదావరి ఈయన రచనలు. వరకవిగా, మంత్రకూట వేమనగా సుప్రసిద్ధుడు.



17.6.1936 - 30.3.2009



7.4.1939 - 28.9.2009

**7. శ్రీశ్రీనివాస బొమ్మల శతకం - డా॥ ఆడెపు చంద్రమౌళి.** వరంగల్ అర్బన్ జిల్లా రంగశాయిపేట గ్రామానికి చెందిన ఈయన బిరుదు 'కవిశశాంక'. వేములవాడ రాజరాజేశ్వర శతకం, రామాయణ రమణీయం (పద్యకావ్యం) రచించాడు. సరళమైన భాషలో, అందరికీ అర్థమయ్యే శైలిలో పద్యాలు రాయడం వీరి ప్రత్యేకత.

**8. శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహ శతకం - శ్రీ ధూపాటి సంపత్కుమారాచార్య.** ఖమ్మం జిల్లాకు చెందిన ఈయన 'యాదగిరివాస! నృసింహ! రమావిభో! ప్రభో!' అనే మకుటంతో చక్కని పద్యాలు రాశాడు. ఇవన్నీ భక్తితోపాటు నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి.



20వ శతాబ్దం



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

## ప్రవేశిక

పద్యం రసానుభూతిని కలిగిస్తుంది. పద్యంలోని రాగయుక్త ఆలాపన (లయ) మానసిక ఆనందాన్నిస్తుంది. నైతికవిలువలను పద్యాల ద్వారా నేర్చుకొని జీవితాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవచ్చు. పద్యాలను ధారణ చేయడం ద్వారా నిరంతరం ఆ నీతులను మననం చేసుకోవచ్చు. మరింకెందుకు ఆలస్యం? శతక పద్యాల తోటలోకి వెళ్దాం! నైతిక పరిమళాల్ని ఆస్వాదిద్దాం!

## I

★ 1. కం॥

ఆఁ కొన్న కూడె యమృతము
తాఁ గొంకక నిచ్చువాఁడె దాత ధరిత్రిన్
సోఁ కోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువ గలవాఁడె వంశతిలకుఁడు సుమతీ!

– సుమతి శతకం, బద్దెన.



★ 2. చం॥

వనకరి చిక్కె మైనసకు, వాచవికిం జెడిపోయె మీను, తా
వినికికిఁ జిక్కెఁ జిల్వ గనువేదురు ఁజెందెను లేళ్ళు, తావినో
మనికి నశించెఁ దేటి, తరమా యిరు మూటిని గెల్వ, నైదు సా
ధనముల నీవె గావదగు దాశరథీ! కరుణాపయోనిధీ!

– దాశరథీ శతకం, కంచెర్ల గోపన్న.

★ 3. సీ॥

లోకమందెవడైన లోభిమానవుడున్న
భిక్షమర్థికిఁ చేతఁ బెట్టలేడు
తాను బెట్టకయున్న తగవు పుట్టదుకాని
యొరులు పెట్టగఁ జూచి యోర్వలేడు
దాత దగ్గర జేరి తన ముల్లె వోయినట్లు
జిహ్వాతోఁ జాడీలు చెప్పుచుండు
ఫలము విఘ్నంబైన బలుసంతసమునందు
మేలుకల్గినఁజాల మిడుకుచుండు

తే.గీ॥

శ్రీరమానాథ! యిటువంటి క్రూరునకును
భిక్షుకుల శత్రువని పేరుబెట్టవచ్చు
భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార నరసింహ దురితదూర!


– నరసింహశతకం, కాకుత్థ్సం శేషప్పకవి.

### ఆలోచించండి – చెప్పండి

★ వంశానికి కీర్తి తేవడమంటే మీకేమర్థమైంది?
★ చెడు అలవాట్లకు లొంగిపోతే ఏం జరుగుతుంది?
★ 'భిక్షుకులకు శత్రువు లోభి' అన్న కవి అభిప్రాయాన్ని మీరు ఏకీభవిస్తున్నారా? ఎందుకు?
★ చాడీలుచెప్పడం మంచి అలవాటు కాదు. ఎందుకో చెప్పండి?

SCERT TELANGANA

# II



★ 4. ఉ॥


ఏనుగు బోవఁజూచి ధ్వనులెత్తుచుఁగుక్కలు గూయసాగుచో
దాని మనస్సు కోపపడి దండడి వానిని వెంబడించునే
మానవులందు సజ్జనుడు, మత్తులు కొందరు గేలి చేయు చో
ఆ నరుడల్గి వాండ్ర బదులాడునె ధర్మపురీ నృకేసరీ!

– నృకేసరి శతకం, కాకుత్థ్సం శేషప్పకవి.

★ 5. కం॥

తన మదిఁ గపటము గలిగిన
తన వలెనే కపటముండుఁ దగ జీవులకున్
తన మది కపటము విడిచిన
తనకెవ్వడు కపటిలేడు ధరలో వేమా!

– వేమన శతకం, వేమన.



★ 6. ఆ.వె॥

ధనమదమ్ము చేత దానవుండై పోయి
పేదవాడు పడెడు బాధ గనక
కష్టపెట్టువారు కలకాల ముందురా
కల్లగాదు రావికంటిమాట!

– నగ్నసత్యాలు శతకం,
రావికంటి రామయ్యగుప్త.

## ఆలోచించండి – చెప్పండి

★ ఏయే గుణాలు అలవరుచుకుంటే మనలోని కపటం తొలగిపోతుంది?
★ సజ్జనుని లక్షణాలు ఏమిటి?
★ గేలి చేయడమంటే మీకేమర్థమైంది?
★ ధనమదమ్ము వంటి ఏయే గుణాలు కలిగిఉంటే దానవులౌతారు?

SCERT TELANGANA

# III

★ 7. ఆ.వె॥ సత్పురుషుల మైత్రి సలుపగా మనసిమ్ము
కమలనయన నిన్ను గాంచనిమ్ము
విశ్వశాంతికోరు విజ్ఞానమే యిమ్ము
చిద్విలాస భాస! శ్రీనివాస!

– శ్రీ శ్రీనివాస బొమ్మలశతకం,
డా॥ ఆడెపు చంద్రమౌళి.



★ 8. చం॥ జననియు జన్మభూమియును స్వర్గముకన్న ఘనమ్ములన్న సూ
క్తిని వెలయింప సత్యమని దివ్యపురావిభవైక నవ్య దీ
ప్తిని గలిగింప మాతృపదపీఠి శిరంబు తృణించు తెంపు నీ
వనిశము గూర్చు యాదగిరివాస! నృసింహ! రమావిభో! ప్రభో!

– శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహ శతకం,
ధూపాటి సంపత్కుమారాచార్య.



**ఆలోచించండి - చెప్పండి**

★ 'విజ్ఞానము విశ్వశాంతికొరకు' దీనిపై మీ అభిప్రాయాలు చెప్పండి?
★ 'జనని, జన్మభూమి స్వర్గం కన్న మిన్న' అని కవి ఎందుకన్నాడు?

**తాత్పర్యాలు**

1. ఓ మంచి బుద్ధి గలవాడా! బాగా ఆకలివేసినపుడు తిన్న అన్నమే అమృతంవలె చాలా రుచిగా అనిపిస్తుంది. వెనుదీయకుండా దానం చేసేవాడే ఈ భూమి మీద నిజమైన దాత. కష్టాన్ని ఓర్చుకొనగలవాడే మనిషి. ధైర్యమున్నవాడే తన వంశానికి వన్నె తెస్తాడు.
2. కరుణాసముద్రుడా! దశరథపుత్రుడా! శ్రీరామా! తనమేని దురదను పోగొట్టుకోవడానికి ఏనుగు, నోటికి రుచి ఆశించి చేప, రాగానికి లొంగి పాము, దృష్టిభ్రమకులోనై జింక, పూలవాసనకు మైమరచి తుమ్మెదలు బందీలవుతున్నాయి. ఇట్లా ఒక్కొక్క ప్రాణి ఒక్కొక్క ఇంద్రియ చపలత్వం వల్ల నశిస్తుంది. ఈ పంచేంద్రియ చాపల్యం గల నేను వాటి నుండి ఎలా బయటపడగలను? నీవే నా చాంచల్యాన్ని దూరంచేసి స్థిరమైన బుద్ధిని ప్రసాదించుము.
3. ఆభరణాలచే ప్రకాశించేవాడా! శ్రీ ధర్మపురంలో నివసించేవాడా! దుష్టులను సంహరించేవాడా! పాపాలను దూరం చేసేవాడా! ఓ నరసింహా! పిసినారి యాచకులకు తన చేతితో భిక్షం పెట్టడు. పెట్టకపోతే ఏ గొడవ లేదు. కాని ఇతరులు పెట్టినపుడు చూసి తాను ఓర్వలేడు. దానం చేసే దాత దగ్గరకు పోయి తనముల్లె (సొమ్ము) పోయినట్లుగా నోటి దురుసుతో చాడీలు చెబుతాడు. లోభి తాను అనుకున్నట్టు దానం చేయడం

SCERT TELANGANA

విఫలమైతే చాలా సంతోషిస్తాడు. ఇతరులకు మేలు కలిగితే బాధపడుతాడు. ఓ శ్రీరమానాథా! ఇటువంటి వారిని భిక్షుకుల శత్రువుగా చెప్పవచ్చుకదా!

4. ధర్మపురి నరసింహా! ఏనుగు పోతుంటే చూసిన కుక్కలు ఎంత మొరిగినా ఆ ఏనుగు వాటిపై కోపంతో వెనుదిరిగి తరుమదు. అట్లాగే ఒక సజ్జనుడిని కొందరు మూర్ఖులు గేలిచేసినా, అతడు కోపించి వారితో వాదులాడబోడు. ఇది సజ్జనుని స్వభావం.

5. ఓ వేమా! తన మనసులో మోసపు ఆలోచనలు ఉంటే ఇతరుల్లో కూడా మోసమే ఉన్నట్లు కనిపిస్తుంది. తన మనస్సునుండి అట్లాంటి మోసపూరిత భావాలను తొలగించుకుంటే ఈ లోకంలో తనకు మోసగాడే కనిపించడు కదా!

6. ధన బలంతో రాక్షసులుగా మారి, పేదవారు బాధపడుతున్నా లెక్కచేయక, వారిని కష్టాల పాలు చేసే మానవులు కలకాలం నిలువరు కదా! ఇది నిజం అని కవి భావన.

7. ఓ శ్రీనివాసా! జ్ఞాన విలాసం చేత ప్రకాశించేవాడా! మంచివారితో స్నేహం చేసే మనసును ఇవ్వు. కమలాల వంటి కన్నులు కలవాడా! నిన్ను కనులారా చూడనివ్వు. ప్రపంచశాంతిని కోరే విజ్ఞానాన్ని ఇవ్వు.

8. యాదగిరివాసా! నరసింహా! లక్ష్మీదేవికి భర్త అయినవాడా! ప్రభో! జన్మనిచ్చిన తల్లి, జన్మభూమి స్వర్గం కంటె మిన్న. ఈ సూక్తిని నిజమని చెప్పటానికి, దివ్యమైన ప్రాచీన వైభవాన్ని నూతన కాంతులతో నిరంతరం వెలిగించడానికి తల్లి పాదపీఠం మీద తల ఉంచి ప్రాణాలు విడిచే తెగువను నాకు ప్రసాదించు.

## ఇవి చేయండి

Y9D3J2

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. పాఠ్యాంశంలోని పద్యాలలో ఏయే మంచి అలవాట్ల గురించి కవులు చెప్పారు? వాటిని అలవరచుకోవాలంటే మనం ఏం చేయాలి?
2. శతక పద్యాలు ఎందుకు నేర్చుకోవాలో చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింద ఇచ్చిన పద్యం చదువండి. అర్థం చేసుకోండి. ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కుఁ జల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా ?
విశ్వదాభిరామ వినురవేమ!

SCERT TELANGANA

అ. సజ్జనుని మాట ఎట్లా ఉంటుంది?
ఆ. ఏది మోగితే ఎక్కువ ధ్వని వినిపిస్తుంది?
ఇ. అల్పుడు .................... మాట్లాడుతాడు.
ఈ. ఈ పద్యానికి శీర్షికను సూచించండి.
ఉ. పై పద్యంలో ఎవరెవరిని వేటితో పోల్చారు?

**2. కింది వాక్యాలను చదువండి. సరైన సమాధానాలు అనుకునేవాటిపై '✓' అనే గుర్తును పెట్టండి.**

అ. నేను పక్షులపై/జంతువులపై దయ ...
ఎప్పుడూ కలిగిఉంటాను / అప్పుడప్పుడు కలిగిఉంటాను / అసలు కలిగిఉండను

ఆ. నేను యాచకులకు భిక్ష ...
ఎప్పుడూ పెడుతాను / అప్పుడప్పుడు పెడుతాను / అసలు పెట్టను

ఇ. నాకు మనసులో మోసపు ఆలోచనలు ...
ఎప్పుడూ వస్తాయి / అప్పుడప్పుడు వస్తాయి / అసలు రావు

ఈ. నేను మంచి దృష్టితో ...
ఎప్పుడూ ఉంటాను / అప్పుడప్పుడు ఉంటాను / అసలు ఉండను

ఉ. నేను మంచివారితోనే స్నేహం ...
ఎప్పుడూ చేస్తాను / అప్పుడప్పుడు చేస్తాను / అసలు చేయను

ఊ. నేను ఓర్పుతో ...
ఎప్పుడూ ఉంటాను / అప్పుడప్పుడు ఉంటాను / అసలు ఉండను

ఋ. నేను అమ్మను, ఊరును ...
ఎప్పుడూ గౌరవిస్తాను / అప్పుడప్పుడు గౌరవిస్తాను / అసలు గౌరవించను

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. 'సత్పురుషుల స్నేహం అవసరం'. ఎందుకు?
ఆ. ఉన్న ఊరు, కన్నతల్లి స్వర్గం వంటివి. ఎందుకు?
ఇ. ధనం బాగా ఉంటే ఏమేం మంచిపనులు చేయవచ్చు?
ఈ. 'లోభి ఎప్పుడూ సంతోషంగా ఉండడు'. ఎందుకు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబు రాయండి.**

పాఠంలోని శతకపద్యాల ఆధారంగా మన ప్రవర్తన, నడవడిక ఎట్లా ఉండాలో వివరించండి?

SCERT TELANGANA

## IV సృజనాత్మకత / ప్రశంస

పద్యాల ఆధారంగా నీతులు తెలిపే సూక్తులను తయారుచేయండి. రాయండి. ప్రదర్శించండి.

## V పదజాల వినియోగం

**1. కింద ఇచ్చిన పదాల అర్థాలను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ. | నరుడు | (     ) | 1. | అపహాస్యం |
| ఆ. | గేలి | (     ) | 2. | మోసం |
| ఇ. | జిహ్వ | (     ) | 3. | మానవుడు |
| ఈ. | కపటము | (     ) | 4. | భూమి |
| ఉ. | ధరిత్రి | (     ) | 5. | నాలుక |

**2. కింది వాక్యాలను చదవండి. ఇచ్చిన పదాలకు అదే అర్థం వచ్చే పదాలను గుర్తించండి.**

అ. **ధరిత్రి :** భూమిపై కాలుష్యం పెరిగింది. నేల కోతవల్ల పంటలు పండటం లేదు. అవనిని తల్లిగా పూజిస్తాం.

ఆ. **తావి :** పువ్వుకు తావి వల్ల కీర్తి వస్తుంది. ఆ పరిమళం ఆఘ్రాణించాలని ఎవరికుండదు? అట్టి సువాసనలు ఎంతో సంతోషాన్నిస్తాయి.

**3. కింది వాక్యాలలో నానార్థాలను గుర్తించండి.**

అ. **శ్రీ :** సాలెపురుగు తన గూడును అద్భుతంగా కడుతుంది. పాము కోరల్లో విషం ఉంటుంది. సంపద శాశ్వతం కాదు. బుద్ధిబలం అవసరం.

ఆ. **ధనము :** గోపాలుడు విత్తము తీసికొని అంగడికి వెళ్ళాడు. పాడిసంపదను పెంచడానికి ఆవుల మందను కొన్నాడు.

**4. కింది పేరాను చదవండి. ఖాళీలలో తగిన పదాలను రాయండి.**

(నిజం, ఓర్పు, బాధ, చాడీలు, నీతి)

సిరి, శాంతి ఒకే తరగతి వారు. సిరి రోజూ బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు రాసుకోవడం, చదువుకోవడం చేసేది. శాంతి బడికి సరిగ్గా వచ్చేది కాదు. అందరినీ తన అల్లరితో ...................... పెట్టేది, ................. చెప్పేది. ఒకరోజు శాంతి, సిరి నోట్‌బుక్‌ను దాచింది. ఈ విషయం తెలిసినా సిరి శాంతిని ఏమి అనలేదు. అదే రోజు ఉపాధ్యాయిని విద్యార్థినుల నోట్‌బుక్‌లను పరిశీలించడానికి తీసుకుంది. వాటిలో సిరి నోట్‌బుక్ లేదు. అందుకని ఉపాధ్యాయిని సిరిని "నోట్‌బుక్ ఇవ్వలేదేం" అని అడిగింది. సిరి మౌనంగా ఉండిపోయింది.

SCERT TELANGANA

ఉపాధ్యాయిని................ తెలుసుకుంది. ఆ తర్వాత పిల్లలకు .................... కథలను ఉదహరిస్తూ, శతకపద్యాల్లో ఉండే మానవతా విలువలను గురించి చెప్పి, నిజజీవితంలో వాటి ఆచరణ ఎలా ఉండాలో తరగతిలో చర్చించారు. శాంతిలో పరివర్తన వచ్చింది. సిరికి, శాంతి క్షమాపణలు చెప్పింది. అందరూ సిరి .......ను ప్రశంసించారు.

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలలో భాషాభాగాలను గుర్తించండి. పట్టికలో రాయండి.**

అ. మామిడిపండు తియ్యగా ఉంది.

ఆ. అయ్యో! రమ చదువు ఆగిపోయిందా?

ఇ. పిల్లలు శతకపద్యాలను చదువుతున్నారు.

ఈ. ఆమె మహా సాధ్వి.

ఉ. కాంచీపురంలో అనేక దేవాలయాలు ఉన్నాయి.

ఊ. బాలభానుడు తూర్పున ఉదయిస్తాడు.

ఋ. రాముడు మంచి బాలుడు.

| నామవాచకం | సర్వనామం | విశేషణం | క్రియ | అవ్యయం |
|---|---|---|---|---|
| | | | | |

### సంధి

**❖ కింది పదాలను కలిపిన విధానాన్ని పరిశీలించండి.**

నేడు + ఇక్కడ = నేడిక్కడ (డ్ + ఉ) దు + ఇ → డి (డ్ + ఇ)

వారు + ఇచ్చట = వారిచ్చట (ర్ + ఉ) రు + ఇ → రి (ర్ + ఇ)

పై మొదటిపదంలో (నేడు) చివరిఅచ్చు (పూర్వస్వరం) 'ఉ'; రెండవపదం (ఇక్కడ) లో మొదటిఅచ్చు (పరస్వరం) 'ఇ'. 'ఉ' కారానికి 'ఇ' కారం కలిసినప్పుడు 'ఇ' కారమే నిలబడింది. అంటే సంధి జరిగిందన్నమాట. పూర్వస్వరానికి పరస్వరం వచ్చి చేరినప్పుడు పరస్వరమే నిలుస్తుంది. దీనినే 'సంధి' అంటాం.

> పూర్వ, పర స్వరాలకు పరస్వరం ఏకాదేశమగుట సంధి.
> (ఏకాదేశమంటే ఒకవర్ణం స్థానంలో మరొక వర్ణం వచ్చిచేరడం.)

**2. కింది పదాలను కలిపి రాయండి.**

అ. దానము + ఒసంగి = ..........................................

ఆ. కవితలు + అల్లిన = ..........................................

ఇ. విఘ్నంబు + ఐన = ..........................................

ఈ. కపటము + ఉండు = ..........................................

ఉ. బదులు + ఆడునె = ..........................................



SCERT TELANGANA

## ప్రాజెక్టుపని

పాఠశాల గ్రంథాలయం నుండి వివిధ శతకాలను సేకరించి, పరిశీలించి అంశాలవారీగా కింది పట్టికలో రాయండి, నివేదిక రాసి ప్రదర్శించండి.

| క్ర.సం. | శతకం | మకుటం | కవి పేరు |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |
| 6 | | | |

## నేనివి చేయగలనా ?

- ★ పద్యాలను రాగంతో, భావంతో చదువగలను. అవును / కాదు
- ★ భావాలను అర్థంచేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు
- ★ అపరిచిత పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. అవును / కాదు
- ★ ప్రవర్తన, నడవడిక గురించి సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు
- ★ పద్యభావాల ఆధారంగా సూక్తులను రాయగలను. అవును / కాదు

## సూక్తి

నీతి, సద్గుణాలు వజ్రాలకన్నా విలువైనవి.
అవి మనిషికి సంతృప్తినిస్తాయి.
మనీషిగా తీర్చిదిద్దుతాయి.

SCERT TELANGANA

## చదువండి - తెలుసుకొండి

భారతీయ విద్యావిధానంలో శ్లోకాలకు ప్రత్యేక స్థానం ఉన్నది. విద్య యొక్క ప్రాధాన్యతను తెలిపే కొన్ని శ్లోకాలను తెలుసుకుందాం.

**శ్లో॥ స్వగృహే పూజ్యతే మూర్ఖః, స్వగ్రామే పూజ్యతే ప్రభుః ।**
**స్వదేశే పూజ్యతే రాజా, విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥**

**భావం :** మూర్ఖుడు తన ఇంట్లోనే గౌరవించబడతాడు. అధికారి తన గ్రామంలోనే గౌరవించబడతాడు. రాజు తన రాజ్యంలోనే గౌరవింపబడతాడు. కానీ విద్యావంతుడు (పండితుడు) అంతటా పూజించబడతాడు.

**శ్లో॥ అన్నదానం మహాదానం, విద్యాదాన మతః పరం ।**
**అన్నేన క్షణికా తృప్తిః, యావజ్జీవం చ విద్యయా ॥**

**భావం :** అన్నదానం గొప్పదేకానీ దానికంటే విద్యాదానం గొప్పది. అన్నము వల్ల తాత్కాలికమైన ఆకలి తీరి తృప్తి కలుగుతుందేమో! కానీ విద్య వల్ల అజ్ఞానం తొలగి జీవితమంతా సుఖశాంతులు లభిస్తాయి.

**శ్లో॥ విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతామ్ ।**
**పాత్రత్వాద్ధన మాప్నోతి, ధనాద్ధర్మం తతస్సుఖమ్ ॥**

**భావం :** విద్య వల్ల వినయం లభిస్తుంది. దానితో పాత్రత వస్తుంది. పాత్రత వల్ల ధనం, దానిద్వారా సుఖాన్ని ప్రజలు పొందుతారు.

**శ్లో॥ విద్యాధనం శ్రేష్ఠధనం, తన్మూల మితరద్ధనమ్ ।**
**దానేన వర్ధతే నిత్యం, న భారాయ న నీయతే ॥**

**భావం :** సంపదలన్నింటిలో విద్యాధనం గొప్పది. విద్య వలన వివిధ ధనాలను సాధించవచ్చు. విద్య పంచినకొద్దీ పెరుగుతుందేకాని తరుగదు. విద్యావంతుడికి విద్య బరువు కాదు. దొంగలపాలు అసలేకాదు.

**శ్లో॥ విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం,**
**విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః ।**
**విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరం లోచనం**
**విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః ॥**


**భావం :** మానవులకు విద్యయే సౌందర్యం. విద్యయే దాచుకున్న ధనం. చదువే కీర్తిని, సుఖాన్ని కలిగిస్తుంది. విద్యయే గురువులకు గురువు వంటిది. విదేశాలకు వెళ్ళినపుడు విద్యయే బంధువు. చదువే మరొక కన్ను. రాజసభలలో విద్యకే గౌరవం లభించిందికానీ ధనానికి కాదు. ఇటువంటి శ్రేష్ఠమైన విద్య లేనివాడు వింత పశువు!

SCERT TELANGANA

# 4. అమ్మ జ్ఞాపకాలు

- టి. కృష్ణమూర్తి యాదవ్

బొమ్మనుచూడండి - ఆలోచించండి - మాట్లాడండి



## ప్రశ్నలు

1. పై బొమ్మలో ఎవరెవరున్నారు?
2. అమ్మ ఏం చేస్తున్నది?
3. పిల్లలకోసం అమ్మ ఏయే సేవలు చేస్తుంది?
4. మీరు మీ అమ్మకోసం ఎప్పుడెప్పుడు, ఎటువంటి సేవలు చేశారు?
5. మీరు మీ అమ్మకోసం ఏమైనా చేసినపుడు ఎట్లా అనిపించింది?

M7J2V6

## పాఠం ఉద్దేశం

అమ్మంటే ప్రేమ. అమ్మంటే ఆప్యాయత. అమ్మంటే అనురాగం. అమ్మ నిరంతరం తన కుటుంబం కోసం సేవలు చేస్తుంది. దేవుడు అంతట ఉన్నాడని చాటడానికి అమ్మను సృష్టించాడు. అనురాగమూర్తి అయిన అమ్మ జ్ఞాపకాలు నెమరేసుకుంటూ అమ్మ సేవలను, అమ్మ ప్రాధాన్యాన్ని, విలువను తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వచన కవిత ప్రక్రియకు చెందినది. తెలుగులోనికి వచన కవిత ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వచ్చింది. ఆంగ్లంలో దీనిని 'Free Verse' అంటారు. పద్యగేయాల్లో ఉండే ఛందస్సు, మాత్రాగణాల నియమం లేకుండా స్వేచ్ఛగా భావయుక్తంగా వాక్యాలతో ఉంటుంది. దీనిని 'వచన కవిత'గా పిలుస్తున్నాం.

ఈ పాఠం కృష్ణమూర్తి యాదవ్ రచించిన 'శబ్నం' కవితా సంపుటిలోనిది.

## కవి పరిచయం


1940-2004

సామాన్యుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలను అక్షరాల్లోకి పొదిగి, సామాన్య ప్రజల భాషలో కవిత్వం రచించిన కవి టి. కృష్ణమూర్తి యాదవ్. వరంగల్ అర్బన్ జిల్లా, భీమదేవరపల్లి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈయన తెలంగాణ భాషలో యాసలో వచనకవిత్వం రాసిన కవులలో ఒకడు.

తన తొలి కవితా సంపుటి 'తొక్కుడు బండ' తో సాహితీ క్షేత్రంలో ప్రవేశించాడు. 'శబ్నం' వీరి రెండవ కవితాసంపుటి. గ్రామీణ జీవితానుభవాలు, మధ్యతరగతి జీవన చిత్రణను తన కవిత్వంలో చొప్పించాడు. సరళమైన వచనాభివ్యక్తి, నిరాడంబరమైన శైలి కృష్ణమూర్తి యాదవ్ ప్రత్యేకత.

## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**అమ్మంటే ఆత్మీయత అనురాగాల కలబోత. అమ్మ మంకు చేసే పిల్లవాడికి చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపిస్తుంది. అమ్మ గొప్పతనం మాటలకందనిది. కుటుంబంకోసం అమ్మ పడే తపన, ఆరాటం అనితరసాధ్యం. అమ్మ జ్ఞాపకాలను హృదయానికి హత్తుకునేవిధంగా కవి ఎట్లా వర్ణించాడో చూద్దాం.**


SCERT TELANGANA

# I

అమ్మ ముగ్గులేస్తే
ప్రాంగణం అద్దకపు చీరలా కన్పించేది
చాయ నలుపు కోలముఖం అమ్మ నవ్వుతున్నప్పుడు
పండ్లు పాలబలపాల్లా కన్పించేవి
మాకు పడిషంపట్టి జ్వరమొచ్చినపుడు
అమ్మ ఇంటినే హాస్పిటల్‌గా మార్చేది
తానే నర్సయి మంచాల చుట్టూ తిరుగుతూ
ఆయుర్వేదపు మందుబిళ్ళలేస్తూ ఉండేది
పొద్దున్నే అయ్య
దొరల బర్లపాలు పిండేవాడు
కాలుష్య నిర్మూలన కార్యకర్తలా
అమ్మ కొట్టంలో పెండకళ్ళు తీసేది
దూడల నోళ్ళు కొట్టి పితికినపాలు
ఆస్థానపు తెల్లకుందేళ్ళు తాగేవి
అమ్మ ముక్కుకు ముక్కుపోగు
ఆకాశానికి అత్తుకున్న నెలవంకలా ఉండేది.

**ఆలోచించండి - చెప్పండి**

- ★ అమ్మ ముగ్గులేస్తే వాకిలి అద్దకపు చీరలా ఉందనడంలో కవి ఆంతర్యమేమిటి?
- ★ అమ్మను నర్సు అని కవి ఎందుకన్నాడు?
- ★ ఇంటిని హాస్పిటల్‌గా మార్చటం అంటే మీకేమర్థమైంది?
- ★ ఆస్థానపు తెల్లకుందేళ్ళు అని కవి ఎవరిని ఉద్దేశించి అన్నాడు? ఎందుకు?





తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## II

జమీందారు ఇండ్లముందు కుందెనలో వడ్లు పోసి
రోకలితో దంపుతున్నప్పుడు మద్దెల దరువులిన్పించేది
అమ్మ ఒడిలో సోలెడు నూకలేసుకొని ఇంటికి వచ్చేది
గోవుల పక్కన ల్యాగల్లా ఇంటిముందు ఆడుకునేవాళ్ళం
అమ్మ ముక్కుపుల్ల వరహావతారం
ముట్టెమీద ఎత్తిన భూగోళంలా కన్పించేది
చెవుల గెంటీలు
గడియారంలోని పెండ్యూలంలా ఊగేవి
అమ్మ అంబలి తాగి కొడవలి పట్టుకొని కోతలకు పోయేది
కాల్వగట్ల పొంటి కాళ్ళు కడుక్కొని
శ్రమను మరచి ఊళ్ళోకి వచ్చే అమ్మకు
కేరింతలు కొడ్తూ ఎదురేగేవాళ్ళం
గుమ్ముల్లో వడ్లున్నట్టే మాకోసం
అమ్మ ఒడిలో పల్లికాయలు, పెసరుకాయలు దొరికేవి
అమ్మకు కాళ్ళకడియా లేసుకోవడం
కంచు మట్టెలు తొడుక్కోవడమంటే చాల ఇష్టం
అమ్మ ఎప్పుడూ పట్టుచీరలు కట్టుకోనూ లేదు
పరుపుల్లో నిద్రపోనూ లేదు
నులక మంచంమీద నిద్ర
చేనేత చీరలతోనే కాలం గడిపేది
సెలవుల మీద ఊళ్ళోకి వచ్చినపుడు
తేనెటీగల్లా అమ్మ జ్ఞాపకాలు
నా చుట్టూ ముసురుతాయి.

### ఆలోచించండి - చెప్పండి

- ★ అమ్మ పొద్దంతా ఎవరి కోసం కష్టపడుతుంది? మీకెట్లాంటి సేవలు చేస్తుంది?
- ★ మీరు కేరింతలు కొడుతూ ఏయే సందర్భాల్లో ఆనందంగా ఉంటారు?
- ★ అమ్మ జ్ఞాపకాలు తేనెటీగల్లా ముసురుతాయి అనడంలో కవి ఆంతర్యమేమిటి?



SCERT TELANGANA

## సారాంశం

అమ్మ వాకిట్లో ముగ్గులేస్తే రంగులద్దిన చీరలా కనిపించేది. అమ్మ నవ్వినప్పుడు పండ్లు పాల బలపాల్లా (తెల్లగా) కనిపించేవి. పిల్లలకు జలుబు చేసినప్పుడు, జ్వరం వచ్చినప్పుడు అమ్మ ఇంటినే దవాఖానాగా మార్చి మంచాల చుట్టూ తిరుగుతూ ఒక నర్సుగా మారి మందుబిళ్ళలు వేసేది. (ఇక్కడ అమ్మ ముగ్గులను అద్దకపు చీరతో పోల్చడం పండ్లను పాలబలపాలతో పోల్చడం కవి ఊహాశక్తికి నిదర్శనం.)

అయ్య పొద్దున్నే దొరల బర్లకాడికి పోయి పాలుపిండేవాడు. దొర కొట్టంలో అమ్మ పెండ తీసేది. లేగదూడలు తాగకుండా వాటి నోళ్ళు కట్టి పితికిన పాలు దొరల బిడ్డలు తాగేవాళ్ళు. (దొరల బిడ్డలను తెల్లకుందేళ్ళతో కవి పోల్చాడు.) అమ్మ పెట్టుకున్న ముక్కుపోగు ఆకాశానికి హత్తుకున్న నెలవంకలా అర్ధచంద్రాకారంగా వుండేది. భూస్వాముల ఇండ్లముందు కుందెనలో పోసి వడ్లను దంచుతున్నప్పుడు ఆ చప్పుడు మద్దెల మోతగా వినిపించేది. అమ్మ రోజంతా పనిచేసి సోలెడు నూకలను చీరకొంగున మూటగట్టుగొని ఇంటికి వచ్చేది. అమ్మ వచ్చేసరికి పిల్లలు ఇంటిముందు ఆడుకునేవాళ్ళు. అమ్మ పెట్టుకున్న ముక్కుపుల్ల వరాహావతారంలో (విష్ణువు) ముట్టెమీద ఎత్తిన భూగోళంలా కనిపించేది. అంటే కవి అమ్మను అవతారమూర్తిగా భావించాడని, అమ్మ పెట్టుకున్న గెంటీలు (గంటీలు) గడియారంలో లోలకంలాగ ఊగేవని చెప్పడం కవి నిశిత పరిశీలనకు దర్పణం. అమ్మ అంబలి తాగి, కొడవలి పట్టుకొని, కోతలకు పోయి మళ్ళీ వచ్చేటప్పుడు కాల్వగట్ల పొంటి కాళ్ళు కడుక్కొని పొద్దంతా చేసిన కష్టాన్ని మరచిపోయి ఊళ్ళోకి వచ్చేది. అమ్మ వస్తుంటే పిల్లలు ఎగురుతూ, దుంకుతూ అరుపులతో ఎదురేగేవాళ్ళు. అమ్మ ఒడిలోని పల్లికాయలు, పెసరకాయలు తీసుకొని పిల్లలు సంతోషంగా తినేవాళ్ళు. కవి అమ్మ ఒడిని గుమ్మితో పోల్చాడు. అంటే గుమ్మిలో ఎప్పుడూ ధాన్యం నిల్వ ఉంటుంది. (అమ్మ ఒడినుంచి ఎన్ని తీసుకున్నా ఇంకా ఎన్నో మిగిలే ఉంటాయని కవి భావన.)

అమ్మకు కాళ్ళకు కడియాలు వేసుకోవడం, మట్టెలు తొడుక్కోవడం చాలా ఇష్టం. అమ్మ ఎప్పుడూ పట్టుచీరలు కట్టలేదు, పరుపుల్లో నిద్రపోలేదు. నేతచీరలు కట్టేది. నులకమంచంమీద నిద్రపోయేది. సెలవులకు ఊళ్ళోకి వచ్చినపుడు తేనెతుట్టె చుట్టూ ముసిరే తేనెటీగల్లా అమ్మ జ్ఞాపకాలు ముసురుతున్నాయి. ఇట్లా అనడంలో కవి ఉద్దేశం తేనెటీగలు మధురసం కోసం పూలచుట్టూ తిరిగినట్లు అమ్మ జ్ఞాపకాల మాధుర్యం మనసు చుట్టూ ముసురుతుంది. ఈ కవిత 'అమ్మను ఎప్పటికీ మరచిపోలేం' అని తెలియజేస్తున్నది.

### ఇవి చేయండి

J7L7J9

### I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. అమ్మ జ్ఞాపకాలను కవి గుర్తుకు తెచ్చుకున్నాడు కదా! మీరు మీ అమ్మ గురించి చెప్పండి.
2. మీరు మీ అమ్మను సంతోషపెట్టడానికి ఏమేమి చేస్తారు?


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. పాఠం చదువండి. వివిధ అంశాలను కవి ఎట్లా పోల్చాడో పట్టికలో రాయండి.**

| | అంశం | పోలిక |
|---|---|---|
| ఉదా॥ | ముగ్గులేసిన ప్రాంగణం | అద్దకపు చీర |
| | | |

**2. కింది పేరా చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

ధర్మం మూర్తీభవించిన శ్రీరాముణ్ణి తీర్చిదిద్దింది తల్లి కౌసల్యే. లవకుశులు వీరులుగా, శూరులుగా, పరాక్రమశీలురుగా తయారైంది తల్లి సీతమ్మ శిక్షణలోనే. కాలినడకన ఆసేతు హిమాచలం పర్యటించి, అద్వైత సిద్ధాంతాన్ని బోధించి, దేశ సమైక్యతను సమగ్రతను కాపాడిన ఆదిశంకరులు కూడ తల్లి ఆర్యాంబ ఒడిలోనే పెరిగి పెద్దవాడయ్యాడు. భారతజాతికి గర్వకారణమైన వీరుడుగా, శూరుడుగా, పేరు ప్రఖ్యాతులనందుకొనిన వీరశివాజీ తనతల్లి జిజియాబాయి చేతులలోనే పెరిగి పెద్దవాడయ్యాడు. ఒక సామాన్య బాలునిలో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, దేశభక్తి భావాలను నాటి, పెంచి, పోషించి గాంధీని మహాత్మునిగా రూపొందించగలిగింది ఆయన మాతృమూర్తి పుతలీబాయి. ప్రపంచచరిత్రను సునిశితంగా పరిశీలిస్తే ఒక వాస్తవం తేటతెల్లమౌతుంది. జాతి గర్వించదగిన వీరులను, శూరులను, మహనీయులను, మహాపురుషులను, ప్రవక్తలను, సంఘసంస్కర్తలను, జ్ఞానులను, యోగులను రూపుదిద్దగల్గిన శిల్పులు మాతృమూర్తులేనని స్పష్టమవుతున్నది.

అ. సీతమ్మ లవకుశులను ఎట్లా తీర్చిదిద్దింది?

ఆ. ఆదిశంకరుల తల్లి పేరేమిటి?

ఇ. శివాజీని జిజియాబాయి ఎట్లా పెంచింది?

ఈ. గాంధీని మహాత్ముడిగా తీర్చిదిద్దింది ఎవరు?

ఉ. జాతి గర్వించదగిన మహనీయులను రూపుదిద్దిన మహాశిల్పులు ఎవరు?

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. ఈ పాఠం రాసిన కవి గురించి సొంతమాటల్లో రాయండి.

ఆ. 'కాలుష్య నిర్మూలన కార్యకర్తగా అమ్మ పనిచేసింది' అని అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

ఇ. మీ అమ్మ ఇష్టాలను గురించి మీ సొంత మాటల్లో రాయండి.

ఈ. అమ్మ చేసే పనుల్లో మనం కూడా ఎందుకు సహాయం చేయాలి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అమ్మ గొప్పతనాన్ని మీ సొంతమాటల్లో రాయండి.



SCERT TELANGANA

## IV సృజనాత్మకత / ప్రశంస

అమ్మ గొప్పతనం తెలిపేటట్లు చిన్న కవిత రాయండి.

## V పదజాల వినియోగం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు సరైన అర్థాలు గుర్తించండి.**

1. జెండావందనం రోజు మా పాఠశాల ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరిస్తాం. ( )
   అ) బయట ఆ) లోపల ఇ) ముంగిలి ఈ) ఇంటిలో
2. మా ఊరిలో వస్త్రాలపై అద్దకం చేసేవారు ఉన్నారు. ( )
   అ) గోడకు వేసే సున్నం ఆ) బట్టలకు రంగు వేసే విధానం
   ఇ) రంగు వేయడం ఈ) రంగు తీసివేయడం
3. బాసర పుణ్యక్షేత్రం గోదావరి గట్టున ఉంది. ( )
   అ) కట్ట ఆ) గోడ ఇ) తీరం ఈ) దూరం

**2. కింద గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.**

అ. కంచు మోగునట్లు కనకంబు మోగునా?

ఆ. కుందేలు ఉపాయంతో అపాయాన్ని జయించింది.

ఇ. ఆవు అంబా అని పిలిస్తే దూడ గంతులు వేసుకుంటూ వచ్చింది.

**3. కింద గీతగీసిన ప్రకృతి పదాలకు వికృతిపదాలు, వికృతి పదాలకు ప్రకృతి పదాలు రాయండి.**

అ. కుల్యలో కాగితపు పడవలు వేసి పిల్లలు ఆడుకుంటున్నారు.

ఆ. ఆకాశంలో పక్షులు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి.

ఇ. శ్రావ్య మొగము ఎంతో అందంగా ఉంది.

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను విడదీయండి.**

అ. అతడెక్కడ = ..................... + .....................

ఆ. బొమ్మనిచ్చెను = ..................... + .....................

ఇ. మనిషన్నవాడు = ..................... + .....................

**2. కింది పదాలను కలపండి.**

అ. మేన + అల్లుడు = ................................

ఆ. పుట్టిన + ఇల్లు = ................................

ఇ. ఏమి + అంటివి = ................................



SCERT TELANGANA

## ఉత్వసంధి

❖ **కింది పదాలను గమనించండి.**

అ. రాముడు + అతడు = రాముడతడు = ఉ + అ = అ

ఆ. సోముడు + ఇతడు = సోముడితడు = ఉ + ఇ = ఇ

ఇ. మనము + ఉంటిమి = మనముంటిమి = ఉ + ఉ = ఉ

ఈ. అతడు + ఎక్కడ = అతడెక్కడ = ఉ + ఎ = ఎ

మొదటి పదంలోని చివరి అచ్చు 'ఉ', రెండవ పదంలోని మొదటి అచ్చుతో కలిసినపుడు మొదటి పదంలోని అచ్చు (ఉ) లోపిస్తుంది. రెండో పదంలోని మొదటి అచ్చు అట్లాగే నిలిచి ఉంటుంది. అనగా ఉకారం మీద ఏదైనా అచ్చు వచ్చి చేరితే సంధి తప్పక జరుగుతుంది. దీనినే 'ఉత్వసంధి' అంటాం.

| 'ఉ'కారాన్ని ఉత్తు అంటారు. | ఉత్తునకు అచ్చుపరమైతే సంధి తప్పక జరుగుతుంది. |
|---|---|

3. **కింది పదాలను కలిపి రాయండి.**

అ. చెట్టు + ఎక్కి = ....................

ఆ. వాడు + ఎక్కడ = ....................

ఇ. ఎదురు + ఏగి = ....................

4. **కింది పదాలను విడదీయండి.**

అ. నూకలేసుకొని = .................... + ....................

ఆ. చూరెక్కి = .................... + ....................

ఇ. ఎట్లున్నది = .................... + ....................

### ప్రాజెక్టుపని

ఒకరోజు ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు అమ్మను గమనించండి. ఏమేమి పనులు చేసింది? ఆయాపనులు చేసేటప్పుడు ఆమె ఎట్లా ఉన్నది? మీకేమనిపించింది? ఈ వివరాలతో నివేదిక రాయండి. తరగతిలో ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా ?

★ అమ్మ గురించి, అమ్మను సంతోషపెట్టడం గురించి మాట్లాడగలను. అవును / కాదు

★ పాఠం ఆధారంగా పోలికలను పట్టికలో రాయగలను. అవును / కాదు

★ అమ్మ గొప్పదనం గురించి సొంత మాటల్లో రాయగలను. అవును / కాదు

★ అమ్మ చేసే పనులు/సేవలు/వాటిగొప్పదనం ఆధారంగా కవిత రాయగలను. అవును / కాదు

### సూక్తి

**ఆకాశంకన్నా ఎత్తు, సముద్రంకన్నా లోతైనది అమ్మ హృదయం.**
**అమ్మ ముందు ఎవరెంత్తు శిఖరమైనా తలవంచి తీరుతుంది.**

SCERT TELANGANA

## చదువండి - తెలుసుకొండి

పోతన రచించిన భాగవతమంతా భక్తిసుధార్ణవమే. తేటతెలుగుదనం, రమణీయ ఆలంకారికత, ధారాశోభితమైన పద్యశైలితో అలరారే పోతన పద్యాలు ప్రజల నాల్కలపై నాట్యమాడుతూనే ఉన్నాయి. అటువంటి పద్యాలలో మచ్చుకు...

**మ॥ సిరికిం జెప్పఁడు; శంఖచక్ర యుగముం జేదోయి సంధింప ఁడే**
**పరివారంబును జీర ఁడభ్రగపతిం బన్నింప ఁడాకర్ణికాం**
**తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాద ప్రోత్థిత శ్రీకుచో**
**పరి చేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై! (స్కం. 8-96వ పద్యం)**

**భావం :** గజరాజు ప్రాణాలను కాపాడాలనే ఉత్సాహంతో విష్ణువు లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖ చక్రాలను చేతులలోనికి తీసుకోలేదు. సేవకుల నెవరినీ పిలువలేదు. గరుడవాహనం సిద్ధపరచుకోలేదు. చెవిలోని తామర దుద్దువరకూ జారిన జుట్టుముడిని కూడా చక్కదిద్దుకోలేదు. వెళ్ళే తొందరతో లక్ష్మీదేవి పైటకొంగును కూడా వదిలిపెట్టడం మరిచాడు.

**శా॥ ఇంతింతై, వటుఁ డింతయై, మఱియుఁ దానింతై, నభోవీథిపై**
**నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై**
**నంతై, చంద్రుని కంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై**
**నంతై, సత్యపదోన్నతుం దగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై (స్కం. 8-622వ పద్యం)**

**భావం :** (బలిచక్రవర్తి మూడడుగుల నేలను వామనుడికి ఇస్తానన్నాడు. ఆతర్వాత వామనుడు కొద్దికొద్దిగా ఎదిగాడు.) ఇంతవాడు అంతవాడయ్యాడు. అంతవాడు మరింత వాడయ్యాడు. క్రమక్రమంగా పెరిగిపోతున్నాడు. వరుసగా ఆకాశం కంటె మేఘమండలంకంటే, వెలుగులరాశికంటె పైకి పెరిగాడు. చంద్రునివరకూ, ధ్రువతారవరకూ మహర్లోకంవరకూ ఆపైన సత్యలోకంవరకూ పెరుగుతూ బ్రహ్మాండమంతా నిండిపోయాడు.

**ఉ॥ అన్నము లేదు, కొన్ని మధురాంబువు లున్నవి; ద్రావుమన్న; రా**
**వన్న, శరీరధారులకు నాపద వచ్చిన వారి యాపదల్**
**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే**
**లున్నదె? నాకు దిక్కు పురుషోత్తముఁ డొక్కడ సుమ్ము పుల్కసా! (స్కం. 9-648వ పద్యం)**

**భావం :** "ఓ అన్నా! అన్నం లేదుకాని తియ్యటి నీళ్లు ఉన్నాయి. దగ్గరకు రా! దప్పిక తీరేటట్లు త్రాగు. తోటి దేహధారులకు ఆపద కలిగితే వెంటనే వారి కష్టాలను పోగొట్టి వారిని ఆదుకోవడం కంటే మానవులకు వేరే పరమార్థం ఉన్నదా? ఆ పురుషోత్తముడు ఒక్కడే నాకు దిక్కు!"

**ఉ॥ నల్లనివాఁడు పద్మనయనంబుల వాఁడు కృపారసంబు పైఁ**
**జల్లెడివాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా**
**జిల్లెడు మోము వాఁడొకడు చెల్వల మానధనంబుఁ దోచెనో**
**మల్లియలారా! మీ పొదలమాటున లేఁడు గదమ్మ చెప్పరే? (స్కం.10-1011వ పద్యం)**

**భావం :** నల్లనివాడూ కమలములవంటి కన్నులు గలవాడూ కరుణారసము చిందించేవాడూ సిగపై వ్యాపించిన నెమలిపింఛం కలవాడూ చిరునగవు చెలువారే మొగము గలవాడూ అయిన ఒకానొకడు, మానినుల మానధనం దోచి తెచ్చినాడు. ఓ మల్లెతీగలారా! మీ పొదలమాటున లేడుగదా! ఉన్నట్లయితే కొంచెం చెప్పండమ్మా!



SCERT TELANGANA

## కొన్ని తెలంగాణ పదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| కందిలి | – | లాంతరు | తిర్లమర్ల | – | వెనుకది ముందుకు, ముందుది వెనుకకు |
| గోందు | – | జిగురు | | | |
| జిమ్మలు | – | చేపలు | ఎల్లెల్కల | – | వెల్లకిల |
| లగాంచి | – | బలంగా | అమడలు | – | కవలలు |
| ఆపతి | – | కష్టం | దూప | – | దప్పిక |
| ఉరుకు | – | పరుగు | దేవులాడు | – | వెతుకు |
| రికాం | – | తీరిక | తక్కెడ | – | త్రాసు |
| దడి | – | కంచె | దురస్తు | – | బాగుచేయు |
| మునుపు | – | క్రితం | తపుకు | – | మూత |
| సొక్కం | – | మంచి, నిజాయతి | బుగులు | – | భయం |
| అల్కగా | – | తేలికగ | చెండు | – | బంతి |
| ఉసికె | – | ఇసుక | పుడా | – | పాకెట్ |
| బుక్కు | – | తిను | కారటు | – | ఉత్తరం |
| సందుగు | – | పెట్టె | అగడు | – | అత్యాశ |
| బోళ్ళు | – | వంటగిన్నెలు | సైసు | – | ఉండు |
| బయానా | – | ముందు ఇచ్చే డబ్బు (అడ్వాన్సు) | కొప్పెర | – | వేడినీళ్ళ కాగు |
| | | | తంతె | – | మెట్టు |
| యారాలు | – | తోడికోడలు | కాపాయం | – | పొదుపు |

## కొన్ని తెలంగాణ సామెతలు

అంతంత బీరకాయ కద్దసేరు మసాల.
దంచిందానికి బుక్కిందే కూలి.
ఉపాసముంటె అప్పుదీరది. ఊపిరితో బొర్ర పెరగది.
ఎంగిలికెగ్గులేదు తాగుబోతుకు సిగ్గులేదు.
పొత్తులపని సుఖం. ఒంటిగ తిండి సుఖం.
పగటిముచ్చట పనికిచేటు. రాత్రిముచ్చట నిద్రకుచేటు.
నాభికాడ చల్లబడితే నవాబుతోని జవాబియ్యచ్చు.
నాలుకమీద కాదు కడుపులుండాలె.
నాగుబాముంత కోపం జెర్రిపోతంత పిరికి.
ధైర్యం దండిది చేయి మొండిది.
గవ్వ ఆందానిలేదు. గడియ పురసతు లేదు.

SCERT TELANGANA

# 5. పల్లె అందాలు

- ఆచ్చి వేంకటాచార్యులు

## బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



J9Y5Z3

### ప్రశ్నలు

1. పై బొమ్మలో ఏమేమి కనిపిస్తున్నాయి?
2. మీరు చూసిన పల్లెకు, బొమ్మలోని పల్లెకు తేడాలేమిటి?
3. పల్లెల్లో ఏమేమి ఉంటాయి?

### పాఠం ఉద్దేశం

పల్లెటూర్లు శాంతి సౌభాగ్యాలకు నిలయాలు. ప్రేమానురాగాల కోవెలలు. పచ్చని ప్రకృతికి ఆలవాలం పల్లె. అటువంటి పల్లెటూరి సౌందర్యాన్ని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కావ్యప్రక్రియకు చెందినది. దీనిలో గ్రామీణ సౌందర్య చిత్రణతోపాటు, పల్లె సోయగాన్ని కవి వర్ణించాడు.

ఈ పాఠ్యభాగం ఆచ్చి వేంకటాచార్యులు రచించిన 'మాఊరు' లఘుకావ్యం లోనిది.

## కవి పరిచయం



1914 - 1985

రమణీయ భావాలతో కమనీయ కవితలు రచించిన కవిశిఖామణి ఆచ్చి వేంకటాచార్యులు. నేటి రాజన్న సిరిజిల్ల జిల్లా ముస్తాబాదు మండలం, ఆవునూరు గ్రామంలో జన్మించాడు. ఆండాళ్ బుర్రకథ, రాగమాల, మాఊరు (ఏకాశ్వాస ప్రబంధం) ఈయన రచనలు. పండిత వంశంలో జన్మించిన ఈయన రాసిన పాటలు, హారతులు, పద్యాలు ఇప్పటికీ ప్రజల నాల్కలపై నాట్యమాడుతూనే ఉన్నాయి.

## విద్యార్థులకు సూచనలు

- ★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- ★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- ★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- ★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

పల్లెటూర్లో ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తుంది. పల్లె ఆనందాన్ని కలిగిస్తుంది. పల్లెసీమలు సౌందర్య నిలయాలు. జాలువారే సెలయేళ్ళు, చెరువులు, నీటిలో తేలియాడే తామరలు, రకరకాల పుష్పాలు, వృక్షాలు, ఒకటేమిటి? అడుగకుండానే అన్నీ ఇచ్చే పల్లెతల్లి ఎంతో స్వచ్ఛమైంది. గ్రామసీమల సుందరదృశ్యాలు, అక్కడి వ్యాపార విధానాలు, వివిధ వృత్తుల వారి జీవనం ఎంత నిష్కల్మషంగా ఉంటాయో చూద్దాం!

SCERT TELANGANA

# I


1. తే.గీ. ఊరిప్రక్కన గన్పట్టు నొదుగు లేని
నిండు గంగాళముల వంటి రెండు చెఱువు
లొక్కటేయని చెప్పుచునుండె నడుమ
గలసి యున్నట్టి యలుగుల గడుసుదనము.

2. తే.గీ. నీటి నిసుమంత గనుపడనీక మొదటి
వరకు వ్యాపించి వలగొను పద్మలతల
సాదుకొను చుండె ప్రేమ రసాల నొలికి
మా తటాకాలు లలితపద్మాకరాలు.

★ 3. తే.గీ. చిన్ని కెరటాల స్నానాలు జేసి వార్చి
తరుణ పేశల కమల పత్రాలనెత్తి
అరుణ కిరణాల దేవత కర్ఘ్యమిచ్చు
బ్రత్యుషస్సున మాయూరి పద్మలతలు

### ఆలోచించండి - చెప్పండి

★ కవి చెరువును గంగాళంతో పోల్చాడు కదా! ఇంకా చెరువును వేటితో పోల్చవచ్చు?
★ 'చెరువులు పద్మాలకు నిలయాలు' అని కవి అన్నాడు కదా! ఇప్పుడు చెరువులు వేటికి నిలయాలు?
★ సూర్యోదయ సమయంలో చెరువు ఎట్లాఉంటుంది?



SCERT TELANGANA

## II


4\. తే.గీ. బంతి, చేమంతి భక్తితో బసవు దిద్ద
రంగు గోరంట జాతి పౌరాణులద్ద
పట్టు కుచ్చులు కుంకుమ బొట్టుబెట్ట
నలరు మాయూరు పెద్ద ముత్తైదువట్లు.

5\. ఉ. మారెడు లల్లనేరడులు మామిడి రేగులు జామ నిమ్మలం
జూరల నంట్లు దాడిమల సోగగులాబులు మల్లె మొల్ల గ
న్నేరులు దాసనల్ వెలసి నిశ్చలతన్ దమకార్తులందు నిం
పార ఫలాల పూవులను నంచెలవారిగ సంతరించి మా
యూరి కుపాయనం బిడుచునుండును దంపతులట్లు నిత్యమున్.

★ 6. తే.గీ. మావులున్నవి – మధురముల్ మంచినీటి
బావులున్నవి, అందాలు పరిమళించు
తావులున్నవి, పుణ్యాల ప్రోవులైన
యావులున్నవి, మాయూర నతిశయముగ.

**ఆలోచించండి – చెప్పండి**

★ పూవులను ఏయే సందర్భాలలో అలంకరణకు వాడుతారు?
★ ఏయే ఋతువులో ఏయే పూలు దొరుకుతాయి?
★ మీ గ్రామ ప్రత్యేకతలు ఏమిటి?



SCERT TELANGANA

# III

7. ఉ. నేయుదురెన్నియేని కమనీయపు నాగరికాంబరమ్ములన్
వేయుదు రద్దకంబులతి వేల పురాతన చిత్రవర్ణముల్
సోయగమైన నేతపని సొంపుల నేర్పరులైన పద్మశా
లీయ కుటుంబముల్ రుచిరలీల వసించును మా పురమ్మునన్.

8. ఉ. గోదలు పాడిగేదెలును కొట్టము నిండుగ దుక్కిటెద్దులన్
భేదము లేక సాకుచును బిడ్డల బోలెను - కారు కారు కిం
పాదిక భూమిదున్నుకొని హాయిగ నుందురు పాడిపంట లా
హ్లాదము గూర్ప మాపురము నందలి కాపు కుటుంబముల్ తగన్.

★ 9. తే.గీ. బహుళ వస్తు ప్రధాన సంపన్నమగుచు
నెలమి క్రయ విక్రయార్థి సంకులమునగుచు
జనగతాగత కల్లోల సాంద్రమగుచు
వెలయు మా యంగడులు నన్నివేళలందు.

## ఆలోచించండి - చెప్పండి

★ పల్లె జీవితం నుండి పశుసంపద ఎందుకు దూరం అయ్యింది?

★ పల్లెలోని వ్యాపారులు ఎట్లాంటి వ్యాపారం చేసేవారు? మీ గ్రామంలోని వ్యాపారులకు, వీరికి భేదం తెలుపండి?

★ మీ ఊరిలో అంగడి ఎట్లా జరుగుతుంది?

## తాత్పర్యాలు

1. మా ఊరి చెరువులు నిండు గంగాళమువలె పూర్తిగా నిండి ఉన్నాయి. వాటి అలుగులు రెండూ కలువడంతో, ఆ గడుసుదనంవల్ల అవి ఒకే చెరువువలె ఉన్నాయి.

2. మా ఊరి అందమైన చెరువులు, తమలోని నీటిని కొంచెం కూడా కన్పించనీయకుండా పైభాగమంతా వ్యాపించిన పద్మాలను ప్రేమతో సాదుకుంటున్నాయి.

3. మా ఊరి చెరువులోని పద్మాలు ప్రతిరోజూ సూర్యోదయ సమయంలో అలలతో స్నానంచేసి, నిగనిగలాడే సుకుమారమైన తమ రేకులను ఎత్తి సూర్యునికి అర్ఘ్యమిస్తూ, సంధ్యావారుస్తున్నాయా అన్నట్లున్నాయి.

4. బంతి, చేమంతిపూలు మా ఊరికి పసుపు దిద్దినట్లున్నాయి. ఎఱ్ఱని గోరింటాకు మా ఊరికి పారాణి అద్దినట్లుంది. పట్టుకుచ్చుల పూలు మా ఊరికి కుంకుమబొట్టు పెట్టినట్లున్నాయి. వీటివల్ల మా ఊరు పండు ముత్తైదువువలె శోభిల్లుతున్నది. (ప్రకృతి దృశ్యాల్లో సాంస్కృతిక విలువలు దర్శించడం కవి ఊహాత్మక శక్తికి తార్కాణం).

5. ఆయా కాలాల్లో మారేడు, అల్లనేరేడు, మామిడి, రేగు, జామ, నిమ్మ, అంజూర, అరటి, దానిమ్మ మొదలైన వృక్షాలు వివిధ ఫలాలనూ; అందమైన గులాబీ, మల్లె, మొల్ల, గన్నేరు, దాసన మొదలైన మొక్కలు వివిధ పుష్పాలనూ; దంపతులవలె మా ఊరికి ఎల్లవేళలా కానుకగా సమర్పిస్తుంటాయి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

6. మా ఊరిలో ఎన్నో మామిడి తోటలున్నాయి. తీయని మంచినీటి బావులు అనేకమున్నాయి. అందాల పూల పరిమళం వెదజల్లే ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. పుణ్యరాశులైన ఆవులు అసంఖ్యాకంగా ఉన్నాయి.

7. మా ఊర్లో ఉండే పద్మశాలీ కుటుంబాలవాళ్ళు నేటి నాగరికతకు సరిపోయే ఎన్నో అందమైన వస్త్రాలను చక్కగా నేస్తారు. చాలాపురాతనమైన బొమ్మలను కూడ ఎన్నో ఆకర్షణీయమైన రంగులతో అద్దకం వేస్తారు. అందమైన నేతపనిలో నేర్పరులైన ఈ పద్మశాలీ కుటుంబాలు మా గ్రామంలో ఎన్నో ఉన్నాయి.

8. మా ఊరి కాపు కుటుంబాలవారు, ఎడ్లు, పాలిచ్చే బర్రెలు, దున్నే ఎడ్లు అనే భేదం లేకుండా పశువులనన్నింటిని తమ బిడ్డలవలె పోషిస్తారు. ప్రతి పంటకాలంలో భూమిని దున్ని, పంటలు పండిస్తూ పాడిని సమకూరుస్తూ సంతోషంగా జీవిస్తారు.

9. మా ఊరిలోని అంగళ్ళు అన్నివేళలా అనేక వస్తువులతో సంపన్నమై, అమ్మకానికి, కొనడానికి వచ్చిన జనంతో క్రిక్కిరిసి, జనం రాకపోకల సందడితో వెలుగొందుతాయి.

## ఇవి చేయండి

E4V9D9

## I వినీ అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. పాఠంలోని పద్యాల ద్వారా ఊరు గురించి తెలుసుకున్నారుకదా! మీరు చూసిన ఊరుతో దీన్ని పోల్చి మాట్లాడండి?
2. పాఠంలోని పద్యాలను రాగంతో చదువండి. వాటి భావాలు చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ప్రకృతి అందచందాలు అమూల్య సంపదలు. గలగలపారే సెలయేరు, ఉదయించే అరుణ కిరణాల సూర్యుడు, పక్షుల కిలకిలారావాలు, పచ్చని కొంగేసినట్లున్న వనసీమలు ఒకటేమిటి? ఎన్నెన్నో అందాలతో విలసిల్లే పల్లె ఆనందానికి నెలవు. పల్లె ఆశ్రయమిచ్చి అక్కున చేర్చుకునే తల్లి. ఆప్యాయతకు, అనురాగాలకు పట్టుగొమ్మ. పల్లె అమాయకత్వం, దివ్యత్వంతో ఉన్న అద్భుత శిల్పం.

అ. అమూల్య సంపదలు అంటే ఏమిటి?

ఆ. ఆనందానికి నెలవు అంటే ఏమిటి?

SCERT TELANGANA

ఇ. అక్కున చేర్చుకోవడం అంటే మీకేం అర్థమయింది?

ఈ. అనురాగాలకు పట్టుగొమ్మ అంటే ఏమిటి?

ఉ. పై పేరాకు పేరుపెట్టండి.

**2. పాఠం ఆధారంగా కింది భావం తెలిపే పద్యపాదాలను వెతికి రాయండి.**

అ. అలుగుల గడుసుదనంతో ఒకే చెరువా అని తెలుపుతున్నట్లున్నాయి.

ఆ. సూర్యునికి అర్ఘ్యమిస్తున్నట్లున్నాయి.

ఇ. దంపతులవలె మా ఊరికి కానుకలు సమర్పిస్తున్నాయి.

ఈ. జనం రాకపోకలతో మా అంగళ్ళన్నీ సందడితో ఉంటాయి.

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. కవి అంగడిని బహుళ వస్తుప్రధానం అన్నాడుకదా! మీ ఊరి అంగడి కూడా ఇట్లే ఉంటుందా? వివరించండి.

ఆ. గ్రామాల్లో కాపులు, పద్మశాలీలు కాకుండా ఇంకా ఎవరెవరు ఉంటారు? వీరి వల్ల ఊరివాళ్ళకేం లాభం కలుగుతుంది?

ఇ. ఆదర్శగ్రామం ఎట్లుండాలని నీవనుకుంటున్నావు?

ఈ. ఊరుకు, చెరువుకు ఉన్న బంధం ఎట్లాంటిది?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబు రాయండి.**

అ. ఊరికి అందాన్నిచ్చే అంశాలేవి? ప్రస్తుతం పల్లెటూర్లలో ఇవి ఉంటున్నాయా? మీ అభిప్రాయాలను సొంత మాటల్లో రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

పాఠంలోని 3వ, 4వ పద్యాలలో ఊరి అందాలను కవి వర్ణించాడు కదా! మీరు చూసిన / మీకు తెలిసిన ఊరు అందాలను వర్ణిస్తూ రాయండి.

(లేదా)

మూడవ పద్యం ఆధారంగా చిత్రం గీసి రంగులు వేయండి. దాని గురించి చిన్న కవిత రాయండి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## V పదజాల వినియోగం

**1. కింద గీతగీసిన పదాలకు అదే అర్థాన్నిచ్చే పదాలు రాయండి.**

ఉదా: సంపద తో గర్వపడకూడదు. ( కలిమి, ధనము )

అ. తటాకంలో రకరకాల చేపలు జీవిస్తాయి. (..............., ...............)

ఆ. పుట్టినరోజున కొత్త అంబరాలు ధరిస్తాం. (..............., ...............)

ఇ. మా పురంలో చక్కని బడి ఉన్నది. (..............., ...............)

**2. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

అ. సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ( )


ఆ. చెరువు నిండితే అలుగు పారుతుంది. ( )

ఇ. కొట్టంలో పశువులు ఉంటాయి. ( )

**3. పాఠం ఆధారంగా కింది వాటికి కారణాలను పట్టికలో రాయండి.**

| | |
|---|---|
| అ. ఊరు పసుపు అద్దినట్లుండడానికి కారణం | |
| ఆ. ఎర్రని పారాణి అద్దినట్లుండడానికి కారణం | |
| ఇ. కుంకుమబొట్టు పెట్టినట్లు ఉండడానికి కారణం | |
| ఈ. పండు ముత్తైదువగా ఉండడానికి కారణం | |

**4.** భావనాచిత్రమంటే ఒక అంశానికి సంబంధించిన భావనలన్నింటినీ వర్గీకరించుకోవడమే! ఒక గ్రామానికి చెందిన భావనాచిత్రం గీయుమన్నపుడు గ్రామంలోని ప్రత్యేకతలు, గ్రామంలోని కీలక ప్రదేశాలు, ప్రజలు, వృత్తులు తదితర అంశాలన్నీ పరిగణిస్తాం.




SCERT TELANGANA

ఇచ్చిన ఉదాహరణ అంశాలను గమనించండి. ఆయా అంశాల ఆధారంగా పై భావనా చిత్రాన్ని పూర్తిచేయండి.

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను కలిపి రాసి, సంధిని గుర్తించండి.**

ఉదా : నీవు + ఎక్కడ = నీవెక్కడ – (ఉత్వసంధి)

అ. భీముడు + ఇతడు = ...................... – (......................)

ఆ. అతడు + ఎక్కడ = ...................... – (......................)

ఇ. ఇతడు + ఒకడు = ...................... – (......................)

ఈ. ఆటలు + ఆడు = ...................... – (......................)

**2. కింది పదాలను కలిపి రాయండి.**

అ. ఏమి + అది = ...................................

ఆ. ఎవరికి + ఎంత = ...................................

ఇ. మరి + ఇప్పుడు = ...................................

ఈ. అవి + ఏవి = ...................................

పై పదాలను విడదీసిన క్రమాన్ని, కలిపిన క్రమాన్ని గమనించండి.

మొదటి పదం చివరి అచ్చు "ఇ"కారం. (ఇత్తు). రెండవ పదాల మొదట్లో అన్నీ అచ్చులే వచ్చినవి.

ఈవిధంగా "ఏమి" మొదలైన పదాల 'ఇ'కారానికి (ఇత్తుకు) అచ్చు పరమైనపుడు సంధి జరుగుతుంది.

కొన్నిచోట్ల ఇట్లా సంధికార్యం జరుగదు. ఆ పదాలను చూద్దాం.

ఉదా: ఏమి + అయ్యె = ఏమయ్యె – సంధి జరిగింది.

ఏమి + అయ్యె = ఏమియయ్యె – సంధి జరగక యడాగమం వచ్చింది.

ఒకసారి సంధి (నిత్యము) జరిగి, మరొకసారి సంధి జరుగక (నిషేధము) పోవడాన్ని వ్యాకరణ పరిభాషలో 'వికల్పము' (వైకల్పికము) అంటారు.

"ఏమి" మొదలైన పదాలకు అచ్చుపరమైతే సంధి వైకల్పికము అని తెలుస్తుందికదా! దీనినే ఇత్వసంధి అంటారు.

ఏమ్యాదులయందు 'ఇత్తు'నకు అచ్చుపరమైతే సంధి వైకల్పికంగా జరుగుతుంది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

**3. ఈ కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

ఉదా : రావాలని = రావాలి + అని (ఇత్వసంధి)

అ. చెప్పాలంటే = ..................... + ..................... (     )

ఆ. ఒక్కటే = ..................... + ..................... (     )

ఇ. రానిదని = ..................... + ..................... (     )

ఈ. నీటినిసుమంత = ..................... + ..................... (     )

ఉ. చెప్పినదియేమి= ..................... + ..................... (     )

ఊ. వచ్చిరపుడు = ..................... + ..................... (     )

ఋ. ఎన్నియేని = ..................... + ..................... (     )

## ప్రాజెక్టుపని

మీ ఊరిలో ఉన్న చెట్లను, పూలను, జరిగే వ్యాపారాలను, చేతివృత్తులవారిని పరిశీలించండి. పట్టికలో నమోదు చేయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

| చెట్లు | పూలు | వ్యాపారం | చేతివృత్తులవారు | ఇతరములు |
|---|---|---|---|---|
| ఉదా॥ మామిడి | గన్నేరు | బియ్యం | వడ్రంగులు | |
| 1. | | | | |
| 2. | | | | |
| 3. | | | | |
| 4. | | | | |
| 5. | | | | |
| 6. | | | | |
| 7. | | | | |
| 8. | | | | |

SCERT TELANGANA

## నేనివి చేయగలనా?

| | |
|---|---|
| ★ పద్యాలను రాగంతో, భావంతో చదువగలను. | అవును / కాదు |
| ★ పద్యాలను చదివి వాటి భావాలను సొంత మాటలలో చెప్పగలను. | అవును / కాదు |
| ★ ఊరి అందాలను వర్ణిస్తూ రాయగలను. | అవును / కాదు |
| ★ పల్లెటూర్ల స్థితిగతులను గురించి సొంతంగా రాయగలను. | అవును / కాదు |
| ★ ఊరి బొమ్మగీసి రంగులు వేయగలను. | అవును / కాదు |

## సూక్తి

**పల్లె - ఆత్మీయత, అనురాగాల కలబోత!**
**ఆదరించి, అక్కున చేర్చుకొనే అన్నపూర్ణ.**

## చదువండి - తెలుసుకొండి

### ఉప్పుల మల్సూర్



**అతి సామాన్య కుటుంబంలో జన్మించాడతడు...**
**నీతినిజాయతీలకు కట్టుబడి జీవితం గడిపాడు...**
**నిస్స్వార్థజీవికి నిఖార్సయిన చిరునామాగా నిలిచాడు...**
**నాయకునిగా మానవత్వం కలిగిన మానవునిగా**
**నిలిచి గెలిచిన చిరస్మరణీయుడు ఉప్పుల మల్సూర్!**

నమ్మిన సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించినవారు అరుదుగా ఉంటారు. అటువంటి అరుదైన రాజకీయ నాయకుడే మల్సూర్. నేటి సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామంలో 1928లో మల్లయ్య, లచ్చుమ్మ దంపతులకు జన్మించిన ఉప్పుల మల్సూర్ అతి సాధారణ జీవితం గడిపిన విశిష్ట రాజకీయ నాయకుడు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆయుధం పట్టి ఉద్యమించిన పోరాటయోధుడు. తన జీవితాన్ని ప్రజలకొరకే అంకితం చేసిన మల్సూర్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల హృదయాలలో నిలిచాడు. ఎమ్మెల్యేగా తనకు వచ్చిన జీతాన్ని పార్టీకే ఇచ్చి, స్వయంగా తాను చెప్పులు కుట్టగా వచ్చిన డబ్బుతోనే జీవితం గడిపాడు. ఆఖరుకు మల్సూర్ భార్య సైతం కూలిపనికి వెళ్ళిందంటే వీరి నిరాడంబర జీవితాన్ని అర్థంచేసుకోవచ్చు. దళిత ఆణిముత్యంగా త్యాగశీలిగా పేరుపొందిన మల్సూర్ 13 జనవరి, 1999న అమరుడయ్యాడు. మల్సూర్ రక్తంతోపాటు విలువలను పంచుకున్న వారి సంతానం తమ సొంత యింటిని మల్సూర్ జ్ఞాపకార్థంగా పాఠశాలకు అందించారు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## మీకు తెలుసా?

### మదర్ థెరీసా



**ఆర్తులు... నిరుపేదలు... అభాగ్యులను అక్కున చేర్చుకున్నది...**
**కుష్ఠువ్యాధితో విలవిలలాడే రోగులకు సేవలుచేసింది...**
**బతికేటందుకు జానెడు జాగా లేనివారికి ఆశ్రయమిచ్చింది...**
**చరిత్రలో మానవతావాదిగా నిలిచింది!**
**ఇన్ని ప్రత్యేకతలున్న విశిష్ట సేవకురాలు మదర్ థెరీసా!**

"ప్రార్థించే పెదవులకన్నా సాయంచేసే చేతులుమిన్న" – అన్న మాటను అక్షరాలా నిజం చేసిన సన్న్యాసిని మదర్ థెరీసా. అల్బేనియా దేశానికి చెందిన థెరీసా అసలుపేరు ఆగ్నస్ గోన్హా బొజాక్షువా. 1910 ఆగస్టు 26న జన్మించిన ఆగ్నస్ బాల్యంనుండి సేవాపరాయణత్వం కల్గిన కరుణామయిగా విశ్వఖ్యాతిని ఆర్జించింది. భారతదేశ పౌరసత్వం పొంది కలకత్తాలో మిషనరీ ఆఫ్ చారిటీస్ సంస్థను స్థాపించి జీవితాంతం సేవలందించింది. అంతర్జాతీయ కీర్తి పొందిన మదర్ థెరీసా మానవసేవలకు గాను 1979 లో నోబెల్ శాంతి బహుమతి, 1980లో భారతరత్న పురస్కారాలు లభించాయి. మదర్ 1997 సెప్టెంబర్ 5న పరమపదించినా సేవాతత్పరతకు చిరునామాగా, ఆత్మీయ అరుణతారగా ప్రకాశిస్తూనే ఉన్నది.

## మీకు తెలుసా?

### మల్లినాథ సూరి

**బాల్యంలో పశువులను కాశాడు...**
**యోగి అనుగ్రహం, తన సాధన వల్ల పండితుడయ్యాడు...**
**కాశీకి వెళ్ళి 19 శాస్త్రాలను అధ్యయనం చేశాడు...**
**మహావ్యాఖ్యాతగా సుప్రసిద్ధుడయ్యాడు...**
**ఆయనే మెతుకుసీమకు**
**అజరామరమైనకీర్తిని తెచ్చిన మహానుభావుడు! మల్లినాథ సూరి!!**



కవికుల గురువుగా పేరొందిన కాళిదాసు రచనలకు వ్యాఖ్యాన మందించిన ప్రతిభామూర్తి మల్లినాథ సూరి. పూర్వపు మెదక్ జిల్లాలోని కొల్చారం ఈయన స్వస్థలం. బహుభాషాకోవిదుడైన మల్లినాథ సూరి అశేష శాస్త్రపాండిత్యం గడించాడు. సంస్కృత పంచమహాకావ్యాలకు వ్యాఖ్యానాలు రాశాడు. కాళిదాస రచనలకు సంజీవనివ్యాఖ్య, కిరాతార్జునీయానికి ఘంటాపథం వ్యాఖ్య, శిశుపాలవధకు సర్వంకష వ్యాఖ్య, నైషధానికి జీవాతువు వ్యాఖ్య... ఇట్లా 15 గ్రంథాలకు వ్యాఖ్యానాలు రచించిన ఘనత మల్లినాథ సూరిది. ఈ వ్యాఖ్యానాలే ఈయనను 'వ్యాఖ్యానచక్రవర్తి' బిరుదాంకితుడిని చేశాయి.

SCERT TELANGANA

# 6. ప్రేరణ

- డా॥ ఏ.పి.జె. అబ్దుల్ కలాం

## చదువండి - ఆలోచించండి - చెప్పండి

ప్రజ్ఞ చాలా తెలివికలది. ఆమెకు శాస్త్రవేత్త కావాలని బలమైన కోరిక ఉన్నది. ప్రతీ దాన్ని పరిశీలన దృష్టితో చూస్తుంది. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులు కూడా గెల్చుకున్నది. శాస్త్రవేత్తలకు సంబంధించిన పుస్తకాలను చదువుతుంది. సందేహ నివృత్తికై ఉపాధ్యాయులను, పెద్దలను సంప్రదిస్తుంది. ఒకరోజు విజ్ఞానశాస్త్ర కార్యక్రమంలో పాల్గొనడానికి వారి గ్రామానికి ఒక శాస్త్రవేత్త రాగా, ప్రజ్ఞ వెళ్ళి కలుసుకున్నది.

F6G2N3

## ప్రశ్నలు

1. ప్రజ్ఞ శాస్త్రవేత్తను ఏమడిగి ఉంటుంది?
2. శాస్త్రవేత్త ప్రజ్ఞకు ఏమి చెప్పి ఉంటాడు?
3. ప్రజ్ఞ శాస్త్రవేత్త కావాలనుకున్నది కదా! మీరేం కావాలనుకుంటున్నారు? ఇందుకోసం మీరేం చేస్తారు?

## పాఠం ఉద్దేశం

ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహనీయుల జీవితం విద్యార్థులకు ప్రేరణ నిస్తుంది. ఆ మహనీయులను మార్గదర్శకంగా తీసుకోవాలనే ఆకాంక్ష విద్యార్థులలో కలుగుతుంది. తద్వారా భావిభారతపౌరులు తమ జీవితానికి లక్ష్యాన్ని నిర్దేశించుకుంటారు. ఆ దిశగా ప్రోత్సహించడమే ఈ పాఠం ఉద్దేశం.


## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ఆత్మకథ ప్రక్రియకు చెందినది. ఒక వ్యక్తి తన జీవిత విశేషాల్ని తానే గ్రంథస్థం చేసుకుంటే అది ఆత్మకథ. ఆత్మకథనే స్వీయచరిత్ర అని కూడా అంటారు. ఇందులో సమకాలీన విశేషాలు ప్రతిబింబిస్తాయి. రచయిత అనుభవాలే కాక ఆ కాలం నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు తెలుస్తాయి. ఇతరులకు ప్రేరణ కలిగిస్తాయి. ఇది ఉత్తమ పురుష కథనంలో ఉంటుంది.

ఈ పాఠ్యభాగం డా॥ అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలామ్, అరుణ్ తివారిగారితో కలిసి రాసిన 'ఒక విజేత ఆత్మకథ' లోనిది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## రచయిత పరిచయం



(15-10-1931
27-07-2015)

అందరూ ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ అని పిలిచే డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలామ్ తమిళనాడులోని రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటిలో పుట్టాడు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదల, క్రమశిక్షణ, అధిక జిజ్ఞాసతో ఇంజనీరుగా శాస్త్రవేత్తగా భారత రాష్ట్రపతిగా తన సేవలను ఈ జాతికి అందించాడు. 'ఒక విజేత ఆత్మ కథ' (ఇగ్నీటెడ్ మైండ్స్ ది వింగ్స్ఆఫ్ ఫైర్-యాన్ ఆటోబయోగ్రఫీ) వంటి రచనలు చేశాడు.

శాస్త్రరంగంలో విశేష కృషి చేసినందుకు గాను 'పద్మభూషణ్', 'పద్మవిభూషణ్'తో పాటు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న'తోను భారతప్రభుత్వం సత్కరించింది. దేశ విదేశాల్లోని విశ్వవిద్యాలయాలు 'గౌరవ డాక్టరేట్'లతో ఆయనను గౌరవించాయి.

## విద్యార్థులకు సూచనలు

- ★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- ★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- ★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- ★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**ఆయన అందరిలా అతి సామాన్య కుటుంబంలో జన్మించాడు. బాల్యంలో అనేక ఒడిదుడుకులను, కష్టాలను ఎదుర్కొన్నాడు. మొక్కవోని దీక్షతో ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం కొనసాగించాడు. చిన్నప్పుడే స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాడు. ఆ లక్ష్యం చేరాలని కలలుకన్నాడు. నిరంతర కఠోర సాధనతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసి అందరి మన్ననలు అందుకున్న ఆ మహానుభావుడు చిన్నారులకు ప్రీతిపాత్రుడు. ఆయన జీవితమే నవతరానికి ప్రేరణ. ఆయన విద్యాభ్యాసం, లక్ష్యసాధన ఎట్లా జరిగిందో చూద్దాం.**

SCERT TELANGANA

# I

నేను రామనాథపురంలో హైస్కూల్లో స్థిరపడగానే నాలోని పదిహేనేళ్ళ జిజ్ఞాసి మేల్కొన్నాడు. తనముందు పరచుకొని ఉన్న జీవితావకాశాల గురించి ప్రత్యామ్నాయాల గురించీ ఇదమిత్థంగా ఏమీ తెలుసుకోలేని ఒక నవ ఔత్సాహికుడికి నా ఉపాధ్యాయుడు ఇయదురై సోలోమోన్ ఆదర్శపథ నిర్దేశకుడయ్యాడు. తన ఉదార విశాల దృక్పథంతో ఆయన తన తరగతిగదిలోని విద్యార్థుల్ని ఉత్సాహపరిచేవాడు. 'మందబుద్ధి శిష్యుడు ఉత్తమగురువు నుంచి నేర్చుకోగలిగిన దానికన్నా ఉత్తమ విద్యార్థి చెడ్డఉపాధ్యాయుడి నుంచి కూడా ఎక్కువ నేర్చుకోగలడ'నే వాడాయన. నేను రామనాథపురంలో ఉన్న కాలంలో మా అనుబంధం గురుశిష్యబంధాన్ని దాటి వికసించింది. ఆయన సాహచర్యంలో ఒకరి జీవితగమనాన్ని ఎవరైనా ఏ మేరకు ప్రభావితం చేయగలరో తెలుసుకున్నాను. ఇయదురై సోలోమోన్ అంటూండేవారు, జీవితంలో విజయం పొందడానికీ ఫలితాలు సాధించడానికీ నువ్వు మూడు అంశాలమీద పట్టు సాధించాల్సి ఉంటుంది – అవి "కోరిక", "నమ్మకం", "ఆశ పెట్టుకోవడమూ"ను.

తరువాతి రోజుల్లో రివరెండ్‌గా మారిన సోలోమోన్ నాకు నేర్పిందిదే. నాకేదన్నా సంభవించాలని నేననుకునే ముందు నేను దాన్ని గట్టిగా ఆకాంక్షించాలనీ, అది తప్పక జరిగి తీరుతుందనీ ప్రగాఢంగా విశ్వసించాలనీను. నా జీవితం నుంచి ఒక ఉదాహరణ ఇస్తాను. నాకు చిన్నప్పటినుంచీ ఆకాశపు రహస్యాలన్నా, పక్షుల ప్రయాణమన్నా అమితాసక్తి. కొంగలూ, సముద్రపు గువ్వలు ఎగురుతుండటం చూస్తూ నేను కూడా ఎగరాలని కోరుకునేవాణ్ణి. సాధారణ గ్రామీణ బాలుడినయినప్పటికీ, నేను కూడా ఏదో ఒకరోజు ఆకాశంలో విహరించగలననీ ఎంతగా నమ్మానంటే మా రామేశ్వరం నుంచి ఆకాశయానం చేసిన మొదటి బాలుణ్ణి నేనే కావటం విశేషం.

ఇయదురై సోలోమోన్ ఎందుకు గొప్ప ఉపాధ్యాయుడంటే ఆయన విద్యార్థులందరిలో ఏదో ఒక విలువ గురించి స్పృహని మేల్కొల్పేవాడు. ఆయన నా ఆత్మగౌరవాన్ని ఏ మేరకు మేల్కొల్పాడంటే ఏ మాత్రం చదువుకోని తల్లిదండ్రుల బిడ్డనైన నేను కూడా ఏది కావాలనుకుంటే అది కాగలనని నమ్మాను. "విశ్వాసంతో నువ్వు నీ విధిని కూడా తిరిగి రాయగలవు" అనే వారాయన. 1950లో ఇంటర్మీడియెట్ పరీక్షకు చదవడానికి తిరుచినాపల్లిలోని ట్రిచీ సెంట్ జోసఫ్ కాలేజీలో చేరాను. పరీక్షల గ్రేడుల లెక్కన చూస్తే నేనేమంత చురుకైన విద్యార్థిని కాను.

మా అన్నయ్య ముస్తఫా కమల్‌కి స్టేషన్‌రోడ్‌లో ఒక కిరాణా దుకాణముండేది. హైస్కూల్లో చదువుకునే టప్పుడు నేను రామేశ్వరం వెళ్ళినప్పుడల్లా నన్ను సాయం చెయ్యమంటూ పిలిచి, షాపులో కూచోబెట్టి ఇంక గంటల తరబడి అతను అదృశ్యమైపోయేవాడు. నేను అక్కడ ఆ షాపుని కనిపెట్టుకు కూచొని బియ్యం, నూనె, ఉల్లిపాయలు ఒకటేమిటి అన్నీ అమ్ముతుండే వాణ్ణి. వాటిలో తొందరగా చెల్లిపోయేవి సిగరెట్లూ, బీడీలూను. బీద వాళ్ళు తమ కష్టార్జితాన్ని ఎందుకట్లా పొగపీల్చేస్తుంటారని ఆశ్చర్యం కలిగేదినాకు. మా అన్నయ్య ముస్తఫా నన్ను వదిలి పెట్టగానే మా తమ్ముడు కాశిం మహమ్మద్ నన్ను తన ఫ్యాన్సీషాపులో కూర్చోబెట్టడానికి సిద్ధంగా ఉండేవాడు. అక్కడ నత్తగుల్లలతోను, శంఖాలతోను చేసిన రకరకాల అలంకార సామగ్రి అమ్మేవారు.

**ఆలోచించండి – చెప్పండి**

- 'నువ్వు నీ విధిని కూడా తిరిగి రాయగలవు' అంటే మీకేమర్థమైంది?
- మీరు మీ కుటుంబసభ్యులకెప్పుడైనా సహాయం చేశారా? ఏ సందర్భంలో ఏం చేశారు?
- కోరిక, నమ్మకం, ఆశపెట్టుకోవడం అనేవి విజయాన్నిస్తాయికదా! వీటిపై మీ అభిప్రాయ మేమిటి?


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

# II

సెంట్ జోసెఫ్‌లోని మా ఉపాధ్యాయులంతా కంచి పరమాచార్యకు అనుచరులు. త్యాగనిరతి ద్వారా ఆనందించే గుణాన్ని ఆయన వాళ్ళల్లో మేల్కొల్పాడు. కళాశాల కేంపస్‌లో మా గణితశాస్త్ర ఉపాధ్యాయులు ప్రొఫెసర్ తోతత్రి అయ్యంగార్, ప్రొఫెసర్ సూర్యనారాయణశాస్త్రిగార్లతో కలిసి నడుస్తున్న ఆ దృశ్యం నాకిప్పటికీ గుర్తొచ్చి ఉద్వేగభరితుణ్ణి చేస్తుంది.

నేను సెంట్ జోసెఫ్‌లో నా చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు ఇంగ్లీషు సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్నాను. ఇంగ్లీషులోని సర్వశ్రేష్ఠ కృతుల్ని చదువుతుండేవాణ్ణి. టాల్‌స్టాయ్, స్కాట్, హార్డీల పట్ల ప్రత్యేక ఆసక్తి ఉండేది. అప్పుడప్పుడు తత్త్వశాస్త్రగ్రంథాలు చదువుతుండేవాణ్ణి. దాదాపుగా ఆ సమయంలోనే భౌతికశాస్త్రం పట్ల నాకు అమితమైన ఆసక్తి ఏర్పడింది.

కొంతమంది మనుషులు సైన్సుఅనేది వేరే ఒక అంశమన్నట్టుగా,అది మనిషిని భగవంతుడి నుంచి దూరం చేస్తుందన్నట్టుగా ఎందుకు మాట్లాడుతారో నాకర్థం కాదు. విజ్ఞానశాస్త్రపథం మానవహృదయ వీథుల్లోంచి సాగిపోయేదే, నాకయితే సైన్స్ ఎప్పుడూ ఆధ్యాత్మిక ఉన్నతికీ, ఆత్మ సాక్షాత్కారానికీ మార్గంగానే ఉంటూ వచ్చింది.

సెంట్ జోసెఫ్‌లో బి.ఎస్.సి. డిగ్రీ కోర్సులో చేరినప్పుడు అంతకుమించిన ఉన్నత చదువేమీ నాకు తెలియదు. ఒక సైన్స్ విద్యార్థికి ఉన్న భవిష్య అవకాశాల గురించిన సమాచారం కూడా నాకేమి తెలియదు. బి.ఎస్.సి. డిగ్రీ పూర్తి చేసాకే భౌతికశాస్త్రం (ఫిజిక్స్) నా సబ్జెక్ట్ కాదని గ్రహించాను. నా కలలు నిజం కావాలంటే నేను ఇంజనీరింగ్ చదవవలసి ఉంటుందని తెలుసుకున్నాను. ఇంటర్మీడియేట్ అయిన తరవాతనే నేను నేరుగా ఇంజనీరింగ్‌లో చేరిఉండవచ్చు. దక్షిణ భారతదేశమంతటిలోనూ సాంకేతిక విద్యకు తలమానికంలాంటి మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తు చేసాను.

ప్రవేశానికి ఎంపికైతే అయ్యాను గానీ అటువంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో చదవడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. దాదాపు వెయ్యిరూపాయలన్నా అవసరమవుతాయి. కానీ అది నా తండ్రికి తలకు మించిన విషయం. అప్పుడు నా సోదరి జొహారా నాకు తోడు నిలబడింది. తన బంగారు గాజులు, గొలుసు కుదవబెట్టి ఆమె నాకు సహాయం చేసింది. నేను చదువుకోవాలన్న ఆమె





SCERT TELANGANA

ఆకాంక్ష నా సామర్థ్యంపై ఆమె నమ్మకం నన్ను గాఢంగా చలింపచేసాయి. నేను నా సొంత సంపాదన మీదనే ఆమె గాజుల్ని విడిపిస్తానని ఒట్టుపెట్టుకున్నాను. అప్పుడు నాకు డబ్బు సంపాదించడానికున్న ఏకైక మార్గం కష్టపడి చదువుకుని స్కాలర్షిప్ సంపాదించుకోవడమే.

నన్ను ఎమ్.ఐ.టిలో అన్నిటికన్నా మిన్నగా ఆకర్షించింది అక్కడ ప్రదర్శన కోసం పెట్టిన రెండు పాత విమానయంత్రాలు. విమానయంత్రాల ప్రదర్శన కోసం అవక్కడుంచబడ్డాయి. వాటి పట్ల ప్రత్యేక ఆకర్షణకు లోనయ్యాను. విద్యార్థులంతా హాస్టలుకు వెళ్ళిపోయాక కూడా చాలాసేపు వాటి దగ్గరే కూర్చుండేవాణ్ణి. పక్షిలాగా ఆకాశంలో విహరించాలన్న మనిషి ఆకాంక్షని ఆరాధిస్తూ అక్కడే గడిపేవాణ్ణి.

నా మొదటిసంవత్సరం పూర్తయ్యాక ఒక ప్రత్యేకవిషయాన్ని ఎంపిక చేసుకోవాల్సి వచ్చినప్పుడు మరేమీ ఆలోచించకుండా ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌ని ఎంచుకున్నాను. లక్ష్యం నా మనసులో స్పష్టంగానే ఉండింది. నేను ఎలాగైనా విమానాల్ని నడపాలి. నిలదొక్కుకునే శక్తి లేదని తెలిసికూడా నాకా లక్ష్యం సాధ్యమనే నేను నమ్మాను. నా సాధారణ కుటుంబ నేపథ్యం అందుకు అడ్డు రాలేదు.

ఆ సమయంలోనే నేను వివిధ రకాల వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడానికి ప్రయత్నించాను. ఆ దారిలో వైఫల్యాలున్నాయి. ఆశాభంగాలున్నాయి. తోవ తప్పడాలున్నాయి. కానీ దారితప్పిన ప్రతివేళా నా తండ్రి మాటలు నన్ను మళ్ళా సరిగా నిలబెట్టేవి. ఆ ఉత్తేజకరమైనమాటలు 'ఇతరుల్ని అర్థం చేసుకున్నవాడు విజ్ఞాని. కానీ తనని తాను తెలుసుకున్నవాడే వివేకి. వివేకం లేని విజ్ఞానం ప్రయోజన శూన్యం'.

ఎమ్.ఐ.టిలో నా విద్యాభ్యాసంలో నా ఆలోచనని ముగ్గురు ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు. వారి సంయుక్త ప్రోత్సాహం ఏర్పరచిన పునాది పైనే నా సాంకేతిక ప్రతిభ అంతా ఆధారపడి ఉంది. వారు ప్రొఫెసర్ స్పాండర్, ప్రొఫెసర్ కే.ఏ.వి. పండలై, ప్రొఫెసర్ నరసింగరావుగార్లు. వారిలో ప్రతి ఒక్కరిదీ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కానీ అందరి ఆశయమూ ఒకటే. తమ విద్యార్థుల జ్ఞాన తృష్ణని తమ చైతన్యంతోనూ అకుంఠిత సంకల్పంతోనూ సంతృప్తిపరచడమే.

విస్తృత పరిజ్ఞానం నా మనసులో నెమ్మదిగా సమీకరింపబడటం మొదలయ్యింది. వివిధ రకాల ఏరోప్లేన్‌ల నిర్మాణాంశాల ప్రాముఖ్యత తెలియడం మొదలైంది. నా జ్ఞానం సమగ్రవంతం కావడానికి ఆ ముగ్గురు ప్రొఫెసర్లు వారివారి శ్రేష్ఠ వ్యక్తిత్వాలతో నాకెంతో సహకరించారు.

ఈ లోగా నా కోర్సు పూర్తిచెయ్యగానే నలుగురు సహచరులతో కలిసి ఒక చిన్న తరహా యుద్ధ విమానం డిజైన్ చేసే బాధ్యత చేపట్టాను. అందులో ఏరోడైనమిక్ డిజైన్ రూపకల్పన బాధ్యతనాది. చోదనం, నిర్మాణం, అదుపు, ఉపకరణ సామగ్రికి సంబంధించిన రూపకల్పనని నా మిత్రులు తమ వంతుగా తీసుకున్నారు.

**ఆలోచించండి - చెప్పండి**

- ★ మీ జీవిత లక్ష్యం ఏమిటి? అది సాధించడానికి ఏం చేస్తారు?
- ★ 'తనను తాను తెలుసుకోవడం' అంటే మీకేమర్థమైంది?
- ★ మిమ్మల్ని మీ ఉపాధ్యాయులెట్లా ప్రోత్సహిస్తారో చెప్పండి.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# III

ఒకరోజు మా డైరక్టర్, మాకు డిజైనింగ్ ఉపాధ్యాయుడూ అయిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ మా పనిలో ప్రగతిని సమీక్షించి, ఏమీ పురోగతి లేదని చాలా నిరాశాజనకంగా ఉందని తేల్చేసారు. నేను పనిలో జాప్యానికి ఓ డజను సాకులు చెప్పినా ఆయన్ని ఒప్పించలేకపోయాను. ఆ పనిని పూర్తి చెయ్యడానికి చివరికి ఒక నెలరోజుల వ్యవధి కోరాను. ఆ ప్రొఫెసర్ నా వంక కొంతసేపు చూసి, 'చూడు యంగ్మేన్, ఈ రోజు శుక్రవారం మధ్యాహ్నం. నేను నీకు మూడు రోజుల టైమిస్తున్నాను. సోమవారం ఉదయానికి గానీ విమాన నిర్మాణం డ్రాయింగ్ పూర్తికాక పోతే మీ స్కాలర్షిప్ని ఆపెయ్యవలసి ఉంటుంది' అన్నాడు. నాకు నోట మాట రాలేదు. ఆ స్కాలర్షిప్పే నా జీవన భాగ్యరేఖ. అది గాని లేకపోతే ఇక ఏ దిక్కూ లేదు. చెప్పినట్టు ఆ పని పూర్తి చెయ్యడం తప్ప మరో మార్గం కనిపించలేదు.

ఆ రాత్రి నేను భోజనం మానేసి డ్రాయింగ్ బోర్డ్ దగ్గరే పనిలో నిమగ్నుణ్ణై పోయాను. మర్నాడు ఉదయం ఒక గంట మాత్రమే విరామం తీసుకుని ఏదో తిన్నాననిపించి మళ్ళా పనిలో పడ్డాను. ఆదివారం ఉదయానికి దాదాపుగా పని పూర్తి కావస్తుండగా హఠాత్తుగా ఎవరో అక్కడ మసిలినట్టుగా అనిపించింది. చూద్దును కదా ప్రొఫెసర్ శ్రీనివాసన్. నన్ను కొంత దూరం నుంచీ పరికిస్తున్నాడు. ఆయన నా పని ప్రగతిని చూడడానికి జింఖానా నుండే నేరుగా తన టెన్నిస్ డ్రెస్‌లో వచ్చేసాడు. నా పనితీరు పరిశీలించాక ప్రొఫెసర్ శ్రీనివాసన్ నన్ను ఆప్యాయంగా కావిలించుకొని ప్రశంసాత్మకంగా వెన్ను తట్టాడు. 'నాకు తెలుసు నిన్ను ఒత్తిడి చేస్తున్నానని, అసాధ్యమైన పరిస్థితికి నెడుతున్నానని కూడా తెలుసు. కానీ నువ్వింత చక్కగా ఈ పనిని పూర్తి చెయ్యగలవని ఊహించలేదు' అన్నాడు.

ప్రాజెక్ట్ పని పూర్తి చేస్తున్న కాలంలోనే నేను ఎమ్.ఐ.టి. తమిళ సంఘం వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్నాను.

'మన విమానాన్ని మనమే తయారు చేసుకుందాం' అని ఒక వ్యాసాన్ని తమిళంలో రాసాను. ఆ వ్యాసం గొప్ప ఆసక్తిని రేకెత్తించింది. ఆ పోటీలో గెలిచాను. ప్రఖ్యాత తమిళ వారపత్రిక ఆనంద వికటన్ సంపాదకుడైన దివాన్ చేతుల మీదుగా దానికి మొదటి బహుమతి అందుకున్నాను.

ఎమ్.ఐ.టికి సంబంధించి నా ఆత్మీయమైన జ్ఞాపకం ప్రొఫెసర్ స్పాండర్‌కి సంబంధించిందే. వీడ్కోలు సమావేశంలో భాగంగా మేము గ్రూప్ ఫోటో కోసం నిలబడ్డాం. ప్రొఫెసర్లు ముందు కూర్చొని ఉండగా గ్రాడ్యుయేట్ విద్యార్థుల మంతా మూడు వరుసల్లో వెనుక నిల్చొన్నాం. హఠాత్తుగా ప్రొఫెసర్ స్పాండర్ లేచి నిల్చొని నా కోసం కలియచూశాడు. నేను మూడో వరుసలో నిల్చున్నాను. 'రా నాతో పాటు ముందు కూర్చో' అన్నాడు. నేను ప్రొఫెసర్ స్పాండర్ ఆహ్వానానికి నిర్ఘాంతపోయాను. 'నువ్వు నా బెస్టు స్టూడెంట్‌వి.' నీ పరిశ్రమ నీ ఉపాధ్యాయులకి భవిష్యత్తులో మంచి పేరు తేవడానికి ఉపకరిస్తుంది' అన్నాడు. ఆ ప్రశంసకి సిగ్గుపడ్డాను. అదే సమయంలో నాకు లభించిన గుర్తింపుకు గర్విస్తూ నేను ప్రొఫెసర్ స్పాండర్‌తో కలిసి ఫోటోగ్రాఫ్ కోసం కూచున్నాను. 'దేవుడే నీ



SCERT TELANGANA

ఆశా, ఆశ్రయమూ, మార్గదర్శి కాగలడు. భవిష్యత్‌లోకి నీ ప్రయాణానికి ఆయనే దారి చూపే దీపం కాగలడు' అన్నాడు ఆ మహామేధావి నాకు వీడ్కోలు పలుకుతూ.

గ్రాడ్యుయేట్ ఏరోనాటికల్ ఇంజనీర్‌గా నేను ఎమ్.ఐ.టి. నుంచి బయటికి వచ్చేటప్పటికి ఆకాశయానం గురించిన నా చిరకాల స్వప్నాన్ని నిజం చేసే రెండు ఉపాధి అవకాశాలు నా ముందుకొచ్చాయి. ఒకటి వైమానిక దళంలో ఉద్యోగం, రెండోది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సాంకేతిక అభివృద్ధి ఉత్పాదక డైరెక్టరేట్‌లో ఉద్యోగమూను. నేను రెండింటికి దరఖాస్తు చేసాను. రెండు చోట్లనుంచీ కాల్ లెటర్లు ఒక్కసారే వచ్చాయి.

వైమానిక దళంలో ఉద్యోగానికి డెహరాడూన్‌కీ, రక్షణ మంత్రిత్వశాఖ ఉద్యోగానికి ఢిల్లీకి వెళ్ళవలసి ఉంది. అప్పుడీ కోరమాండల్‌తీర బాలుడు ఉత్తర దేశానికి పోయే రైలెక్కాడు. నా జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది. నా మాతృభూమి విస్తృతి ఎటువంటిదో మొదటిసారి తెలుసుకున్న సందర్భం అది.

### ఆలోచించండి - చెప్పండి

★ 'స్కాలర్‌షిప్పే నా జీవన భాగ్యరేఖ' అని కలాం అనడంలో ఆంతర్యమేమిటి?

★ 'దారిచూపే దీపం' అనే మాటను ఏయే సందర్భాలలో ఉపయోగిస్తారు?

★ ప్రొఫెసర్ కలాంను ముందువరుసలో కూర్చోమన్నాడుకదా! కలాం స్థానంలో మీరుంటే ఏవిధంగా అనుభూతి చెందేవారు?

## ఇవి చేయండి

Y4X2Q2

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. ప్రేరణ అని 'పాఠం' పేరు వినగానే మీకేమనిపించింది?
2. అబ్దుల్ కలామ్ చదువుకున్న రోజుల్లోని విద్యా విధానం గూర్చి మీ మిత్రులతో చర్చించండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది వాక్యాలు పాఠంలో ఏ పేరాల్లో ఉన్నాయో గుర్తించండి. ఆ వాక్యాలను పూర్తిగా రాయండి.**

అ. కలామ్ తత్త్వశాస్త్ర గ్రంథాలు చదవడం

ఆ. విజయానికి సూత్రాలు మూడు.

ఇ. సోదరిసహాయం

ఈ. ప్రొఫెసర్ పక్కన కూర్చొని ఫొటో దిగడం.

SCERT TELANGANA

**2) కింది పేరా చదువండి. తప్పు ఒప్పులను గుర్తించండి.**

భారత జాతీయోద్యమ నాయకులలో బిపిన్ చంద్రపాల్ ఒకడు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న సైచెల్‌లో జన్మించాడు. సహాయనిరాకరణోద్యమానికి పిలుపునిచ్చాడు. దేశ స్వాతంత్ర్యం కోసం, అభ్యుదయం కోసం పాటుపడ్డాడు. కవులనూ పండితులను, తత్త్వవేత్తలను, ప్రవక్తలను, నాయకులను, సాధారణ ప్రజలనూ అందరినీ ఆహ్వానించాడు. స్వాతంత్ర్యపోరాటంలో చురుకుగా పాల్గొని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

అ. బిపిన్ చంద్రపాల్ జాతీయోద్యమ నాయకుడు. ( )

ఆ. బిపిన్ చంద్రపాల్ సహాయ నిరాకరణోద్యమానికి వ్యతిరేకి. ( )

ఇ. బిపిన్ చంద్రపాల్ కవులను, పండితులను స్వాతంత్ర్యోద్యమంలోకి ఆహ్వానించాడు. ( )

ఈ. బిపిన్ చంద్రపాల్‌కు స్వాతంత్ర్యోద్యమ కాంక్ష ఉన్నది. ( )

ఉ. బిపిన్ చంద్రపాల్ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన జాతీయనాయకుడు. ( )

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. 'ఇతరుల్ని అర్థం చేసుకున్నవాడు జ్ఞాని' ఈ వాక్యంపై మీ అభిప్రాయం రాయండి.

ఆ. 'కోరిక, నమ్మకం, ఆశపెట్టుకోవడం' అనే మూడు అంశాల మీద ఎందుకు పట్టు సాధించాలి.

ఇ. 'తమ విద్యార్థుల జ్ఞాన తృష్ణను తమ చైతన్యంతో, అకుంఠిత సంకల్పంతో సంతృప్తిపరచడమే!' ఈ మాటలు ఎవరినుద్దేశించినవి దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

ఈ. ప్రొఫెసర్ శ్రీనివాసన్ అప్పగించిన పనిని పూర్తి చేసే సమయంలో కలాం స్థానంలో మీరుంటే ఏం చేసేవారు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

కలాం తన ఆశయ సాధనలో ఎలా కృతకృత్యుడయ్యాడు? మీ సొంత మాటల్లో రాయండి.

(లేదా)

కలాం విద్యాభ్యాసం ఏ విధంగా కొనసాగిందో మీ సొంత మాటల్లో రాయండి.

SCERT TELANGANA

## IV సృజనాత్మకత / ప్రశంస

కలాం తన కోరికను గురించి చెప్పాడు కదా! అట్లాగే మీరు కూడా మీ కోరికను చిన్నకవిత రూపంలో రాయండి.

(లేదా)

ఈ పాఠం స్ఫూర్తితో మీరే అబ్దుల్ కలాం అయితే నేటి విద్యార్థులకు ఏం చెబుతారు? సందేశమివ్వండి. ఏకపాత్రాభినయం చేయండి.

## V పదజాల వినియోగం

**1. కింద గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ. <u>ఔత్సాహికుడైన</u> వ్యక్తి ఏ రంగంలోనైనా రాణిస్తాడు.

ఆ. <u>జిజ్ఞాసువు</u> కొత్త విషయాలను తెలుసుకుంటాడు.

ఇ. సుస్మితకు డాక్టరు గా ఎదగాలని <u>ఆకాంక్ష</u>.

ఈ. అభ్యర్థులు ఎన్నికల సమయంలో <u>వాగ్దానాలు</u> చేస్తారు.

**2. పాఠంలో శాస్త్ర సంబంధ పదాలున్నాయి. వాటిని పట్టికగా రాయండి.**

ఉదా : ఏరోనాటికల్ ఇంజనీర్

**3. కింది వాక్యాలలో సమానార్థకాన్నిచ్చే పదాలున్నాయి. వాటిని గుర్తించి రాయండి.**

అ. ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. ఆ గగనంలోనే చంద్రుడు కాంతులీనుతున్నాడు. అందుకే నింగి అంటే నాకెంతో ఇష్టం.

ఆ. భూమి మీద ఎన్నో జీవరాశులున్నాయి. అదే వసుధలో నిధి నిక్షేపాలుంటాయి. అట్టి ధరణికి వృక్షాలు అందాన్నిస్తాయి.

ఇ. ఆయనకు సుమారు ముప్పై ఏళ్ళు. ఉద్యోగంలో చేరి ఇంచుమించు ఆరు సంవత్సరాలైంది. ఏడాదికి దాదాపు రెండులక్షలు సంపాదిస్తున్నాడు.

ఈ. కిరణ్‌కు కలెక్టర్ కావాలని కోరిక. తన ఆకాంక్ష నెరవేరడానికి నిరంతరం శ్రమించాడు. పరీక్ష ఫలితాలు రాగానే తన వాంఛ నెరవేరిందని సంతోషించాడు.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను విడదీయండి. సంధులను గుర్తించండి.**

అ. మొదలయ్యింది = .................. + .................. (         )

ఆ. మేల్కొల్పాడంటే = .................. + .................. (         )

ఇ. ఉంటుందని = .................. + .................. (         )

ఈ. నాకిప్పటికీ = .................. + .................. (         )

ఉ. నైపుణ్యముందో = .................. + .................. (         )

**2. కింది వాక్యాలు చదువండి. గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తికి చెందినవో గుర్తించండి, రాయండి.**

ఉదా: అ. ఆదిత్య మంచి బాలుడు. ( ప్రథమావిభక్తి )

ఆ. సూర్యనారాయణశాస్త్రిగారితో నడిచాను. (         )

ఇ. ఆయనను ఒప్పించలేకపోయాను. (         )

ఈ. ఆహారం కొరకు పక్షులు బయలుదేరుతాయి. (         )

ఉ. గురువులయొక్క ప్రభావం కలాంపై బాగా ఉన్నది. (         )

ఊ. చెరువులయందు ఉన్న తామరలు సౌందర్యాన్నిస్తాయి. (         )

ఋ. ఓ బాలలారా! కలలు కనండి. (         )

### ప్రాజెక్టుపని

మీకు నచ్చిన శాస్త్రవేత్తను గురించి వారెట్లా ప్రేరణ పొందారో, ఏ కొత్త విషయాలు కనుక్కున్నారో వివరాలు సేకరించి నివేదిక రాసి ప్రదర్శించండి. (లేదా) వివిధ శాస్త్రవేత్తల గురించి పత్రికల్లో వచ్చిన అంశాలను సేకరించి, నివేదిక రాసి ప్రదర్శించండి.

### నేనివి చేయగలనా ?

- ★ కలాం విద్యాభ్యాసం గురించి మాట్లాడగలను. అవును / కాదు
- ★ అపరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన వాక్యాల్లో తప్పొప్పులను గుర్తించగలను. అవును / కాదు
- ★ కలాం ఆశయసాధన గూర్చి సొంతమాటలలో రాయగలను. అవును / కాదు
- ★ నాలోని కోరికలను చిన్న కవిత రూపంలో రాయగలను. అవును / కాదు

### సూక్తి

**తన గురించి, తన కాలాన్ని గురించి రాసేవాడే సర్వప్రజల గురించి సర్వకాలాల గురించి రాసిన వాడవుతాడు.**

**– బెర్నార్డ్ షా**

SCERT TELANGANA

# 7. శిల్పి

- గుఱ్ఱం జాషువా

## బొమ్మలను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



T6M5D2

### ప్రశ్నలు

1. పై బొమ్మలను చూడండి. అవి వేటితో తయారైనాయి?
2. ఇవన్నీ ఏ కళకు సంబంధించినవి? వాటి గురించి మీకు తెలిసింది చెప్పండి.
3. శిల్పాలను తయారుచేసేవారిని ఏమంటారు? వారి గురించి మీకు తెలిసింది చెప్పండి.

### పాఠం ఉద్దేశం

అరవైనాలుగు కళలలో శిల్పకళ ఒకటి. భారతదేశంలో శిల్పకళ కనిపించని దేవాలయాలు లేవు. నిర్జీవమైన బండరాళ్ళకు జీవం పోసేవాడు శిల్పి. శిల్పి చెక్కిన శిల్పాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. జీవకళ ఉట్టిపడేటట్లు శిల్పాలను చెక్కిన శిల్పి ధన్యుడు. శిల్పి నైపుణ్యాన్ని, శిల్పి కష్టాలను తెలియజేయడమే పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ఖండకావ్య ప్రక్రియకు చెందినది. వస్తువైవిధ్యం కలిగిన ఖండికలతో కూడి ఉన్న కావ్యం ఖండకావ్యం.

గుఱ్ఱం జాషువా రచించిన 'ఖండకావ్యం' మొదటిభాగంలోనిది ఈ పాఠం.

## కవి పరిచయం



28.09.1895 – 24.7.1971

"మాతలకు మాత సకల సంపత్సమేత" అంటూ భరతమాత గొప్పదనాన్ని చాటిన కవి గుఱ్ఱం జాషువా. ఈయన గుంటూరుజిల్లా వినుకొండ గ్రామంలో జన్మించాడు. రచనల్లో అణువణువున తెలుగుదనం గుబాళింపజేసిన జాషువా – గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్‌మహల్, నేతాజి, బాపూజీ, క్రీస్తుచరిత్ర, నాకథ, స్వప్నకథ, కొత్తలోకము, ఖండకావ్యాలు మొదలైన రచనలు చేశాడు. ఈయన రచనలు సరళంగా ఉంటాయి. వర్ణనలు కళ్ళకుకట్టినట్లుంటాయి. కవికోకిల, కవితావిశారద, కళాప్రపూర్ణ, పద్మభూషణ్, నవయుగకవి చక్రవర్తి, మధుర శ్రీనాథ మొదలైనవి జాషువా బిరుదులు. సామాజిక సమస్యలను ఛేదించడానికి పద్యాన్ని ఆయుధంగా ఎన్నుకున్నాడు.

## విద్యార్థులకు సూచనలు

- ★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- ★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- ★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- ★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**భారతదేశం శిల్పకళకు పెట్టింది పేరు. ప్రపంచ ప్రఖ్యాతిపొందిన ఎల్లోరా శిల్పాలు చెక్కినది భారతీయ శిల్పులే! మనసులో కలిగిన భావాలను శిలలపై చెక్కి అద్భుత రూపాన్నిస్తాడు శిల్పి. వేయిస్తంభాలగుడి, రామప్పదేవాలయం, గుప్తుల కాలంనాటి ఏకశిలారథం మొదలైన కళాఖండాలు శిల్పి నైపుణ్యానికి నిదర్శనాలు. శిల్పి ఘనతను అతడి అజరామర కీర్తిని ఈ పాఠంలో తెలుసుకుందాం.**

SCERT TELANGANA

# I

తే.గీ॥ చేత మిగురొత్త నొక నల్లఱాతియందు
మలచినాడవు, భయద సింహముల తలలు
వసుధ గన్పట్టు సర్వపర్వతములందు
జిత్రముల నెన్ని గతుల జూచెదవొ నీవు! 1


★ తే.గీ॥ సున్నితంబైన నీచేతి సుత్తెనుండి
బయలుపడె నెన్ని యెన్ని దేవస్థలములు
సార్థకము గాని యెన్ని పాషాణములకు
గలిగె నీనాడు పసుపు గుంకాల పూజ! 2

★ తే.గీ॥ కవికలంబున గల యలంకార రచన
కలదు కలదోయి శిల్పి, నీ యులిముఖమున;
గాకపోయిన బెను ఱాతికంబములకు
గుసుమవల్లరు లేరీతి గ్రుచ్చినావు? 3

**ఆలోచించండి - చెప్పండి**

★ భక్తిభావం పెంపొందడానికి శిల్పి ఎట్లా దోహదపడతాడు?

★ రాతికంబమునకు 'కుసుమ వల్లరులు' కూర్చడమంటే మీరేమనుకుంటున్నారు?



SCERT TELANGANA

## II

మ॥ నునుపుల్ దీర్చి మదంబు చిందిపడ నేస్గన్ గున్నలన్ జెక్కి వై
చిన చాతుర్యము నీ శిరోగ్రమున నిల్చెన్సత్కిరీటాకృతిన్;
తెనుగుందేశము నిన్నువంటి పనివానిం జూచి యుప్పొంగుచుం
దును; నీ లేమి దలంచి కంట దడిబెట్టున్: శిల్పవిద్యానిధీ! 4

మ॥ తెలిఱాతిన్ జెలువార నచ్చరపడంతిం దిద్ది యా సోగ క
న్నుల పజ్జన్ నిను నీవు దిద్దుకొని, సంతోషించుచున్నాడవా!
భళిరే! శిల్పిజగంబులోన జిరజీవత్వంబు సృష్టించుకో
గల నీకెవ్వడు సాటివచ్చును? నమస్కారంబు నీ ప్రజ్ఞకున్ 5

### ఆలోచించండి - చెప్పండి

★ 'కంటతడి పెట్టడం' అంటే ఏమిటి? శిల్పిని చూసి ఎందుకు కంటతడిపెట్టాల్సి వస్తున్నది?
★ శిల్పి సంతోషపడేదెప్పుడు?

## III

★ తే.గీ॥ ప్రతిమలు రచించి యొక మహారాజు చరిత
వల్లెవేయింప గలవు చూపరులచేత;
గవనమున జిత్రములు గూర్చు కవికి నీకు
దారతమ్యంబు లే దబద్ధంబు గాదు. 6

తే.గీ॥ ఱాల నిద్రించు ప్రతిమల మేలుకొలిపి
యులిని సోకించి బయటికి బిలిచినావు;
వెలికి రానేర్చి, నీ పేర నిలపకున్నె
శాశ్వతుడ వోయి నీవు నిశ్చయముగాను. 7

మ॥ తలయెత్తెన్ గద, నీదు చాతురి యజంతాగహ్వరశ్రేణి గే
వల పాషాణములందు; జీవకళ నిల్పంజాలు నీ సుత్తెలో
మొలుచు న్మానవ విగ్రహంబులు; మహాపుణ్యుండవయ్యా! హరి
త్తులు, నీ బొమ్మలచెంత ముగ్ధగతినందున్; శిల్పకంఠీరవా! 8

### ఆలోచించండి - చెప్పండి

★ కవికి, శిల్పికి మధ్యగల పోలికలు చెప్పండి.
★ శిల్పికి శాశ్వతత్వం ఎప్పుడు వస్తుంది?
★ శిల్పిని "మహాపుణ్యుండవయ్యా" అని కవి ఎందుకన్నాడు?



### తాత్పర్యాలు

1. ఓ శిల్పీ! మనసు చిగురించేట్లు ఒక నల్లరాతిలో భయంకరమైన సింహాల తలలు చెక్కినావు. భూమి మీద కనిపించే కొండల్లోని రూపాలను ఎన్నివిధాలుగా దర్శిస్తావోకదా?
2. మెత్తనైన నీ చేతి సుత్తిదెబ్బలతో ఎన్ని దేవాలయాలు బయటపడ్డాయో! ఒకనాడు వ్యర్థంగా పడి ఉన్న ఎన్నో బండలకు నీవల్లనే పసుపు కుంకుమలతో పూజలు పొందే భాగ్యం లభించింది. (అంటే ఆ బండలను శిల్పి దేవతామూర్తులుగా మలిచాడని తాత్పర్యం.)

SCERT TELANGANA

3. కవి కలానికి ఉండే అలంకార రచనాశక్తి, నీ ఉలికి కూడా ఉన్నది. లేకపోతే కఠినమైన రాతిస్తంభంలో (పూలు, లేత కొమ్మలను) పూలగుత్తులను ఎట్లా చెక్కగలిగావు?

4. శిల్పవిద్యను ఎరిగినవాడా! మదజలం కారుతున్న ఏనుగును, ఆ ఏనుగు పిల్లలను నున్నగా చెక్కిన నేర్పు నీతలమీద కిరీటమై వెలుగుతున్నది. నీవంటి పనివాళ్ళను చూసి తెలుగు నేల ఉప్పొంగుతున్నది. నీ దారిద్ర్యాన్ని చూసి కన్నీరు కారుస్తున్నది.

5. తెల్లరాతిలో అప్సరసను సృష్టించి, ఆమె విశాల నేత్రాలకు పక్కగా నిన్ను నువ్వు మలచుకొని సంతోష పడుతున్నావా? భళా! శిల్పి ప్రపంచంలో శాశ్వతత్వాన్ని కల్పించుకోగలిగిన నీకెవరు సాటి వస్తారు? నీ ప్రతిభకు నమస్కారాలు.

6. చూసేవాళ్ళచేత నీ శిల్పాలు ఒక మహారాజు కథను చెప్పించగలవు. కావ్యంలో బొమ్మలను చూపే కవికి నీకు ఏమాత్రం భేదం లేదు. ఇది అబద్ధం కాదు.

7. రాళ్ళలో నిదురపోతున్న బొమ్మలకు నీ ఉలిని తాకించి, మేల్కొలిపి బయటకు పిలిచావు. అవి బయటికి వచ్చి నీపేరు నిలుపవా? నీవు నిశ్చయంగా చిరంజీవివి.

8. అజంతా గుహలలో నీ నైపుణ్యం తలెత్తుకుందికదా! నీ సుత్తె వట్టి బండరాళ్ళలో కూడా జీవకళను నిలుపగలదు. నీ సుత్తెలోనుంచి మానవ విగ్రహాలు పుడుతాయి. ఓ శిల్పిశ్రేష్ఠుడా! నువ్వు పుణ్యమూర్తివి. సింహాలు నీ బొమ్మల దగ్గర చక్కదనాన్ని పొందుతాయి.

## ఇవి చేయండి

K2E1K9

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. కవి శిల్పిని శాశ్వతుడనీ, ఆయన ప్రజ్ఞకు నమస్కారం చేయుమని చెప్పాడుకదా! దీనిమీద మీ అభిప్రాయాన్ని చెప్పండి.
2. శిల్పకళ వలె నీకు తెలిసిన ఇతర కళలేవి? ఆయా కళాకారుల గొప్పదనమేమిటి?

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది పద్యపాదాలు పాఠంలోని ఏయే పద్యాల్లో ఉన్నాయి. వాటి సందర్భమేమిటి?**

అ. బయలుపడె నెన్ని యెన్ని దేవస్థలములు.

ఆ. తారతమ్యంబు లే దబద్ధంబు గాదు.

ఇ. ఊల నిద్రించు ప్రతిమల మేలుకొలిపి

ఈ. శిల్పిజగంబులోన జిరజీవత్వంబు సృష్టించుకో గల

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

2. **కవికి - శిల్పికి మధ్య పోలికలున్న పద్యాలు ఈ పాఠంలో ఉన్నాయి. అవి ఏయే పద్యాల్లో ఉన్నాయో గుర్తించి వాటిని రాయండి.**

3. **కింది గద్యాన్ని చదువండి. ఐదు ప్రశ్నలు తయారుచేయండి.**

జనపదం అంటే గ్రామం. జనపదంలో నివసించే వాళ్ళు జానపదులు. వీళ్ళు ప్రదర్శించే కళలను జానపదకళలు అంటారు. యక్షగానం, వీథినాటకం, వీరభద్రవిన్యాసాలు, హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ వంటివి కొన్ని జానపదకళారూపాలు. వీటిని కాపాడుకోవలసిన బాధ్యత మనపైన ఉన్నది.

చిత్రలేఖనం, సంగీతం, శిల్పం, నృత్యం, కవిత్వం వంటివి లలితకళలు. భావం మనస్సుకు హత్తుకొనే రకంగా బొమ్మను గీయడం చిత్రలేఖనం. వీనుల విందుగా ఉండే గానకళ సంగీతం. రాళ్ళను చెక్కి, అనేక భావాలను మనసులో కలిగించే కళ శిల్పకళ. రాగ, తాళ, లయలకు తగిన విధంగా అభినయం చేయడం నృత్యకళ. ఒక భావాన్ని సూటిగా చెప్పకుండా మాటల వెనుక మరుగుపరచి మనసుకు ఉల్లాసం కలిగించే విధంగా పదాలను కూర్చి చెప్పేదే కవిత్వం.

## III స్వీయరచన

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. శిల్పి రాళ్లలో ఏయే రూపాలను చూసి ఉంటాడు?

ఆ. నల్లని రాళ్ళకు శిల్పిమీద కృతజ్ఞత ఎందుకుండాలి?

ఇ. కవికీ, చిత్రకారుడికీ ఉండే పోలికలు, భేదాలు ఏమిటి?

ఈ. చూసే వాళ్ళకు శిల్పాలు మహారాజుల కథలు చెప్పగలవని కవి ఎందుకు అన్నాడు?

2. **కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

తెలంగాణ రాష్ట్రంలోని శిల్పకళాసంపదను గురించి సొంతమాటల్లో వివరించండి. (లేదా)

శిల్పి గొప్పదనాన్ని వివరిస్తూ సొంతమాటల్లో రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

శిల్పిని గురించి ఆత్మకథ రాయండి. దీన్ని ఏకపాత్రాభినయంగా ప్రదర్శించండి.

ఉదా : నేను తెలుసా! నేను రాళ్లను చెక్కే....

## V పదజాల వినియోగం

1. **కింది వాక్యాలు మీ పాఠంలోనివే! వీటిలో గీతగీసిన పదాల అర్థాలు తెలుసుకొని వాటితో వాక్యాలను తిరిగి రాయండి.**

అ. <u>భయద</u> సింహముల తలలు

ఆ. <u>వసుధ</u> గన్పట్టు పర్వతములందు



SCERT TELANGANA

ఇ. శాశ్వతుడవోయి నీవు నిశ్చయముగాను

ఈ. తెనుగుందేశము నిన్నువంటి పనివానిం జూచి యుప్పొంగుచుండును

ఉ. నీ సుత్తెలో మెలుచు న్మానవ విగ్రహంబులు

**2. కింది వాక్యాల్లో ఉన్న ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**

అ. సింగం బావిలో తన మొగాన్ని చూసి అది మరో సింహం ముఖమని అనుకొన్నది.

ఆ. కరెంటు స్తంభాలు ఉరికంబాలు కాగూడదు.

ఇ. నిద్ర మనకు అవసరమే కాని మనమే నిద్దుర మొహాలం కాగూడదు.

ఈ. పేదలకు సహాయం చేయడం పున్నెం. ఆ పుణ్యమే మనను నిలుపుతుంది.

**3. సూచనల ఆధారంగా పాఠ్యాంశంలోని పదాలతో గడులు నింపండి.**

**అడ్డం**

1. శిల్పాలు చరిత్రను ... వేయించగలవు
2. కవి చేతిలోనిది
3. దేవళంలో 'ళం' తీసేస్తే
4. మూడోపద్యం రెండోపాదంలో మొదటి పదం చివరి అక్షరం లోపించింది.
5. శిల్పంగా మారేది
6. శిల్పి ప్రజ్ఞకు మనం సమర్పించేది

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | ★ | 2 | | 3 |
| | ★ | 3 | | ★ | |
| | ★ | ★ | | ★ | |
| ★ | 4 | | ★ | ★ | |
| 5 | | ★ | 6 | ★ | ★ |
| | ★ | 6 | | | |

**నిలువు**

1. ఈ పదం భూమికి మరో అర్థం
2. కవిత్వం చెప్పడాన్ని ఇట్లా అంటారు
3. రాతికి మరో పదం తలకిందులైంది
4. 'స్వప్నం' పర్యాయపదం
5. శిలను శిల్పంగా మలిచేవాడు.
6. బొమ్మలు అని అర్థమున్న పదంలో మొదటి అక్షరం లోపించింది.

## VI భాషను గురించి తెలుసుకుందాం

### సవర్ణదీర్ఘసంధి

✤ **కింది పదాలను పరిశీలించండి. సంధి జరిగిన విధానం గమనించండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అ. | శివాలయం | = | శివ + ఆలయం | = | అ + ఆ = ఆ |
| ఆ. | మునీంద్రుడు | = | ముని + ఇంద్రుడు | = | ఇ + ఇ = ఈ |
| ఇ. | భానూదయం | = | భాను + ఉదయం | = | ఉ + ఉ = ఊ |
| ఈ. | మాతౄణం | = | మాతృ + ఋణం | = | ఋ + ఋ = ౠ |

SCERT TELANGANA

పై పదాలను విడదీసినపుడు మొదటి (పూర్వ), రెండవ (పర) పదాల్లో ఒకేరకమైన అచ్చులున్నాయికదా! అట్లా ఆ రెండు అచ్చులు కలిసినప్పుడు వాటివాటి దీర్ఘాలు వచ్చాయి.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ/ఆ | + | అ/ఆ | = | ఆ | | ఇ/ఈ | + | ఇ/ఈ | = | ఈ |
| ఉ/ఊ | + | ఉ/ఊ | = | ఊ | | ఋ/ౠ | + | ఋ/ౠ | = | ౠ |

అ, ఇ, ఉ, ఋ లకు అవే అచ్చులు (సవర్ణాలు) వచ్చి చేరినపుడు వాటి దీర్ఘాలు ఏకాదేశంగా వస్తాయి. దీనినే **సవర్ణదీర్ఘసంధి** అంటాం.

> అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణాలు పరమైతే దీర్ఘం ఏకాదేశంగా వస్తుంది.

> 'ఏకాదేశం' అంటే ఒక వర్ణం స్థానంలో మరొక వర్ణం వచ్చిచేరడం.

> ఒకేరకమైన అచ్చులను 'సవర్ణాలు' అంటాం.

**1. కింది పదాలను విడదీయండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా: | హిమాలయం | = | హిమ | + | ఆలయం | = | (అ + ఆ = ఆ) |
| 1. | కిరీటాకృతి | = | .................. | + | .................. | = | ( ) |
| 2. | మహానందం | = | .................. | + | .................. | = | ( ) |
| 3. | మహీంద్రుడు | = | .................. | + | .................. | = | ( ) |
| 4. | గురూపదేశం | = | .................. | + | .................. | = | ( ) |
| 5. | కోటీశ్వరులు | = | .................. | + | .................. | = | ( ) |
| 6. | మాతౄణం | = | .................. | + | .................. | = | ( ) |

## ప్రాజెక్టుపని

మీ గ్రామం / ప్రాంతంలోని కళలను గురించి, కళాకారులను గురించి వివరాలు తెలుసుకొని వాళ్ళ గొప్పదనాన్ని గురించి నివేదిక రాయండి.

## నేనివి చేయగలనా ?

| | |
|---|---|
| ★ ఈ పాఠంలోని పద్యాలను రాగ, భావయుక్తంగా చదువగలను. | అవును / కాదు |
| ★ భావాల ఆధారంగా పద్యపాదాలను గుర్తించగలను. | అవును / కాదు |
| ★ కళాకారుల నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ మాట్లాడగలను. | అవును / కాదు |
| ★ శిల్పి గొప్పదనాన్ని వివరిస్తూ వ్యాసం రాయగలను. | అవును / కాదు |
| ★ శిల్పి ఆత్మకథను రాసి ఏకపాత్రాభినయం చేయగలను. | అవును / కాదు |

## సూక్తి


**శిల్పి వల్ల రాయి శిల్పంగా మారి గౌరవాన్ని పొందుతుంది. అట్లే విద్యవల్లే మనిషికి గుర్తింపు లభించి, ఉన్నతంగా ఎదుగుతాడు.**

SCERT TELANGANA

# 8. గ్రామాలలోని వేడుకలు - క్రీడావినోదాలు

- దేవులపల్లి రామానుజరావు

**బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



**ప్రశ్నలు**

1. పై బొమ్మ దేనినిగూర్చి తెలియజేస్తున్నది?
2. పై బొమ్మలో ఎవరెవరు ఏమేమి చేస్తున్నారు?
3. మీరు ఎప్పుడైనా జాతరలకు వెళ్ళారా? ఏయే జాతరలకు వెళ్ళారు?
4. మీకు తెలిసిన/చూసిన జాతర గురించి చెప్పండి?

N1J8R8

**పాఠం ఉద్దేశం**

నేడు సామాన్య ప్రజానీకానికి వివిధ రకాలైన వినోద కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచమే ఒక చిన్న గ్రామమైనది. ఎక్కడ ఏం జరిగినా, ఇంట్లో కూర్చొని ప్రసార మాధ్యమాల ద్వారా వాటిని చూస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందక ముందు గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు ఏయే వినోదసాధనాలు ఉండేవో, వాటిద్వారా గ్రామీణులు ఎట్లా ఆనందాన్ని పొందేవారో, తద్వారా ఆనాటి సంస్కృతిని తెలుసుకొని గౌరవించడం ఈ పాఠం ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'రేడియో ప్రసంగం' ప్రక్రియకు చెందినది.
సిద్ధం చేసుకొన్న వ్యాసం రేడియోద్వారా ప్రసారం చేయబడుతుంది.
విషయ క్లుప్తత, సరళత రేడియో ప్రసంగ లక్షణాలు.

గ్రామాలలో జరిగే వివిధ వేడుకలు, క్రీడావినోదాల గురించి దేవులపల్లి రామానుజరావు తన ప్రసంగంలో వివరించాడు.

## రచయిత పరిచయం



25-08-1917
08-06-1993

ఆంధ్ర సాహిత్య సాంస్కృతిక ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, జాతీయ పునరుజ్జీవన మహోద్యమ కార్యకర్త, తెలంగాణ ప్రజలు గర్వించదగ్గ రచయిత దేవులపల్లి రామానుజరావు.

వరంగల్ అర్బన్ జిల్లాలోని దేశాయిపేట గ్రామంలో వేంకటచలపతిరావు, ఆండాళమ్మ దంపతులకు జన్మించాడు. ప్రాథమికవిద్య దేశాయిపేటలో, హైస్కూలువిద్య హన్మకొండలో పూర్తిచేశాడు. 1946 లో 'శోభ' అనే సాహిత్య మాసపత్రికను ప్రారంభించి సంపాదకుడిగా ఉన్నాడు. గోలకొండ పత్రికను కొంతకాలం నడిపించాడు. పచ్చతోరణం, సారస్వత నవనీతం, తెనుగు సాహితి, వేగుచుక్కలు, తెలంగాణ జాతీయోద్యమాలు మొదలైనవి ఈయన రచనలు. 'ఏబది సంవత్సరాల జ్ఞాపకాలు' ఈయన ఆత్మకథ. ఆంధ్ర సారస్వత పరిషత్తుకు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడిగా విశేష సేవలు అందించాడు.

## విద్యార్థులకు సూచనలు

- ★ పాఠంలోని బొమ్మలు చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. విషయాన్ని ఊహించండి.
- ★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- ★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- ★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**గ్రామీణ ప్రాంతాల ఆటలు ఈ రోజుల్లో దాదాపుగ కనుమరుగైనాయి. ప్రస్తుతం ప్రజలు ఆడే ఆటలు గెలుపు ఓటములే లక్ష్యంగా కొన్ని సందర్భాలలో జూదంగా పరిణమించాయి. పిల్లలు మైదానాలకు దూరమై కంప్యూటర్లతో చరవాణి (సెల్‌ఫోన్) లతో ఆటలాడుతూ శారీరక వ్యాయామానికి ప్రాధాన్యతను ఇవ్వడంలేదు. పాశ్చాత్య వికృతనృత్యాలు, ప్రసారమాధ్యమాలలోని విపరీతపోకడల ప్రవాహంలో కొట్టుకుపోతూ ఇరుగుపొరుగు వారి సంబంధాలకు దూరమౌతున్నారు. తద్వారా మానవ సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో శారీరక, మానసిక వికాసానికి దోహదపడే ఆటలు, వినోదాల గూర్చి తెలుసుకోవడం అత్యంత అవసరం. ఆటపాటలు మన సంస్కృతిలోభాగం. పూర్వం గ్రామాలలో ఎట్లాంటి ఆటలు, వినోదాలు ఉండేవో తెలుసుకుందాం.**

SCERT TELANGANA

# I

గౌతమి, కృష్ణవేణులకు ఆవాసమై, పాడిపంటలకు నిలయమైన తెలుగుసీమలోని పల్లెపట్టులలో కళాసౌందర్యము అడుగడుగున గోచరిస్తున్నది. తెలుగువారి భాష యెంత మధురమైనదో, వారి సామాజిక జీవనమంత సుందరమైనదని చెప్పితే అతిశయోక్తి ఆవంతయునుగాదు. భారతదేశమంతటిలో నున్నట్లే తెలుగుసీమలో గూడ నూటికి తొంబదిపాళ్ల జనులు పల్లెటూళ్ళలోనున్నారు. తరతరాల నుండి వ్యాప్తిలోనున్న వేడుకలు, క్రీడావినోదాలు ఎన్నియో ఇక్కడ కలవు. ఈ క్రీడావినోదాలలో తెలుగువారి సుకుమార అభిరుచి ప్రతిబింబిస్తున్నది.



స్త్రీలకు, పురుషులకు, బాలబాలికలకు ప్రత్యేకంగా కొన్ని వినోదాలు, ఆటపాటలు ఉన్నవి. వీనితోపాటు స్త్రీ పురుషులకు సమానముగా ఆదరణీయములైన వినోదాలు, క్రీడలు కూడ కొన్ని కలవు. ఈ క్రీడలలోను, వినోదాలలోను తెలుగు ప్రజల స్వభావ గుణమైన సౌందర్యరక్తి మనకు స్పష్టంగా కనుపిస్తుంది. ఇందులో కొన్ని విశ్రాంతి సమయాలలో ఆటవిడుపు కొరకు ఉద్దేశించిన క్రీడావినోదాలు, మరికొన్ని పండుగపబ్బాలలో సర్వజనులు సమానముగా ప్రోత్సహించి, ఆనందించే వినోదాలు; ఇంక కొన్ని పెండ్లిండ్లు మొదలైన శుభకార్యాల సందర్భాలలో నిర్వహించే వేడుకలు. కొన్ని క్రీడలు, వినోదాలు శ్రీమంతులకు మాత్రమే అందుబాటులో నుండునవి. మరికొన్ని క్రీడలు సార్వజనికమైనవి అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో నుండునవి. ఈవిధంగా జనుల ఆర్థికస్థితిని అనుసరించి, వయస్సును అనుసరించి, విజ్ఞానమును అనుసరించి, మనోరంజనము గావించు క్రీడలు తెలుగు సీమలో పుష్కలంగా వున్నవి.

ఈ వినోదాలలోను, వేడుకలలోను, పాటలను మొట్టమొదలు పేర్కొనవలసి వుంటుంది. పొలములో కలుపుదీసే పడుచులు, ఎద్దులను గాసే బాలకులు, సంపన్నుల యిండ్లలో కావలసినంత తీరికవున్న స్త్రీలు, బాలికలు, ఈ పాటలను పాడుతూ వుంటారు. పూర్వకాలంలో తుమ్మెదపదాలు, పర్వతపదాలు, శంకరపదాలు, నివాళిపదాలు మనదేశములో అధిక వ్యాప్తిలో ఉన్నట్లు తెలుస్తున్నది. కాని యీనాడు ఈ పాటలు ఇంచుమించుగా నశించినవనే చెప్పవలసి వున్నది. సేద్యముచేస్తూ కూలీలుపాడే జాజరపాటలు ఈనాటికిని కొన్ని ప్రాంతాలలో విశేష వ్యాప్తిలో వున్నవి. హైద్రాబాదు నగరానికి నూరుమైళ్ళలోనున్న వరంగల్ జిల్లా మానుకోట తాలూకాలో ఈ పాటలను రైతు యువకులు మక్కువతో ఈనాటికీ పాడుకుంటున్నారు. ప్రత్యేకంగా స్త్రీలు పాడుకొనే పాటలు గూడ యెన్నో వున్నవి. ఇందులో పెండ్లి పాటలు, కూతురుని అత్తమామలకు అప్పగించే సందర్భంలో పాడే అప్పగింతపాటలు, మంగళహారతులు, ముఖ్యంగా పేర్కొనదగియున్నవి. తెల్లవారకముందే లేచి మేలుకొలుపులు ఆలపించే అలవాటు ఈనాటికిని మన పల్లెటూళ్లలోని పూర్వపద్ధతి కుటుంబాలలో కనుపిస్తున్నది. పసిపిల్లలను ఉయ్యాలలో నిద్రబుచ్చుట కొరకు పాడే జోలపాటలను మనదేశంలో విననివారు ఉండరని చెప్పవచ్చును. ఈవిధంగా వివిధములైన పాటలు వివిధ సందర్భాలలో మన పల్లెటూళ్లలో వీనులకు విందు జేస్తుంటవి.


SCERT TELANGANA

ఆటలకూ పాటలకూ వీడరాని చుట్టరికమున్నది. తెలుగు పల్లెలలో రకరకాలైన ఆటలను మనము చూడవచ్చును. ఈ ఆటలు మనస్సుకు ఉల్లాసము కలిగించే వేడుకలు. ఇందులో సమస్త జనులను ఆకర్షించే తోలుబొమ్మలాట సుప్రసిద్ధమైనది. ఈ తోలుబొమ్మలాట తెలుగువారి ప్రత్యేకత. వారు అనేక సంవత్సరాలనుండి ఉపాసించిన కళ. ఒక సన్ననిబట్టను తెరగాగట్టి ఆ తెర వెనుక పెద్ద దివిటీలు వెలిగింతురు. తెరవెనుక



తోలుబొమ్మల కాళ్ళకూ, చేతులకూ దారాలు గట్టి బొమ్మలను నిలబెట్టి దారాలను లాగుతూ దివిటీల వెలుగులో వానిని ఆడింతురు. ఈ ఆటను ఆడించే నిపుణులైనవారు కొందరు, మన పల్లెటూళ్ళలో తిరుగుతూ వుంటారు. ఈ తోలుబొమ్మలాటలు ఎక్కువగా రామాయణ భారత కథలకు సంబంధించినవి. నిజానికి రామాయణమూ, భారతమూ, మన దేశీయులలో ప్రతి రక్తకణమునందును జీర్ణించిన కథలు.

ఈ తోలుబొమ్మలాట వలెనే బహుళ ప్రచారము పొందినవి యక్షగానాలు అనే వీధినాటకాలు. ఈ నాటకాలను ఆడేవారిని జక్కులు అని పిలుస్తుంటారు. భాగవతములోని కృష్ణలీలలు మొదలైన వానిని ఆడేవారిని భాగోతులని గూడ పిలుస్తుంటారు. కొన్ని సంవత్సరాల క్రిందటివరకు మన పల్లెటూళ్లలో ఈ భాగోతుల ఆటలు విరివిగా జరుగుతూ వుండేవి. ఎన్నో నూర్ల సంవత్సరాలనించి యక్షగానాలు, తోలుబొమ్మలాటలతోపాటు, భాగోతాలు మన పల్లెటూళ్ల ప్రజలను రంజింపజేస్తున్న వినోదాలు, వేడుకలు. ఇవన్నీ తెలుగువారి కళాభిరుచికి మంచి నిదర్శనాలు. భజనమండలులను స్థాపించి, వారానికొకసారి (ఏ శనివారమునాటి సాయంత్రమో) ప్రజలొకచోట సమావేశమై భజనలు గావించుట మన పల్లెటూళ్లలోని వినోదాలలో ఒక ప్రత్యేకమైన వినోదము. ఇతరులు ఆడుతుండగా చూచి వినోదించే ఆటపాటలలో చేరే వినోదాలు బొబ్బిలికథ, బాలనాగమ్మ కథ మొదలైనవి. ఈ కథలను చెప్పేవారు గంటలతరబడి, ఒక్కొక్కసారి ప్రొద్దంతా, పల్లెటూరి ప్రజలను ఆకర్షించి, వినోదింప జేస్తుంటారు. కాని ఈనాటి మారిన పరిస్థితులలో వీటికన్నింటికీ వ్యాప్తి తగ్గిపోతున్నది. ఈ కథలను జెప్పేవారి నేర్పు చాలగొప్పది. వినేవారి రక్తము ఉడుకెత్తునట్లుగా వీరగాథలను వీరు చెప్పుచుందురు.



**ఆలోచించండి - చెప్పండి**


- ★ స్త్రీలు ఏయే పాటలు పాడుకుంటారు? మీకేమైనా తెలిస్తే చెప్పండి.
- ★ గ్రామీణులను ఎక్కువగా ఆకర్షించిన కళారూపం ఏది? అది ఎందుకు బాగా నచ్చి ఉంటుంది?
- ★ మీకు నచ్చిన గ్రామీణ వినోదం ఏది? అది ఎందుకు నచ్చింది?

SCERT TELANGANA

# II



స్వయంగా పాల్గొని ఆనందించే ఆటలు, పాటలు, మన పల్లెటూళ్ళలో చాలా కనిపిస్తున్నవి. రంగురాట్నము ఈవిధమైన వేడుకలలో ఒకటి. జనులు ఈ రంగురాట్నము ఎక్కి గిర్రున తిరుగుట అందరికి బాగా తెలిసిన వినోదమే. హైద్రాబాదు నగరంలో ప్రతి సంవత్సరము జరిగే అఖిల భారత ప్రదర్శనపు ఆవరణలోపల ఈ వినోదాన్ని చూడవచ్చును. మన పల్లెటూళ్ళకు ప్రత్యేకమైనది గిల్లిదండ అనే ఆట. ఈ ఆట చాలా పురాతనమైనది. తెలంగాణపు పల్లెటూళ్ళలో దీనిని చిర్రగోనె అని కూడ అంటారు. మన కవులు వ్రాసిన పుస్తకాలలో ఈ ఆట మనోహరంగా వర్ణింపబడింది. భారతంలో కౌరవ పాండవులు ఈ ఆటను ఆడినారంటే, ఇది యెంత పురాతనమైనదో తెలుస్తుంది. ఒక చిన్న కర్రముక్కను పెద్ద కర్రతో కొట్టుతూ, ఈ ఆటను ఆడుతుంటారు. ఈ ఆటను క్రికెట్టుతో పోల్చవచ్చును. కొందరు దీనిని స్వదేశీ క్రికెటు అని మెచ్చుకోవడం కలదు. కోడిపందెములు తెలుగుదేశీయులు ప్రత్యేకంగా కొన్ని సంవత్సరాల క్రిందటివరకు అభిమానించిన ఆట. ముఖ్యంగా సంక్రాంతి సందర్భములో, ఈ ఆటను అత్యంత ఆసక్తితో ఆడేవారు. ఈ ఆట గూడ పలనాటి వీరచరిత్రలో చక్కగా వర్ణింపబడింది. బొంగరాల ఆట మన గ్రామాలలో మిక్కిలి ప్రచారములోనున్న క్రీడ. పిల్లలకు ఈ ఆటలో మిక్కిలి ఆసక్తి. ఇవన్నీ గృహాల వెలుపల బహిరంగ ప్రదేశాలలో ఆడే ఆటలు. ఈ ఆటలు జరుగుతూ వుంటే జనులు ఎంతో ఉత్సాహంతో వీనిని తిలకించుతుంటారు.




ఈ ఆటలతోపాటు కాలక్షేపముకొరకు, ఇండ్లలో కూర్చుండి ఆడే ఆటలు ప్రత్యేకమైనవి కొన్ని వున్నవి. ఈ ఆటలలో చదరంగము మిక్కిలి ముఖ్యమైనదే కాక చాల ప్రసిద్ధిచెందినది. అసలు ఈ ఆట మొట్టమొదట మన దేశములోనే ప్రారంభమైనదని కొందరు చెప్పుతుంటారు. ఏమైనప్పటికి, ఈ ఆటకు మన పల్లెటూళ్ళలోని కుటుంబాలలో మంచి ప్రచారము వున్నది. ఈ ఆట ఆడటంలో కొందరు సాటిలేని నైపుణ్యము కలిగి వుంటారు. చదరంగము వంటి ఆట యింకొకటి పులిజూదము. ఈ పులిజూదము మూడురకాలుగా వున్నది. ఒక పటము మీద, చిన్న రాళ్ళనో లేక చింతగింజలనో తీసికొని, కొన్నింటిని పులులుగాను, కొన్నింటిని మేకలుగాను భావించి, ఆడే ఆట యిది. పులులసంఖ్య మూడింటికన్న మించదు. మేకలసంఖ్య పదహారింటి వరకు వుంటుంది. ఒకరు పులులను తీసికొని, యింకొకరు మేకలను తీసికొని ఈ ఆటను ఆడుచుందురు. ఇప్పుడు ప్రచారము తగ్గిపోయినా, యిటీవల వరకు, మన పల్లెటూళ్ళలోని ఉన్నత కుటుంబాలలో విశేష ఆసక్తితో ఆడిన ఆట పాచికల ఆట; దీనికి అక్షక్రీడ అని మరోపేరు ఉన్నది. ఈ ఆట గూడ తరతరాల నుండి మనదేశములోని ప్రజలను ఆకర్షించినది. మన


ప్రబంధాలలో ఈ ఆటను రమణీయంగా మనకవులు వర్ణించినారు. రుక్మిణీకృష్ణులు ఈ ఆటను ఆడినట్లు ఉత్తర హరివంశములో మనోహరముగా వర్ణింపబడినది. ఈ తరగతికి చెందిన యింకొక ఆట పచ్చీసు. ఈ ఆటలో స్త్రీలకు ఆసక్తి ఎక్కువ. రంగుగుడ్డలో అందముగా పచ్చీసును కుట్టించి, దానిమీద పూసలతో ఇండ్లను ఏర్పాటుచేసి, గవ్వలను వేస్తూ ఈ ఆటను ఆడే దృశ్యము పల్లెటూళ్ళలో ఏమాత్రము కొద్ది పరిచయము కలిగినవారికైనా బాగా పరిచితమైనదే. ఈ ఆటలు మన గ్రామీణ సంస్కృతి శోభకు మంచి ప్రతిబింబాలు.



జనులను వినోదింపజేయడానికి ప్రత్యేకంగా ఉద్దేశించిన వేడుకలు ఇంకా యెన్నో మన పల్లెటూళ్ళలో చూడవచ్చును. వినోదాలే వృత్తిగా కలిగినవారు గూడ కొందరున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రోత్సాహము లేనందువలన జీవనోపాధి కొరకు వీరు యితర వృత్తులను అవలంబించడంచేత వీరి సంఖ్య తగ్గిపోతున్నది. గంగిరెద్దులను అలంకరించి, యిల్లిల్లు తిరిగేవారు ఈ శ్రేణికి చెందినవారే. పగటివేషాలను వేసుకొని, ప్రజలను వినోదింపజేసేవారు మనకు కనిపిస్తుంటారు. వీరిని పగటివేషాల వారనీ, బహురూపుల వారనీ పిలుస్తుంటారు. విప్రవినోదులనే వారు గారడీవిద్యలో ప్రవీణులు. వీరు అనేక ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తుంటారు. వీరందరూ, జనుల పోషణ మీద ఆధారపడి ఈ పనులను వృత్తిగా తీసికొని, అందులో గొప్ప నైపుణ్యం సంపాదించి నటువంటివారు.

పల్లెటూళ్ళలో ఉయ్యాలలూగుట బాలబాలికలే గాక పెద్దలు గూడ మిక్కిలి మక్కువ చూపించే క్రీడ. ఏదోవిధమైన ఉయ్యాలను మనము అనేక గృహాలలో చూడవచ్చును. ఈమధ్య యితర క్రీడల వలెనే, సన్నగిల్లిపోతున్నప్పటికినీ గుర్రపుస్వారీ మన గ్రామాలలో బాగుగా అభిమానించిన క్రీడ. మల్లయుద్ధాలు, కుస్తీలు మొదలైనవి తరతరాలనుండి మనవారు అభిమానించి, ప్రోత్సహించిన క్రీడలు. తెలుగుదేశంలోని జమీందార్లు ఇందులో ప్రవీణులైనవారిని తమ ఆస్థానాలలోనికి చేరదీసి వారిని పోషించిరి. దసరాపండుగ సందర్భాలలో ప్రజల సమక్షాన యీ మల్లయుద్ధ ప్రదర్శనలు కుస్తీలు జరిపించి, వారికి బహూకరించే ఆచారము ఇటీవలివరకు మన పల్లెటూళ్ళలో వుండేది; కత్తిసాము, కట్టెసాములలో ప్రవీణులైనవారిని మన పల్లెటూళ్ళలో చూడవచ్చును.





### ఆలోచించండి - చెప్పండి

- ★ స్వయంగా పాల్గొని ఆనందించే ఆటలు, పాటలు ఎందుకు ప్రజలకు నచ్చుతాయో చెప్పండి.
- ★ ఈరోజుల్లో స్త్రీలు మధ్యాహ్నవేళ పచ్చీసు మొదలైన ఆటలు ఎందుకు ఆడటం లేదో చెప్పండి.

# III

కొన్ని వేడుకలు, వినోదాలు, క్రీడలు ప్రత్యేకమైన సందర్భాలలో జరుగుతుంటవి. దసరాపండుగకు ముందు, తొమ్మిది దినాలు బాణసంచాలను కాల్చడం, జనుపకట్టలను కాల్చడం ఈ తరగతికి చెందిన వినోదము. పిల్లలు ఈ తొమ్మిది రోజులు ప్రతిరోజూ ఈ వేడుకను జరుపుకుంటూ ఆనందిస్తారు. హోళీపండుగ సందర్భంలో ఒకరి మీద మరొకరు రంగులు చల్లుకోవడం కూడ యిటువంటి వేడుకలే. ఏరువాకపున్నమ అనగా జేష్ఠపున్నమ. రైతులకు మిక్కిలి సంతోషకరమైన పబ్బము. ఆనాడు వారు తమ యెడ్లను కడిగి, వాటిని రంగురంగులతో అలంకరించి, తమ నాగళ్ళమీద ఎఱ్ఱమన్నుతోను, సున్నముతోను పట్టెలనువేసి, ఆ నాగళ్ళను భుజాలమీద వేసికొని,



యెడ్లతోపాటు ఊరేగి, పొలాలకు వెళ్ళి దుక్కిదున్ని ఆ సంవత్సరపు వ్యవసాయపు పనులను అత్యంత ఉత్సాహముతో ప్రారంభించుదురు. శ్రీరామనవమినాడు బండ్లను గట్టుకొని ఊరేగుట పల్లెటూళ్ళలో మనము గమనించు మరొక వేడుక. సంక్రాంతికి తీర్థాలకు వెళ్ళే ఆచారము తెలంగాణపు పల్లెటూళ్ళలో ప్రజలకు మిక్కిలి ప్రేమపాత్రమైన వేడుక. బండ్లను గట్టుకొని తమతమ కుటుంబాలతో సంక్రాంతినుండి శివరాత్రి మధ్య జరిగే ఈ జాతరలలో వీరు పాల్గొంటారు. ఇటువంటి జాతరలలో ప్రసిద్ధమైనవి కొరవిజాతర, ఐనవోలు జాతర, మేడారముజాతర మొదలైనవి. ఈ జాతరలలో అసంఖ్యాకముగా జనులు పాల్గొంటారు దేవాలయాలలో సీతాకల్యాణము మొదలైన ఉత్సవాలు జరిపించడం పల్లెటూరు ప్రజలకు అభిమానాస్పదమైన వేడుక. శక్తిపూజలు పల్లెటూరి ప్రజానీకములో చాల ప్రచారంలో వున్నవి. దుర్గ, కాళి, ఎల్లమ్మ మొదలైన దేవతలకు మేకపోతులను బలియిచ్చే వేడుక చాల ప్రసిద్ధమైనది.



ఈవిధంగా అన్ని తరగతుల వారికి అభిమానాస్పదమైన వేడుకలు, వినోదాలు, మన పల్లెటూళ్ళలో పుష్కలముగా వున్నవి. కొన్ని వినోదాలు, క్రీడలు స్త్రీలకు మాత్రమే ప్రత్యేకమైనవి. ఇందులో కోలాటము ముఖ్యంగా పేర్కొనదగినది. కామునిపున్నమకు ముందు వెన్నెల రాత్రులలో యువతులు ఈ కోలాటము వేసే పద్ధతి తెలంగాణపు పల్లెటూళ్ళలో బాగా ప్రచారంలో

SCERT TELANGANA

వున్నది. పురుషులు గూడ కోలాటము వేయడం, ఆ సందర్భాలలో పాటలు పాడడం కొన్ని ప్రాంతాలలో కనుపిస్తుంది. అందుచేత దీనిని స్త్రీ పురుషులకు సమాన ఆదరణీయమైన క్రీడ యని కూడ చెప్పవచ్చును.



ప్రత్యేకంగా బాలికలు అభిమానించే ఆట చెమ్మచెక్క ఆట. తెలుగుసీమలో ఏ పల్లెటూరికి వెళ్ళినా చూడ వచ్చును. అచ్చనగండ్ల ఆట మన పల్లెటూళ్ళ బాలికలు అభిమానించే మరొక రమ్యమైన క్రీడ. గచ్చకాయలను ఎగురవేస్తూ, ఆడపిల్లలు ఈ ఆటను ఆడే దృశ్యము మిక్కిలి సుందర మైనది. ఓమన గుంటలఆట బాలికలకు, యువతులకు అభిమానాస్పదమైన క్రీడ. ఒక కట్టె దిమ్మలో పద్నాలుగు గుంటలు చెక్కించి, వాటిలో చింతగింజలు పోసి ఈ ఆటను ఆడుతుంటారు. ఈవిధమైన కట్టె దిమ్మెలు పల్లెటూళ్ళకు వెళ్లిచూస్తే అనేక కుటుంబాలలో కనిపిస్తుంటవి. గుజ్జనగూళ్ళ ఆట గూడ బాలికలకు ప్రత్యేకమైనది. రుక్మిణీదేవి చిన్నప్పుడు ఈ ఆటను ఆడినట్లు భాగవతంలో పోతనగారు తెలిపినారు. బొమ్మరింద్లలో గూర్చుండి బాలికలు గురుగులలో రకరకాల వంటలు వండి వడ్డించునట్లుగా వినోదించే ఈ ఆట ఆడపిల్లలకు మిక్కిలి ప్రియమైనది. గీరన గింజల ఆట బాలికలు అభిమానించే మరొక క్రీడా విశేషము. ముగ్గులు వేయడం పల్లెటూరి బాలికలకు, యువతులకు మిక్కిలి ఆహ్లాదకరమైన వేడుక. రకరకాల ముగ్గులను వేయడంలో నైపుణ్యము ప్రదర్శించే స్త్రీలు మన పల్లెటూళ్ళ యందు పుష్కలముగా కనిపిస్తుంటారు. ఈ ముగ్గులు తెలుగుపడతుల సౌందర్యరక్తికి, కళాభిరుచికీ, మేలి ఉదాహరణాలు. ఈనాడు ఎక్కువగా వ్యాప్తిలో లేకపోయినా చిలుకలను పెంచి, వానికి బుద్ధులు చెప్పి వినోదించుట తెలుగు సీమలోని పల్లెటూళ్ళ యందలి సంపన్న గృహాలలోని సుందరాంగుల వేడుకలలో బహు రమ్యమైనది.

ఈవిధంగా మన పల్లెటూళ్ళ జీవితాన్ని పరిశీలించితే, క్రీడలకు, వినోదాలకు మనవారు ఎంత ముఖ్యమైన స్థానాన్ని యిచ్చినారో వెల్లడి కాగలదు. క్రీడాభిరామమైన పల్లెటూరి జీవితములోని ఉత్తమ సంస్కృతిని ఈ క్రీడలు, వేడుకలు, వినోదాలు మనకు వెల్లడి చేస్తున్నవి.

(రేడియో ప్రసంగము - 1959)

## ఆలోచించండి - చెప్పండి

★ మీకు తెలిసిన జాతర గురించి చెప్పండి.

★ 'ముగ్గులు స్త్రీల కళాభిరుచికి ఉదాహరణలు' అనే రచయిత అభిప్రాయాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.

★ గ్రామీణ ఉత్సవాల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటి?

SCERT TELANGANA

## ఇవి చేయండి

C6I7C6

## I వివి, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. గ్రామాలలోని కళలు, క్రీడలు నేడు మనకు కనిపించకపోవడానికి కారణాలు చెప్పండి.
2. గ్రామీణ కళలు, క్రీడలు ప్రజలను సమైక్యంగా ఎట్లా ఉంచాయో చర్చించండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. కింది విషయాలు పాఠంలో ఏయే పేరాలలో ఉన్నాయో వెతికి వాటికి సంబంధించిన ముఖ్యాంశాలు పట్టికలో రాయండి.**

| విషయం | పేరా | ముఖ్యాంశాలు |
|---|---|---|
| 1. తోలుబొమ్మలాట | | |
| 2. చిర్రగోనె ఆట | | |
| 3. అక్షక్రీడ | | |

**2. కింది పేరాను చదివి ఐదు ప్రశ్నలు తయారుచేయండి.**

మన రాష్ట్రంలో సాధనాశూరులు ఇంద్రజాలవిద్యను అద్భుతంగా ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శన గ్రామం మధ్యలో ఖాళీప్రదేశంలో ఏర్పాటుచేస్తారు. ప్రేక్షకులు చూస్తుండగానే తెల్లని వస్త్రాలతో ఒక గుడారం ఏర్పాటుచేసి, ప్రదర్శన ప్రారంభిస్తారు. గుడారంముందు హాస్యగాడు నిలబడి తనకు వివిధ దేవతల విగ్రహాలు కావాలని ప్రధాన సాధనాశూరుని కోరతాడు. వేములవాడ రాజన్న, ధర్మపురి నర్సన్న, తిరుపతి వెంకన్న, కొండగట్టు అంజన్న... అంటూ హాస్యగాడు వివిధ దేవుళ్ళపేర్లు చెబుతుంటాడు. ప్రధాన సాధనాశూరుడు ఒక్కొక్క రాయిని ఒక్కో దేవునిగా అభివర్ణిస్తూ, మూసి ఉన్న గుడారంలో పెడతారు. చివరకు గుడారం తెరచి చూస్తే రాళ్ళకు బదులుగా దేవతల విగ్రహాలు ధూపదీపనైవేద్యాలతోసహా ప్రత్యక్షమైతాయి. దీంతో చూపరులు ఆశ్చర్యచకితులౌతారు.

వీరి ప్రదర్శనలో ప్రేక్షకుని తలపై పొయ్యిపెట్టి పూరీలను కాల్చడం, నీళ్ళకుండలో మూడురంగుల ఇసుకను పోసి, విడివిడిగా మూడురంగుల ఇసుకను ముద్దలు ముద్దలుగా తీయడం, గుడారంలోని ఒక కర్రకు కట్టిన వ్యక్తి మరో కర్రకు మారడం వంటి అంశాలు అందరినీ ఆకర్షిస్తాయి.



SCERT TELANGANA

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. స్త్రీల పాటల వల్ల స్త్రీలకు, పిల్లలకు ఎట్లా ఆనందం కలుగుతుందో వివరించండి.

ఆ. 'వినేవారి రక్తము ఉడుకెత్తునట్లు కథ చెప్పడం' అంటే మీరు ఏమనుకుంటున్నారో రాయండి.

ఇ. 'కొన్ని వినోదాలు శ్రీమంతులకు మాత్రమే అందుబాటులో ఉండేవి' అనే వాక్యాన్నిబట్టి వినోదాలకు ఆర్థికస్థితికి గల సంబంధాన్ని చెప్పండి.

ఈ. ఒకనాటి బాలికల ఆటలకు, నేటి బాలికల ఆటలకు గల తేడాలు చెప్పండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

క్రీడలు, వినోదాలు మానవ జీవితానికి ఎందుకు అవసరమో తెలుపుతూ మీ అభిప్రాయం రాయండి.

(లేదా)

ఆటకు పాటకు వీడరాని చుట్టరికమున్నదనే రచయిత మాటలను సమర్థిస్తూ రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

మీకు తెలిసిన ఏవేని నాలుగు పద్యాలను బతుకమ్మ పాటలాగా మార్చి రాయండి.

ఉదా : ఉప్పుకప్పురంబు ఉయ్యాలో...
ఒక్కపోలికనుండు ఉయ్యాలో...
చూడచూడరుచుల ఉయ్యాలో...
జాడలువేరమ్మ ఉయ్యాలో... **(లేదా)**

గ్రామీణ కళాకారులను ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

## V పదజాల వినియోగం

**1. కింది పదాలకు అర్థాలను రాయండి.**

ఉదా: మేలుకొలుపు : మా నాయనమ్మ మేలుకొలుపు గీతాలు చక్కగా పాడుతుంది.

అ. ఆసక్తి ఆ. వీనులవిందు ఇ. శోభ ఈ. పురాతనమైన

**2. కింది వాక్యాలు చదివి సమాన అర్థం వచ్చే పదాలకింద గీతగీయండి.**

అ. శ్రీరామనవమి పండుగ వైభవంగా జరిగింది. ఈ పర్వాన్ని చూడటానికి ప్రజలు తరలి వచ్చారు. ఈ వేడుక అందరిలోనూ ఉత్సాహాన్ని నింపింది.

ఆ. శ్రీజకు చిత్రలేఖనం పట్ల ఆసక్తి ఎక్కువ. ఆ అపేక్షతో బొమ్మలు గీసింది. ఆమె అభిరుచిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఇ. రామయ్య గృహం నిర్మించుకోవాలనుకుని, ఇల్లుకు సరిపోయే స్థలం కొని, సదనం నిర్మించాడు.



SCERT TELANGANA

**3. కింది వికృతి పదాలకు సరిపోయే ప్రకృతి పదాలు గళ్ళలో ఉన్నాయి. వాటిని వెతికి రాయండి.**

అ. పబ్బము : .........................

ఆ. పున్నమి : .........................

ఇ. జీతం : .........................

ఈ. కర్జము : .........................

| | | | |
|---|---|---|---|
| కా | మ | ర్ణి | పూ |
| వే | ర్య | త | జ |
| క | న | ము | తం |
| వు | గ | జీ | వి |
| ల | కు | డు | జీ |
| తా | జై | కే | పం |

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాల్లో "సమాపక", "అసమాపక" క్రియలేవో గుర్తించి రాయండి.**

అ. శిరీష అన్నం తిని, సినిమాకు వెళ్ళింది.

అసమాపక క్రియ .................... సమాపక క్రియ ....................

ఆ. రమ బడికి వెళ్ళి, చదువుకున్నది.

అసమాపక క్రియ .................... సమాపక క్రియ ....................

ఇ. విజయ్ పుస్తకం చదివి, నిద్రపోయాడు.

అసమాపక క్రియ .................... సమాపక క్రియ ....................

ఈ. భరత్ బొమ్మలు గీసి, ప్రదర్శనకు పెట్టాడు.

అసమాపక క్రియ .................... సమాపక క్రియ ....................

**క్రియలనుబట్టే కాకుండా అర్థాన్నిబట్టి కూడా వాక్యాలలో తేడాలుంటాయని గమనించండి.**

ఉదా: అ. ఆహా! ఎంత బాగుందో!

ఆ. 'చేతులు కడుక్కో'

ఇ. మన రాష్ట్ర రాజధాని ఏది?

పై వాక్యాలు ఒక్కో భావాన్ని సూచిస్తున్నాయి. అదెట్లాగో చూద్దాం!

ఆహా! ఎంత బాగుందో! ఇది ఆశ్చర్యానికి సంబంధించిన అర్థాన్ని సూచిస్తుంది. కాబట్టి **ఆశ్చర్యాన్ని తెలియజేసేవాక్యం 'ఆశ్చర్యార్థక వాక్యం'.**

ఇక రెండో వాక్యం 'చేతులు కడుక్కో'. ఇది "విధిగా చేయాలి" అనే అర్థాన్ని సూచిస్తుంది. అంటే **చేయాల్సిన పనిని విధిగా చెయ్యాలి అనే అర్థాన్ని సూచించే వాక్యం 'విధ్యర్థక వాక్యం'.**



SCERT TELANGANA

ఇక మూడో వాక్యం మన రాష్ట్ర రాజధాని ఏది? ఇది ప్రశ్నార్థకాన్ని సూచిస్తుంది. **ప్రశ్నించే విధంగా ఉండే వాక్యమే 'ప్రశ్నార్థక వాక్యం'.**

**2. ఈ వాక్యాలు ఏరకమైనవో గుర్తించండి.**

అ. మీరు ఏ ఊరు వెళ్తున్నారు? ( )

ఆ. ఈ పాఠం చదువు. ( )

ఇ. వసంత ఎంత బాగా పాడిందో! ( )

ఈ. మన పాఠశాలకు ఎవరు వచ్చారు? ( )

ఉ. చెరువులో తామరలు ఎంతో అందంగా ఉన్నాయికదా! ( )

ఊ. పూలనన్నింటినీ హారంగా కూర్చండి. ( )

ప్రశ్నార్థక వాక్యాల చివర ప్రశ్నార్థకం (?), ఆశ్చర్యార్థక వాక్యాల చివర ఆశ్చర్యార్థకం (!) ఉంటుందనే విషయాన్ని గమనించండి. వీటికి ఇవి ప్రత్యేకం. మిగిలిన వాటికి అలా గుర్తులుండవు.

## ప్రాజెక్టుపని

1. మీ జిల్లాలోని ముఖ్యమైన / పెద్ద చెరువులు ఏవి? అవి ఎక్కడ ఉన్నాయి? మొదలగు విషయాలను ఒక పట్టిక ద్వారా వివరించండి. నివేదిక రాయండి. ప్రదర్శించండి. **(లేదా)**
2. గ్రామీణ వేడుకలు లేదా క్రీడలకు సంబంధించిన పాట/కథ/వ్యాసం సేకరించి నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

★ ప్రాచీన గ్రామీణ కళల గురించి చెప్పగలను. అవును / కాదు

★ అపరిచిత గద్యానికి ప్రశ్నలు తయారుచేయగలను. అవును / కాదు

★ విషయానుగుణంగా సంబంధించిన పేరాను సూచించగలను. దాని గూర్చి చెప్పగలను. అవును / కాదు

★ క్రీడలు, వినోదాల ప్రాముఖ్యతను సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు

★ పద్యాలను బతుకమ్మ పాటలాగా మార్చి రాయగలను. అవును / కాదు

**సూక్తి**


**క్రీడలు దేహ దారుఢ్యానికి, మానసిక దృఢత్వానికి కారకాలు. క్రీడలకు సమయమివ్వలేనివారు రోగాలబారిన పడాల్సివస్తుంది.**

SCERT TELANGANA

# 9. ఏ కులం?

- చెరబండ రాజు

## బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి




V4Z7E5

### ప్రశ్నలు

1. పై బొమ్మలో ఎవరెవరున్నారు?
2. నల్లబల్లపైనున్న పద్యం ఏ శతకంలోనిది?
3. ఆ పద్యం ఏ సందేశాన్నిస్తుంది?

### పాఠం ఉద్దేశం

సమాజంలో అనేక కులాలవారు, తెగలవారు, వృత్తులవారు ఉన్నారు. కొందరు స్వార్థపరుల ఆలోచనల వల్ల వారు చీలిపోతున్నారు. వృత్తుల సేవలతోనే సమాజం సమతుల్యతను సాధిస్తుంది. అందుకే కులవృత్తుల సేవలను గుర్తించి తగిన గౌరవం అందించాలి. అప్పుడే సమసమాజ నిర్మాణం జరుగుతుందని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయ' ప్రక్రియకు చెందినది. ఇది మాత్రాఛందస్సులో ఉంటుంది. రాగయుక్తంగా పాడుకోవడానికి వీలుగా ఉంటుంది.

ప్రస్తుత పాఠ్యభాగం చెరబండరాజు రచించిన 'జన్మహక్కు' అనే కవితా సంపుటి లోనిది.

## కవి పరిచయం



03.01.1944
02.07.1982

చెరబండరాజు అసలుపేరు బద్దం భాస్కరరెడ్డి. మేడ్చల్ జిల్లాలోని అంకుశాపురం ఇతని సొంత ఊరు. ఈయన ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. 1965లో దిగంబర కవిగా మొదలై, 1970 తర్వాత విప్లవగేయాలు, కథలు, నవలలు రాశాడు. 'గమ్యం', 'ముట్టడి', 'పల్లవి' ఇతని కవితా సంకలనాలు. 'కత్తిపాట' ఇతని పాటల సంకలనం. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు. తెలుగు కవిత్వంలో పదునైన వ్యక్తీకరణకు మొక్కవోని దీక్షకు, ధిక్కారస్వరానికి ప్రతినిధి, ప్రతీక చెరబండరాజు.


## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**మానవశరీరంలోని ప్రతి అవయవానికి ప్రాధాన్యత ఉన్నది. ఏ అవయవానికి దెబ్బ తగిలినా, శరీరమంతా బాధపడుతుందిగదా! అవయవాలన్నీ కలిసి పనిచేసినప్పుడే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అదేవిధంగా కుటుంబ అభివృద్ధికి, గ్రామాభివృద్ధికి, దేశాభివృద్ధికి, అందరూ కలిసిమెలిసి ఉండాలి. ఐకమత్యంతో సంఘీభావంతో ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించాలి. అందుకే కులాలు వేరైనా వృత్తులు వేరైనా మనదంతా ఒకేజాతి - మనమంతా భారతీయులం. 'ఐకమత్యమే మహాబలం' అనే విషయాన్ని ఈ పాఠం చదివి తెలుసుకుందాం.**

SCERT TELANGANA



# I

ఏ కులమబ్బీ!
మా దేమతమబ్బీ!!

1. మట్టి పిసికి ఇటుక చేసి
ఇల్లు కట్టి పెట్టినపుడు
డొక్క లెండి కొండ్ర లేసి
ధాన్యరాసులెత్తినపుడు ॥ ఏ ॥

2. పొగగొట్టాలై పేగులు
కొలిమి సెగలు చిమ్మినపుడు
దగ్గులతో క్షీణిస్తూ
బొగ్గుట్టలు త్రవ్వినపుడు ॥ ఏ ॥

3. మాడు చెక్కలే తింటూ
మాగాణం దున్నినపుడు
ఎండలలో బండలపై
విగ్రహాలు చెక్కినపుడు ॥ ఏ ॥

**ఆలోచించండి - చెప్పండి**

★ కార్మికుల ఆరోగ్యం ఎందుకు క్షీణిస్తున్నది?
★ "మాడు చెక్కలే తింటూ మాగాణం దున్నినప్పుడు" అని కవి అనడంలోని ఉద్దేశం ఏమిటి?

SCERT TELANGANA

## II

4. పూజకు అందిచ్చు పూల
బుట్టలల్లి ఇచ్చినపుడు
రామకోటి రాసుకొనే
కాగితాలు చేసినపుడు ॥ ఏ ॥

5. పశువు గొంతు కోసి మీకు
చెప్పులు కుట్టిచ్చినపుడు
కూటికింత కూడు లేక
కుండలు జేసిచ్చినపుడు ॥ ఏ ॥

6. సన్యాసుల్లె వస్తే
క్షవరాలూ చేసినపుడు
మురికి గుడ్డలుతికి మల్లె
పూలు చేసి ఇచ్చినపుడు ॥ ఏ ॥

**ఆలోచించండి - చెప్పండి**

★ రామకోటి రాసే కాగితాన్నీ, పూలబుట్టను కష్టపడి తయారుచేసిన వారిపట్ల మీ అభిప్రాయం ఏమిటి?

★ శ్రామికులు కూటికి ఎందుకు ఇబ్బంది పడుతున్నారు?





## III

7. చెల్లవు మీ కల్లబొల్లి
కబుర్లన్ని చెదలు పట్టె
ఆగదు మీ పాతరోత
రథం విరిగిపోయినది. ॥ ఏ ॥

8. కులాలనీ కులంలోని
శాఖలనీ వేరుజేస్తే
చెమటోడ్చే మనుషులమూ
చేయి కలిపి నిలబడితే ॥ ఏ ॥

**ఆలోచించండి - చెప్పండి**

★ "పాతరోత రథం విరిగిపోయింది" అని కవి అన్నాడు కదా! దీనిని సమర్థిస్తూ మాట్లాడండి.

★ శ్రామికులందరు చేయి చేయి కలిపి నిలబడితే ఏమి జరుగుతుంది?

### సారాంశం

మట్టిని మెత్తగా తొక్కి, పిసికి, ఇటుకలను తయారుచేసి, ఇల్లు కట్టేవారిది ఏ కులం? కడుపు మాడ్చుకొని, దున్నిన చాలులో పంటను పండించి, ధాన్యరాసులను బస్తాలకు ఎత్తినపుడు రైతుదేకులం?! ఏమతం?

ఫ్యాక్టరీలో పనిచేస్తున్నప్పుడు ఆ కొలిమి సెగలు తగిలి పేగులు మాడిపోతున్నాయి. బొగ్గు గుట్టలను తవ్వినపుడు దుమ్ము ధూళి వల్ల దగ్గుతో కార్మికుని ఆరోగ్యం క్షీణిస్తుంది. వీరిది ఏ కులం?! ఏమతం?! (ఇక్కడ కార్మికుని పేగులను పొగగొట్టాలతో కవి పోల్చాడు).

మాడిన అన్నం తింటూ కూడా నేలను దున్నుతూ వరిపంటను పండించే రైతుది ఏకులం? మండే ఎండలో బండలను అందమైన ఆకృతులలో విగ్రహాలను చెక్కిన శ్రమజీవి శిల్పిది ఏకులం?! ఏమతం?!

SCERT TELANGANA

దైవపూజకు తీసుకొని వెళ్ళే బుట్టలను అల్లి ఇచ్చిన వారిది ఏకులం?! భక్తితో రామకోటి రాసుకునేవారికి కాగితాలను తయారుచేసే శ్రామికులది ఏకులం?! ఏమతం?!

జంతువుల చర్మంతో చెప్పులు తయారుచేసి ఇచ్చిన వారిది ఏకులం?! ఏమతం?! బతకడానికి తిండిలేక జనంకోసం కుండలను తయారుచేసిన శ్రమజీవులది ఏకులం?! ఏమతం?!

గడ్డాలు, మీసాలు, జుట్టు పెంచుకొని వచ్చినవారికి క్షవరాలు చేసేవారిది ఏకులం?! మురికిబట్టలను మల్లెపువ్వులవలె తెల్లగా ఉతికి ఇచ్చే వారిది ఏకులం?! ఏమతం?! ఇట్లా వారి శ్రమను సమాజం వాడుకుంటుంది. వారు ప్రజల అవసరాలను తీరుస్తూనే ఉన్నారు.

మీ కల్పిత మాటలకు కాలం చెల్లింది. అబద్ధాలతో ఉన్న మాటలను వినం. వాటికి చెదలుపట్టినాయి. ఆగకుండ సాగిన మీ పాత ఆలోచనల రథం విరిగిపోయింది.

కులాలను, కులాల్లోని అన్ని శాఖలను వేరుచేసి అనైక్యతను సృష్టించాలని చూసేవారికి, గుణపాఠంగా చెమటను చిందించే శ్రామికులు అందరూ చేయి చేయి కలిపి నిలబడతారు. అప్పుడే నవసమాజం, సమసమాజం ఏర్పడుతుంది.

అన్ని వృత్తుల సేవల వల్ల సమాజం ఎట్లాంటి ఒడిదుడుకులు లేకుండా సాగుతున్నది. అవసరాలు తీర్చేటప్పుడు లేని కులం మిగతా సందర్భాలలో ఎందుకని కవి ప్రశ్నిస్తున్నాడు. ఈ గేయంలో సామాజిక చైతన్యం, విశాల దృక్పథం కనిపిస్తుంది.

## ఇవి చేయండి

H4T4P6

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. "ఏ కులమబ్బీ...." అనే పాట ఉద్దేశం ఏమై ఉంటుంది? చర్చించండి.
2. పాఠంలో కవి చెప్పినట్లుగానే శ్రామికుల జీవితాలు ఉన్నాయా? దీనిమీద అభిప్రాయాలు తెలుపండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. మనిషి జీవనగమనమంతా శ్రామికులమీద ఆధారపడి నడుస్తుంది. మనిషి లౌకిక జీవన పార్శ్వాలన్నీ శ్రామికుల స్పర్శతో చైతన్యవంతమవుతాయి. పొద్దున్నే లేవగానే అవసరమయ్యే నీళ్ళు మన ఇంట్లోకి రావడానికి వెనుక ఎవరి శ్రమ దాగివున్నదో ఆలోచించామా? వేడివేడి చాయ్, కాఫీలు తాగే రుచి వెనుక పాలుపోసే పాలవాడిని గుర్తుచేసుకుంటామా? ఇల్లూ వాకిలిని పరిశుభ్రంగా ఉంచేవారిని, మనం వేసుకునే ఉతికిన దుస్తులు, ఇస్త్రీమడతల వెనకఉన్న శ్రమ సౌందర్యాన్ని తలచుకున్నామా? అందమైన పూలతోటల పరిమళాలు, అపురూప శిల్పసంపదలతో విలసిల్లే దేవాలయాల వాతావరణం వెనుక దాగిన కార్మికశక్తులను స్మరించుకున్నామా? ఇట్లా అడుగడుగునా మన అవసరాలకు,

SCERT TELANGANA

విలాసాలకు ఉపయోగపడే శ్రామికులు, కార్మికులు, వివిధ కులవృత్తులవాళ్ళు తీవ్రమైన సామాజిక వివక్షతకు గురౌతున్నారు. చేసిన పనికి తగిన వేతనం లేక, సరైన గౌరవమూ లభించక శ్రమదోపిడికి, నిరాదరణకు గురౌతూ మానసిక వేదనలను అనుభవిస్తున్నారు. వారిపట్ల సమాజ దృక్పథం మారవలసిన అవసరమున్నది. ఆయా వృత్తుల వెనుక ఉన్న సాంస్కృతిక వారసత్వాన్ని సామాజిక బాధ్యతను మనం గుర్తించాలి. శ్రామికుల స్వేదంతో ప్రపంచం కదులుతుందన్న సత్యాన్ని గౌరవిద్దాం.

**పై పేరా ఆధారంగా పట్టికను నింపండి.**

| శ్రమజీవులు | వారి సేవలు |
|---|---|
| | |

**2. ఈ పాఠంలోని ప్రాసపదాలు రాయండి.**

ఉదా: 1. పెట్టినపుడు, ఎత్తినపుడు ..........................................................

..........................................................................................

2. ..........................................................................................

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. "చెమటోడ్చే మనుషులు చేయి కలిపి నిలబడితే" అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

ఆ. శ్రమ చేసేవారికి సమాజంలో తగిన గౌరవం లభిస్తుందా? అభిప్రాయం రాయండి.

ఇ. పాత కబుర్లకు చెదలు పట్టాయని కవి అంటున్నాడు. ఎందుకు అట్లా అన్నాడో ఆలోచించి రాయండి.

ఈ. పాఠం ఆధారంగా కవికి గల సామాజిక భావన ఎటువంటిదో రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబు రాయండి.**

'సమాజంలో మనుషులంతా ఒక్కటే' అనే వాక్యాన్ని సమర్థిస్తూ రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

మీ పాఠశాలలో ఈ గేయానికి తగినట్లుగా అభినయం చేసి చూపండి.

(లేదా)

ఈ పాఠం స్ఫూర్తిగా తీసుకొని వివిధ పనులు చేసేవారి ప్రాధాన్యత తెలిపేటట్లు చిన్న కవిత/గేయం రాయండి.

SCERT TELANGANA

## V పదజాల వినియోగం

1. **కింద ఇచ్చిన వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ. మా నాయనమ్మ ఆరోగ్యం క్షీణించింది.

ఆ. నేను మా బడిదగ్గర కమ్మరి కొలిమిని చూశాను.

ఇ. పొలంలోని కొండ్రలు చక్కని గీతలవలె ఉన్నాయి.

ఈ. మా వీధిలోని కుక్కకు తిండిలేక డొక్కలెండిపోయినాయి.

ఉ. పిల్లలు కబుర్లలో పడిపోయారు.

ఊ. మన దేశంలో కూడు లేనివారు ఉండరాదు.

2. **కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ. కల్లబొల్లి ఇ. చెమటోడ్చి

ఆ. పాతరోత ఈ. విగ్రహాలు

3. **కింది వాక్యాలు చదవండి. ప్రతి వాక్యంలోనూ ప్రకృతి-వికృతి పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి.**

అ. పిల్లవాడు పశువుకు మేత వేశాడు. తరువాత కుడితిని తెచ్చి పసరం దగ్గర పెట్టాడు.

ఆ. జాతరలో రథం తిప్పుతరట! ఆ అరదం అందంగా ఉంటుందట!

## VI భాషను గురించి తెలుసుకుందాం

1. **కింది పదాలను విడదీయండి. సంధులపేర్లు రాయండి.**

ఉదా:- ఎవరితడు = ఎవరు + ఇతడు ( )

అ. డొక్కలెండి = ............. + ............. ( )

ఆ. బుట్టలల్లి = ............. + ............. ( )

ఇ. గుడ్డలుతికి = ............. + ............. ( )

ఈ. రాముడెప్పుడు = ............. + ............. ( )

2. **ఈ కింది పదాలను కలుపండి. సంధులపేర్లు రాయండి.**

ఉదా: వెలుగును + ఇచ్చెను = వెలుగునిచ్చెను ( )

అ. కులాలు + అని = .................................... ( )

ఆ. కూటికి + ఇంత = .................................... ( )


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

ఇ. కొండ్రలు + ఏసి = ...................................... (                    )

ఈ. కబుర్లు + అని = ...................................... (                    )

ఉ. అంది + ఇచ్చు = ...................................... (                    )

**3. కింది పట్టిక ఆధారంగా సరైన ప్రత్యయాలతోటి ఖాళీలు పూరించండి.**

అనగనగా ఒక రాజ్య ................. ఆ రాజ్యము .................... ప్రజల .............. కులాలు, మతాలు లేవు. వారంతా ఒకరి ................. ఒకరు త్యాగాలు చేసుకుంటారు. వారి ............... మంచివారు ప్రపంచం .................... ఎవరూ లేరు. అన్నదానం .................. పుణ్యం వస్తుందని ఆ ఊరి రాజు ................ అన్నదానం చేయబడింది. కాని ఆ అన్నదానాని........ ఎవరూ రాలేదు. కారణం ఆ ఊరిప్రజలు ఎవరు కష్టపడి సంపాదించుకున్నది వారే తింటారు. ఇది విని రాజు సంతోషపడ్డాడు. ................ ప్రజలారా! మీరంతా ధన్యులు. మీ ............... నా జేజేలు అన్నాడు రాజు.

| కు, ఓ, చేత, కి, ము, వలన, లో, కొరకు, కంటె, తో |
|---|

## ప్రాజెక్టుపని

కుల వ్యవస్థను రూపుమాపేందుకు కృషిచేసిన ఒక సంఘసంస్కర్త గురించి, మీ పాఠశాల గ్రంథాలయం నుండి సమాచారం సేకరించండి, వారిగురించి నివేదికరాయండి. తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

- ★ గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. గేయభావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. అవును / కాదు
- ★ సమాజంలో మనుషులంతా ఒక్కటే అనే వాక్యాన్ని సమర్థిస్తూ రాయగలను. అవును / కాదు
- ★ గేయంలోని ప్రాసపదాలను గుర్తించి రాయగలను. అవును / కాదు
- ★ పాఠాన్ని అభినయించగలను. వృత్తిపనుల ప్రాధాన్యతను తెలిపేలా కవిత/గేయం రాయగలను. అవును / కాదు

## సూక్తి

శ్రమ శక్తిలోనే ప్రపంచ సౌందర్యం దాగి ఉన్నది.

SCERT TELANGANA

# 10. సీత ఇష్టాలు

బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



ప్రశ్నలు

1. పై బొమ్మలో ఎవరెవరున్నారు?
2. వారు ఏంచేస్తున్నారు?
3. ఇట్లాంటి ప్రదర్శనను మీరు ఎప్పుడైనా చూశారా? దీనిని ఏమంటారు?

D1B1D6

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠం ఉద్దేశం

ఆడపిల్లల పట్ల వివక్ష లేకుండా ప్రోత్సహిస్తే అన్నిరంగాలలో రాణిస్తారు. స్త్రీవిద్య కుటుంబానికే కాక ప్రపంచానికే వెలుగునిస్తుందని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం. అట్లే జానపద కళారూపాలపట్ల అభిరుచి పెంచుకొని ఆదరించాలని, 'బుర్రకథ' వంటి కళారూపాల వలన ప్రయోజనాలున్నాయని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'బుర్రకథ' ప్రక్రియకు చెందినది. జానపద కళారూపాల్లో బుర్రకథ ఒకటి. ఇందులో ఒక కథకుడు, ఇద్దరు వంతపాడేవాళ్ళు ఉంటారు. వచన, గేయరూపంలో కథను చెపుతూ అభినయిస్తూ ప్రేక్షకులను రంజింపచేస్తారు.

## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
★ పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలలో బాలికలను ఇంటికే పరిమితంచేసి, విద్యకు దూరం చేస్తున్నారు. బాలికలను పసిపిల్లల సంరక్షణకు, తల్లికి సాయపడటానికి, వ్యవసాయ కూలీ పనులకు కొందరు తల్లిదండ్రులు ఉపయోగిస్తున్నారు. చదువుకోవాలనే కోరిక వీరికీ ఉంటుంది. ఇట్టి వారికి ప్రోత్సాహం కలిగిస్తే వారు చదువుకొని, ముందడుగు వేస్తారు. అట్లాంటి ఒక సీత కథను పాఠం చదివి తెలుసుకుందాం.....**

SCERT TELANGANA

# I



అది ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. పాఠశాల ప్రాంగణం అంతా పిల్లలతో కళకళలాడుతున్నది. జాతీయదినోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు విద్యార్థులు. రమాదేవి అనే విద్యార్థిని తరవాత ప్రదర్శించబోయే అంశం ప్రకటిస్తున్నది ఇట్లా...

**రమ :** జానపద కళారూపాల్లో ఎంతో ప్రాచుర్యం పొందింది బుర్రకథ. తరతరాలుగా ప్రజాచైతన్యంలో ఈ కళారూపం కీలకపాత్ర పోషించింది. ఇందులో ఒకరు కథ చెబుతూంటే వారికి చెరో పక్కా ఇద్దరు వంతపాడుతూ ఉంటారు. కథ చెప్పేవారిని 'కథకుడు' అనీ ఆయనకు రెండుపక్కలా నిలబడి గొంతు కలిపేవాళ్ళను 'వంతలు' అని అంటారు. కథకుడు తంబూరా వాయిస్తాడు కాబట్టి కథకు బుర్రకథ అని పేరు వచ్చింది. ఈనాటి బుర్రకథను కృష్ణవేణి చెబుతుంది. రోజా, రాజు వంతపాడుతారు.

అనగనగా రామాపురం అనే ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే దంపతులకు కలిగిన తొలి సంతానం సీత. ఆ సీత చదువుకునేందుకు చేసిన ప్రయత్నమే ఈనాటి బుర్రకథకు నేపథ్యం.

**బుర్ర కథ - పాత్రలు**

కథకురాలు – కృష్ణవేణి

వంతలు – 1. రాజు

2. రోజా

**కృష్ణవేణి :** (పాట) – జయము జయము మన భారతమాతకు జయము దిగ్విజయమూ... ॥తందాన తాన॥
చదువులనిచ్చు సరస్వతి తల్లీ – చల్లగ జూడమ్మా ॥తందాన తాన॥
సిరులనిచ్చెడి శ్రీ మహాలక్ష్మీ – కరుణ జూపవమ్మా ॥తందాన తాన॥
శత్రువినాశము జేసేడి దుర్గా – జయము నీయవమ్మా –
తందాన – తందాన – దేవనందనానా – తరికిట ఝం తరిత

**రాజు :** అక్కా! ఈరోజు ఏ కథ చెబుతున్నావు?


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

**రోజా :** ఏదో కాదురా! నలమహారాజు కథ, పాండవులూ కౌరవుల కథ, మరాఠీల కథ, రామకథ, లవకుశుల కథ, సీతమ్మ కష్టాలు...

**రాజు :** ఏందక్కా! ఆ కథలన్నీ పాత గాథలయిపోయినయి కదా, కొత్త కథ చెప్పరాదా?

**రోజా :** ఏందిరా! పాతంటే రోతగా ఉందా? అయితే పాత గ్లాసులు, బిందెలూ, వెండి పళ్ళాలు, బంగారు గొలుసులూ అన్నీ తీసి బయటికి పారేస్తావా? ప్రతివాడికీ ఇదో ఫేషనైపోయింది. పాత లేందే కొత్తెక్కడిదిరా తిక్క సన్నాసీ! ఇప్పుడు కొత్త... కొత్త... అని అరుస్తున్నారు గానీ, ఈ కొత్తంతా పాతలోనుంచే గదరా పుట్టింది...

**రాజు :** అరరరె... ఇప్పుడు నేనేమన్నానని కరెంట్ షాక్ తలిగిన కాకిలెక్క అట్లా అరుస్తున్నావు? పాతంటే రోతని నేనన్నానా? కాలం మారినా ఇంకా మనం పాతలోనే బతుకుతున్నామా? ఎలక్ట్రిక్ దీపాలు వద్దని ఆముదం దీపాలు పెట్టుకుంటున్నామా? బస్సులూ, రైళ్ళు కొత్తవని ఎడ్లబండ్లమీదనే ప్రయాణిస్తున్నామా?

**కృష్ణవేణి:** ఒరే తమ్ముడూ! చెల్లీ! అనవసరంగా మీరిట్లా కొట్లాడుకొని రసాభాస చెయ్యకండి! తమ్ముడన్నట్లు ఈరోజు మనం కొత్త కథనే చెప్పుకుందాం.

**రాజు :** (మంచి పనయింది అన్నట్లు అభినయించాడు)

**రోజా :** ('చాల్లే ఎచ్చులు' అన్నట్లు మూతి వంకర తిప్పుతూ అభినయించింది)

**కృష్ణవేణి:** ఈరోజు మనం చెప్పుకోబోయే కథ - **'సీత ఇష్టాలు'.**

(పాట) తకతా - తకిట - తక - తరికిట తరికిట తా - - - - ఇది -

పేద ఇంటిలో పుట్టి పెరిగిన పైడిబొమ్మ కథరా ॥తందాన తాన॥
చదువు సందెలో పేరు పొందిన చక్కనమ్మ కథరా ॥తందాన తాన॥
ఓటమినెరుగక పోరాడే ఒక వీర బాల కథరా ॥తందాన తాన॥
పదిమందికినీ ప్రేరణనిచ్చే వర్తమాన కథరా ॥తందాన తాన॥
- తరికిట ఝం తరితా!

**రోజా :** ఇంతకూ ఎవరా పైడిబొమ్మ? ఏమా కథ?

**కృష్ణవేణి:** అయ్యలారా! అమ్మలారా! శ్రీలు విలసిల్లిన భారతభూమిలో, రాజనాలు పండే రతనాల నేల తెలుగు నేల. ఆ తెలుగునాట రామాపురమనేది ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే పేదదంపతులున్నారు. ఆ దంపతులకు కలిగిన తొలి సంతానమే సీత. సీతను బడికి పంపాలను కుంటుండగానే వాళ్ళకు మరో పిల్లవాడు పుట్టాడు. సంతానాన్ని ఇక్కడితో ఆపేద్దామా, వద్దా అని వాళ్ళు మథనపడుతుండగానే మరో కూతురు పుట్టింది.

**ఆలోచించండి - చెప్పండి**

★ 'కొత్త వింత - పాత రోత' సామెత ఏఏ సందర్భాలలో వాడుతారు?

★ ఆడపిల్లలను కొంతమంది తల్లిదండ్రులు చదివించకపోవడానికి కారణాలేమిటి? మిత్రులతో చర్చించండి.



SCERT TELANGANA

## II

**రాజు :** ఆలస్యం అమృతం విషం అంటే ఇదేనేమో!

**రోజా :** నువ్వు నోరు మూస్తావా, ముయ్యవా?

**రాజు :** నోరు మూసుకునే కాలం పోయిందక్కా. ప్రశ్నించేవాడే ఉత్తముడు. మాట్లాడేవాడే మంచోడు.


**కృష్ణవేణి:** తరువాత కథ వినండి...

(పాట) పూట గడవని తల్లిదండ్రులకు పాటు లెక్కువాయె ॥తందాన తాన॥
పంటలు పండక - పొట్టనిండక కష్టమెక్కువాయె ॥తందాన తాన॥
కుటుంబ భారం కుంగదీయగా తల్లడిల్లినారు ॥తందాన తాన॥
భార్యా - భర్త కూలినాలితో బతుకు నీడ్చినారు ॥తందాన తాన॥
తరికిట ఝుం తరితా!

**రోజా :** ఇంతకూ సీత బడికి పొయ్యిందా? లేదా?

**కృష్ణవేణి:** లేదు చెల్లెలా! అమ్మా, నాయనా పనిలోకి పోతే తమ్ముణ్ణీ, చెల్లెల్నీ ఆడించడానికే ఆమె అంకితమైపోయింది.

**రాజు :** **'పిల్లలు బడిలో - పెద్దలు పనిలో'** అనే సంగతి వాళ్ళకు తెలియదా అక్కా? "పదహారేళ్ళలోపు పిల్లలను పనిలో పెట్టొద్దు" అన్న చట్టాన్ని గురించి వాళ్ళెందుకు పట్టించుకోలేదు?



SCERT TELANGANA

**కృష్ణవేణి:** చట్టాలు అమలుచేయడం ఏ ఒక్కరి బాధ్యతో అనుకున్నంతకాలం పరిస్థితిలో మార్పు రాదురా తమ్ముడూ!

**రోజా :** ఇంతకూ ఆ చిన్నారి సీతమ్మ ఏమేం పనులు చేసేదక్కా?

**కృష్ణవేణి:** (పాట)

ఇంటి పనులనే చేసేరా .... సై
వంట పనీ కొంత నేర్చెరా .... సై
బీడీలెన్నో తాను చుట్టెరా .... సై
పత్తి చేలకే పోయెరా .... సై
కొవ్వొత్తిలా బతుకాయెరా .... సై
వినరా సోదర చదువుల తల్లి దీనగాథ నిపుడు - నిరుపేద గాథ ఎపుడూ - తందానతాన.
॥తరికిట ఝుం తరిత॥

**రోజా :** తరువాతేం జరిగిందక్కా?

**రాజు :** ఇంకేం జరుగుతుందీ? నాలుగు రాళ్ళు సంపాదించిన తర్వాత, ఆ రాళ్ళతోనే, ఆ పిల్లనెత్తిన నీళ్ళు పోసి, పెళ్ళి చేసి ఉంటారు.

**కృష్ణవేణి:** నిజంగా అదే జరిగితే మన కథకు అర్థం లేదురా తమ్ముడూ!
ఆ ఊరికి శ్రావణి అనే కొత్త టీచర్ వచ్చింది.

**రోజా :** నీ పిచ్చిగానీ, టీచర్లు చదువు చెబుతారు కానీ, ఇవన్నీ పట్టించుకుంటారా?
ఒకవేళ పట్టించుకొని చెప్పినా వినేవాళ్ళుంటరా? విన్నా, మార్పు సాధ్యమవుతుందా?

**రాజు :** తప్పకుండా సాధ్యమవుతుంది. మా బళ్ళో టీచర్లు రోజూ పాఠాలతోపాటు మంచి మంచి కథలు, సూక్తులు చెప్తారు. ఆటలాడిస్తారు. పాటలు పాడిస్తారు. బడి పిల్లలని తమ సొంత బిడ్డల్లాగా పట్టించుకుంటారు.

**కృష్ణవేణి:** ఔను తమ్ముడూ! శ్రావణి కూడా అటువంటి టీచరే! ఆమె ఆ ఊరికి రాంగనే ముందుగా చేసిన పని - బడి ఈడున్న పిల్లలు ఎవరెవరు బడికి వస్తారో రారో తెలుసుకోవడం. అట్లా తెలుసుకొని ఒక్కొక్క ఇంటికి వెళుతూ శివయ్య వాళ్ళింటికి కూడా వెళ్ళింది.

**రాజు :** అయితే అది గమనించిన గౌరమ్మ సీతను ఇంట్లో దాచిపెట్టి, మా ఇంట్లో అటువంటివాళ్ళెవరు లేరని చెప్పిందా?

**రోజా :** నువ్వు అతిగా ఊహించకు. అక్క చెప్పేది విను.

**కృష్ణవేణి:** రాజు ఊహించింది నిజమే. గౌరమ్మ సీతను దాచిపెట్టింది.

**రాజు :** అయ్యో! అప్పుడేమయింది?

**కృష్ణవేణి:** శ్రావణి టీచర్ వచ్చిన పని చెప్పకుండా శివయ్య దంపతులకు కొన్ని మంచి మాటలు చెప్పింది.



SCERT TELANGANA

**రోజా :** ఏమని?

**కృష్ణవేణి:** (పాట)

ఓ భారతీయుడా – ఓ బాలభానుడా – వినవయ్య వీనులవిందుగా
తెలుసుకోవయ్య చరితను ముందుగా
ఎన్నో జన్మల పుణ్యఫలమ్మిది మానవ జన్మమ్ము ॥అది మానవ జన్మమ్ము ॥
అందులోనూ ఆడపిల్లగా పుట్టుట శ్రేష్ఠమ్ము ॥ఔను పుట్టుట శ్రేష్ఠమ్ము ॥
సహనము స్నేహము ప్రేమ భావము ఆమె గొప్పతనము ॥అది ఆమె గొప్పతనము॥
ఆ గొప్పను గల్గిన ఆడపిల్లను చక్కగ పెంచాలి ॥బహు చక్కగ పెంచాలి॥
అప్పుడె ఇల్లు – ఊరూ – దేశం – అభ్యున్నతి పొందు – ॥ఔను అభ్యున్నతి పొందు॥
అట్టి బాలికల నణచిపెట్టుట – అన్యాయమ్మగును ॥అంతే – అన్యాయమ్మగును॥
॥ఓ భారతీయుడా॥

**ఆలోచించండి – చెప్పండి**

- ఆడపిల్లలు ఇంటివద్ద ఏయే పనులు చేస్తూ తమ ఇష్టాలు కోల్పోతున్నారు? చర్చించండి.
- సీతను దాచిన తల్లి మనసు ఎటువంటిది? దీనిపై మాట్లాడండి.
- స్త్రీ గొప్పదనమేమిటి?

# III

**రాజు :** ఆడవాళ్ళుకూడా గొప్పవాళ్ళు, వాళ్ళను అణచిపెట్టడం మహాపాపం అంటున్నావు బాగానే ఉంది కాని, అటువంటి నలుగురు గొప్పవాళ్ళ పేర్లు చెప్పక్కా.

**కృష్ణవేణి:** సరే, వినండి మరి. ఆ శ్రావణి టీచర్ కూడా కొందరు ఆదర్శ మహిళల గురించి ఇట్లా చెప్పింది.

**రోజా :** ఎలా....

**కృష్ణవేణి:** (పాట)

రుద్రమదేవి చూడరా సై
శత్రువులను చెండాడెరా సై
సరోజినీ నాయుండురా సై
స్వరాజ్య సమరం చేసెరా సై
సంగెం లక్ష్మీ బాయిరా సై
బాలలను బాగు పరచెరా సై
అచ్చమాంబను చూడరా సై
మహిళల మార్గము దిద్దెరా


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

కల్పన చావ్లా చూడరా సై
అంతరిక్షమున కెగిరెరా సై
సునితా విలియం చూడరా సై
పరిశోధనలెన్నో చేసెరా సై ॥తదిక్కుతోం॥
అన్ని రంగములలోన మహిళలూ ఆదర్శంగా నిలిచారు.
॥భళానంటి భళి తమ్ముడా – సై – మేలు భళానోయ్‌తందానా॥
తకతా – తకిట తక – తరికిట తరికిట–తా

**రోజా :** అక్కా! అక్కా! ఆ తరువాతేమయిందో నేను చెప్తా! ఆ మాటలన్నీ లోపలినుంచి వింటున్న సీత బయటకివచ్చి, తానూ చదువుకుంటానని చెప్పింది.

**కృష్ణవేణి:** ఔను చెల్లెమ్మా! అంతేకాదు, టీచర్ మాటలతో ప్రభావితులైన శివయ్య దంపతులు బిడ్డను చదివించడమే మంచిదన్న సంగతి అర్థం చేసుకున్నారు. సీతను టీచర్ వెంట పంపించారు.

**రాజు :** అంతే లెండి. అందరూ మా చిన్నక్కలా ఉంటారా?

**రోజా :** అంటే?

**రాజు :** నువ్వు రాజుకంటే గొప్పదానివక్కా!

**రోజా :** ఈ కథ గానీ, నీ సంగతి చెబుతా.

**కృష్ణవేణి:** సరే! మీరు తర్వాత కొట్టుకోవచ్చు. ముందు కథ వినండి. సీత ఎట్లా చదువుకున్నదయ్యా అంటే

(పాట) అక్షరమాల నేర్చెరా సై
తెలుగు చక్కగా జదివెరా సై
ఎక్కాలన్నీ నేర్చెరా సై
లెక్కలు చక్కగ జేసెరా సై
పరిసరాల విజ్ఞానమూ సై
పక్కాగా గ్రహించెరా సై ॥తదిక్కుతోం॥
ఏది జదివినా – ఏది రాసినా – ఎదురు లేదు తనకు – ॥తందాన తాన॥
అందరిలోను అన్నిటికన్నా ముందు నిలిచె తుదకూ ॥తందాన తాన॥
తా – తకిటతక – తరికిట తరికిట తా –

**కృష్ణవేణి:** ఆమె తెలివితేటలు గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడా ముగ్ధులై ఏడాది గడవకుండనే ఐదో తరగతిలో చేర్పించారు.

**రోజా :** చూడు! చదివితే అట్లా చదువాలి.

**రాజు :** నువ్వేం నన్ను వెక్కిరించనవసరంలేదు. నేను కూడా ఒకటో తరగతిలో ఉండంగనే పెద్ద పెద్ద లెటర్స్ చదివిన... తెల్సా?



SCERT TELANGANA

**రోజా :** నువ్వా? అంత లేదు. ఏం చదివినవో చెప్పు.

**రాజు :** లెటర్స్... పేద్ద లెటర్స్.

**రోజా :** అవే... ఏంటో... ఒకటి రెండు చెప్పు

**రాజు :** ఒకటి రెండు కాదు.... 26 చదివిన... చెప్పలేనా? చెప్పమంటవా...? అయితే విను... A...B...C...D...



**రోజా :** ఆ లెటర్సా? ఏడ్చినట్లే ఉంది. నువ్వు తర్వాత కథ చెప్పక్కా.

**కృష్ణవేణి:** ఆ తర్వాత సీతకు ఎదురే లేకుండా పోయింది. ఏడో తరగతి కూడా పూర్తిచేసింది. సరిగ్గా అదే సమయంలో శ్రావణి టీచర్ ప్రమోషన్‌మీద బదిలీ అయి, వేరే ఊరికి వెళ్ళింది.

**రాజు :** అయ్యో! అయితే సీత చదువు ఆగిపోయిందా అక్కా?

**కృష్ణవేణి:** లేదులే రాజూ! శ్రావణి టీచర్ సీత మనసులో చదువుబీజాలు బలంగా నాటింది. టీచర్ బదిలీ అయినా, ఉన్న ఊళ్ళో పై చదువులకు అవకాశం లేకపోయినా పట్నం పోయి స్కూల్ చదువూ, కాలేజీలో ఇంటరూ పూర్తిచేసి, డిగ్రీలో చేరింది.

**రోజా :** ఎందుకక్కా? ఇంజనీరింగ్‌లో సీటు దొరకలేదా?

**కృష్ణవేణి:** ఏదో చదువుకొని, డబ్బులు సంపాదించి, తను మాత్రం హాయిగా ఉండాలనుకోలేదు సీత. తను బాగా చదువుకొని, తనలాంటి పిల్లలను బాగుపరచాలని, కలెక్టరుగానో, నాయకురాలుగానో ఈ సమాజానికి సేవ చేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. డిగ్రీ చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి, మండల అభివృద్ధి అధికారిగా ఎంపికైంది.

**రాజు :** ఓహో! చాలా బాగుంది. తర్వాత కథ చెప్పక్కా.

**కృష్ణవేణి:** తర్వాతేముందిరా తమ్ముడూ! పిల్లల చదువుకోసం, స్త్రీలకు మేలు చేసేందుకోసం నిరంతరం కృషి చేస్తుందిప్పుడు మన సీతక్క.

**రోజా :** ఔనా! అక్కా! సీత ఇష్టాలన్నావుకదా! అవేవో చెప్పవా?

**రాజు :** మరి నా ఇష్టాలో...

**రోజా :** అవా? అవి... మన కథ అయినతరువాత తీరుబడిగా చెప్పుదువుగానీ ముందు సీత ఇష్టాలు విను.

**రాజు :** సరే సరే... నువ్వంటావుగదా! వింటావుగదా! ఇప్పుడు నువ్వు... ముందు అక్క చెప్పేవి విను.

SCERT TELANGANA

**కృష్ణవేణి:** (పాట) ఆడపిల్లలను చిన్నచూపుతో చూడరాదు భాయీ

॥అరెరే చూడరాదు భాయీ॥

అన్నిటిలోనూ అవకాశాలను కల్పించాలోయీ

॥చక్కగ - కల్పించాలోయీ॥

చదువులనైనా పదవులనైనా సమానమేనోయీ

॥వాళ్ళూ సమానమేనోయీ॥

వాళ్ళల్లోని ప్రతిభను నీవూ గౌరవించవోయీ

॥తప్పక గౌరవించవోయీ॥

తరికిట ఝుం తరిత.

**రాజు :** చాలా మంచికథ చెప్పావు అక్కా. ఈ కథ వింటే నిజంగా ఎవ్వరిలోనయినా మార్పు వస్తుంది.

**రోజా :** ఇటువంటి సీతక్కలు ఊరికొక్కరున్నా ఈ దేశం తొందరగా బాగుపడుతుంది.

**కృష్ణవేణి:** ప్రతి ఒక్కరూ ఈ సీతక్కను ఆదర్శంగా తీసుకొని తమనూ, తమ దేశాన్నీ బాగుపరచాలని కోరుకుంటూ, కథ ముగించుదాం.

(పాట) మంగళం మన భారత మాతకు॥

మంగళం జయ మంగళం ॥

మంగళం తెలంగాణ తల్లికి ॥

మంగళం జయ మంగళం ॥

మంగళం మన రుద్రమదేవికి ॥

మంగళం జయ మంగళం ॥

మంగళం ఆదర్శ మహిళలకు ॥

మంగళం జయ మంగళం ॥

తరికిట ఝుం తరిత!

### ఆలోచించండి - చెప్పండి

★ టీచర్ ఆదర్శ మహిళల గురించి సీత తల్లికి ఎందుకు చెప్పి ఉంటుంది?

★ చదువుకున్నవాళ్ళు ఎట్లా ఆలోచించాలని సీత ఇష్టాల ద్వారా తెలుసుకున్నారు?

★ సీత ఇష్టాలు తెలుసుకున్నారుకదా! సీత వలె అమ్మాయిలు ఎట్లాంటి ఇష్టాలు కలిగి ఉండాలి?



SCERT TELANGANA

## ఇవి చేయండి

D6F2N7

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. ఆడవాళ్ళు కూడా గొప్పవాళ్ళే, ఎందుకు? కారణాలు చెప్పండి.
2. శ్రావణి టీచర్ గురించి తెలుసుకున్నారు కదా! అట్లాగే మీ ఉపాధ్యాయులను గురించి మాట్లాడండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

1. 'కొత్త వింత - పాత రోత' అనే అర్థం వచ్చే వాక్యాలు పాఠంలో ఎక్కడ ఉన్నాయి?
2. పాఠంలో మీకు నవ్వు పుట్టించిన అంశాలు రాయండి.

**కింది పేరా చదివి క్రింది పట్టికను పూరించండి.**

1940 ప్రాంతంలో తెలంగాణాలో స్త్రీల చైతన్యం కొంత వికసించింది. లేడీ హైదరీల క్లబ్, సోదరీ సమాజం, ఆంధ్ర యువతీ మండలి, ఆంధ్రమహాసభ మొదలైన సమాజాలు ఏర్పడి సమావేశాల ద్వారా స్త్రీలను చైతన్యవంతులను చేశాయి. రత్నదేశాయి తన సాహిత్యం ద్వారా గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసింది. వితంతువుల కోసం వసతిగృహాలు ఏర్పాటుచేసింది. అనేకమంది రచయితలు, రచయిత్రులు పత్రికల ద్వారా స్త్రీలలో చైతన్యం కలిగించారు. సుమిత్రాదేవి, ఈశ్వరీబాయి, సంగెం లక్ష్మీబాయి మొదలైన వాళ్ళు సంఘ సంస్కరణకు కృషిచేశారు. అఘోరనాథ ఛటోపాధ్యాయ గారి భార్య వరదసుందరీదేవి నాంపల్లిలో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించింది. ఈమె సరోజిని నాయుడు తల్లి.

| సంఘ సంస్కర్తలు | రచయిత్రులు | సంస్థలు |
|---|---|---|
| | | |

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. శ్రావణి టీచర్ పిల్లల అభివృద్ధి కోసం చేసిన ప్రయత్నాన్ని తెల్పండి.

ఆ. 'బుర్రకథ' ప్రదర్శన విధానం గురించి రాయండి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

ఇ. పాఠాన్ని ఆధారంగా చేసుకొని ఆడపిల్లల పరిస్థితులను గురించి రాయండి.

ఈ. 'పెద్దలు పనికి – పిల్లలు బడికి' అనే నినాదాన్ని గురించి రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

'సీత ఇష్టాలు' కథను మీ సొంత మాటల్లో రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని తెలిపే "నినాదాలు" రాయండి.

## V పదజాల వినియోగం

**1. కింది వాక్యాలు చదవండి. ఎవరెవరిని ఏమంటారో రాయండి.**

అ. మండలంలో అభివృద్ధి పనులు నిర్వహించే అధికారి ..........................

ఆ. నాయకత్వం వహించేవారు ..........................

ఇ. ఉపన్యాసం ఇచ్చేవారు ..........................

ఈ. హరికథ చెప్పేవారు ..........................

ఉ. శిక్షణను ఇచ్చేవారు ..........................

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలలో సమాపక, అసమాపక క్రియాభేదాలు గుర్తించండి. మరికొన్ని అసమాపక, సమాపక క్రియలు రాయండి.**

అ. వెళ్ళి, వచ్చి, తెంపి, తిని, చూసి
తిన్నది, చేసింది, అల్లింది, తెచ్చింది, తెచ్చాడు, రాశాడు

..........................................................................................

..........................................................................................

**సమాపక, అసమాపక క్రియలను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

**2. ఈ కింది వాక్యాల్లో ఆశ్చర్యార్థక, ప్రశ్నార్థక, విధ్యర్థక వాక్యాలను గుర్తించండి. అవసరమైనచోట తగిన విరామ చిహ్నాలను ఉంచండి.**

అ. దెబ్బ ఎట్లా తలిగింది

ఆ. అమ్మో ఎంత పెద్ద పామో

ఇ. తప్పకుండా ఇంటిపని పూర్తిచేయాలి

ఈ. నాన్న కొనిచ్చిన సైకిల్ ఎంత బాగుందో

ఉ. పండుగ నాటికి గుడిని అలంకరించండి

ఊ. మీది ఏ ఊరు

SCERT TELANGANA

## ప్రాజెక్టుపని

మీ ప్రాంతంలోని కళారూపాలను గురించి తెలుసుకొని, మీకు నచ్చిన కళారూపాన్ని గురించి రాసి నివేదికను మీ తరగతిలో ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

| | |
|---|---|
| ★ బుర్రకథ విని అర్థం చేసుకోగలను, అభిప్రాయాలు చెప్పగలను. | అవును / కాదు |
| ★ బుర్రకథ సారాంశాన్ని సొంత మాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| ★ పాఠం చదివి సూచనలకనుగుణంగా వాక్యాలను గుర్తించగలను. | అవును / కాదు |
| ★ ఇచ్చిన అంశానికి తగినట్లు నినాదాలు రాయగలను | అవును / కాదు |
| ★ వాక్యాలలోని భేదాలను గుర్తించగలను. | అవును / కాదు |

## మీకు తెలుసా?

### మలాలా



**బాలికలు చదువరాదని విధించిన ఆజ్ఞను ఉల్లంఘించింది...**
**ధైర్యసాహసాలు ప్రదర్శించి బడికెళ్ళింది...**
**చదువుకోవడానికి తనకున్న హక్కును**
**లాక్కోవడానికి మీరెవరని ప్రశ్నించింది...**
**తాలిబన్ల ఉగ్రవాద చర్యలకు ఎదురొడ్డి నిలిచింది...**

అచంచల ధైర్యసాహసాలతో తనపేరును స్వర్ణాక్షరాలతో లిఖించుకున్న ఆ బాలిక మలాలా యూసఫ్ జాయ్. 1997 జూలై 12న పాకిస్థాన్‌లో జన్మించిన మలాలా ప్రపంచం గర్వించే సాహస బాలికగా పేరు తెచ్చుకుంది. "సాటి మనిషిని ప్రేమించడమే నా కుటుంబం నాకు నేర్పిన సంస్కారం. నామీద తూటాలు కురిపించిన తాలిబన్ వచ్చి నాయెదురుగా నిలిచినా అతణ్ణి నేను క్షమిస్తాను. గాంధీజీ, మార్టిన్ లూథర్ కింగ్, మదర్ థెరీసాలే నాకు ఆదర్శం" అని గర్వంగా చాటింది. అత్యుత్తమ ఔదార్యానికి నిలువెత్తు నిదర్శనమై నిలిచింది. సత్యార్థి కైలాశ్ ప్రకాశ్ (బాలల హక్కులకోసం కృషి చేస్తున్న భారతీయ సామాజిక సేవకుడు) తో కలిసి 2014 సంవత్సరంలో నోబెల్ శాంతి బహుమతి నందుకొన్నది.

## సూక్తి

**తన పిల్లలను అద్భుతంగా తీర్చిదిద్దగలిగిన తల్లి వందమంది ఉపాధ్యాయులతో సమానం**

**- రామకృష్ణ పరమహంస**

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## చదువండి - ఆనందించండి

### మాట్లాడడమూ ఒక కళే

మనసులోని భావాన్ని ఎదుటివారికి తెలియజేసే మాధ్యమం మాట. మాటకున్న శక్తి గొప్పది. అది అవతలివారిని మెప్పించగలదు, నొప్పించగలదు, ఆపదలనుండి తప్పించగలదు. మాట్లాడటం ఒక కళ. శబ్దశక్తి తెలిసిన వానికే ఈ కళ కరతలామలకమవుతుంది.

ఒకాయన మెట్లుదిగుతున్నాడు. అదే సమయంలో మరొకాయన మెట్లు ఎక్కుతున్నాడు. దారి ఇరుకుగా ఉంది. ఇద్దరూ మధ్యలో ఎదురుపడ్డారు. కింది నుండి వస్తున్న అతనికి కోపమెక్కువ. పైనుండి దిగుతున్న వానితో "నేను మూర్ఖులకు దారివ్వను" అన్నాడు. వెంటనే ఎదుటివాడు ఏమాత్రం తడుముకోకుండా "పరవాలేదు నేనిస్తాను" అన్నాడు. ఇప్పుడు ఎవడు మూర్ఖుడయ్యాడు?

ఒకామె ఇంకొకామెతో కొట్లాట పెట్టుకున్నది. కోపంతో రెచ్చిపోయి "ఛీ కుక్కా" అన్నది. అవతలామె "ఏమక్కా?" అన్నది. ఈ మాటతో మొదటామెకు తిక్కకుదిరింది.

తాంబూలం వేసుకోవడానికి వెళ్ళాడొక పెద్దమనిషి. తమలపాకులు కట్టేవానితో "ఏయ్, ఆకులోసున్నం తక్కువవేయి, దవడపగులుతుంది" అంటూ పక్కనే ఉన్న అరటిపండ్ల గెలకు చేయి ఆనించి నిలబడ్డాడు. అవకాశంకోసం ఎదురుచూస్తున్న తమలపాకులవాడు "ఏమయ్యోయ్, చెయ్యితియ్యి, పండ్లురాలుతాయి" అన్నాడు. మాటకు మాట, దెబ్బకు దెబ్బ.

సాహిత్యాభిలాషియైన ఒకడు కవిని కలిశాడు. ఎంతోకాలం నుండి తన మనసులో దాచుకున్న ఆశను బయటపెట్టాడు. "అయ్యా, నాకు ఏదైనా నాటికను రాసివ్వండి" అనడిగాడు. దానికి బదులిస్తూ ఆ కవి "ఓ! దానికేముంది ఏనాటికైనా రాస్తాను" అని అభయమిచ్చాడు.

ఒక పెండ్లివేడుకలో కొందరు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఒక పెద్దాయనను "మీవయసెంతండీ" అనడిగారు. దానికా పెద్దమనిషి "ఏడేళ్ళు" అన్నాడు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఎంత పెద్దమనిషైతే మాత్రం ఇంతగా పరిహాసమాడుతారా అని నిలదీశారు. అతనన్నాడు "నేను నిజమే చెప్పాను. నాకు ఏడేళ్ళు" ($7 \times 7 = 49$) అన్నాడు. అసలు విషయం తెలుసుకుని అందరూ గొల్లున నవ్వారు.

బజారులో వెళుతున్న ఒకతనికి మిత్రుడు తారసపడ్డాడు. చాలాకాలమైంది వాళ్ళు కలుసుకొని. మిత్రుడు చెప్పులు లేకుండా ఉండడంచూసి విషయమేమిటని ప్రశ్నించాడు. దానికి బదులిస్తూ "చెప్పుకొనుటకేమున్నద"ని పెదవి విరిచాడామిత్రుడు.

తను తీయబోయే సినిమా విషయంలో నిర్మాత ఒక కవి దగ్గరకు వెళ్ళాడు. "నా సినిమాకొక పాట రాస్తారా?" అని అభ్యర్థించాడు. దానికి కవి "రాస్తారా" అన్నాడు. ఎంత కవియైతే మాత్రం ఇంత అహంకారంగా తనను 'రా' అంటాడా అనుకున్నాడు నిర్మాత. అతని ఆంతర్యం గ్రహించిన కవి, "అయ్యా! నన్ను తప్పుగా అనుకుంటున్నట్లున్నారు నేనన్నది 'రాస్తా, రా' " అని. హమ్మయ్య అనుకున్నాడు నిర్మాత.


ఇట్లా మాటల విరుపులు మెరుపులను సృష్టిస్తాయి. మాటలలో వ్యంగ్యం గిలిగింతలు పెడుతుంది.

SCERT TELANGANA

# 11. శ్రీలు పొంగిన జీవగడ్డ

- రాయప్రోలు సుబ్బారావు

## చదువండి - ఆలోచించండి - మాట్లాడండి



G5K9U6

ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము...

### ప్రశ్నలు

1. పై వాక్యాలు దేనిగురించి చెప్తున్నాయి?
2. దేశంపట్ల ఎటువంటి భావనతో ఉండాలి?
3. జాతిగౌరవం నిలుపడం అంటే మీరు ఏమనుకుంటున్నారు?
4. ఈ గేయాన్ని ఎవరు రచించి ఉండవచ్చు?

### పాఠం ఉద్దేశం

భారతదేశం అనేక సంస్కృతి సంప్రదాయాలకు నిలయం. సిరిసంపదలకు, పాడిపంటలకు ప్రసిద్ధి పొందింది. ఎందరో మహనీయులకు ఇది పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశం ప్రత్యేకత. మన దేశగౌరవాన్ని దశదిశలా చాటడం మన కర్తవ్యం. మన దేశ పౌరుషాన్ని నిలబెట్టడం మన బాధ్యత. ఈ భావాల స్ఫూర్తిని కలిగించడమే ఈ పాఠం ఉద్దేశం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయ' ప్రక్రియకు చెందినది. ఇది మాత్రాఛందస్సులో, రాగయుక్తంగా, పాడుకోవడానికి వీలుగా ఉంటుంది.

ఈ గేయం రాయప్రోలు సుబ్బారావు రచించాడు.

## కవి పరిచయం



13 మార్చి 1892
30 జూన్ 1984

భావకవిత్వానికి పేరెన్నికగన్న రాయప్రోలు సుబ్బారావు గుంటూరుజిల్లా గార్లపాడు గ్రామంలో జన్మించాడు. తృణకంకణం, స్నేహలత, స్వప్నకుమార, కష్టకమల, ఆంధ్రావళి, జడకుచ్చులు, వనమాల మొదలైన కావ్యాలను రచించాడు. రమ్యాలోకం, మాధురీ దర్శనం ఈయన రాసిన లక్షణ గ్రంథాలు. అద్భుత వర్ణనలు, తెలుగుదనం, దేశభక్తి రాయప్రోలు కవిత్వంలో అడుగడుగునా కన్పిస్తాయి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠాన్ని చదువండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.
- అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
- పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**భారతీయ సాంస్కృతిక వైభవం ప్రపంచ దేశాలకు తలమానికం. మన వైదిక వాఙ్మయం, ఉపనిషత్తులు సమాజానికి దివ్యమార్గదర్శనం చేస్తాయి. భారతీయ చారిత్రక గాథలు, సాహితీసంపద, కవిత్వం, నాట్యరీతులు అత్యంత ప్రసిద్ధికెక్కినాయి. భారతీయ చారిత్రక వారసత్వం, మన దేశపు ఘనత ఎంత విశిష్టమైనవో ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం!**

SCERT TELANGANA







# I

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు పారిన భాగ్యసీమయి
వరలినది యీ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా!

వేదశాఖలు వెలిసె నిచ్చట
ఆదికావ్యం బలరె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాదు సుమ్మిది చెల్లెలా!

విపిన బంధుర వృక్షవాటిక
ఉపనిషన్మధు వొలికె నిచ్చట
విపుల తత్త్వము విస్తరించిన
విమలతల మిదె తమ్ముడా!

సూత్రయుగముల శుద్ధవాసన
క్షాత్రయుగముల శౌర్యచండిమ
చిత్రదాస్యముచే చరిత్రల
చెఱిగిపోయెను చెల్లెలా!

మేలికిన్నెర మేళవించీ
రాలు కరగగ రాగమెత్తీ
పాలతీయని భావిభారత
పదము పాడర తమ్ముడా!

## ఆలోచించండి - చెప్పండి

★ కవి భారత భూమిని 'శ్రీలు పొంగిన జీవగడ్డ' అనడంలో ఆంతర్యమేమిటి?
★ భారతదేశం ఎందుకు పుణ్యభూమిగా కీర్తించబడింది?
★ మన దేశం గొప్పతనమేమిటి?

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# II

నవరసమ్ములు నాట్యమాడగ
చివురు పలుకులు చెవుల విందుగ
కవితలల్లిన క్రాంతహృదయుల
గారవింపవె చెల్లెలా!

దేశగర్వము దీప్తిచెందగ
దేశచరితము తేజరిల్లగ
దేశమరసిన ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా!

పాండవేయుల పదును కత్తులు
మండి మెఱసిన మహిత రణకథ
కండగల చిక్కని తెలుంగుల
కలసి పాడవె చెల్లెలా!

లోకమంతకు కాకపెట్టిన
కాకతీయుల కదన పాండితి
చీకిపోవని చేవపదముల
చేర్చి పాడర తమ్ముడా!

తుంగభద్రాభంగములతో
పొంగి నింగిని పొడిచి త్రుళ్ళీ
భంగపడని తెలుంగునాథుల
పాట పాడవె చెల్లెలా!







**ఆలోచించండి - చెప్పండి**

★ చెవులకు విందుచేయడం అంటే మీరు ఏమనుకుంటున్నారు?
★ ఎటువంటి పనులు చేసినవారు ధీరపురుషులుగా కీర్తించబడతారు?
★ భారత వైభవాన్ని ఎందుకు పాడుకోవాలి?

## సారాంశం

కవి మనదేశపు గౌరవాన్ని, గొప్పతనాన్ని చాటిచెప్పేవిధంగా, ప్రతివారూ పాడుకొనేందుకు వీలుగా గేయంలో ఈ కింది విషయాలను చెప్పారు. ఆయన భారతదేశ ప్రజలను తమ్ముడా! చెల్లెలా! అని సంబోధించారు.

మన భారతదేశం సిరులు పొంగిన, జీవమున్న భూమి. ఇది పాడిపంటలుగల భాగ్యదేశం. అట్లాంటి ఈ భారతదేశాన్ని గూర్చి భక్తితో పాడాలి.

వేదాలు, వాటి శాఖలు ఈ దేశంలో వెలిశాయి. ఆదికావ్యమైన రామాయణం ఇక్కడే పుట్టింది. మహాభారత, భాగవతాలను రచించిన వేదవ్యాసుడు మొదలైన ఎందరో మునులనుగన్న పుణ్యభూమి ఇది.

ఈ దేశంలో దట్టమైన చెట్లతో కూడిన విస్తారమైన అరణ్యాలున్నాయి. మధురమైన భావసారంగల ఉపనిషత్తులు ఇక్కడే పుట్టాయి. వివరాలతో కూడిన తత్త్వబోధన విస్తరించిన పవిత్రమైన భూమి ఇది.

ఆపస్తంబ, ఆశ్వలాయనాది సూత్రాలను చెప్పిన కాలంనాటి గొప్పతనం, ప్రచండ పరాక్రమమున్న రాజుల కాలంనాటి, పరాక్రమ చరిత్రలన్నీ పరదేశీయుల కింద బానిసతనం వల్ల అంతరించిపోయాయి.

కిన్నెర వాద్యాన్ని మీటుతూ, రాళ్ళను కూడా కరగించగల రాగంతో, మధురంగా, భావి భారతదేశ భాగ్యాన్ని గురించి పాడుకోవాలి.

నవరసాలతో నిండిన, తేటతెలుగు మాటలతో చెవులకింపుగా కవిత్వాన్ని చెప్పిన ప్రగతిశీల కవులను గౌరవించాలి.

దేశాభిమానం ప్రకాశించేటట్లుగా దేశచరిత్ర విస్తరించేటట్లుగా దేశాన్ని కాపాడిన వీరులను గురించి తెలుసుకొని కీర్తించాలి.

పాండవుల కత్తుల పదునుతో తళతళలాడిన కురుక్షేత్ర యుద్ధాన్ని గురించి చక్కని తెలుగుపదాలతో అందరూ కలసి పాడుకోవాలి.

ప్రపంచాన్నే వేడెక్కించిన కాకతీయరాజుల యుద్ధనైపుణ్యాన్ని కలకాలం నిలిచే మాటలతో మెచ్చుకోవాలి.

తుంగభద్రానది అలలతో పాటుగా పొంగి ఆకాశాన్నంటినా చెక్కుచెదరని ధైర్యంగల తెలుగు రాజుల చరిత్రలను గానంచేయాలి.

SCERT TELANGANA

## ఇవి చేయండి

A8U5S4

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

1. ఈ గేయం దేనిగురించి చెపుతున్నది? ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశాలు ఏమేమున్నాయి?
2. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడండి. సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. ఈ గేయంలో మన భారతదేశం అని తెలిపే పదాలను గుర్తించండి.**

**2. ఈ కింది భావం వచ్చే వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయో చూసి రాయండి.**

అ. మన దేశం వేదాలకు పుట్టినిల్లు

____________________________

ఆ. కాకతీయుల యుద్ధ నైపుణ్యం

____________________________

ఇ. లేత మాటలు చెవుల కింపుగ

____________________________

ఈ. ఉపనిషత్తులు ఇక్కడే పుట్టాయి.

____________________________

ఉ. నవరసాలు నాట్యమాడాయి.

____________________________

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. భారతదేశాన్ని కాపాడిన కొందరు వీరులను గురించి తెలుపండి.

ఆ. 'బానిసతనం' అంటే ఏమిటి?

ఇ. 'భరత ఖండం' భాగ్యసీమ అనటానికి గల కారణాలు తెలుపండి.

ఈ. రాయప్రోలు సుబ్బారావుగారిని మీ మాటల్లో పరిచయం చేయండి?

**2. కింది ప్రశ్నకు పదేసి పంక్తులలో సమాధానం రాయండి.**

భారతదేశం గొప్పతనాన్ని ఎందుకు తెలుసుకోవాలి?

లేదా

'శ్రీలు పొంగిన జీవగడ్డ' గేయం ఆధారంగా భారతదేశ వైభవాన్ని వర్ణించండి.

SCERT TELANGANA

## IV సృజనాత్మకత / ప్రశంస

ఈ గేయాన్ని భారతమాత ఆత్మకథగా రాయండి. (లేదా)

మన దేశం గొప్పతనం గురించిన గేయం గురించి తెల్సుకున్నారు కదా! అట్లాగే మీ ఊరు గొప్పదనం గురించి ఒక గేయం రాయండి.

## V పదజాల వినియోగం

**1. కింది వాక్యాలు చదువండి. గీత గీసిన పదాల అర్థాలు రాయండి.**

అ. ఋషులు, మునులు విపినాలలో తపస్సు చేస్తుంటారు. ( )

ఆ. మనందరం భూతలంమీద నివసిస్తున్నాం. ( )

ఇ. ఉగాది పచ్చడి ఆరు రుచుల మేళవింపు. ( )

ఈ. తేనెటీగలు మధువును ఇస్తాయి. ( )

**2. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సమానార్థాన్నిచ్చే పదాలను గేయంనుంచి తీసి రాయండి.**

అ. అధిక సంపదలు కలిగినవారి కంటే గుణవంతులే గొప్ప.

ఆ. మనదేశం చాలా సంవత్సరాలు బ్రిటిష్‌వారి కింద బానిసతనంలో మగ్గిపోయింది.

ఇ. మంచివారిని, గొప్పవారిని గౌరవించాలి.

ఈ. వేసవికాలం ఎండ వేడిగా ఉంటుంది.

**3. కింది వాక్యాలలో ఒకే అర్థాన్నిచ్చే పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి, రాయండి.**

అ. విపినాలలో క్రూర జంతువులుంటాయి. ఆ అరణ్యాలలోనే మునులు నివసిస్తారు.

ఆ. ఈ ధరణిలో ఎందరో వీరులు జన్మించారు. ఈ నేల మీద పుట్టిన ప్రతివారూ పౌరుషవంతులే.

ఇ. గొప్పవారి సేవలు చిరస్థాయిగా ఉంటాయి. అందుకోసం వారిని ఎల్లప్పుడూ గుర్తించాలి.

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది వాక్యాలను చదువండి. అవి ఏరకమైన వాక్యాలో గుర్తించండి.**

ఉదా॥ ఈ శిల్పం ఎంత అందంగా ఉందో! ( ఆశ్చర్యార్థక వాక్యం )

అ. పనిని త్వరగా పూర్తిచేయాలి. ( )

ఆ. చుట్టాలు ఎప్పుడు వస్తారు. ( )

SCERT TELANGANA

 తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

ఇ. ఈ పుస్తకం వెల ఎంత. (                    )

ఈ. పాఠం అందరూ చదువుకొని రండి. (                    )

ఉ. మీరు నానుండి తెలుసుకోండి. (                    )

❖ కింది వాక్యాలను చూద్దాం.

★ వారు చదువుకోవాలని నేను వేడుకొంటున్నాను.

★ మిమ్ములను నేను ప్రార్థిస్తున్నాను.

★ దయచేసి మీరు రావాలి.

ఈ మూడు వాక్యాల్లో ఒకరిని మరొకరు ప్రార్థిస్తున్నట్లు ఉన్నది. ఇట్లా **ప్రార్థిస్తున్నట్లుగా ఉండే వాక్యం 'ప్రార్థనార్థక వాక్యం'.**

★ నేను ఉన్నత చదువు చదువగలను.

★ నడిచి వెళ్ళగలను.

★ భయం లేకుండా మాట్లాడగలను.

ఈ వాక్యాలు ఒకరి సామర్థ్యాన్ని తెలిపే భావాన్ని కలిగి ఉన్నట్లు కనబడుతున్నాయి. **సామర్థ్యాన్ని తెలియజెప్పే భావం ఉన్న వాక్యం 'సామర్థ్యార్థక వాక్యం'.**

★ అతడు వస్తాడో? రాడో?

★ రేపు వర్షం పడవచ్చు.

★ ఈ రోజు ఎండ కాస్తుందో? లేదో?

ఈ మూడు వాక్యాల్లో పని జరుగుతుందో లేదో అనే సందేహం వ్యక్తం అవుతున్నది.

**పని జరుగుతుందో లేదో అనే 'సందేహం' కలిగేటట్లున్న వాక్యం "సందేహార్థక వాక్యం".**

★ లోపలికి రావచ్చు.

★ కొద్దిసేపు టీవీ చూడవచ్చు.

★ మీరు వెళ్ళవచ్చు.

ఈ వాక్యాలు అనుమతిని ఇస్తున్నట్లుగా ఉన్నాయి. అంటే ఇవి 'అనుమత్యర్థక వాక్యాలు'.

**ఏదైనా ఒక పనిని చేయడానికి అనుమతిని ఇచ్చే అర్థాన్ని సూచించే వాక్యం 'అనుమత్యర్థక వాక్యం'.**

★ ఇతరులను ఎగతాళి చేయవద్దు.

★ నీటిని వృథా చేయవద్దు.

★ ఎక్కువసేపు నిద్రపోవద్దు.

ఈ వాక్యాలు ఆయా పనులను చేయవద్దని చెబుతున్నవి (నిషేధిస్తున్నవి). కనుక ఇవి 'నిషేధార్థక వాక్యాలు'.

**ఒక పనిని చేయవద్దనే (నిషేధించే) అర్థాన్ని సూచించే వాక్యం 'నిషేధార్థక వాక్యం'.**



SCERT TELANGANA

**2. కింది వాక్యాలను చదువండి. అవసరమైనచోట తగిన విరామచిహ్నాలు ఉంచండి. అవి ఏరకమైన వాక్యాలో గుర్తించండి.**

అ. అట్లా అనుకోకండి ( )

ఆ. నేను చెప్పింది విన్నారో లేదో ( )

ఇ. ఈ సంవత్సరం వర్షాలు పడుతాయో లేదో ( )

ఈ. మీరెప్పుడైనా రావచ్చు ( )

ఉ. అనుమతి లేకుండా లోనికి రావద్దు ( )

ఊ. మీరు భోజనానికి వెళ్ళవచ్చు ( )

ఋ. అబ్బ ఎంత వర్షం కురిసింది ( )

ౠ. మనసు పెట్టి వినండి ( )

## ప్రాజెక్టుపని

భారతమాతను స్తుతించే గేయాలను సేకరించండి. నివేదికను రాసి ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

| | |
|---|---|
| ★ ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. గేయంలో చెప్పిన విషయాలను సొంతమాటల్లో చెప్పగలను. | అవును / కాదు |
| ★ గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| ★ భావం ఆధారంగా గేయంలోని పాదాలను గుర్తించగలను. | అవును / కాదు |
| ★ గేయాన్ని భారతమాత ఆత్మకథగా రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

ప్రపంచానికి మార్గదర్శనం చేయగలిగిన సామర్థ్యం
భారతదేశానికి మాత్రమే ఉన్నది

– ఆర్నాల్డ్ టాయిన్‌బీ



SCERT TELANGANA

## చదువండి - తెలుసుకొండి

### గర్వించదగ్గ తెలంగాణాబిడ్డ కెప్టెన్ విజయరఘునందన్‌రావు



పాకిస్తాన్ దురాక్రమణను ఎదుర్కొని మాతృదేశ సంరక్షణకై అసువులు అర్పించిన అమరవీరుడు కెప్టెన్ విజయరఘునందన్‌రావు. రఘునందన్‌రావు జన్మించింది రాజన్న జిల్లా బోనాల గ్రామం. బోనాల కూచగిరిరావు, శ్రీమతి కాంతమ్మ దంపతులకు 5-8-1939న జన్మించాడు. ఆయన బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం సొంత ఊరైన బోనాలలో జరిగింది. అనంతరం ఉన్నత విద్య కోసం హైదరాబాద్ చేరుకున్నాడు. ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో గణితంలో డిస్టింక్షన్‌తో మెట్రిక్యులేషన్ ప్రథమశ్రేణిలో పాసయ్యాడు. నిజాంకాలేజీలో ఇంటర్మీడియట్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి. చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు.

చిన్నప్పటినుండీ రఘునందన్‌రావుకు దేశభక్తి అపారము. దేశసేవ చేయాలని తపించేవాడు. అందుకు తగినట్లుగా ఇంటర్మీడియట్‌లో ఎన్.సి.సి.లో చేరాడు. చక్కని శిక్షణను పొందాడు. అత్యుత్తమ క్యాడెట్‌గా, రైఫిల్‌మెన్‌గా గుర్తింపు పొందాడు.

విద్యార్జన పూర్తికాగానే 1962లో జరిగిన జాయింట్ సర్వీసింగ్ వింగ్ నిర్వహించిన ఎంపిక పరీక్షలో దక్షిణభారతదేశంలోనే ప్రథముడిగా నిలిచాడు. రెండవ లెఫ్టినెంట్‌గా సైన్యం (NEFA) లో నియమింపబడ్డాడు. పర్వతప్రాంతాల్లో, దుర్గమ అరణ్యాల్లో కఠోరమైన శిక్షణ పొందాడు. యుద్ధవ్యూహంలో ఆరితేరాడు. ఆతరువాత నాగాలాండ్‌కు బదిలీమీద వెళ్ళినప్పుడు మిలటరీ ఇంటెలిజెన్స్‌లో (గూఢచారి విభాగం) శిక్షణ పొందాడు. తరువాత 'కెప్టెన్'గా పదోన్నతిని పొందాడు.

ఇది ఇట్లుండగా సెలవుల్లో ఉన్న రఘునందన్‌రావు విశ్రాంతికోసం పూనాలో ఉంటున్నాడు. కొన్నిరోజుల్లోనే భారతప్రభుత్వంనుండి సెలవు రద్దుచేసుకొని విధుల్లో చేరుమని ఆదేశం అందింది. కర్తవ్యపరాయణుడైన రఘునందన్‌రావు వెంటనే శ్రీనగర్ చేరుకున్నాడు.

కాశ్మీర్‌ను ఆక్రమించుకోవడానికి పాకిస్తాన్ యుద్ధం ఆరంభించింది. వారిని తరిమికొట్టడం భారత సైనికుల లక్ష్యం. ఒక సైనికదళానికి రఘునందన్‌రావు నాయకత్వం వహించాడు. తాను సింహంలా ముందుకు దూకుతూ తనవారిని నడిపించాడు. భయంకరంగా యుద్ధం జరిగింది. ఎంతోమంది పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టాడు. కాని శత్రువులు పేల్చిన ఒక తుపాకీగుండు ఈ వీరుని తలలోకి చొచ్చుకొనిపోయింది. భారతమాత ఒడిలోకి వాలిపోతూ కూడా తనపై అధికారికి పరిస్థితులను వివరించి బాధ్యతను మరో ఆఫీసర్‌కు అప్పగించి నేలకొరిగాడు. అది 17 సెప్టెంబర్ 1965. సెప్టెంబర్ 21న సకల లాంఛనాలతో ఆయన దహన సంస్కారాలు జరిగినవి. అటువంటి వీరాగ్రేసరుని స్మృతికి చిహ్నంగా కరీంనగర్‌లో మిషన్ హాస్పటల్‌రోడ్డుకు ఆయన పేరు పెట్టారు. భారతప్రభుత్వం 'వీరచక్ర' అవార్డు ఇచ్చి గౌరవించింది. సిరిసిల్ల-బోనాల గ్రామాలమధ్య "విజయనగరం" పేరుతో ఒక నూతన గ్రామం ఏర్పడింది. ఈయనకు శాశ్వత నివాళులు అర్పించడానికి కరీంనగర్‌లో 'స్ఫూర్తి' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పరచి సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

SCERT TELANGANA

# 12. రాణి శంకరమ్మ

బొమ్మను చూడండి - ఆలోచించండి - మాట్లాడండి



NGANA

## ప్రశ్నలు

1. బొమ్మలో కనిపిస్తున్నదెవరు?
2. ఆమె ఏం చేస్తున్నది? ఎవరితో పోరాడుతున్నది? ఎందుకు పోరాడి ఉండవచ్చు?
3. యుద్ధంలో శౌర్యాన్ని చూపిన స్త్రీలను ఏమంటారు?
4. మీకు తెలిసిన వీరనారీమణుల పేర్లు చెప్పండి.

E2S6Z3


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠం నేపథ్యం

తెలంగాణలో వీరనారీమణులకు కొదువలేదు. అటువంటి నారీమణులలో అందోలు సంస్థానాన్ని పాలించి, శత్రువులను గడగడలాడించిన రాణి శంకరమ్మ ధైర్యసాహసాలు కలిగిన వీరవనిత. ఈమె సంగారెడ్డి సమీపంలోని గౌడిచర్లలో 1702లో పుట్టింది. రాజమ్మ, సంగారెడ్డి దంపతులకు జన్మించిన శంకరమ్మ బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నది. ప్రజల్ని కన్నబిడ్డలుగా పరిపాలించిన రాణి శంకరమ్మ శత్రువుల పాలిట అపరకాళికవలె ధైర్యసాహసాలు ప్రదర్శించింది. చరిత్రలో తనకంటూ చెరగని స్థానం సంపాదించుకున్నది. మెదకు ప్రాంతాన్ని చరితార్థం చేసిన రాణి శంకరమ్మ గూర్చి ఈ పాఠం తెలియజేస్తుంది.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం గేయకథ ప్రక్రియకు చెందినది. కథను గేయరూపంలో చెబితే గేయకథ. లయాత్మకంగా పాడుకోవడానికి వీలుగా ఉంటుంది.

సంగారెడ్డి జిల్లాకు చెందిన కీ॥శే॥ సంపన్ముడుంబై రంగకృష్ణమాచార్యులు రచించిన "మెదక్ జిల్లాంతర్గత అందవోలు శౌర్య వీర్యరెడ్డి త్రయం" (వీరుల గాథలు) పుస్తకం ఆధారంగా రూపొందించిన పాఠ్యాంశమిది.

## విద్యార్థులకు సూచనలు

★ పాఠంలోని బొమ్మలను చూడండి. పాఠం ముందున్న ప్రవేశిక చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీతలు గీయండి.

★ అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.

★ పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టిక చూసి, తెలియని పదాలకు అర్థాలను తెలుసుకొండి.

## ప్రవేశిక

**అవకాశం లభిస్తే మహిళలు ఏ పనినైనా సాధించగలరు. తమ శక్తిసామర్థ్యాలను పదునుపెట్టుకొని, ఆత్మ విశ్వాసంతో ముందడుగువేస్తారు. ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తారు. అటువంటి కోవకు చెందిన మహిళ శంకరమ్మ. ఆమె యుద్ధరంగంలో చూపిన ప్రతిభను, ఆమె జీవిత చరిత్రను ప్రజలు పాటలుగా పాడుకుంటారు. ఇంత కీర్తిపొందిన రాణిశంకరమ్మ చరిత్రను బతుకమ్మ పాట రూపంలో తెలుసుకుందాం.**

SCERT TELANGANA

# I

వీర తెలంగాణా
మన శౌర్య తెలంగాణా
మన ధైర్య తెలంగాణా
మన భాష తెలంగాణా
మన వాణి తెలంగాణా
మన బాణి తెలంగాణా
మన శ్వాస తెలంగాణా
మన ధ్యాస తెలంగాణా

తెలంగాణ అంటేనే ఒక ప్రత్యేక ఉనికి. విశిష్ట సంస్కృతి. ఉద్యమాలకు పుట్టినిల్లు. తెలంగాణలోని ప్రతి గ్రామం ఒక వీరునికో, ఒక కళాకారునికో, ఒక కవికో, ఒక గాయకునికో ఏదో ఒక రంగానికి చెందిన గొప్పవారికో జన్మనిచ్చింది. ఈ విషయంలో నాటి గౌతమీ బాలాశ్రీ మొదలుకొని నేటివరకు అనేక మంది స్త్రీలకు కూడా ప్రసిద్ధస్థానముంది.



రగిలించే పౌరుషాగ్ని తెలంగాణా
కదిలించే హృదయ దీప్తి తెలంగాణా
త్యాగాలకు మారుపేరు తెలంగాణా
వీరులకు పుట్టినిల్లు తెలంగాణా

ఇంత ప్రాధాన్యత సంతరించుకున్న తెలంగాణలో మెతుకుసీమ సిగలో విరిసిన శౌర్య పారిజాతం రాణిశంకరమ్మ. ఈమె నేటి మెదక్‌జిల్లాలోని అందోలును రాజధానిగా చేసుకొని రాజ్యం చేసింది. శత్రువులకు సింహస్వప్నమైంది. ప్రజలకు ఆరాధ్యదేవతైంది. నేటికీ ఈమె గురించిన కథలు పాటలుగా, గాథలుగా చెప్పుకుంటారు పల్లె ప్రజలు. బతుకమ్మ పాటల్లో కూడా ఈమె చరిత్రను పాడుకుంటారు. ఆ చరిత్ర ఎట్లా ఉన్నదో చూద్దాం!

SCERT TELANGANA

శౌర్యశంకారమ్మ ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
శూరశంకారమ్మ ఉయ్యాలో - ధైర్య శంకారమ్మ ఉయ్యాలో
రాయబాగిని గాథ ఉయ్యాలో - కొదుమ సింగపు గాథ ఉయ్యాలో
సుద్దులూ వినరండి ఉయ్యాలో - కొదువ లేకా వినుడు ఉయ్యాలో
పల్లెలో పుట్టింది ఉయ్యాలో - పల్లెలో పెరిగింది ఉయ్యాలో
పల్లెటూర్లో నుండి ఉయ్యాలో - పట్నాని కెదిగింది ఉయ్యాలో
అందాలు సిల్కింది ఉయ్యాలో - అందలా లెక్కింది ఉయ్యాలో
కనగ శంకారమ్మ ఉయ్యాలో - కన్నతల్లీ మనకు ఉయ్యాలో
గౌడి చర్లాలోన ఉయ్యాలో - కాపోళ్ళ గల్లిలో ఉయ్యాలో
పాడిపంటలు గల్ల ఉయ్యాలో - రైతు సంగారెడ్డికీ ఉయ్యాలో
రాజమ్మ తల్లీ ఉయ్యాలో - అపర లచ్మీ వోలె ఉయ్యాలో
అపర రుద్రమ వోలె ఉయ్యాలో - అపరంజి బొమ్మోలె ఉయ్యాలో
అవతరించీనాది ఉయ్యాలో - ఆది శంకారమ్మ ఉయ్యాలో
సుగుణాల పట్టిరా ఉయ్యాలో - గారాల పట్టిరా ఉయ్యాలో
ఆటపాటల్లోన ఉయ్యాలో - మేటిగా నిల్చెరా ఉయ్యాలో
బండరాళ్ళను గూడ ఉయ్యాలో - పిండిగా జేసెనూ ఉయ్యాలో
కండ బలమూ గల్గి ఉయ్యాలో - గుండె బలమూ కల్గి ఉయ్యాలో
సదువు సందెల్లోన ఉయ్యాలో - సక్కగా నుండెరా ఉయ్యాలో
శౌర్య శంకారమ్మ ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
రాయబాగిని కథ ఉయ్యాలో - రమ్యంగా వినరండి ఉయ్యాలో
మగరాయనివోలె ఉయ్యాలో - పంచెనూ కట్టురా ఉయ్యాలో
కఱ్ఱ తిప్పుటలోన ఉయ్యాలో - కత్తి పట్టుట లోన ఉయ్యాలో
నాగల్ని పట్టుట్ల ఉయ్యాలో - బండినీ తోలుట్ల ఉయ్యాలో
ఆరితేరినాది ఉయ్యాలో - అన్ని విద్దెల్లోన ఉయ్యాలో
మీసాలు లేకున్న ఉయ్యాలో - రోసమును సూపురా ఉయ్యాలో
పదుగురూ ఎదురైన ఉయ్యాలో - పడగొట్టి తన్నురా ఉయ్యాలో
ధైర్యలచ్మీ దేవి ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో

ఈవిధంగా ఎదుగుతున్న శంకరమ్మ ఒకసారి గౌడిచర్ల ప్రాంతంలో ఒక చిరుతపులితో కలెబడింది. చిరుత గాండ్రిస్తూ తన పంజా విసురుతున్నా భయపడలేదు. కట్టెతో పులిని కొడ్తూ ధైర్యంగా ఎదుర్కొన్నది. చిరుతపులిని


SCERT TELANGANA

కాళ్ళతో తొక్కింది. దానిని చంపివేసింది. తాను చాలా అలిసిపోయింది. ఐనా అతి కష్టంతో తన తండ్రికి సద్దిగంపను తలపైనెత్తుకొని తీసుకు పోతున్నది. అప్పుడు...

> **ఆలోచించండి - చెప్పండి**
>
> ★ "త్యాగాలకు, వీరత్వానికి మారుపేరు తెలంగాణ" దీన్ని మీరెట్లా సమర్థిస్తారు?
>
> ★ ఏ ఏ గుణాలు కల్గిఉంటే "సుగుణాల పట్టి" అంటారు?

ఒక్క గంపాలోన ఉయ్యాలో
సద్దిమూటను వెట్టి ఉయ్యాలో
పొద్దెక్కి నాదంచు ఉయ్యాలో
చేను కాడికి పోంగ ఉయ్యాలో
పూని నడుచూచుండె ఉయ్యాలో - రాణి శంకారమ్మ ఉయ్యాలో
వేసంగి కాలాన ఉయ్యాలో - ఎండవేడిమి పెరిగె ఉయ్యాలో
అల్లంత దూరాన ఉయ్యాలో - అగుపించె నొక్కడూ ఉయ్యాలో
గుఱ్ఱాన్ని తోలుతూ ఉయ్యాలో - అటు ఇటూ తిరుగుతూ ఉయ్యాలో
ఆకలి దప్పులతో ఉయ్యాలో - అలమటించూచుండె ఉయ్యాలో

## II

శంకారమ్మా చూసి ఉయ్యాలో - చెంతకేగేనాది ఉయ్యాలో
మంచి నీళ్ళందించి ఉయ్యాలో - అంబలిని, సంకటిని ఉయ్యాలో
అతనికీ ఇచ్చిందీ ఉయ్యాలో - ఆకలినీ తీర్చింది ఉయ్యాలో
ఈ రీతి శంకారమ్మ ఉయ్యాలో - సేద తీర్చినాది ఉయ్యాలో
నారసింహారెడ్డి ఉయ్యాలో - సంతోషభరితుడై ఉయ్యాలో
అమ్మ నీ వెవ్వరవు ఉయ్యాలో - అన్నపూర్ణవు నీవు ఉయ్యాలో
అమృతాన్నము నిచ్చి ఉయ్యాలో - ఆకలిని తీర్చితివి ఉయ్యాలో
ఇదిగో తీస్కోమంచు ఉయ్యాలో - ఉంగరము నిచ్చెను ఉయ్యాలో
అప్పుడూ శంకరమ్మ ఉయ్యాలో - ఈ రీతిగా బల్కె ఉయ్యాలో
నువ్వెవరివో గాని ఉయ్యాలో - వేయి దండాలయ్య ఉయ్యాలో
ఉంగరం గింగరం ఉయ్యాలో - నాకేమి వద్దయ్య ఉయ్యాలో
ఈ ఉంగరం జూస్తేను ఉయ్యాలో - మా అయ్య మా అవ్వ ఉయ్యాలో
తప్పు జేసిన వంచు ఉయ్యాలో - కోదండమేతురూ ఉయ్యాలో
అమ్మలక్క లంత ఉయ్యాలో - నిందలూ వేతురూ ఉయ్యాలో
నాకొద్దు నాకొద్దు ఉయ్యాలో - ఈ ఉంగారమ్ము ఉయ్యాలో
అనుచు దిగ్గున లేచి ఉయ్యాలో - లేడోలె పరుగెత్తె ఉయ్యాలో

SCERT TELANGANA

ఇట్లా ఇతరులకు సహాయం చేయడంలో కూడా రాణి శంకరమ్మ ఎప్పుడూ ముందుండేది. ఈ పాటలో ఉన్న నారసింహారెడ్డి అందోలు రాజు. ఆయన శంకరమ్మ చేసిన సహాయాన్ని మరిచిపోకుండేవాడు. ఎప్పుడూ ఆమెను గుర్తుకు తెచ్చుకుంటుండేవాడు. చివరకు సంగారెడ్డి దంపతుల వద్దకు మంత్రులతో పెండ్లి రాయబారాన్ని పంపాడు. సంగారెడ్డి దంపతులు సంతోషంతో శంకరమ్మను నారసింహారెడ్డి కిచ్చి ఘనంగా పెండ్లిచేశారు. శంకరమ్మ నారసింహారెడ్డిని రాజ్యపాలన చక్కగా చేయమని రాజధర్మాన్ని చెప్పింది. అదెట్లా ఉందో చూద్దాం.

పెండ్లి పూర్తైనంక ఉయ్యాలో – రాచకార్యాల్విడిచి ఉయ్యాలో
రాజరికము మరిచె ఉయ్యాలో – నారసింహారెడ్డి ఉయ్యాలో
అదే అదనుగా ఉయ్యాలో – సిద్దిఖీ సోదరులు ఉయ్యాలో
కుట్రలూ పన్నిరీ ఉయ్యాలో – కుతంత్రాలు జేసిరి ఉయ్యాలో
ప్రజలనూ పీడించి ఉయ్యాలో – పన్నులూ లాగిరీ ఉయ్యాలో
ఈ సంగతిని తెల్పిరీ ఉయ్యాలో – రాజు నర్సింహారెడ్డికీ ఉయ్యాలో
ఉలుకు పలుకూ లేని ఉయ్యాలో – పెనిమిటిని చూసి ఉయ్యాలో
శంకరమ్మప్పుడూ ఉయ్యాలో – భయమింత లేకుండ ఉయ్యాలో
రాజు చెంతా జేరి ఉయ్యాలో – ఈ రీతి దెల్పెనూ ఉయ్యాలో
నా మీది ప్రేమతో ఉయ్యాలో – ప్రజలను మరిచినవు ఉయ్యాలో
రాజ్యమంతా జూడు ఉయ్యాలో – రంజిల్లు టాలేదు ఉయ్యాలో
రాజధర్మం గాదు ఉయ్యాలో – ఇది పద్ధతి గాదు ఉయ్యాలో
ప్రజల హితమును గోరి ఉయ్యాలో – కన్న బిడ్డల్లా జూడు ఉయ్యాలో
మొదట రాజ్యం పనులు ఉయ్యాలో – కుదురుగా జేయాలి ఉయ్యాలో
జగమున మెరవాలి ఉయ్యాలో – కీర్తినీ పొందాలి ఉయ్యాలో

ఈవిధంగా తన పెనిమిటికి రాజధర్మం గురించి చెప్పి రాజ్యపాలన చేయించింది. చక్కగా పాలన సాగిస్తున్న నారసింహారెడ్డిని చూసి సహించలేక సిద్దిఖీ సోదరులు విషప్రయోగం చేసి చంపారు. శంకరమ్మ తన భర్త గురించి ఏడ్చి ఏడ్చి కండ్లలో సముద్రం నింపుకొన్నది. ఈమె ఇట్లా బాధలో ఉండగానే శంకరమ్మను నైజాం రాజు మరాఠీల పైకి యుద్ధానికి పంపాడు. అదెట్లాగో వినుండి;

అంతట మరాఠీలు ఉయ్యాలో – పంతాలు గలవారు ఉయ్యాలో
నైజాము రాజుకు ఉయ్యాలో – జాబునూ రాశిరీ ఉయ్యాలో
కప్పంబు గడ్తవా ఉయ్యాలో – కయ్యానికొస్తవా ఉయ్యాలో
మాబలము గొప్పదీ ఉయ్యాలో – రాజీకీ రావయ్య ఉయ్యాలో
అది జూసి నైజాము ఉయ్యాలో – చింతలో పడ్డాడు ఉయ్యాలో
పీష్వాలు వీరులూ ఉయ్యాలో – శూరులూ ధీరులూ ఉయ్యాలో
పోరు నెట్లా జేతు ఉయ్యాలో – వారినెట్లా గెలుతూ ఉయ్యాలో
అనుచు చింతించుతూ ఉయ్యాలో – శంకరమ్మను బిల్చి ఉయ్యాలో

సమరానికీ బంపె ఉయ్యాలో - కయ్యానికీ బంపె ఉయ్యాలో
శంకరమ్మంతటా ఉయ్యాలో - శక్తి రూపము దాల్చెఉయ్యాలో
జుట్టుముడి వేసింది ఉయ్యాలో - కొంగు నడుముకు గట్టి ఉయ్యాలో
ముందుకుచ్చిల్లు దీసి ఉయ్యాలో - ముద్దుగా మలిచింది ఉయ్యాలో
కాశె బోసినాది ఉయ్యాలో - కత్తినే పట్టింది ఉయ్యాలో
కదనాని కెల్లింది ఉయ్యాలో - కాళికా రూపెత్తి ఉయ్యాలో
అశ్వికా దళములూ ఉయ్యాలో - ఆరువేలు రాగ ఉయ్యాలో
కాలిబంటూలంత ఉయ్యాలో - వేవేలు వెనువెంట ఉయ్యాలో
మొండి ధైర్యంతోని ఉయ్యాలో - దండెత్తి పోయింది ఉయ్యాలో
ఎత్తుపై ఎత్తుతో ఉయ్యాలో - కుత్తుకల్దెగ్గోసె ఉయ్యాలో
రక్తమును పారించె ఉయ్యాలో - వీరనారీయయ్యె ఉయ్యాలో
పీష్వాలతోకలను ఉయ్యాలో - కత్తిరించీ వేసె ఉయ్యాలో
విజయ గర్వంతోని ఉయ్యాలో - వెనుదిరిగినాది ఉయ్యాలో

### ఆలోచించండి-చెప్పండి

★ శంకరమ్మ యుద్ధరంగంలో ధైర్యం చూపింది. మరి స్త్రీలు ఏయే సందర్భాలలో ధైర్యం చూపాలో చర్చించండి.

★ శంకరమ్మ చేసిన మంచి పనికి ఉంగరం ఇస్తే తీసుకోలేదు కదా! దీనిని బట్టి మీరేం గ్రహించారు?

★ 'కండ్లలో సముద్రం నింపుకోవడం" అన్న జాతీయాన్ని ఏయే సందర్భాల్లో వాడుతారు?

## III

విజయం తర్వాత నైజాం నవాబు శంకరమ్మకు 'రాయబాగిన్' అనే బిరుదునిచ్చాడు. అందోలు రాజ్యాన్ని శంకరమ్మకు అప్పగించాడు. ఆమెను రాణిగా ప్రకటించాడు. 1764 సం॥ లో అందోలు రాజ్యానికి శంకరమ్మ రాణి అయ్యింది. చక్కగా రాజ్యపాలన జేసింది. రాజ్యాన్ని తన శూరత్వంతో విస్తరించుకున్నది. అనేక విజయాలను సాధించింది. కాని ఆమె మనసు సంతోషంగా ఉండేది కాదు. ఎప్పుడు భర్త గుర్తుకు వచ్చేవాడు. ఈ బాధ నుండి ఉపశమనం పొందడానికి తీర్థయాత్రలకు పోయింది. నడితోవలో శత్రువులు ఆమెపై మత్తుమందు చల్లారు. నిజాం వద్దకు వెళ్ళి శంకరమ్మ చలిజ్వరంతో చనిపోయిందని చెప్పారు. అందోలుకు రాజులయ్యారు. అడవిలో తెలివిలోకి వచ్చిన శంకరమ్మ ...

నెమ్మదిగ లేచింది ఉయ్యాలో - కలయజూసినాది ఉయ్యాలో
తనవారలెవ్వరూ ఉయ్యాలో - కానగారాలేదు ఉయ్యాలో


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

కారండ పడవిరా ఉయ్యాలో - కాటుక చీకటిరా ఉయ్యాలో
కొండా కోనలూ ఉయ్యాలో - గండూ చీమలూ ఉయ్యాలో
పులులూ సింహాలు ఉయ్యాలో - ముంగీస పాములూ ఉయ్యాలో
దట్టమైన పొదలూ ఉయ్యాలో - లోయలూ లొంకలూ ఉయ్యాలో
దారీ తెన్నూ లేక ఉయ్యాలో - ఎండనక వాననక ఉయ్యాలో
రాణి శంకారమ్మ ఉయ్యాలో - కాళ్ళరగ దిరిగెను ఉయ్యాలో
చీకట్లో చిరుదీపం ఉయ్యాలో - కోయవాడగుపించె ఉయ్యాలో
మెడలోని హారాలు ఉయ్యాలో - కానుకగ నిచ్చెను ఉయ్యాలో
దగ్గర గ్రామంకు ఉయ్యాలో - దారిజూపుమనె ఉయ్యాలో
కోయరాజంతట ఉయ్యాలో - కుర్రో కుర్రోయంచు ఉయ్యాలో
హైదరాబాదుకు ఉయ్యాలో - దారిని జూపిండు ఉయ్యాలో

రాణి శంకరమ్మ ధైర్యవంతురాలు కనుకనే అడవిని దాటగలిగింది. నైజాం రాజు దగ్గరికి వచ్చి శత్రువుల కుట్రలను ఛేదించింది. ఆందోలుకు రాణి అయింది. ప్రజలను కన్నబిడ్డలుగా పాలించింది. ప్రజలకు పన్నుల భారం తగ్గించింది. అందరూ ఆమె రాజ్యాన్ని రామరాజ్యం అనేవారు. ఆమె తన తండ్రిపేరిట సంగారెడ్డి, తల్లి పేరిట రాజంపేట పట్టణాల్ని నిర్మించింది. గరుడాద్రి గుట్టపై రంగనాథాలయాన్ని కట్టించింది. ఇట్లా ఉండగా శంకరమ్మకు...

రాచపుండు పుట్టింది ఉయ్యాలో - రంపానపెట్టింది ఉయ్యాలో
ఎన్నిమందులు పెట్టు ఉయ్యాలో - ఇంతైన తగ్గదు ఉయ్యాలో
పెయ్యంత పాకింది ఉయ్యాలో - పానాలు దీసింది ఉయ్యాలో
రాణి శంకారమ్మ ఉయ్యాలో - దేవున్ని చేరింది ఉయ్యాలో

1774 సంవత్సరంలో శంకరమ్మ తుది శ్వాస విడిచింది. అందోలు చరిత్రలో ఆమె కీర్తి సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అందుకే అందోలు ప్రజలు శంకరమ్మను ఈవిధంగా కీర్తించారు.

వీర శంకారమ్మ ఉయ్యాలో - శూరశంకారమ్మ ఉయ్యాలో
అందోలు కీర్తిని ఉయ్యాలో - అజరామరంజేసె ఉయ్యాలో
సూర్యచంద్రులవోలె ఉయ్యాలో - సుక్కై నిలిచింది ఉయ్యాలో
ఆదర్శరాణియై ఉయ్యాలో - నిలిచిపోయినాది ఉయ్యాలో
మారాణి శంకరమ్మ ఉయ్యాలో - మారాణి మాతల్లి ఉయ్యాలో
విన్నవారికి ఉయ్యాలో - విష్ణులోకాలు ఉయ్యాలో
చెప్పినవారికి ఉయ్యాలో - కలుగు గోసంపదలు ఉయ్యాలో
మంగళం మంగళం ఉయ్యాలో రాణీ శంకరమ్మ ఉయ్యాలో

**ఆలోచించండి-చెప్పండి**

★ "చీకట్లో చిరుదీపం" అనడంలో ఆంతర్యమేమిటి?
★ ప్రజలను కన్నబిడ్డలుగా పాలించడం అంటే మీకేమర్థమైంది?
★ రాణి శంకరమ్మ కథ ద్వారా మీకేమర్థమైంది?


SCERT TELANGANA

## ఇవి చేయండి

T8Q7R8

## I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

రాణి శంకరమ్మ కథలో మీకు నచ్చిన / ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఏది? దాని గురించి మాట్లాడండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

**1. పాఠం చదువండి. రాణి శంకరమ్మ పరాక్రమాన్ని తెలిపే పదాలను గుర్తించండి?**

ఉదా : బండరాళ్ళను పిండిగా జేయడం.

**2. కింది గద్యాన్ని చదువండి. కింద ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబును ఎన్నుకొని కుండలీకరణంలో రాయండి.**

స్త్రీని మాతృదేవతగా భావించి, పూజించి, ఆరాధించేవారు భారతీయులు. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అన్నది ఆర్యోక్తి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఒక తరం నుండి మరోతరానికి వారసత్వంగా అందిస్తూ ఉంటారు మహిళలు. సభ్యత, సంస్కారాల రూపంలో జాతి జీవన శక్తిని మరింత వేళ్ళూనుకునేటట్లు చేసింది భారతీయ మహిళే. ఇటు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, అటు సమాజ ఉన్నతికై పరిశ్రమిస్తూ తమవంతు పాత్రను పరిపూర్ణం చేసుకుంటూ, అవసరమైనప్పుడు సంస్కృతి రక్షణకై పూనుకుంటారు. అవసరమైతే మహిళలు మాతృభూమి రక్షణకోసం ప్రాణత్యాగాలు చేస్తుంటారు.

1) స్త్రీలను - భారతీయులు ఎట్లా పూజిస్తారు? ( )
క) మాతృదేవతగా గ) పితృదేవతగా చ) అతిథి దేవతగా

2) మహిళలు ఒక తరం నుండి మరో తరానికి దేనిని అందిస్తూ ఉంటారు? ( )
క) భారతీయ ఆర్థిక వ్యవస్థను గ) భారతీయ సంస్కృతిని చ) భారతీయ వ్యవహారాలను

3) జాతి జీవనశక్తి దేనివలన వేళ్ళూనుకొని ఉంటుంది? ( )
క) సభ్యత, సంస్కారాలు గ) కుళ్ళు కుతంత్రాలు చ) ఎత్తుకు పై ఎత్తులు

4) వేటి ఉన్నతికై స్త్రీలు పరిశ్రమిస్తారు? ( )
క) సిరిసంపదలు గ) కుటుంబం-సమాజం చ) తమకోసం తాము

5) దేనికోసం ప్రాణత్యాగం చేయవచ్చు? ( )
క) సంపదలకై గ) ఆచారాలకై చ) మాతృభూమి రక్షణకై


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

## III స్వీయరచన

**1. కింది ప్రశ్నలకు అయిదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. శంకరమ్మ ధైర్యంగా పులితో పోరాడిన సంఘటనను వర్ణించండి.

ఆ. మీరు తప్పిపోతే ధైర్యంగా ఏవిధంగా ఇంటికి చేరుకుంటారో రాయండి.

ఇ. రాణి శంకరమ్మ మంచి పాలనాదక్షురాలు అనడానికి ఉదాహరణలు రాయండి.

ఈ. రాణి శంకరమ్మ గొప్పతనం గురించి నేటికీ పాటల రూపంలో పాడుకోవడానికి కారణాలు ఏమిటో రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

రాణి శంకరమ్మ పరాక్రమాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV సృజనాత్మకత / ప్రశంస

రాణి శంకరమ్మ చరిత్రను ఏకపాత్రాభినయం చేయడానికి వీలుగా తగిన అంశాలతో రచన చేయండి. ప్రదర్శించండి.

## V పదజాల వినియోగం

**1. గీత గీసిన పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు రాయండి.**

అ) నిర్మల్ కొయ్య బొమ్మల తయారీకి ప్రసిద్ధి.

ఆ) బాగా చదువుకొని స్వప్నం నెరవేర్చుకోవాలి.

ఇ) మహాభారత సమరంలో ధర్మం గెలిచింది.

ఈ) అపాయకర సంఘటనలు ఎదురైనపుడు శౌర్యం చూపాలి.

ఉ) సూర్యుని దీప్తి లేకపోతే లోకమంతా చీకటిమయం.

**2. కింది పదాలను వివరించండి.**

అ) సాహితీ జ్యోతులు

ఆ) శౌర్యచంద్రికలు

ఇ) అపరంజి బొమ్మ

ఈ) అజరామరం



SCERT TELANGANA

## VI భాషను గురించి తెలుసుకుందాం

**1. కింది పదాలను విడదీయండి. సంధిని గుర్తించి సంధిపేరు రాయండి.**

అ) రంగనాథాలయం :

ఆ) అమృతాన్నం :

ఇ) అజరామరం :

ఈ) కవీంద్రుడు :

**2. ఈ కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసాల పేర్లు రాయండి.**

అ) చదువుసంధ్యలు :

ఆ) పాముముంగిసలు :

ఇ) ఎండావానలు :

ఈ) కొండాకోనలు :

ఉ) మంత్రతంత్రాలు :

ఊ) తల్లిదండ్రులు :

ఋ) రామకృష్ణులు :

ౠ) కూరగాయలు :

### ద్విగు సమాసం

❖ **ఈ పదాలను పరిశీలించండి**

నవరసాలు చతుర్వేదములు షట్చ్రక్రవర్తులు

పంచపాండవులు దశదిశలు

ఈ పదాలలో మొదటి (పూర్వ) పదం సంఖ్యా వాచకంగా ఉండి, రెండవపదం (పర) నామవాచకంగా ఉంది. వీటికి విగ్రహవాక్యాలు ఇట్లా ఉంటాయి.

| | | |
|---|---|---|
| నవరసాలు | – | తొమ్మిది సంఖ్యగల రసాలు |
| చతుర్వేదములు | – | నాలుగు సంఖ్యగల వేదములు |
| షట్చ్రక్రవర్తులు | – | ఆరు సంఖ్యగల చక్రవర్తులు |
| పంచపాండవులు | – | ఐదు సంఖ్యగల పాండవులు |
| దశదిశలు | – | పది సంఖ్యగల దిక్కులు |
| ఎనిమిది బొమ్మలు | – | ఎనిమిది సంఖ్యగల బొమ్మలు |

మొదటి (పూర్వ) పదం సంఖ్య అయితే తర్వాత (పర)పదం ఆ సంఖ్యను సూచించే నామవాచకం అయి ఉంటుంది.

**పూర్వపదం సంఖ్యావాచకమైతే అది 'ద్విగు సమాసం'.**



SCERT TELANGANA

**3. కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి సమాసాల పేర్లు రాయండి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వంద సంవత్సరాలు | వంద సంఖ్యగల సంవత్సరాలు | ద్విగు సమాసం. |
| అ. | ముక్కుచెవులు | ........................ | ........................ |
| ఆ. | ఏడేండ్లు | ........................ | ........................ |
| ఇ. | ఆరువేలగుణ్ణాలు | ........................ | ........................ |
| ఈ. | శౌర్యధైర్యాలు | ........................ | ........................ |

## ప్రాజెక్టుపని

మీ ప్రాంతంలో బతుకమ్మ పాటలుగా పాడుకునే వీరగాథలను సేకరించండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

## నేనివి చేయగలనా ?

- ★ రాణిశంకరమ్మ బతుకమ్మ పాటను రాగయుక్తంగా పాడగలను. అవును / కాదు
- ★ అపరిచిత గద్యాన్ని చదివి అర్థం చేసుకోగలను. అవును / కాదు
- ★ రాణిశంకరమ్మ పాఠ్యాంశాన్ని సొంత మాటలలో రాయగలను. అవును / కాదు
- ★ రాణి శంకరమ్మ కథను ఏకపాత్రాభినయ రచనగా రాయగలను, ప్రదర్శించగలను. అవును / కాదు

## సూక్తి

ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో,
అక్కడ దేవతలు ఆనందంగా ఉంటారు.

SCERT TELANGANA


ఉపవాచకం



సెలవులు వచ్చాయంటే పిల్లలందరికి ఎంతో సంబరం!
అమ్మమ్మ తాతయ్యల దగ్గరకో...
మరో చుట్టాల దగ్గరకో వెళ్ళాలని తాపత్రయం...
సెలవులను హాయిగా గడపాలని అనుకుంటారందరూ...
సెలవుల్ని అందరికీ ఉపయోగపడేలా గడపాలని కొందరే అనుకుంటారు...
అలాంటి కొందరు పిల్లలు తమ సెలవుల్లో ఎవరికి ఎట్లా సాయపడ్డారో
పాఠంద్వారా తెలుసుకుందాం!

# 1. అద్భుతమైన సెలవులు

అవి శీతకాలపు సెలవురోజులు. సుశీల్, సునీత, సాగర్‌లకు చాలా విసుగ్గా ఉన్నది. ఇంట్లోనే ఉంటూ కలసి ఆడుకోవటం తప్ప వేరే పనే లేదు. ఏ మాత్రం సాహసోపేతంగా గానీ, ఉత్సాహంగా గానీ లేని పని అది. వాళ్ళ స్నేహితులు చాలామంది వాళ్ళ అమ్మానాన్నలతో బంధువుల ఊళ్ళకు వెళ్ళారు. ఈసారి వీళ్ళ నాన్నకు చాల పని ఉండడంవల్ల ఇదివరకటివలె కొత్త ప్రదేశాలు చూడడానికి వెళ్ళలేకపోయారు.



మెత్తలతో కొట్టుకుంటూ, ఇంట్లో పరుగులు పెడుతూ ఉంటే, వాళ్ళ పిన్ని సావిత్రి, "ఏమిటిది? వెళ్ళండి. పనికి అడ్డురాకండి," అన్నది.

"అబ్బా ఇంకేం చేయాలె మేము?"

వాళ్ళ విసుగును లెక్కపెట్టకుండా, "ఈ మెత్త తొడుగులూ, కుషన్లూ, పాడుచేయకండి, మీలాంటి పిల్లలు ఆడవలసిన ఆట కాదిది," అని గట్టిగా చెప్పింది సావిత్రి పిన్ని.


విసుగ్గా, గట్టిగా "మరి మేమేం చెయ్యాలె?" అన్నాడు సుశీల్.

"బయటికెళ్ళి ఆడుకో గూడదా?" అంటూ ఆమె సలహా ఇచ్చింది.

"మూడు రోజులుగా అదే కదా చేస్తున్నాం. నాకు చాలా విసుగ్గా ఉన్నది.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



కొత్తగా, ఉత్సాహంగా లేనే లేదు," అన్నడు సాగర్.

"ఏం చేయడానికీ తోచకపోతే వంటింట్లో నాకు సాయం చేయండి. కొత్త వంటకాలు తయారుచేద్దాం," అన్నది సావిత్రి పిన్ని.

"ఈ ఆలోచన మాకేం నచ్చలేదు," సుశీల్, సాగర్ కలిసి అన్నారొకేసారి. "పద, బయటికివెళ్ళి ఆడుకుందాం," అనుకుంటూ ఇద్దరూ బయల్దేరారు.

వాళ్ళ వెనకే సునీత వెళ్తుంటే, "నా చిన్ని సునీతా! నువ్విక్కడే ఉండి నాకు సాయం చెయ్యాలె" అన్నది సావిత్రి పిన్ని.

"సారీ, పిన్నీ," అంటూ, సునీత బయటికి పరుగులుపెట్టింది. లేకుంటె ఆమె బలవంతంమీద ఈ పూట వంటింటి పనులన్నీ తనొక్కతే చేయాల్సి వస్తదేమోనని భయంవేసింది సునీతకు.

పిల్లలందరూ ఇంట్లోంచి బయటికి వచ్చి లాన్‌లో గడ్డిని కోస్తున్న తోటమాలి దగ్గరికి వెళ్ళారు. అతను "ఏమిటి సుశీల్ బాబూ! తోటపనిలో మెలకువలు నేర్చుకుంటావా?" అని అడిగాడు సుశీల్‌ని.

"అది కాదు తాతా," బాధగా అన్నాడు సుశీల్. "మాకందరికి సెలవులిప్పుడు. ఏం చేయాల్నో ఎవరికీ తోస్తలేదు."

"చక్కటి పూలు తెంపి మంచి పూలగుత్తి చేసి మీ అమ్మకు ఇయ్యండి. ఆమె తప్పకుండ సంతోషిస్తుంది."

"ప్చ్... ఇంకేం చేద్దాం? కొన్ని పూలు కోసి చక్కటి పూలగుత్తి తయారుచేద్దాం పదండి," అన్నాడు సుశీల్.

గులాబిపూలు చాలా బాగున్నవి. చామంతి పువ్వులు తాజాగా, అందంగా ఉన్నాయి. తోట వందలకొద్ది పూలతో కళకళలాడుతూ ఉన్నది. వాటిలో వేటిని తెంపాలో, మొగ్గలుగా ఉన్న కారణంగా వేటిని తెంపగూడదో తోటమాలి తాతయ్య చెప్పాడు. చక్కటి పూలగుత్తి తయారైంది. "దీన్ని చూసి సంతోషించేవాళ్ళుండే చోటికి తీసుకుపోయి ఇద్దాం! సరేనా?" అన్నాడు సాగర్.


"ఎక్కడికి?" సుశీల్ అడిగాడు.

"ముసలివాళ్ళంతా ఉండే వృద్ధాశ్రమం గుర్తుందా నీకు? ఒంటరిగా, చేసేందుకేమీ లేకుండా ఉంటరు పాపం. వాళ్ళు దీన్ని తప్పకుండా ఇష్టపడుతారు. నాకు తెలుసు"

సుశీల్‌కు, సునీతకు కూడా ఈ ఆలోచన నచ్చింది. "మనకు ఉత్సాహంగా లేకపోయినా, కనీసం అది లేనివాళ్ళకు, ఉత్సాహాన్ని ఇచ్చేందుకు ఇలాంటి పనులు చెయ్యాలె," అన్నారిద్దరు.

"ఐతే, ఒకటి సరిపోదేమో, మరికొన్ని పూలు తెంపి ఇంకొన్ని పూలగుత్తులు చేస్తే బాగుంటుంది కదా!" అనుకొని ముగ్గురూ కలిసి మరికొన్ని పూలగుత్తులు తయారుచేసుకొని, పది నిమిషాల నడక దూరంలో ఉన్న వృద్ధాశ్రమానికి వెళ్ళారు.

ఆశ్రమంలో ఉన్న వృద్ధుల గురించి చిన్నపిల్లలు తీసుకుంటున్న శ్రద్ధకు వాళ్ళ ముఖాల్లో సంతోషం కనిపించింది. పిల్లలకు వాళ్ళందరు కృతజ్ఞతలు చెప్పారు. వీళ్ళు ముగ్గురూ అక్కడే వాళ్ళతో పాటు కూర్చుని ముచ్చట్లాడారు. వాళ్ళలో కొంతమంది మాట్లాడకుండ కూర్చుని ఉన్నారు. మరికొంతమంది తమ బాధను దాచుకునేందుకు వాళ్ళతో మాట్లాడుతూ, పిల్లలెక్కడుంటున్నారో, ఎక్కడ చదువుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. చివరికి ఆశ్రమంలో భోజనానికి ఉండిపొమ్మని వాళ్ళు పిల్లలను బలవంతపెట్టారు. కానీ, సుశీల్ వినయంగా, "ఇంట్లో మా అమ్మ మాకోసం ఎదురు చూస్తుంటుంది" అని చెప్పాడు.




రెండు రోజుల తరువాత పిల్లలు మరికొన్ని పూలు పట్టుకొని అక్కడికి వెళ్ళారు. మళ్ళీ వాళ్ళతో ముచ్చట్లు. 'పొద్దంతా ఏం చేస్తూ ఉంటా'రని వాళ్ళను సుశీల్ అడిగాడు, మాటలమధ్య. "ఏముంది? కొద్దిసేపు కూర్చుంటాం. కొద్ది సేపు దైవప్రార్థన చేసుకుంటాం. కొద్దిసేపు మాట్లాడుకుంటాం. భోంచేస్తాం. పండుకుంటాం.

ఈ వయసులో ఇంతకంటె ఏం చేయగలం?" అన్నారు వాళ్ళలో ఒకరు.

"అంటే కాలక్షేపానికి ఇక్కడేం లేదన్నమాట. కనీసం టీవీ కూడా?" సాగర్ ఆశ్చర్యంతో అడిగాడు.

ఒక పెద్దాయన దగ్గుకుంటూ అన్నాడు "ఇదివరకొక బ్లాక్ అండ్ వైట్ టీవీ ఉండేది. అది చెడిపోయి మరమ్మతుకు పోయింది. మళ్ళీ వెనక్కి రాలేదు. వార్తాపత్రికలు, వారపత్రికలు వస్తుంటాయి. అప్పుడప్పుడు అవి చదువుకుంటాం."

పిల్లలకు చాలా బాధ కలిగింది. సిగ్గువేసింది కూడా. తమకైతే అన్నీ ఉన్నాయి. అయినా ఎప్పుడూ ఏదో ఒకదానికీ గొడవే. ఇంటికి పోయిన తరువాత వృద్ధాశ్రమాన్ని గురించి, అక్కడుండేవాళ్ళను గురించి, కాలక్షేపం కోసం వాళ్ళకేమీ లేకపోవటం గురించి చర్చ జరిగింది.

"వాళ్ళకోసం ఒక టీవీ కానీ, రేడియో కానీ కొని ఇస్తే బాగుంటుంది," అన్నాడు సాగర్. "మనం దాచుకున్న పైసలన్నీ పెట్టినా, అలాంటిది ఏదీ కొనలేం" అన్నది సునీత.

"మనం చేయగలిగినదంతా మన పైసలతో ఓ సినిమాకో, మరోదానికో కొన్ని టికెట్లు కొనివ్వగలం అంతే!"

"సినిమా... టికెట్స్..." సుశీల్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక్కసారి గట్టిగా "అంతే!" అంటూ అరిచాడు.

సునీత, సాగర్ ఒక్కసారే అడిగారు "ఏమనుకుంటున్నావ్ మనసులో నువ్వు?" అని. సుశీల్ మెరిసే కళ్ళతో అన్నాడు "మీకు తెలుసుగా! మన స్కూలు నాటకాల్లో నటించిన అనుభవం మన ముగ్గురికీ బాగా ఉన్నది. మనం వాళ్ళకోసం ఉచితంగా ఓ ప్రదర్శన ఇస్తే కనీసం వాళ్ళను ఆనందపరచి నట్లవుతుందిగా?"

సాగర్ సరేనన్నాడు. కానీ సునీతకు ఈ ఆలోచన నచ్చలే. "కేవలం ముగ్గురితోటి ప్రదర్శన ఏమంత బాగుండదు. తప్పనిసరిగ యింకా కొంతమంది కావాలి, ఇదంతా మనవల్ల అవుతుందా అని?"

"తోటమాలి తాతయ్య, సావిత్రి పిన్ని స్టేజీకి వెనక మనకు తప్పకుండా సాయంచేస్తారు. నాకు తెలుసు!" అన్నాడు సాగర్. "స్కూల్లో నితిన్ అని నాకో స్నేహితుడున్నాడు. మీకు గుర్తుంది కదా. నితిన్ ఈ నాటకంలో పాల్గొంటాడు. ఇంక కొంతమందిని తీసుకొని వస్తాడు కదా."

సునీత ఒప్పుకొంటూ ఇట్లా అన్నది. "మనం దీన్నొక ఛారిటీ షో లాగ చేస్తే బాగుంటుంది. కొన్ని టికెట్లు ఇరుగుపొరుగువాళ్ళకు అమ్ముదాం. ఇట్లా మనం జమచేసే డబ్బుతో కనీసం రేడియోసెట్టయినా కొని ఇవ్వవచ్చుగా!"

అంతే, వెంటనే సాగర్ నితిన్ ఇంటికి వెళ్ళాడు. మరో రెండు గంటలకల్లా సాగర్ నవ్వుతూ, తుళ్ళుతూ గర్వంగా ఇంటికొచ్చి నితిన్ సాయంత్రమే తన పిన్ని ఇద్దరు కూతుళ్ళతో పాటు వాళ్ళింటికొస్తున్నాడని ప్రకటించాడు.

ఇంక చేయవలసింది చాలాఉన్నది. "మరి టికెట్లెక్కడ ప్రింట్ చేయిద్దాం?" సునీత అడిగింది.

"ప్రింట్ చేయవలసిన పని లేదు. మనకు తెలిసినవాళ్ళను, ఇరుగుపొరుగువాళ్ళను, ప్రదర్శనకు రమ్మందాం. తమకు తోచిన విరాళం ఇమ్మని అడుగుదాం. అంతే!" సుశీల్ విడమరిచి చెప్పాడు.


"మరి ప్రదర్శనకు చోటు ఎక్కడున్నది? "

"వృద్ధాశ్రమం ఉన్నది పెద్ద ఆవరణలో కదా! దాని పక్కనే ఆటస్థలమున్నది, అక్కడ."

ఈ ఆలోచన అందరికీ నచ్చింది. సాయంత్రం నితిన్, తన చెల్లెళ్ళు తమన్నా, వీణలతో కలిసి రాగానె, ఏ నాటకం వేయాలని చర్చించుకోవడం మొదలుపెట్టారు. నితిన్ తెచ్చిన పుస్తకాల్లో నుండి వెతికి 'గుశ్వం' అన్న



SCERT TELANGANA




హాస్యనాటకాన్ని ఎంపిక చేసుకున్నారు.

సుశీల్ ఆరోజు రాత్రీ, మరుసటి రోజు పగలంతా కదలకుండా కూర్చుని నాటకానికి సంభాషణలు రాశాడు. మిగతావాళ్లు ఇంటింటికీ వెళ్ళి వాళ్ళను ఆహ్వానించి విరాళాలు సేకరించారు. అట్లా వాళ్ళంతా కొంత మొత్తం పోగుచేయగలిగారు.

మూడో రోజున నాటక ప్రదర్శనకు రిహార్సళ్ళు మొదలయినవి. స్కూల్లో నాటకాలు వేయటంలో మంచి అనుభవమున్న నితిన్ ఈ నాటకానికి దర్శకత్వం వహించాడు. ప్రదర్శనకు ముందు వారం రోజులు ఎట్లా గడిచి పోయాయో వాళ్లకే తెలియలేదు. ప్రతి రోజూ కనీసం మూడు గంటలు రిహార్సళ్ళు చేసేవాళ్ళు. తక్కిన రోజంతా స్టేజి ఎట్లా ఉండాలి, దుస్తులెట్లా ఉండాలి, ఇరుగుపొరుగువాళ్ళనెట్లా ఆహ్వానించాలి. ఇట్లాంటి విషయాలను గురించిన చర్చలే.

చివరికి ప్రదర్శన రోజు రానే వచ్చింది. అంతకు ముందురోజే వృద్ధాశ్రమం నిర్వహించే మేనేజరు దగ్గరి నుంచి అనుమతి తీసుకొనేటందుకు పోయారు. ఆయన ఎంతో ఆనందంగా అంగీకరించాడు. అక్కడి వృద్ధులకు ఆశ్చర్యం కలిగేలా ఒక్కరోజు ముందు మాత్రమే వాళ్ళకోసం తాము వేస్తున్న నాటకాన్ని గురించి చెప్పారు. ప్రదర్శన రోజున పొద్దుటినుంచే పిల్లలు తమకోసం వేస్తున్న నాటకంకోసం ఆ ఆశ్రమంలోనివాళ్ళంతా ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

కర్రలు, కర్టెన్‌లతో వరండాలో స్టేజీ తయారు చేసుకున్న తరవాత ఎదురుగా ఉన్న ఆటస్థలంలో ప్రేక్షకుల కోసం బల్లలు, కుర్చీలు వంటివి వేయటం జరిగింది. వందమంది కూర్చునేందుకు వీలుగా ఆశ్రమంలోనుండి కొన్ని, ఇరుగుపొరుగు ఇళ్ళలోనుండి కొన్ని, తమ ఇళ్ళనుండి కొన్ని కుర్చీలు సేకరించి తెచ్చారు.

ప్రదర్శన బ్రహ్మాండంగా జరిగింది. పిల్లలు అద్భుతంగా నటించారని అందరూ అభినందించారు. నాటకంలోని హాస్య సన్నివేశాల్లో అందరూ విరగబడి నవ్వుతూ ఆనందించారు.

నాటక ప్రదర్శన తర్వాత తాము 800 రూపాయలు విరాళాల ద్వారా సేకరించామని, దానికి తాము పొదుపుచేసి దాచుకున్న డబ్బులు కలిపి రేడియోతో పాటు ఒక టేప్‌రికార్డర్ కూడా వృద్ధాశ్రమానికి కొని ఇవ్వగలుగుతున్నామని సుశీల్ ప్రకటించాడు. ఈ సెలవులను ఇట్లా పెద్దవాళ్ళ ఆనందంకోసం వినియోగించిన పిల్లలను చూసి వృద్ధులంతా చాలా ఆనందించారు. అందరినీ దీవించారు.

*- మూలం : నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా*

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

ఉపవాచకం



ఆమె...

అబలలు సబలలు అని నిరూపించింది!

వనితలు వీరవనితలుగా నిలబడతారని ఋజువు చేసింది!

కార్యాలోచనలో తనకంటూ ప్రత్యేకతను సంతరించుకుంది!

రణరంగంలో కత్తిపట్టి యుద్ధంచేసి...

విజయదుందుభి మ్రోగించింది!

వీరనారిగా... ధైర్యసాహసాలు ప్రదర్శించి ... రాణి రుద్రమగా నిలిచిన చారిత్రక ధ్రువతారగూర్చి చదువుకుందాం!


మార్గదర్శకంగా తీసుకుందాం!

# 2. రుద్రమదేవి

తెలంగాణను పాలించిన రాజవంశాలలో కాకతీయులు చిరస్మరణీయులు. కాకతి వంశ మూలపురుషుడు వెన్నరాజు. కాకతీయులలో ప్రసిద్ధి చెందిన మొదటి రాజు ఇతడు. ఆ వంశంవాడైన మహాదేవరాజు కుమారుడు గణపతిదేవుడు క్రీ.శ. 1198 నుండి 1262 వరకు సుదీర్ఘకాలం పాలించాడు. ఇతనికి పుత్రసంతానం లేనందున కూతురైన రుద్రమదేవి క్రీ.శ. 1262 నుండి 1289 వరకు పాలించింది. అట్లా దక్షిణభారతదేశంలో మొదటిమహిళా చక్రవర్తిగా రుద్రమదేవిపేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. రుద్రమకు పుత్రసంతానం లేనందున ఆమె కూతురు ముమ్మడమ్మ కొడుకు ప్రతాపరుద్రుడు క్రీ.శ. 1289 నుండి 1323 వరకు పాలించాడు. ఇతని కాలంలోనే ఓరుగల్లు పతనమయింది.

గణపతిదేవ చక్రవర్తి, సోమాంబ దంపతులకు రుద్రమదేవి క్రీ.శ. 1220 సంవత్సరంలో జన్మించింది. గణపతిదేవుడు పుత్రసంతానం కొరకు నారమ్మ, పేరమ్మలను కూడా పెండ్లిచేసుకున్నాడు. కాని మగ సంతానం కలుగనందున రుద్రమనే పురుష సంతానంగా పెంచుకున్నాడు. ఆ క్రమంలోనే యుద్ధవిద్యలను నేర్పించాడు. యుద్ధవిద్యలను నేర్చుకున్నప్పుడు శిక్షణస్థలాన్ని యుద్ధరంగంగా భావించుకుని వ్యూహాలు, ప్రతివ్యూహాలను అమలుచేసేది రుద్రమ. యుద్ధవిద్యలతో పాటు రాజనీతి, న్యాయ, రాజ్యపాలన, అర్థశాస్త్రాల్లో సుశిక్షితురాలయింది. శివదేవయ్య శిక్షణలో ఆరితేరి ధీరవనిత అయింది. మేనమామ జాయపసేనాని నాట్యశాస్త్రాన్ని, కొంకణభట్టు సంగీత సాహిత్యాలతోపాటు వివిధ కళలలో శిక్షణనిచ్చాడు. ఫలితంగా రుద్రమదేవి సర్వశక్తిమంతురాలుగా ఎదిగింది. గణపతిదేవుని కొలువు కూటంలో పురుషవేషంలో కూర్చొని రాజ్యపాలనలో మెళకువల్ని గ్రహించింది. పరాయిరాజుల వ్యవహారాలపై ఎట్లా దృష్టి పెట్టాల్నో చూసి నేర్చుకున్నది. శక్తి యుక్తులతో పురుషులతో సమానమైన ప్రతిభను సాధించింది. గణపతిదేవుడు ఈమెను వీరభద్రునికిచ్చి వివాహం చేయాలనుకున్నాడు. ఆలోచన వచ్చిన

వెంటనే భద్రకాళి, ఏకవీర, కాకతమ్మ దేవతల సాక్షిగా, అంగరంగ వైభవంగా స్వయం భూదేవాలయ సువిశాల ప్రాంగణంలో రుద్రమదేవి - వీరభద్రుల వివాహం జరిగింది.



రుద్రమదేవి వీరభద్రులకు - ముమ్మడాంబ, వీరరుద్రమ, రుయ్యమ్మ అనే పుత్రికలు పుట్టారు. మగసంతానం లేనందున గణపతిదేవుడు కొంచెం కలత చెందాడు. ఇటు గణపతిదేవుణ్ణి వృద్ధాప్యం వెంటాడుతుంటే అటు దుర్వ్యసనాలకులోనై అనారోగ్యానికి గురైన రుద్రమదేవి భర్త చాళుక్య వీరభద్ర భూపతి మరణించాడు. ఈ సంఘటన రుద్రమకు అశనిపాతం వంటిది. కానీ ఆమె చెక్కుచెదరలేదు. మేనమామ జాయపసేనాని వెంటరాగా భర్త కర్మకాండ విధియుక్తంగా నిర్వహించింది. తండ్రికి తలకొరివి పెట్టడానికి కూతురుకు కూడా హక్కు ఉందని, కాదన్న అందరినీ నిలదీసి ముమ్మడాంబతో చితికి నిప్పుపెట్టించిన ధైర్యశాలి రుద్రమ. ఆమె వాగ్ధాటిముందు ఛాందస రాజబంధు బృందం ఎవరూ నోరెత్తలేదు.

ఇన్ని పరిణామాలు జరిగినా రుద్రమదేవి యువరాజుగా తన పనులు తాను నిర్వహిస్తూనే ఉన్నది. పురుషవేషంలో తిరుగుతూ ప్రజల మంచిచెడ్డలు చూస్తూ ఉన్నది. అట్లాంటి సందర్భంలో ఓరుగల్లు వీధిలో ఒక వింత గొడవ ఆమెకు కనిపించింది. సంగతి భటులద్వారా తెలుసుకొని స్వయంగా తానే అక్కడికి వెళ్ళింది.

అది భార్యాభర్తల మధ్య గొడవ. వీధి నాటకాలతో కడుపునింపుకొనేవారు. నాటకంలో స్త్రీపాత్ర తన భార్య పోషించవలసిన అవసరం లేదంటాడు భర్త. తానే ఆ వేషం కడతాననీ, మరే మగవాడు ఆ వేషం కట్టడానికి వీల్లేదన్నది భార్య. అలా చేస్తే నేనింకెవ్వరినో తెచ్చుకొని కట్టుకొంటానంటాడు భర్త. నేనింకెవడినో కట్టుకొని వీధి నాటకాలాడతానన్నది భార్య.

ఇట్లాంటి కొట్లాట మధ్యకు అనుకోకుండా వచ్చింది రుద్రమదేవి. యువరాజును చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వాతావరణం నిశ్శబ్దంగా మారింది.

"నీ వృత్తిలో నీ భార్యకే సమానస్థానమివ్వని నీవు, నీ నాటకం ద్వారా లోకానికేం సందేశమిస్తావు" అని సూటిగా అడిగింది రుద్రమ.

"పొరపాటైంది యువరాజా" అని తప్పును ఒప్పుకున్నాడు.

SCERT TELANGANA

"ఓ నటశిఖామణీ! కుటుంబాన్ని కూడా వీధినాటకంగా చేయకు" అని వ్యంగ్యస్వరంతో హెచ్చరించి వెళ్ళింది.

ఇట్లాంటి సంఘటనల్ని ఆమె అనేకం చూసి, పరిష్కరించింది. ప్రజల్ని ఆమె కన్నబిడ్డల్లా చూసుకున్నది అని తెలుపడానికి ఇలాంటివి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

గణపతిదేవుడు చాలా శక్తిసంపన్నుడు. అతడు రాజ్యపాలన చేసినన్నిరోజులు సామంతులు అణగిమణగి ఉన్నారు. రాజ్యానికి శత్రుభయం లేకుండా స్థిరమైన పాలన చేశాడు. అతడంటే ప్రజలకు అభిమానం, భయం, భక్తి ఉండేవి. మంత్రుల సలహాలు, సామంతుల అభిప్రాయాలకు విలువనిచ్చి రాజ్యపాలన చేసిన గణపతిదేవుడు వృద్ధాప్యం వల్ల రుద్రమదేవికి పట్టాభిషేకం చేయాలనుకున్నాడు. ఒక స్త్రీని రాజుగా చేస్తే రాబోయే పరిణామాలు ఎట్లా ఉంటాయి అనే ఆలోచనలో పడి మంత్రుల సలహాలు, అభిప్రాయాలు తీసుకున్నాడు.

"రుద్రుని పట్టాభిషేకం తరువాత పరిస్థితి ఏవిధంగా ఉంటుంది" ప్రశ్నించాడు గణపతిదేవుడు.

"ప్రజలేనాడూ కాకతీయుల్ని వ్యతిరేకించలేదు" జవాబిచ్చాడు శివదేవయ్య.

"మంత్రుల అభిప్రాయం?"

"సానుకూలంగానే ఉన్నది"

సేనాపతులు, దళపతులు, ఇతర ఉద్యోగుల ఆలోచన?

రుద్రమదేవి రాణి కావాలనే ఉన్నది!

సామంతరాజుల ప్రవర్తన ఎట్లా ఉన్నది?

ఓరుగల్లు పరిసరాల్లోని సామంతులు సానుకూలంగానే ఉన్నారు. కాని సుదూరప్రాంతాల్లోని ఒకరిద్దరు ఎదురుతిరుగుతారు కావచ్చు!

ఇరుగు పొరుగు రాజులు?

వారిలో కూడా వ్యతిరేకించేవారు కొందరున్నారు!

"కారణం ఏమై ఉంటుంది?"

"స్త్రీ అంటే చులకనభావం, పురుషాహంకారం!"

అంతా తెలుసుకున్న గణపతిదేవుడు "రుద్రమా, నీ పట్టాభిషేకానికి ముహూర్తం సమీపిస్తున్నది. ఈ నేలను కాపాడుతానని కాకతమ్మ ముందు ప్రతిజ్ఞ చెయ్యి" అన్నాడు.

కాకతమ్మ ముందు ప్రతిజ్ఞచేసి, "మీ నమ్మకాన్ని నిలబెడతా. ప్రజల్ని కన్నబిడ్డల్లా కాపాడుతా. రాజ్యాన్ని రక్షిస్తా. నా తరువాత సమర్థుడైన వ్యక్తికే ఈ రాజ్యాధికారం అప్పగిస్తా" అని తండ్రితో అన్నది.

SCERT TELANGANA

రుద్రమదేవి రాజ్యపట్టాభిషేకం జరిగింది. రాణి రుద్రమ అధికారంలోకి రాగానే కొందరు సామంతులు ఎదురుతిరిగారు. గోదావరి తీరాన ఉన్న మండలాధిపతులు స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తే రాణిపట్ల స్వామిభక్తి ఉన్న ఇతర మండలాధిపతులు తిరుగుబాట్లను అణచి రాజ్య సుస్థిరతను కాపాడి రాజ్యం చీలిపోకుండా జాగ్రత్తపడ్డారు. రుద్రమ దేవతాదర్శనానికి మొగిలిచర్లకు పోయినపుడు హరిహరదేవుడు, మురారిదేవుడు ఓరుగల్లు కోటలో ప్రవేశించి కోటద్వారాలు మూయించి ఆమెను కోట లోపలికి రాకుండా చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఆమెను అభిమానించే సేనానులు, ప్రజల సహాయంతో కోటను స్వాధీనం చేసుకున్నది. దేవగిరి రాజ్యం యాదవుల రాజ్యం. అది కాకతీయుల సామ్రాజ్యానికి ఆనుకొని పశ్చిమదిశలో ఉన్నది. దేవగిరిరాజు ఓరుగల్లు మీదికి దండయాత్రకు వచ్చాడు. ఆ సమయంలో ఆమె దేవతాదర్శనానికి వెళ్ళింది. ఆమెకు దండయాత్ర వార్త తెలిసింది. దేవగిరి రాజు ఓరుగల్లు చేరకముందే కోటలో ప్రవేశించి కోట తలుపులు మూయించింది. దేవగిరిసేనలు ఓరుగల్లు కోటను 15 రోజులు ముట్టడి చేశాయి. అంతకుముందే జాగ్రత్తపడ్డ రాణి కోటలో ఆహారపదార్థాలు, ఆయుధాలు, మంచినీటి వసతి సైన్యానికి కల్పించింది. దేవగిరిసైన్యం ఏనుగులు కోట తలుపులను బద్దలుకొట్టలేకపోయినవి. బురుజులపైనుండి కోట గోడలపైనుండి వచ్చే బాణాలకు, ఇనుపగుండ్లకు, రాళ్ళకు పదాతిసేన బాగా దెబ్బతిన్నది. మహదేవరాజు చేసేదిలేక ముట్టడి ఆపి దేవగిరి మార్గం పట్టాడు.

కాకతీయ రాజ్యానికి తూర్పున ఉన్న కళింగులు కూడా రుద్రమను ఓడించలేకపోయారు. దక్షిణాన ఉన్నది పాండ్యరాజ్యం. పాండ్యరాజు నెల్లూరుపై పోరాటానికి దిగి, కాకతీయుల సామంతుడైన మనుమసిద్ధిని ఓడించాడు.





తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

కాకతీయుల సైన్యం పాండ్యరాజు చేతిలో ఓడిపోయింది. కాని రుద్రమ మరల సైన్యాన్ని తయారుచేసింది. మనుమసిద్ధి కుమారుడు కాకతీయ సేనల సహాయంతో మరల నెల్లూరును ఆక్రమించాడు. ఇట్లా నెల్లూరు ప్రాంతం తరచు చేతులుమారింది.

రాణి రుద్రమదేవి సైన్యంలో క్షత్రియులు, రెడ్లు, కాపులు, కమ్మవారు, పద్మనాయక వెలమలు, కాయస్థులు – వారు వీరు అని కాకుండా అన్ని కులాలవారు ఉండేవారు. అందరికీ వారి వారి శక్తి సామర్థ్యాలనుబట్టి తగు విధంగా గౌరవం, హోదా లభించినవి. దేవగిరిరాజు యుద్ధనష్టపరిహారం కింద కోటి పన్ను చెల్లించాడు. అందులో సుమారు మూడవ వంతు పైకం ఆమె సైనికులకు పంచిపెట్టింది. తనకు విధేయులుగా ఉన్న సామంతులను రాణి రుద్రమ గౌరవించింది. కుట్ర చేసినవారిని శిక్షించింది. ఆమె పరిపాలనా విధానం వల్ల ఉద్యోగులందరు ఆమెపట్ల భక్తిశ్రద్ధలు చూపించారు. ఆమె సర్వమత సహనాన్ని ప్రదర్శించింది. సవ్యమైన పాలన కోసం సమర్థులైన మంత్రులను, ఉద్యోగులను నియమించింది. శివదేవయ్య మంత్రిని ప్రధానమంత్రిగా నియమించుకొని రాజ్యాన్ని సమర్థంగా పాలించింది. పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని నాడులుగా, స్థలాలుగా విభజించింది. నాడులకు అమాత్యులను, ప్రగడలు అనే హోదాగల అధికార్లను నియమించింది. ఇంకా స్థలాలుగా విభజించిన ప్రాంతాలకు స్థలాధికారులు, స్థలకరణాలు, సుంకరులు అనే అధికారులను నియమించింది. 'స్థలం' అనే భూభాగంలో అరవై వరకు గ్రామాలుండేవి. పాలనలో గ్రామం చివరిభాగం. గ్రామనిర్వహణకు అయ్యవార్లు, కరణం, పెద్దకాపు, తలారి, పురోహితుడు మొదలగు పన్నెండుమంది గ్రామసేవకులుండేవారు.

రుద్రమదేవి ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేది. దానధర్మాలు చేసేది. శిల్పకళ, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, సాహిత్యం వంటి కళలను పోషించినట్లు చరిత్ర మనకు చెబుతున్నది. వర్తకం, వ్యవసాయం ఆమె పాలనలో అభివృద్ధి చెందాయి. ఓరుగల్లుకోట, రామప్పగుడి, వేయిస్తంభాలగుడి రాణి కాలంలో వైభవంతో వెలుగొందాయి. పాకాల, లక్నవరం, రామప్ప తటాకాల పూడిక తీయించి ప్రజావసరాలకు తగ్గకుండా నీరు నిల్వచేసి ఉంచారు. చారులను నియమించి ఏమరుపాటులేక ప్రజలను పాలించిన ఘనత రాణి రుద్రమదేవికే చెల్లింది. ఎవరైనా వచ్చి తనకు అన్యాయం జరిగిందని మొరపెట్టుకుంటే ఆమె వెంటనే విచారించి వారికి న్యాయం చేసింది. సత్రాలు నెలకొల్పింది. గ్రామాలు దానంచేసి ఆ గ్రామాల ఆదాయంతో పాఠశాలలు, విద్యార్థులకు ఉచిత వసతిగృహాలు, ఆరోగ్యశాలలు, ప్రసూతిశాలలు నడిపేలా ఏర్పాటు చేసింది. దారిపొడవునా చెట్లు నాటించింది. దేవాలయాలు కట్టించింది.

మహిళలు అబలలు కాదు సబలలు అనే విషయం రుద్రమదేవితోనే రుజువైంది. దానికి నిదర్శనంగా ఆమె తన సైన్యంలో ప్రత్యేక మహిళా సైనికదళాన్ని ఏర్పాటుచేసింది. యుద్ధాలలో వారు ప్రత్యక్షంగా పాల్గొనేలా శిక్షణలు ఇప్పించింది. ఆమె చేసిన విజయయాత్రలలో, ఆమెపై శత్రురాజులు దండెత్తిన సమయంలో వీరు పోషించిన పాత్ర అమోఘం. పటిష్ఠ గూఢచార వ్యవస్థ ఏర్పాటుచేసింది. సైన్యం రెండు రకాలుగా ఉండేది. ఒకటి మూలసైన్యం. అంటే రుద్రమదేవి సైన్యం. రెండవది సామంతులు పోషించి, రాజు కోరినప్పుడు పంపించే సైన్యం. సామంతులకు



SCERT TELANGANA

వారి వారి ప్రాంతాలపై పెత్తనం ఉండేది. రుద్రమదేవికి కప్పం కడుతూ, ఆమెను సామ్రాజ్యాధిపతిగా అంగీకరిస్తూ, ఆమె కోరినప్పుడు సైన్యాలను పంపిస్తూ వాటికి సేనా నాయకత్వం వహిస్తూ ఉండడమే వీరి ముఖ్యవిధి. ఇట్లాంటి పటిష్ఠమైన వ్యవస్థను సమకూర్చుకొని ఆమె రాజ్యపాలన చేసింది.

తెలంగాణ ప్రాంతంలో పెద్దపెద్ద చెరువులున్నవి. నదులు దగ్గరలో లేకపోవటంతో పొలాలకు నీరు అందించడానికి మహారాజులు, వారి సామంతులు పెద్దపెద్ద చెరువులు తవ్వించారు. పెద్ద ఉద్యోగులు, ధర్మబుద్ధి గల అనేకమంది ఈ పనికి పూనుకొనేవారు. చెరువులు తవ్వించటం, ఏడురకాల ధర్మకార్యాల్లో ఒకటిగా హిందూధర్మం పేర్కొన్నది. మొదటి ప్రోలరాజు 'కేసరి సముద్రం' అనే చెరువు తవ్వించాడు. రెండవ బేతరాజు 'సెట్టిసముద్రం' అనే చెరువును ఏర్పర్చాడు. గణపతిదేవుడు నెల్లూరు, ఏలూరు మున్నగు స్థలాల్లో చెరువులు నిర్మించాడు.

'పాకాల చెరువు' గణపతిదేవుని కాలంలో రేచర్ల రుద్రారెడ్డిచే నిర్మించబడింది. అది చాలా పెద్దచెరువు. చెరువులపై కాకతీయ చక్రవర్తులకు ఉన్న శ్రద్ధ వారి సామంతులకు, మంత్రులకు ఆదర్శప్రాయమైంది. కనుక తెలంగాణ నిండా అనేక చెరువులు వెలిశాయి. ఈ చెరువుల నుండి పొలాలకు నీరు సరఫరా చేయడానికి పెద్దకాల్వలు తవ్వించారు. రుద్రమదేవి వీటన్నిటికి మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడేటట్లు చేయడంలో చాలా శ్రద్ధ వహించింది.

గణపతిదేవునికి సైన్యాధిపతిగా పనిచేసి ఎన్నో విజయాలు సాధించిపెట్టినవాడు గంగయసాహిణి. అతని మూడవతరంవాడు అంబదేవుడు. మొదట్లో అతడు రుద్రమదేవికి విధేయుడుగా ఉన్నాడు. దక్షిణ విజయ యాత్రలో




తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



కీలకపాత్ర పోషించాడు. నావల్లనే విజయాలు సాధించబడినవనే అహంతో ఒక మహిళకు సామంతుడిగా ఉంటానా అని స్వాతంత్ర్యం ప్రకటించుకొని కాకతీయ సామ్రాజ్యపు దక్షిణభాగాన్ని కొంతమేరకు ఆక్రమించుకొన్నాడు. రుద్రమదేవి శత్రురాజైన యాదవరాజుతో స్నేహం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో రుద్రమదేవి – అంబదేవుల మధ్య యుద్ధం జరిగింది. రుద్రమవైపు నిలిచి యుద్ధం చేసిన మల్లికార్జునుడు యుద్ధభూమిలో మరణించాడు. ఇది చూసిన రుద్రమ శత్రుసైన్యాధిపతిని ముక్కలు చేసింది. ఆమె యుద్ధకౌశలం ముందు అంబదేవుడు నిలువలేక పోయాడు. కాని ఈ యుద్ధంలో రుద్రమ కూడా శత్రుసైనికుల కత్తిదెబ్బలు తిన్నది. విజయం వరించినా క్షతగాత్రగా వెనుదిరిగింది.

రుద్రమ, గణపతిదేవుని కాలంలో ఉన్న కాకతీయ రాజ్యాన్ని మరింత సుస్థిరపరచింది. ఉత్తరాన సింహాచలం నుండి దక్షిణాన కంచి వరకు రాజ్యాన్ని పెంచింది. పశ్చిమాన బీదరు వరకు, తూర్పున బంగాళాఖాతం వరకు కాకతీయ రాజ్యాన్ని విస్తరించింది. తన తరువాత సింహాసనాన్ని అధిష్ఠించేది ముమ్మడమ్మ కొడుకు ప్రతాపరుద్రుడని ప్రకటించింది. ప్రతాపరుద్రుణ్ణి చదువుసంధ్యల్లో, సాముగరిడీల్లో తీర్చిదిద్దింది. అతణ్ణి తనవెంబడి తిప్పుతూ దేశం, ప్రజ, ధర్మం, పరిపాలన అనే అంశాలను కూలంకషంగా బోధించడం ప్రారంభించింది. తల్లి ముమ్మడమ్మ తన పుత్రుని మహర్దశకు సంతసించి ప్రతాపరుద్రుని అమ్మమ్మకే అప్పగించి నిశ్చింతగా కాలం గడిపింది. తన జీవితకాలంలోనే ప్రతాపరుద్రుడికి పట్టాభిషేకం చేసి, తండ్రి గణపతిదేవుని అడుగుజాడల్లో నడిచింది. తన బతుకంతా ప్రజల కోసమే అర్పించిన వీరనారి క్రీ॥శ॥ 1289 లో నల్లగొండజిల్లా నకిరేకల్ సమీపంలోని చందుపట్ల వద్ద కన్నుమూసింది. తెలంగాణ చరిత్రలో వీరనారి రుద్రమదేవి అధ్యాయం సువర్ణాక్షరాలతో లిఖించబడింది. ఎందరో విదేశీయాత్రికులు రుద్రమ పాలనావిధానాన్ని ప్రశంసించారు.

SCERT TELANGANA

**ఉపవాచకం**



*తెలంగాణ పడుచు బోనమెత్తితే దుర్గమ్మ పరవశిస్తుంది!*
*తెలంగాణ పడుచు బతుకమ్మ ఆడితే ప్రకృతి పులకరిస్తుంది!*
*హిందూ ముస్లింల అలయ్‌బలయ్ లు తెలంగాణతో మమైకం!*
*గంగాజమునా తెహజీబ్ తెలంగాణకే ప్రత్యేకం!*
*మనకంటూ ప్రత్యేక విశిష్టత...*
*మనదంటూ ప్రత్యేక సంస్కృతి...*
*మన సంస్కృతిలోని పండుగల వైభవాన్ని ఆస్వాదిద్దాం!*

# 3. మన పండుగలు

మనం ఎన్నో పండుగలు జరుపుకొంటాం. ఒక్కొక్క పండుగకు ఒక్కొక్క ప్రత్యేకత ఉన్నది. కొన్ని చరిత్రకు సంబంధించి, కొన్ని భక్తికి సంబంధించి, కొన్ని కాలగమనానికి సంబంధించిన పండుగలు. ఏండ్లకేండ్లుగా మనిషిలో ఒక స్ఫూర్తిని నింపి మంచిని బోధించేందుకు ఈ పండుగలు ఉపయోగపడుతున్నవి.

ఇప్పుడు మన తెలంగాణలో జరుపుకొనే ముఖ్యమైన కొన్ని పండుగల గురించి తెలుసుకుందాం!

## బతుకమ్మ పండుగ :



తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకువచ్చే పండుగ బతుకమ్మ. ఇది పూలజాతర. సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో వచ్చే ఆశ్వయుజశుద్ధ పాడ్యమి మొదలుకొని తొమ్మిది రోజుల వరకు రోజుకో తీరున బతుకమ్మను పూలతో పేరుస్తూ జరిపే పండుగ. ఇది తెలంగాణకు మాత్రమే సంబంధించిన పండుగ.

**బతుకమ్మ :** వేల ఏండ్ల చరిత్ర ఉన్న ఈ పండుగ వెనుక కూడా అనేక కథలున్నవి. చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు పుడతారు. వారందరూ యుద్ధంలో మరణిస్తారు. చాలాకాలం తర్వాత లక్ష్మీదేవి అనుగ్రహంతో వారికి ఓ ఆడపిల్ల పుడుతుంది. పుట్టక పుట్టక పుట్టిన పిల్లకు బతుకమ్మ అని పేరు పెట్టి, నిండు నూరేళ్ళు బతకాలని ఆ పిల్లను అందరూ ఆశీర్వదిస్తారు. ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకొన్నది.

గునుగు, చామంతి, తోకచామంతి, తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, పచ్చగన్నేరు, రుద్రాక్ష, బీర, గుమ్మడి, బంతి, ముద్దబంతి లాంటి రకరకాల పూలను సేకరించి రంగులు రంగులుగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతిరోజు సాయంత్రం బతుకమ్మ ఆడుకుని చెరువులోనో బావిలోనో నిమజ్జనం చేస్తారు.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

**సద్దుల బతుకమ్మ :** దసరాకు ఒకటి, రెండురోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబసభ్యులంతా ఇంట్లోనే ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త బట్టలు కట్టుకుంటారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకుని సద్దులు తీసుకుని ఆడుకున్న తర్వాత చెరువుకు వెళ్తారు. జొన్నపిండి, మక్కపిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన మలీద, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులను తయారుచేస్తారు. చెరువు దగ్గర బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులో సాగనంపుతారు.

తర్వాత తెచ్చిన సద్దులను ఒకరికొకరు పంచుకుంటారు. బతుకమ్మను నీళ్ళలో వదలడం కూడా ఒక పద్ధతి ప్రకారం చేస్తారు. మోకాలిలోతు నీటివరకు వెళ్ళి నీటిపై బతుకమ్మను ఉంచి ఏమాత్రం చెదరకుండా ఒడుపుగా వదిలి ఇత్తడి తాంబాళాన్ని పక్కకు తప్పిస్తారు. తర్వాత నీటిని మూడుసార్లు ముందుకు నెట్టి దండం పెట్టి వెనుకకు తిరుగుతారు.

**రోజుకోతీరు :** తొమ్మిదిరోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాహారాలను సమర్పిస్తారు. మొదటిరోజు మహాలయ అమావాస్య (పెత్రమాస) నాడు పెద్దలకు బియ్యం ఇచ్చినంక బతకమ్మను పేరుస్తారు. ఈరోజు ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తారు. ఈరోజు నువ్వులు, బెల్లం, చక్కెరను ఫలహారంగా పెడుతారు. రెండవరోజు అటుకుల బతుకమ్మ అంటారు. ఈరోజు పప్పు, బెల్లం, అటుకులు ప్రసాదం చేస్తారు. మూడోరోజున ముద్దపప్పు బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు ముద్దపప్పు బెల్లం ప్రసాదంగా చేస్తారు. నాలుగవరోజు నానబియ్యం, ఐదవరోజు అట్లబతుకమ్మ, ఆరోరోజు అలకల బతకమ్మ. ఈ ఆరో రోజును అర్రెమి అంటారు. ఈరోజు ఎవరి ఇళ్ళల్ల వాళ్ళు బతుకమ్మ ఆడుతారు. ఏడోరోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవరోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు. తొమ్మిదోరోజున సద్దుల బతుకమ్మగా పిలుస్తారు.

**అన్నికులాలు (సబ్బండ వర్ణాలు) :** బతుకమ్మ ఆటలో అన్నికులాలవారు పాల్గొంటారు. ఏ వాడకు ఆ వాడవాళ్ళు వాళ్ళ వాకిట్లో బతుకమ్మను ఆడుకున్నాక ఊరి బొడ్రాయి దగ్గరో, కచేరు దగ్గరో, గ్రామంలోని కీలక ప్రదేశంలోనో బతుకమ్మలు పెట్టి చుట్టూ తిరుగుతూ చప్పట్లుకొడుతూ పాడుతూ ఆడుతారు. ఆడవాళ్ళు బతుకమ్మ ఆడుతుంటే పిల్లలు వచ్చి మధ్యలో కూర్చుంటారు. మగవాళ్ళు సద్దులు పట్టుకుని అరుగుల మీద తీరిగ్గా కూర్చుంటారు.

**ఆటలో లయ, చప్పుడు :** బతుకమ్మ ఆటలో ఓ ప్రత్యేకత ఉన్నది. ఓపద్ధతి ప్రకారం అడుగులు వేస్తూ చప్పట్లుకొడుతూ గుండ్రంగా తిరుగుతూ వంగి లేస్తూ లయబద్ధంగా ఆడుతారు. ఆట, పాట, నాట్యం ఈ మూడింటితో పాటు పాటల్లో గొప్ప సాహిత్యం ఉంటుంది.

**బతుకమ్మ పాటలు :** బతుకమ్మ పాటల బాణీలు, ఎంతో ప్రసిద్ధిగాంచినవి. ఆయా ప్రాంతాల ఆచారాలు, పేర్లు, అలవాట్లను, భాషను కలబోసుకుని ప్రాంతీయ కథలతో ఉయ్యాలో అని, కోల్ అని, చందమామ అని, గౌరమ్మ అని, వలలో అని, ఎన్నెలో అనే మాటలను చివరన చేరుస్తూ పాటలు పాడుతారు. ఈ పండుగకు ఆడపిల్లలు ఎక్కడున్నా పుట్టింటికి చేరుకుంటారు. తోబుట్టువులు, కన్నవారు ఆడపిల్లలకు కట్నకానుకలను బహుకరిస్తారు. అత్తవారింట్లో ఉన్న అమ్మాయి ఈ పండుగ వచ్చిందంటే చాలు పుట్టింటివారికోసం ఎదురుచూస్తుంది. ఆ ఎదురుచూపును కూడా పాటల రూపంలోనే చెబుతుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, వారు అత్తగారింట్లో ఎదుర్కొనే సమస్యలు, వీటి గురించిన పాటలే ఎక్కువగా ఉంటాయి.

SCERT TELANGANA

**ఆడబిడ్డల ఎదురుచూపులు :**

ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో ...
ఒక్కడే మాయన్న ఉయ్యాలో వచ్చన్నవోడు ఉయ్యాలో
వచ్చన్న వోడు ఉయ్యాలో చూసన్నవోడు ఉయ్యాలో
ఎట్లొత్తు చెల్లెలా ఉయ్యాలో ఏరడ్డమాయె ఉయ్యాలో...

**తల్లిగారింటికి వెళ్ళడానికి అనుమతి :**

కలవారి కోడలు ఉయ్యాలో కలికి కామాక్షి ఉయ్యాలో
వంటింట్లో కూసుండి ఉయ్యాలో బియ్యమేరుతుంటె ఉయ్యాలో
అప్పుడే కామాక్షి ఉయ్యాలో అన్నవచ్చినాడు ఉయ్యాలో
కాళ్ళకు నీళ్ళిచ్చి ఉయ్యాలో కన్నీళ్ళు దీసె ఉయ్యాలో
ఎందుకూ చెల్లెలా ఉయ్యాలో ఏడువకమ్మ నీవు ఉయ్యాలో
కట్టుకో బట్టలు ఉయ్యాలో పెట్టుకో సొమ్ములు ఉయ్యాలో...

మల్లెతోటల ఉన్న ఉయ్యాలో ఓమామగారు ఉయ్యాలో
మాయన్న వచ్చిండు ఉయ్యాలో మమ్ముంపరాదా ఉయ్యాలో
నేనెరుగ నేనెరుగ ఉయ్యాలో మీఅత్తనడుగు ఉయ్యాలో
పత్తి తోటలఉన్న ఉయ్యాలో ఓ అత్తగారు ఉయ్యాలో...

**శ్రమ జీవనం :**

శ్రీరాముడు మోటగొట్ట వలలో
సీతా నీళ్ళుగట్ట వలలో
రఘురాముడు గొర్రుగొట్ట వలలో
జానకి నాటులెట్ట వలలో...

**పెద్ద బతుకమ్మను వేసి ఇంటికి వచ్చేప్పుడు:**

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ ఏమేమి కాయొప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ తంగేడు కాయొప్పునే గౌరమ్మ...

**తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ :** తెలంగాణ ఉద్యమకాలంలో బతుకమ్మ ప్రస్తావన, ఆట లేని సమావేశం లేదంటే అతిశయోక్తి కాదు. బతుకమ్మ ఆట, పాటతో, ఉద్యమం ఒక పోరాటరూపమై ఎదిగింది. ఉద్యమంలో కూడా స్త్రీలను భాగస్వామ్యం చేసింది. మహిళలు బోనం, బతుకమ్మలను ఎత్తుకొని వచ్చి పోరాట బిడ్డలకు స్వాగతం చెప్పి నుదుటన వీరతిలకం దిద్దారు.

**బతుకమ్మ – పర్యావరణం :** బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన పండుగ. పువ్వులనే దేవుడుగా కొలవడం, తమ బతుకులను కష్టాలనే పాటలుగా పాడుకోవడం ఒక్క తెలంగాణ ప్రజలకు మాత్రమే చెల్లింది. ఇంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మకు తెలంగాణలో ఎక్కడా గుడి కనిపించదు. ఎవరికీ బతుకమ్మ పేరు పెట్టుకోరు.

బతుకమ్మ పేర్చడంలో వాడే ఆకులు, పూలు, మంచి ఔషధాలు. వీటిని చెరువుల్లో కలపడం వల్ల నీటిశుద్ధి జరుగుతుంది. అందుకే బతుకమ్మ పండుగ ప్రకృతి పండుగ అయింది.



SCERT TELANGANA

## హోళీపండుగ :

వసంత ఋతువు రాకతో ప్రకృతిలో ఎంతో మార్పు వస్తుంది. చెట్లు కొత్త చిగుళ్లను తొడుక్కుంటవి. కోకిలలు కూస్తాయి. కొత్త కొత్త పూలు కనువిందు చేస్తాయి. ఆ సమయంలో జరుపుకునే రంగుల పండుగ ఇది. ఆడ, మగ, చిన్నా, పెద్ద వయోభేదం లేకుండా జరుపుకునే పండుగ హోళీ. ఇది అతి ప్రాచీనమైన పండుగ.

**కామదహనం :** హోళి పండుగ ముందురోజు కాముని దహనం చేస్తారు. దీనివెనుక ఎన్నో కథలున్నా అవన్నీ చెప్పేది "చెడుపై మంచి విజయం సాధిస్తుంది" అన్నది ఒక్కటే. ప్రతియేడు ఫాల్గుణ మాసంలోని పున్నమిరోజున వచ్చే ఈ పండుగను కాముని పున్నం అని కూడా పిలుస్తారు. మనిషిలోని చెడు ప్రవర్తనను అంతం చేసి మంచిని పెంచే పండుగగా దీనిని అందరు భావిస్తారు. కామదహనం తర్వాత ఆ బూడిదను పొలాలల్లో కలుపుకుంటే పంటలు బాగా పండుతాయని రైతులనమ్మకం. ఇప్పటికీ కామదహనం రోజున తెలంగాణలో ఇంటింటికి ఒక పిడకను లేదా ఇంట్లోని పాతకట్టెలు, చెక్క వస్తువులను ఒక్కచోట చేర్చి కామదహనం చేస్తారు. కామదహనవేళ వాటి చుట్టూ తిరుగుతూ, డప్పులు కొడుతూ, పాటలు పాడుతారు. తర్వాత కాలిన పిడక బూడిదను తెచ్చుకుని రైతులు కొత్త విత్తనాల్లో కలుపుకుంటారు.



**రంగుల పండుగగా హోళీ :** మోదుగ పూలను తెచ్చి నీటిలో ఉడికించి రంగుగా తయారుచేసుకొని ఒకరిపై ఒకరు చల్లుకుంటారు, ఆనందిస్తారు. వివిధ చెట్ల ఆకులు, పూలతో రంగులు తయారు చేసుకొని చల్లుకోవడం వల్ల హోళీ రంగుల పండుగగా ప్రసిద్ధి పొందింది.

**పాటల పండుగగా హోళీ :** తెలంగాణలో హోళీ ఆనందదాయకంగా జరుగుతుంది. తెలంగాణలో పండుగ అనగానే పాట గుర్తుకొస్తుంది. ఇక్కడ ఏ పండుగైనా పాటతోనే ముడిపడి ఉంటుంది. పాట, ఆటలు కలబోసుకొని పండగ చేసుకుంటారు.

హోళీపండగకు పదిరోజుల ముందు నుంచే పల్లెల్లో జాజిరిపాటలు, హోళీ పాటల మోత మొదలవుతుంది. రాత్రిపూట మగపిల్లలయితే కోలలతో కొడుతూ ఆడపిల్లలయితే చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ డబ్బు, ధాన్యం వసూలు చేస్తారు. పండుగనాడు స్త్రీలు, యువతులు, పాటలు పాడుతూ ఎవరైనా డబ్బులుఇస్తే తీసుకొని పోతారు.

SCERT TELANGANA

**పిల్లలపాటలు :** (1) రింగురింగు బిల్లా రూపాయి దండ
దండగాదురా దామెరమొగ్గ
మొగ్గ గాదురా మోదుగ నీడ.
నీడగాదురా నిమ్మలబాయి
బాయిగాదురా బసంతకూర
కూరగాదురా గుమ్మడిపండు

(2) ఆగుండీగుండు ఇత్తడి గుండు
గుండువాయి బండతో రమ్మనిచెప్పె
బండతో గుండు నేను రానని చెప్పె
చెప్పేది చెప్పక కట్టెతో గొట్టె
కొట్టిన కట్టెనే చెట్టయి మొలిచే

(3) అడేల్ తొడేల్ జింకపిల్ల
జీడిమేకల గాయవొతె
కేకకేకకు నన్నే పిలిచె
చిక్కుడు కళ్ల బోడదిరా
బోడదంటె బోడదిరా
బోడి కొమ్ముల పయ్యదిరా...

**పొద్దంతా పెద్దవాళ్లు పాడే పాటలు :** (1) హొళి హొళీలరంగ హోళీ... చెమ్మ కేళీల హోళి
హొళింత రంగాయె హోళీ చెమ్మకేళీల హోళి...

(2) నిమ్మచెట్టు కింద నిమ్మ చెట్టుకింద పోకురాజన్నా ...
నిమ్మెక్కి వదినమ్మ నిమ్మెక్కి వదినమ్మ నీళ్ళు ఎగజల్లో...

**వరుసైన వారిని పొగడుతూ...** (3) పావు శేరు బుక్కగొని పక్క జేబులవోసుకుని
వంగి వంగి సల్లవోతే ఓ దేవరెడ్డి
సల్లవోతే సల్లనీయదో ఓ దేవలక్ష్మి
కట్టినవు పట్టంచుదోతి పెట్టినవు జోడుంగురాలు
తొవ్వనడిచి నువ్వేపోంగనో ఓ దేవరెడ్డి
తొవ్వకడ్డం తానెవచ్చునో ఓ దేవలక్ష్మి...

ఈ పాటలన్నీ జానపద గీతాలే! ఎవరికివారు ఎప్పటికప్పుడు కట్టుకుని పాడుకున్నవే. మౌఖికంగా వేల ఏండ్లుగా అవి ప్రచారంలో ఉన్నాయి.

**ఉద్యమంలో జాజిరి పాటలు :** తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన అనేక పాటల మాతృకలన్నీ ఈ జాజిరి పాటల్లోనే ఉన్నవి. అచ్చమైన తెలంగాణ యాసలో ప్రజలభాషకు దగ్గరగా, ప్రజల నాలుకలమీద ఆడే


SCERT TELANGANA

ఈ బాణీలు ఒక్క తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా అంతకుముందు జరిగిన రైతాంగ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు కూడా స్ఫూర్తినిచ్చే గేయాలయినవి. సుద్దాల హనుమంతు లాంటి ప్రజా కళాకారులు ఈ బాణీల్లోనే పాటలు అల్లుకున్నారు.

## మిలాదున్నబీ :

మిలాదున్నబీ ముహమ్మదీయులు అత్యంత సంతోషముగా జరుపుకొను పండుగ. ఈ పర్వదినము ఇస్లామీ మాసమైన రబీయుల్ అవ్వల్ యొక్క 12వ తారీకున జరుపుకొంటారు. ముహమ్మదీయులు అంతిమ దైవ ప్రవక్తగా నమ్మే ముహమ్మద్ గారు మక్కా నగరము నందు జన్మించిన సందర్భముగానే ఈ పర్వదినము.

ముహమ్మద్ గారు బహుదైవారాధనను, విగ్రహారాధనను వ్యతిరేకించి విగ్రహ రహిత ఏకేశ్వరుని ఆరాధన వైపు ప్రజలను ఆహ్వానించారు. వారి అనుయాయులనే ముహమ్మదీయులనీ, వారు అనుసరించే మతమునే ఇస్లాం మతమని అంటారు. మనము సామాజిక జీవులమని, మన ప్రవర్తనతో మనం జీవించే సమాజము యొక్క సుఖ శాంతులు ప్రభావితమవుతాయని కావున సత్ప్రవర్తన కలిగి వుండాలని ఇస్లాం మతం బోధిస్తుంది. దైవారాధనతో పాటు సత్ప్రవర్తన కలిగిన వారితోనే దైవం సంతృప్తి చెందుతుందని, వారికే మోక్షం-స్వర్గం లభిస్తుందని ప్రవక్త బోధించారు.

మిలాదున్నబీ రోజున ముహమ్మదీయులు తమ ప్రవక్త జన్మదినాన్ని వేడుకగా జరుపుకుంటారు. ఈ పండుగకు రంజాన్, బక్రీద్ లాగా ఈద్‌గాహ్ వెళ్ళి సామూహిక నమాజు చేయడం ఉండదు. ఆ రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి మస్జిద్‌లో ఇషానమాజ్ చేసిన తరువాత ప్రవక్త జీవన విధానాన్ని వారి బోధనలను కొనియాడుతారు.

**ప్రవక్త ముహమ్మద్ గారి జీవన విధానం :** ముహమ్మద్ ప్రవక్త గారు తమ జీవితంలో ఏ విషయం లోనూ ఇతరులెవ్వరినీ నొప్పించకుండా ఇతరుల సాధక బాధకాలను తమవిగా భావించి వారికి తమవంతు సహాయ సహకారాలను అందిస్తూ ఉండే వారు. తను చేసిన హితోపదేశాలన్నింటినీ తను పాటించి మరీ అవన్నీ ఆచరణ యోగ్యమే అని నిరూపించినారు. దైవ సందేశాన్ని తను ఆచరిస్తూ చక్కగా తన అనుయాయులకు బోధించారు. వారి జీవితాన్నే ఆదర్శంగా చేసుకుని ముహమ్మదీయులు తమ జీవితాన్ని నీతి-నిజాయితీగా గడుపుతారు. ప్రవక్త గారు బోధించిన ముఖ్యమైన హితోపదేశాలు-ఇస్లాం మతానికి మూల స్థంభాలు.

- తను ఆరాధించే ఏకేశ్వరుని పై సంపూర్ణ విశ్వాసాన్ని కలిగి వుండడం. (తౌహీద్)
- ప్రతి రోజూ సూర్యోదయానికి ముందు, మధ్యాహ్నము, సూర్యాస్తమయమునకు ముందు, సూర్యాస్తమయము తరువాత మరియు రాత్రి పడుకునే ముందు ఇలా అయిదు పూటలు నమాజు చేయటము. (నమాజ్)
- రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటించడం. (రోజా)
- స్తోమత గలవారు ముహమ్మద్ ప్రవక్త గారి జన్మ స్థానమైన మక్కాలో కల కాబాను సందర్శించి ప్రదక్షిణలు చేయుట. (హజ్)
- స్తోమత కలిగినవారు తమ ఆదాయంలో నిర్ణీత భాగాన్ని దానం చేయడం. (జకాత్)



SCERT TELANGANA

## ప్రవక్త ముహమ్మద్ గారి బోధనలు :

**మిలాదున్నబీ సందర్భంగా కొనియాడే ప్రవక్త గారి బోధనలు :**

- ప్రపంచంలో కనిపించే ఏ వస్తువు అల్లాహ్ శక్తి కంటే పెద్దది కాదు.
- మనం ఆరాధించే ప్రభువు అల్లాహ్‌ను పూర్తిగా విశ్వసించాలి, వారికి సమానమైన హోదాను వేరెవరికి కల్పించ కూడదు.
- ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎవరి మనసూ నొప్పించ కూడదు. గర్వపడ కూడదు.
- విశ్వంలో జీవించే ఏ ప్రాణికీ ఎటువంటి హాని కలుగ చేయరాదు. ప్రాణులన్నింటికీ తమ వంతు సహాయ సహకారాలు అందించాలి.
- ఎట్టి సమయములోనూ నైతిక విలువలను వీడరాదు.
- సత్యమును వీడరాదు. అబద్ధము మహా పాపము.
- కోపమును నిగ్రహించుకొనాలి. కోపం వచ్చినప్పుడు మౌనాన్ని గ్రహించాలి.
- ఎవ్వరినీ అవమానించ కూడదు. వేరే వారి తప్పులను ఎత్తి చూపుట నేరము.
- మన కోరికలను ఇతరులకోసం త్యాగం చేయుటకు ఎల్లప్పుడూ సిద్ధముగా ఉండాలి.
- మనం సంపాదించిన ధనమునే కాక ఏ వస్తువును కూడా వృధాగా ఖర్చు చేయరాదు. (నీటిని కూడా) ఎల్లప్పుడూ పవిత్రంగానే ఉండాలి. అశ్లీలతను దరి చేరనీయ వద్దు. స్త్రీలను గౌరవించాలి.
- ఆహార పదార్థాలను, అన్న పానీయాలను జాగ్రత్తగా చూసి, సంతృప్తి చెందాకే సేవించాలి.
- ఎవరి వద్ద నుండి ఏ వస్తువునూ ఆశించ కూడదు.
- తల్లిదండ్రులను ఎట్టి పరిస్థితిలోనూ బాధ పెట్టకూడదు. వారిని సుఖ పెట్టి వారి ఆశీస్సులు పొందాలి.
- మన హక్కులకై పోరాడుట కంటే ఇతరుల హక్కులను రక్షించుట పై ధ్యాస పెట్టాలి.
- మన ప్రతి సుఖములోనూ పొరుగు వారినీ బంధు మిత్రులను భాగస్వాములను చేయాలి.
- రోగులకు, అంగ వైకల్యం కల వారికి ఎల్లప్పుడు అండగా నిలవాలి. దయాగుణం కలిగి ఉండాలి.
- ఇతర మతస్తులతో మర్యాదగా మెలగాలి. వారి భావజాలాలను గౌరవించాలి.
- ఛాందసవాదాన్ని మన దరి చేరనివ్వ కూడదు.
- మానవులే కాక ఏ ప్రాణిని కూడా బాధలో ఉంటే చూస్తూ ఊరుకో కూడదు. చేతనైనంత
- సహాయాన్ని తప్పకుండా చేయాలి.
- మత్తు పదార్థాలను సేవించడం మహా పాపం.

ఈ విధంగా మిలాదున్నబీ పండుగ రోజున ప్రవక్త జీవిత విశేషాలను మరియు వారి బోధనలను కొనియాడుట పరిపాటి.

SCERT TELANGANA




ఆధునిక సాంకేతిక ప్రవాహంలో కొట్టుకుపోయే జనం
పర్యావరణానికి మూగజీవాలకు హానిచేస్తున్నారు!
మితిమీరిన సాంకేతికతతో ప్రమాదాలకు కారణమౌతున్నారు
ఒకవేళ జంతువులు సైతం కంప్యూటర్లు వాడితే ఏం జరుగుతుంది?
మానవాళిని అంతం చేస్తాయా?
తమని తాము సంరక్షించుకుంటయా?
ఏం జరుగుతుందో చూద్దాం.

# 4. www.కారడవి.కామ్

ఒక దట్టమైన అడవి ఉండేది. ఆ అడవిలోని దారులు తికమకపెట్టేవిగా ఉండేవి. అందువల్ల ఈ అడవిలోకి వెళ్ళడానికి వేటగాళ్ళు కూడ భయపడేవారు. చాలా ఏండ్లకిందట కొందరు వేటగాళ్ళు కారడవిలోకి వెళ్ళడానికి ప్రయత్నించారు. కానీ వాళ్ళు తిరిగిరాలేదు. దాంతో ప్రజలు ఈ అడవి గురించి రకరకాల కథలు అల్లేవారు. అడవి దట్టంగా ఉండడంవల్ల తొవ్వ మరచిపోయే ప్రమాదం ఉందని అటవీ శాఖవాళ్ళు అనేవారు. పైగా, ఏ చెట్టుమీద కూర్చున్న ఏ పులి ఎప్పుడుదాడిచేస్తుందో? ఏ చిరుత ఎప్పుడు మెడపట్టుకుంటుందో? హఠాత్తుగా ఏ ఎలుగుబంటి ఎదురువస్తుందో? అనే భయం ఉండేది. అటవీశాఖవాళ్ళు నిర్మించిన రోడ్లమీద నుంచి కలపమోసే ట్రక్కులు వస్తూపోతూ ఉండేవి. కాని అడవికి 'గూండా' జగ్గు దౌర్జన్యం విస్తరించినప్పటి నుంచి కాంట్రాక్టర్లకి కలపతో ట్రక్కులు నింపి పట్టుకొని వెళ్ళడం కష్టమైంది. జగ్గూ మనుషులు ప్రతి కాంట్రాక్టరుతో వేరువేరుగా మామూళ్ళు వసూలు చేసేవాళ్ళు.

కారడవిలో గత కొన్నిరోజుల కింద ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. బిహారి అనే కోతి చాలారోజుల నుంచి కనబడలేదు. అకస్మాత్తుగా అతడు తిరిగి కనబడగానే అడవి జంతువులు అతడు కనబడక పోవడానికి కారణం అడిగాయి. అందుకు బిహారి తాను పక్కనున్న పట్టణానికి కంప్యూటర్ నేర్చుకోవడానికి వెళ్ళానని చెప్పాడు. ఇప్పుడు తను ఒక వెబ్‌సైట్ కూడ తెరిచానని చెప్పాడు. దానిపేరు www. కారడవి.కామ్. తరువాత అందరిని తను కంప్యూటర్ మొదలైనవి పెట్టిన చోటుకి తీసుకుని వెళ్ళాడు. అడవికి రాజయిన సింహం అడిగాడు. "బిహారీ! దీనివల్ల అడవి జంతువులకు ఏమిటి లాభం?" అని.

బిహారి అన్నాడు "ప్రభూ! ఇది కొత్త ప్రపంచపు అద్భుతం. కంప్యూటర్‌వల్ల ప్రపంచమంతా ఒకటే కుటుంబమైంది. మన కారడవి రహస్యాలు, సంగతులన్నీ నా వెబ్‌సైట్ ద్వారా ప్రపంచానికి తెలుస్తాయి.

"మూర్ఖుడా! ఎంత పనిచేశావు! మనందరి చావును పిలుచుకువచ్చావు." సింహం కోపంగా గద్దించింది. "లేదు ప్రభూ! అలా ఏమి జరుగదు. ఎవరికైనా ఏ సమాచారమైనా కావలసి ఉంటే ఈ-మెయిల్ ద్వారా నన్నే

కదా అడగాలి. నేను నా ఈ-మెయిల్ చిరునామా - "బిహారి @ మెయిల్.కామ్" ఇచ్చిన. ఏ జంతువు నివాసం ఎక్కడ ఉందో దాన్ని చేరుకునే దారి ఏమిటో నేను ఎప్పుడూ చెప్పను".

సింహం వెళ్ళిపోయిన తర్వాత కోతి బిహారి అక్కడున్న జంతువులకు కంప్యూటర్ గేమ్‌లు చూపిస్తూ వినోదం కలిగించసాగాడు.

కారడవికి దగ్గరగా ఉన్న పట్టణం అనూప్‌గంజ్. ఇక్కడ ముఖ్తార్‌సింగ్ ఎం.ఎల్.ఏ., ముఖ్యమైన నాయకుడు. గూండా జగ్గు దౌర్జన్యాన్ని నిలువరిస్తానని ఆయన ప్రజలకు మాట ఇచ్చాడు. ఇది విని జగ్గు మండిపడ్డాడు. ముఖ్తార్‌సింగ్‌ను కిడ్నాప్ చేసి కారడవి మధ్యలో బంధించాడు. ప్రభుత్వానికి, పోలీసులకు ఏం చేయాలో పాలుపోలేదు. ఆ రాత్రి పోలీస్‌కమీషనర్ ఇంట్లో సమావేశం జరుగుతున్నది. అకస్మాత్తుగా కమీషనర్ గారి పది సంవత్సరాల కొడుకు రాజు ఆయాసపడుతూ వచ్చాడు. "నాన్నా! నేనిప్పుడే ఇంటర్నెట్‌లో ఒక కొత్త వెబ్‌సైట్ చూశాను. దానిపేరు www. కారడవి.కామ్. దాంట్లో నీకు కారడవి వివరాలు దొరకవచ్చు".

ఈ వింత వెబ్‌సైట్ గురించి అందరు పోలీసు అధికారుల్లో ఆసక్తి పెరిగింది. వాళ్ళు వెంటనే ఆ వెబ్‌సైట్ తెరిచారు. అందులో నిజంగానే కారడవి గురించి వివరాలు ఉన్నాయి. ఆ వెబ్‌సైట్‌లో, మరిన్ని వివరాల కోసం ఈ-మెయిల్ చిరునామా www. బిహారి.కామ్ అని ఉన్నది. ఇది ఎవరై ఉంటారు. ఒక కోతి వెబ్‌సైట్‌ని ఎట్లా తెరిచి ఉంటుంది? అయితే పోలీసుఅధికారులు ఇప్పుడీ ప్రశ్నలన్ని వదిలిపెట్టి ముఖ్తార్‌సింగ్ గురించి తెలుసుకోవడానికి ఈ-మెయిల్ పంపారు. "అడవి దొంగ జగ్గునే ఎం.ఎల్.ఏ ముఖ్తార్‌సింగ్‌ను ఎత్తుకు వెళ్ళిండు. నువ్వు అతడి నివాసమెక్కడ ఉందో, అక్కడికి చేరే మార్గమేమిటో చెప్పగలవా?" ఈ-మెయిల్ చదివిన కోతి బిహారికి ఈ విషయమంత అర్థమైపోయింది. అతడు వారికి పూర్తి అడవిమ్యాపుని పంపడంతో పాటు అక్కడిదాకా వారు చేరుకోవడానికి కోతుల ద్వారా దారిచూపే ఏర్పాటు చేశాడు.

బిహారి పంపిన మ్యాపు ప్రకారం వారు సరైనచోటుకు చేరుకున్నారు. అక్కడికి అసలు ఎవరైన చేరుకోగలరని జగ్గు కలలో కూడ ఊహించలేదు. అతడు తన అనుచరులతో జల్సా చేసుకుంటున్నాడు. హఠాత్తుగా పోలీసు కమాండోలు వారిని చుట్టుముట్టారు. జగ్గుకు సంభాళించుకునే అవకాశం కూడ దొరకలేదు. కన్నుమూసి తెరిచే లోపల అక్కడి దృశ్యం మారిపోయింది. ముఖ్తార్‌సింగ్ విడుదలయ్యాడు. జగ్గు అతడి అనుచరులు నిర్బంధంలోకి తీసుకోబడ్డారు.

దీంతో కారడవిలో జగ్గు ముఠా అంతం అయింది. అందరు పోలీసులను మెచ్చుకున్నారు. పోలీసుల సిఫార్సుతో ప్రభుత్వం అత్యుత్తమ వెబ్‌సైట్‌గా www. కారడవి.కామ్.ను ప్రకటించింది. దీనితో కోతి బిహారి ధైర్యం ఇంకా పెరిగిపోయింది.


కోతి బిహారి తన గుహ బయట ఒక సైన్‌బోర్డు తగిలించేసరికి అడవంతా సందడి వ్యాపించింది. అక్కడ బిహారి ఒక కంప్యూటర్ సెంటరుని తన పేరు మీద ప్రారంభించాడు. 'కోతి బిహారి కంప్యూటర్ సెంటర్' అంటే కెబిసిసి అని సైన్‌బోర్డు కింద రాసి ఉన్నది. "రిజిస్ట్రేషన్ తెరచి ఉన్నది"... దానితో సాయంత్రానికల్లా రిజిస్ట్రేషన్ చేయించేవారితో పెద్దలైన్ ఏర్పడింది. ఇందులో ఎక్కువగా జంతువులు-పక్షులు, యువకులు, పిల్లలు ఉన్నారు.



SCERT TELANGANA

బిహారి అడవిలోని పిల్లలకి, యువకులకి కాలుక్యులేటరు, మొబైలు ఫోను తెచ్చినప్పటి నుండి అడవంతా విప్లవం వచ్చినట్లయింది. మొబైలుఫోను దొరకడం వల్ల అడవిలోని జంతువులన్నింటికి ప్రమాదానికి అప్రమత్తమయ్యే సూచన లభిస్తూ ఉండేది. షేర్‌సింగ్ సింహం లేళ్ళ వేటకి బయలుదేరగానే అన్ని జింకలు, తెల్లచుక్కల లేళ్ళు ఆఖరికి కుందేళ్ళు కూడ షేర్‌సింగ్ ఎక్కడినుంచి వస్తున్నాడో, ఒకరికొకరు వార్త నందించుకోసాగారు. ఫలితంగా షేర్‌సింగ్ చాల రోజులవరకు ఆకలితో ఉండవలసి వచ్చింది. అందువల్ల షేర్‌సింగ్ మనసులోనే కోతి బిహారిపైన కోపంగా ఉన్నది.


అడవిలోని మరికొన్ని జంతువులు కూడ కోతి బిహారి చేసిన పని బాగా లేదన్నవి. కంప్యూటర్ల వల్ల మన పిల్లలు పాడైపోతున్నారని అన్నవి. చిరుతపులి ఖాన్ మాత్రం దీనికి భిన్నంగ మాట్లాడింది. "మీరంత ముసలివాళ్ళయిపోయారు. మీ బతుకు మీరు బతికేశారు. మీ పిల్లలను వాళ్ళ బతుకెందుకు బతుకనీయరు? వారిమీద మీ అభిప్రాయాలను ఎందుకు మోపుతున్నారు ఈనాడు కంప్యూటర్ మొత్తం ప్రపంచంలో విప్లవం తెచ్చింది. బిహారి కారడవిలో ఎలక్ట్రానిక్ వస్తువులు తెచ్చినప్పటి నుండి మనం ఎంత ధనికులమయ్యామో! షేర్‌సింగ్ వేటాడ్డం మానివేసి శాకాహారి కావాలి. మామూలుగా కూడా ప్రభుత్వం అడవిలో వేటాడటం చట్టం ప్రకారం నేరమని ప్రకటించింది. అందువల్ల సోదరులారా! మీ పిల్లలను కొత్త ప్రపంచంతోపాటు నడువ నివ్వండి. జరుగుతున్నది మంచికే జరుగుతున్నది" అన్నది. మరి కొన్ని వాదనల తరువాత ఆ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది.



షేర్‌సింగ్ వేటాడటం మానేశాక నక్క ఖోఖల్ ఆకలితో మాడసాగాడు. ఎందుకంటే నక్క ఖోఖల్ సింహం ఎంగిలిచేసిన మాంసం తిని బతికేవాడు. వాడి గూండా కొడుకు జయకాల్ (అందరు వాడిని జె.కె. అనే వాళ్ళు) కూడ తండ్రి తెచ్చినవి తిని హాయిగా ఉండేవాడు. ఇప్పుడు చాలా రోజులనుండి పస్తులుంటున్నాడు. ఒకరోజువాడు తన తండ్రి ఖోఖల్‌ను కోపగించుకున్నాడు. అప్పుడు ఖోఖల్ నక్క అన్నాడు. "నువ్వు ఏ బిహారి దగ్గర కంప్యూటర్ నేర్చుకోవడానికి వెళుతున్నావో

SCERT TELANGANA

అతడు మన నెం. 1 శత్రువు అతడి పనులను ఆపకపోతే మనం తొందరలోనే చచ్చిపోతాం". నక్క జె.కె.కి విషయమేమిటో ఇప్పుడర్థమైంది. "అట్లాఅయితే నేను కోతి బిహారికి జీవితంలో మరచిపోలేని గుణపాఠం చెబుతాను" అన్నాడు. మరునాడు జె.కె. పట్టణం వెళ్ళి కోతి బిహారీ కంప్యూటర్లను నాశనంచేసే వైరస్‌ఉన్న ఫ్లాపీ తెచ్చాడు. కానీ కొండముచ్చు 'కాలూ' దీన్ని పసిగట్టి బిహారికి చెప్పింది. జయకాల్ బండారం బయటపడింది.



బిహారి సెక్యూరిటీ గార్డులు అతడిని ఎంతగా చితక్కొట్టారంటే, అతడు చాలా రోజులవరకు తన గుహ లోపలనే ఉండి కేకలు పెడుతుండేవాడు.

బిహారిని ఎట్లాగైనా దెబ్బ తీయాలని జయకాల్ మళ్ళీ పట్టణానికి వెళ్ళాడు. అక్కడ మల్లిక్ సైబర్‌కెఫేలో దూరాడు. వారి గురించి తెలుసుకోవాలనిపించి, "ఇంటర్నెట్ అంటే ఏమిటి?" అని అడిగాడు.

"ఇంటర్నెట్ ఒక రకంగా ప్రపంచవ్యాప్తంగా ఉండే కంప్యూటర్ల నెట్‌వర్కు. ఇది ప్రజలకు ఒకరికొకరు సూచనలు ఇచ్చిపుచ్చుకోవడంలో సాయపడుతుంది. కంప్యూటర్‌లో ఇంటర్నెట్ ద్వారా మీరు ఎన్నో వెబ్‌సైట్ల నుండి సమాచారాన్ని పొందవచ్చు. ఎవరితోనైనా మాట్లాడవచ్చు. స్నేహం చేయవచ్చు. అని చెప్పాడు షాపు యజమాని మల్లిక్. 'మరి సైబర్‌కెఫే అని రాశారు!' మళ్ళీ అడిగిండు జయకాల్.

"ఓ అదా! సైబర్ అన్న పదం సైబర్‌నెటిక్స్ నుంచి వచ్చింది. దీని అర్థం – యంత్రాలు, జీవం గల ప్రాణులు రెండింటిలో సమాచారం మరియు స్వయంగా నడిచే నియంత్రణ ప్రణాళికకు సంబంధించిన శాస్త్రం. దీనితో ఇంటర్నెట్‌లో సంచరించడానికి తీసుకున్న పదం సైబర్ అర్థమైందా?" "మరి కేఫే అంటే?" "దీనిని కాఫీ హౌసు అంటారు. అంటే ప్రజలు కాఫీ హౌజ్‌కు వెళ్ళి బాతాఖానీ కొట్టినట్టే, కొందరు కంప్యూటర్ గురించి మాట్లాడ్డం, బాతాఖానీ, సూచనల నిచ్చిపుచ్చుకోవడం మొదలైనవి చేస్తారు. అందువలన వీటిని కేఫే అంటే సైబర్ కేఫే అని అంటారు" అన్నడు మల్లిక్. బిహారీని ఓడించడానికి ఇదే సరైన మార్గమని భావించి 'జయకాల్ సైబర్ కెఫే' మొదలుపెట్టి సరిగా నడపలేక మళ్ళీ చేతులు కాల్చుకున్నాడు జయకాల్.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

కానీ గుంటనక్క జయకాల్ తన కుటిల ప్రయత్నాలు మాత్రం మానుకోలేదు. తను కూడా కొన్ని తెలివితేటలు సంపాదించి 'www. లకీఆజ్‌వికె.కామ్' పేరుతో ఓ వెబ్‌సైట్ మొదలుపెట్టాడు. కారడవి సమాచారాన్ని అడవిదొంగలకు పెద్ద మొత్తాలకు అక్రమంగా అందించడం మొదలుపెట్టాడు. దీనివల్ల కారడవిలో ఐదు ఏనుగులు వేటగాళ్ళ తుపాకీలకు బలైపోయాయి. జంతువులన్నీ బిహారి దగ్గరకొచ్చి "నీవల్లే ఇదంతా జరిగింది. కంప్యూటర్లు వద్దని మొత్తుకున్నా వినిపించుకోలేదని" నిందించాయి. బిహారి వారిని శాంతపరిచి ఈ రహస్యాన్ని ఛేదిస్తాను. భయపడవద్దని హామీ ఇచ్చాడు.

మరుసటిరోజు పట్టణంవెళ్లి అక్కడే మూడురోజులుండి తిరిగి వచ్చాడు.

పట్టణం నుంచి బిహారి ఎంతో చాతుర్యంగా పాస్‌వర్డ్ డిటెక్టర్ సాఫ్ట్‌వేర్ తీసుకొని వచ్చాడు. ప్రతి వెబ్‌సైట్‌లో ఒక పాస్‌వర్డ్ అంటే ఒక రహస్యసంకేతం ఉంటుందని అతనికి తెలుసు. దానిద్వారా వెబ్‌సైట్‌లో ఏదైనా వివరాన్ని పెట్టవచ్చు లేదా తొలగించవచ్చు. ఆ సాఫ్ట్‌వేర్ సాయంతో బిహారి జయకాల్ వెబ్‌సైట్ పాస్‌వర్డ్‌ని కనిపెట్టాడు. తరువాత వెబ్‌సైట్ తెరిచి వివరాలన్నీ తారుమారుచేసేసి వెబ్‌సైట్‌ని హైజాక్ చేశాడు. అతడికి తెలుసు తాను హైజాకింగ్ చేసి సైబర్‌క్రైం చేస్తున్నానని, కాని అందరి మంచికోరి చేసేపని నేరం కాదు.

జయకాల్ మరునాడు ఈ-మెయిల్ చెక్‌చేసినపుడు ఒక సందేశం ఇట్లా ఉంది. ముఖ్యమైన కొంత సరకు కావాలి. పోలీసులు జాగరూకులై ఉన్నారు. కలిసిన తరువాతే మాట్లాడుకుందాం. అమెరికన్ డాలర్లలోనే



చెల్లిస్తాం. ఎప్పుడు ఎక్కడ కలుస్తావో వెంటనే చెప్పు. పంపినవాళ్ళు బీబీ @ మెయిల్.కామ్. ఇది ఎవరో దొంగరవాణా కోసం వేటాడే వారి సందేశంలా ఉంది. జయకాల్ జవాబు పంపిండు. “సోమవారం–రాత్రి ఒంటిగంట. నల్లనది పాత మర్రిచెట్టు” పంపినవాళ్ళు ‘లకీఆజ్ @ వీకె యాహూ.కామ్.’

మరునాడే సోమవారం రాత్రి జయకాల్ తన గుహనుంచి బయలుదేరాడు. మెల్లమెల్లగ, జాగ్రత్తగా నడవసాగాడు. అడవి నిశ్శబ్దంగా ఉంది. చాలసార్లు జయకాల్ తన కాలికిందపడి నలిగిన ఎండుటాకుల చప్పుడుకే ఉలికిపడ్డాడు. మర్రిచెట్టును సమీపించడానికి ముందు జయకాల్ నాలుగుదిక్కుల పరిశీలించి చూశాడు. అంత సరిగ్గా ఉండటంచూసి మర్రిచెట్టు కిందికివెళ్ళి నిలుచున్నాడు.

హఠాత్తుగా, కోతి బిహారి చెట్టుమీద నుండి దుంకి, అక్కడికివచ్చాడు. జయకాల్ అతడిని చూస్తూనే గాబరాపడ్డాడు.

“వంచకుడా! నీ ఆటలింక సాగవు. ఏనుగుల హత్యలు చేయించింది నువ్వే. నీ వెబ్‌సైట్ దీనికి సాక్ష్యం”. కోతి బిహారి అన్నాడు. జయకాల్ పరిగెత్తబోయాడు. కానీ అప్పటికీ షేర్‌సింగ్, చిరుతఖాన్, గజరాజసింగ్ మొదలైన జంతువులు వానిని చుట్టుముట్టేశారు. కోపంగ ఉన్న గజరాజ్‌సింగ్ జయకాల్‌ను తొక్కెయ్యడానికి తన కాలు పైకెత్తిండో, లేదో ఇంతలో ముసలి నక్క ఖోఖల్ అతని కాలుపట్టుకొని, “నా ముసలితనంలో వీడే నా ఆసరా. వీడిని విడిచిపెట్టండి’ అంటూ బతిమాలుకోవడం మొదలుపెట్టాడు. జయకాల్ బాగా తన్నులు తిని ఉన్నాడు. షేర్‌సింగ్ అన్నాడు ‘సరే, వీడిని వదిలెయ్యండి. కానీ వీడు ఇంక ఎప్పుడూ కారడవిలో కనబడకూడదు.” మరునాడు బిహారి పోలీసులకు చెప్పి జయకాల్ వెబ్‌సైట్‌ను మూయించాడు.

ఒకరోజు అడవిలో జంతువులన్నీ టీవీలో ఒక సంచలన వార్త చూశాయి. పులులు, తోడేళ్ళు మొదలైన ఇరవైఅయిదు జంతువుల చర్మాలతోపాటు వాటిని దొంగరవాణా చేసే అయిదుగురిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. అడవికి రాజైన షేర్‌సింగ్ మరునాడు ఉదయం పేపరు వచ్చినపుడు మొదటిపేజీలో ఆ వార్తనంతటినీ పూర్తిగా చదివాడు. అది అతణ్ణి కలవరపరచింది. అతడు గుహనుండి బయల్దేరి తిన్నగా బిహారి–కంప్యూటర్ సెంటరుకి వెళ్ళాడు. ఇలాంటి విషయాలలో బిహారి తెలివిగా సలహా ఇస్తాడని షేర్‌సింగ్‌కి తెలుసు.

“ఇదేవిధంగా పులులు, తోడేళ్ళ హత్యలు జరుగుతూపోతే పులివంశం అంతరించడానికి ఎంతోకాలం పట్టదు. డయనోసర్ లాగానే ప్రజలు, ఎపుడో పులులు భూమి మీద అడవులలో ఉండేవి అని పుస్తకాలలో మాత్రమే చదువుతారు” అని షేర్‌సింగ్ అన్నాడు.

“అంతర్జాతీయ స్థాయిలో ఈ సమస్యగురించి ఆలోచించాలి. ప్రపంచంలోని ఇతరదేశాల పులులు, సింహాలను కూడ ఈ పనిలో చేర్చుకోవాలి. అప్పుడే ఈ సమస్య గురించి అందరు గంభీరంగా ఆలోచిస్తారు” అని ఈ సమస్యకు పరిష్కారం చెబుతూ బిహారీ అన్నాడు. “కాని, ఇతర దేశాల పులులు, సింహాలతో మాట్లాడటం ఎలా జరుగుతుంది?” షేర్‌సింగ్ అడిగాడు.



SCERT TELANGANA

"ఇంటర్నెట్ ద్వారా" బిహారి అన్నాడు.

"అదేమిటి?" షేర్‌సింగ్ ప్రశ్నించాడు.

అప్పుడు బిహారి ఇంటర్నెట్‌లోని అన్ని సౌకర్యాల గురించి వివరించాడు. షేర్‌సింగ్ ఇతర దేశాల పులులతో ఏవిధంగా చాట్ (సంభాషణ) చేయగలడో కూడా చెప్పాడు. షేర్‌సింగ్ చాట్ చేయడానికి సిద్ధపడ్డాడు. కోతి బిహారి ఇంటర్నెట్‌లో షేర్‌సింగ్‌తో ఛాట్‌చేసే ఆహ్వానాన్ని ప్రసారం చేశాడు. నిర్ణీత తేదీన నిర్ణీత సమయానికి షేర్‌సింగ్ బిహారి కంప్యూటర్ ఎదుట ఛాట్ చేయడానికి కూర్చున్నాడు.

షేర్‌సింగ్ ఇంటర్నెట్‌లో ప్రపంచంలోని పులులన్నింటికీ నమస్కారం చెప్పాడు. చాట్ చేయడానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపాడు. తరువాత అతడు పులులు, తోడేళ్ళు మొదలైనవాటిపై త్వరితంగా జరుగుతున్న హత్యలు, వాటి తోళ్ళ దొంగతనం, అంతర్జాతీయ మార్కెట్‌లో తోళ్ళ గిరాకి మొదలైన సమస్యలను ప్రస్తావించాడు. సింహాల జాతి అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్న విషయంపై తన ఆవేదన తెలిపాడు.

ఆఫ్రికా సింహం సందేశం వచ్చింది. "ప్రపంచ వన్యజీవుల సంరక్షణ నుంచి సాయం ఎందుకు తీసుకోరు?"

షేర్‌సింగ్ : "ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వ యంత్రాంగంలో చిక్కుకుని ఈ పనులు ఆగిపోతున్నాయి."

మలేషియా సింహం. "మా అడవులలో చాలా ఖాళీ స్థలం ఉంది. మీ పులులు, తోడేళ్ళు అన్నీ మా ఎయిర్‌లైన్స్ విమానంలో కూర్చొని వచ్చేయండి. రాజకీయ రక్షణ దొరుకుతుంది."

చైనా నుంచి ఒక పులి : 'ఎన్ని పులుల కోసం బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు పంపమంటారో చెప్పండి. నాయకుల్లాగా మీరు కూడ మీ రక్షణ ప్రయత్నాలు ఎందుకు చేసుకోరు? మీకు కావాలంటే మేము మీలో కొందరికి కమెండోల ట్రైనింగు ఇప్పిస్తాం."

షేర్‌సింగ్ మలేషియా, చైనా పులులు ఇచ్చిన సలహాలకి ఆలోచించి సమాధానం ఇస్తానని చెప్పాడు. అమెరికాలోని ఏదో జూ నుంచి ఒక పులి సందేశం పంపింది. "మా సలహా ఏమిటంటే జాతిని రక్షించడం అవసరం. దీనికోసం అమెరికా శాస్త్రవేత్తలతో ఎందుకు మాట్లాడకూడదు? వారు క్లోనింగ్ ద్వారా పులులు, తోడేళ్ళ కొత్తజాతిని పుట్టించి పూర్తిసైన్యాన్ని తయారుచేస్తారు."

షేర్‌సింగ్‌కు క్లోనింగ్ అంటే అర్థంకాలేదు. కోతి బిహారి చెప్పాడు. "ఏదైనా ప్రాణి నుంచి ఒక ప్రత్యేక (జన్యువు) జీన్‌ను వేరుచేసి దానిని మరొక ప్రాణి కోశంలో చేరుస్తారు. ఈవిధంగా ఆ జీన్ కొత్త ప్రాణిలో పాతప్రాణియొక్క కొన్ని ప్రత్యేక లక్షణాలని కలుగజేస్తుంది. 'డాలీ' అనే గొర్రె ఈవిధంగానే పుట్టింది."

"ఏమన్నావు? గొర్రెల్లాగ సింహాలను పుట్టిద్దామనుకున్నావా?" షేర్‌సింగ్ చికాకుగా ప్రశ్నించాడు.

SCERT TELANGANA

తరువాత షేర్‌సింగ్, అమెరికాపులి మధ్య ఈరకంగా సంభాషణ జరిగింది. "అవి నిజం సింహాలవుతాయా?"

"పూర్తిగా నిజమైనవే. ఆకారం, పని, అలవాట్లు అన్నీ సింహంలాగే ఉంటాయి."

"వీటిని ఎవరుపుట్టిస్తారు? వీటి తల్లి ఆడసింహమే అవుతుందా?"

"రాబోయేకాలంలో ఆడసింహం అవసరం కూడా ఉండదు. అంతా టెస్ట్‌ట్యూబ్‌లోను, ప్రయోగశాలల్లోను అయిపోతోంది."

"ఏమన్నావు? ఆడసింహం లేకుండా కూడా పుడుతాయా? కాని అప్పుడు వాటిని సింహం పిల్లలని ఎలాగా అంటారు? వాళ్ళెలా అనగలరు. మేము సింహం పాలుతాగామని నీకు తెలియదా, మేము జాతిసింహాలం. మాకు పూర్తి వంశసంప్రదాయం ఉన్నది."

"ఈ పాతమాటలన్నీ మరచిపో, ప్రపంచం మారిపోతున్నది. శాస్త్రవేత్తలు, మనుషుల జాతిని కూడ మార్చబోతున్నారు."

షేర్‌సింగ్ కోపంతో అరిచాడు. "నాకక్కరలేదు క్లోనింగ్ సింహం".

"క్లోనింగ్ సింహాలను పుట్టించి నేను భారతదేశం సింహాలను అవమానం చేయను. నువ్వు చూస్తూ ఉండు, నేను తొందరలోనే ఇక్కడి అన్ని సింహాలను ఒకచోట చేర్చి, వారిని రక్షించడానికి ఒక ప్రణాళికను తయారుచేస్తాను. మేము సింహాలం మరి" కోతి బిహారి కంప్యూటరు సెంటరు నుంచి బయటికి వచ్చి ఎంత గట్టిగా గర్జించాడంటే. పూర్తి అడవికి తెలిసిపోయింది రాజు అతడేనని.

* * *

జయకాల్ పెద్దన్న మైకాల్ పరమక్రూరుడు. జయకాల్ కొన్నాళ్ళు అతనితో కలసి కారడవికి ద్రోహం చేద్దామని చూశాడు. ఆ ఎత్తుగడలేవీ ఫలించలేదు.

ఒకసారి మైకాల్ కారడవిని మట్టుపెట్టడంలో సొంత తమ్ముడి ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడ లేదు. ఈ సంఘటన జయకాల్ కన్ను తెరిపించింది. అతడికి జన్మస్థలమైన కారడవిపై ప్రేమకూడా పెరిగింది. మనసు మారిన జయకాల్ షేర్‌సింగ్, బిహారీ మొదలైనవారిని శరణువేడి తిరిగి కారడవిలోకి ప్రవేశించాడు.

జయకాల్ తన దుష్టస్వభావాన్ని వదిలిపెట్టి అడవికి పనికివచ్చే పనులు చేయసాగాడు. అతడి ఏకాగ్రతని చూసి కోతి బిహారి సలహాతో జయకాల్‌ని అడవికి సమాచారమంత్రిగా చేశారు. జయకాల్ సలహాతో అడవిలో రేడియో స్టేషను, టీవీస్టేషను ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి జంతువులు కారడవిలో మొబైలు ఫోనుతోపాటు, పాకెట్ ట్రాన్సిస్టర్లని కూడా పట్టుకుని తిరుగసాగారు. తుఫాను, వరదలువంటి వాతావరణం సూచనలు తెలియడంవలన వారికి చాలా లాభమైంది. వేసవికాలంలో మండుతున్న ఎండలో చెట్టునీడన



SCERT TELANGANA

కూర్చుని పాటలు వినే ఆనందం దొరికింది. చలికాలపు సుదీర్ఘ రాత్రుళ్ళలో టెలివిజన్ సినిమాలు చూసి ఆనందం పొందసాగారు.

జయకాల్ తాను ప్రసారంచేసే కార్యక్రమాలు మనోరంజకంగా, ఉత్తేజంగా ఉండేలా చేయడానికెప్పుడూ సతమతమవుతూ ఉండేవాడు. అప్పుడే అతనికి ఒక ఆలోచన తట్టింది. అతడు జర్మనీ, జపాను, చైనా, అమెరికా వంటి ఎన్నో దేశాలకు ఉత్తరాలు రాసి, వారు తమ దేశాల్లో సర్కసుల్లో బంధించిన జంతువులను విడిచిపెట్టి కారడవికి పంపమని విన్నవించుకున్నారు. వారు మా గౌరవనీయ కళాకారులు. వారు ఇక్కడ మా ప్రసార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పనికి జయకాల్ ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణకు చెందిన సంస్థల సహకారం కూడా అడిగాడు. జయకాల్ విన్నపానికి ప్రపంచంలోని అన్ని దేశాలవారు సహకారం అందిస్తామని ఉత్తరాలు రాయసాగారు. ఎందరో పర్యావరణవేత్తలు అతనికి అభినందనలు చెబుతూ 'ఇది చాలా మంచిపని అనీ, దీనికి సాయపడడానికి తాము సిద్ధంగా ఉన్నామని' సందేశాలు పంపారు.

నేను ప్రపంచదేశాలకి నా ధన్యవాదాలు తెలుపుతున్నాను. వారు నా విన్నపంతో సర్కసు జంతు కళాకారులను కారడవికి పంపుతున్నారు. మీరంతా తొందరలోనే వాటి కార్యక్రమాలని కారడవి రేడియో, టీవీలలో వినవచ్చు, చూడవచ్చు." అన్నాడు జయకాల్.

కారడవి టీవీలో అన్ని సర్కసులనుంచి వచ్చిన సింహాలు, ఎలుగుబంట్లు, కోతులు, పక్షులు తమ మనోహరమైన విన్యాసాలను చూపించసాగారు. నృత్యాలు, సంగీతం, నాటకం మొదలైన కార్యక్రమాలు కూడా ప్రసారమవుతూ ఉండేవి. ఆ టీవీ ఛానెల్ తొందరలోనే జనుల ప్రియమైన ఛానెల్ అయిపోయింది. అన్ని దేశాలవాళ్ళు దీనిని చూడసాగారు.

కారడవి టీవీ చానెల్ జనప్రియ ఛానెల్గా మారడానికి మరొకకారణం – దీనిలో కార్టూన్ చిత్రాల కథలు సజీవంగా చూపబడేవి. ప్రపంచంలోని పిల్లలందరూ దీనిని ఇష్టపడేవాళ్ళు. ప్రపంచంలోని ఎందరో పర్యావరణ ప్రేమికులు కూడ దీనిని ప్రశంసించేవారు. ఎందుకంటే ఈ ఛానెల్ వన్యజంతువుల భద్రత, వివిధరకాల జంతువుల నుంచి రక్షించుకోవడానికి సంబంధించిన వివరాలు తెలియజేసేది. దీనిలో ఒక వార్తాబులెటిన్ కూడ ప్రసారం చేయబడేది. దీనిలో ప్రపంచంలోని వన్యప్రాణుల నేటిపరిస్థితి, వాటిమీద జరుగుతున్న అత్యాచారాల వాస్తవకథలు ప్రసారమవుతూ ఉండేవి.


కారడవి వెబ్సైట్, కారడవి టి.వి, ఛానెల్, కోతి బిహారి కంప్యూటర్ సెంటర్ మొదలైనవాటితో కోతి బిహారి కారడవి ప్రతిష్ఠని మరింత పెంచాడు. ఇప్పుడు కారడవి ప్రపంచంలోని అడవులన్నింటికీ ఆదర్శవంతమైన అడవి. దీని వెనుకనున్న ముఖ్యపాత్ర కోతి బిహారీయే!

www. **కారడవి.కామ్.**

**నేషనల్ బుక్ట్రస్ట్**

SCERT TELANGANA

ఉపవాచకం



అందరిలాగే సామాన్య కుటుంబంలో జన్మించింది...
నాటి సామాజికస్థితికి అనుగుణంగా బాల్యవివాహం జరిగింది...
భర్త ప్రోత్సాహంతో చదువుకుంది. ఒక్కో మెట్టు ఎదిగింది...
రాజకీయ అవగాహనతో చురుగ్గా ఉద్యమాల్లో పాల్గొంది...
సాయుధ పోరాటంలో పాల్గొని తుపాకీ పట్టింది...
శాసనసభ్యురాలై ప్రజాసమస్యల్ని పరిష్కరించింది...
తెలంగాణ జనం గుండెల్లో చిరస్మరణీయురాలైంది...
ఆమె ఎవరో ఇంతవరకూ చెప్పలేదుకదూ!
ఇన్ని విశిష్టతలున్న తెలంగాణ మహిళాతేజం ఆరుట్ల కమలాదేవి!

# 5. ఆరుట్ల కమలాదేవి

ప్రజలే తన దేవుళ్ళన్న
పవిత్ర ఆత్మకు జేజేలు!
సమానత్వమే సార్థకతయని
నమ్మిన సాధ్వికి జేజేలు!!

కొందరు పుట్టి భూమికి భారమవుతారు. ఎక్కువమంది కుటుంబం కోసం శ్రమిస్తారు. కొద్దిమంది మాత్రమే అందరికోసం తమ జీవితాలను అంకితం చేస్తారు. అట్లాంటి కొద్దిమందిలో ఆరుట్ల కమలాదేవి ఎర్రగులాబీలా వికసించి తాను పుట్టిన నేల తల్లి పాదాలపై రాలిపోయింది.

తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు. ఉన్నత ఆశయాలు కల్గిన కమ్యూనిస్టు. ఆంధ్రరాష్ట్ర మహిళా ఉద్యమ నిర్మాణంలో నిరంతర కృషి చేసిన ధీరవనిత. నిజాం పాలనను అంతమొందించుటకు జరిగిన పోరాటంలో నిస్స్వార్థంగా, అంకితభావంతో పోరాటం చేసిన వీరవనిత ఆరుట్ల కమలాదేవి.

**బాల్యం – వివాహం :**

ఆరుట్ల కమలాదేవి యాదాద్రి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో పుట్టింది. పుట్టినపుడు తల్లిదండ్రులు ఆమెకు రుక్మిణి అని పేరుపెట్టారు. మధ్యతరగతి రైతుకుటుంబం వారిది. అది నిజాం పాలనలో పౌరహక్కులకు స్వేచ్ఛ లేని కాలం. సనాతన ఆచారాలు, మూఢవిశ్వాసాలు, కులమతతత్త్వం, అంటరానితనం వ్యవస్థని శాసిస్తున్న రోజులవి. పల్లెటూర్లలో పాఠశాలలు ఉండేవి కావు. ఆరోజులలో ఆడపిల్లలకి చదువులు ఊహించడం కూడా తప్పే. అందువల్ల రుక్మిణి బాల్యం ఇంటికే పరిమితమయ్యింది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

ఆడపిల్లలకు బాల్యంలోనే వివాహాలు చేయడం ఆచారంగా ఉండేది. రుక్మిణికి 11 సంవత్సరాల వయసు రాగానే తల్లిదండ్రులు పెళ్ళిచేయాలని నిశ్చయించారు. రుక్మిణి పుట్టినపుడే మేనమామ కొడుకు ఆరుట్ల రామచంద్రారెడ్డి భార్య అవుతుందని రెండు కుటుంబాలు నిశ్చయించుకున్నవి.

అప్పటికే ఆరుట్ల రామచంద్రారెడ్డి హైదరాబాదులో విద్యార్థిగా, రెడ్డి వసతిగృహంలో ఉంటూ ఆంధ్రమహాసభ సభ్యుడిగా, కాంగ్రెస్ కార్యకర్తగా, వందేమాతరం ఉద్యమకారుడిగా గుర్తింపు పొందాడు. తల్లిదండ్రులు పెళ్ళి ప్రస్తావన తేగానే బాలికగా ఉన్న రుక్మిణికి అప్పుడే పెళ్ళేందుకన్నడు. కొన్ని షరతులతో పెళ్ళికి అంగీకరించాడు. "పెళ్ళి సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా ఆర్యసమాజం పద్ధతిలో జరగాలి. కట్నకానుకల పద్ధతి ఉండకూడదు. పెళ్ళయిన తరువాత రుక్మిణి తన సహచరిగా రాజకీయాలలో పాల్గొనాలి." అన్నాడు రామచంద్రారెడ్డి. ఇరు కుటుంబాలవారు షరతులు ఒప్పుకున్నారు. వివాహం జరిగింది. వివాహవేదికపై రుక్మిణి పేరును కమలాదేవిగా మార్చారు. కమలాదేవిని తీసుకొని రామచంద్రారెడ్డి హైదరాబాద్ చేరాడు.

### చదువులతల్లి :

రామచంద్రారెడ్డి కమలాదేవిని చదివించాలని అనుకున్నాడు. కమలాదేవి ఈ వార్త విని ఎంతగానో సంతోషించింది. మాడపాటి హన్మంతరావు నెలకొల్పిన బాలికల పాఠశాలలో చేరింది. ఎక్కడ ఉండాలన్నది సమస్య. దంపతులిద్దరూ రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డిగారిని కలిసి బాలికలకు హాస్టల్ ఏర్పాటుచేయాలని కోరారు. దానికి వారు సరేనని బాలికల హాస్టల్ ఏర్పాటు చేశారు. ఆ బాలికల హాస్టల్‌లో కమలాదేవి ప్రథమ విద్యార్థిగా ప్రవేశించింది. పట్టుదలతో చదివి మెట్రిక్ పూర్తిచేసింది. విద్యతోపాటు రాజకీయాలు అర్థంచేసుకుంది. మహిళా ఉద్యమాలలో పాల్గొన్నది.

### నాటి తెలంగాణ గోస :


అప్పుడు తెలంగాణలో నిజాం రాచరిక పాలన ఉండేది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల ఆలోచనల ప్రకారం నిజాంపాలన సాగేది. సంస్థానాధీశులు, దేశ్‌ముఖ్‌లు లక్షల ఎకరాల భూమిని తమ ఆధీనంలో ఉంచుకునేవారు. భూస్వాములు, గ్రామీణ పెత్తందార్ల క్రింద గ్రామ ప్రజలు, రైతులు కష్టాలు పడ్డారు. అన్ని కులాలవారు అణిగి ఉండాల్సిందే. వెట్టిచాకిరి పేరుతో ప్రతిఫలం లేకుండా భూస్వాముల ఇండ్లలో పనిచేయాలి. తిరగబడితే దండన. ఇంటిలో పెంచుకున్న కోడినో, కుక్కనో చంపినట్లుగా పేదలను చంపినా అడిగేవారు లేరు. చట్టం లేదు; తెలుగుభాషలో చదువుకునే అవకాశాలు లేవు. పాఠశాలలు, గ్రంథాలయాల స్థాపనకు అడ్డంకులుండేవి. ఇట్లాంటి గోసను కమలాదేవి సహించలేక పోయింది. ఇట్లాంటి కష్టాలు ఆమెలో ఉద్యమభావాలకు ప్రాణం పోశాయి. 1944 లో పుట్టిన కొడుకుకు 'విప్లవం' అని పేరుపెట్టింది. పురిటిబిడ్డను చుట్టాలదగ్గర వదిలేసి కమలాదేవి ఉద్యమ కదనరంగానికి కదిలింది.



SCERT TELANGANA

## అక్షరాస్యతకై పోరాటం :

చల్లని వెన్నెలవంటి చిరునవ్వు
అమృతంకురిసే ఆత్మీయమైన పలకరింపు
వయోభేదాలు పాటించని మమతల హరివిల్లు
మృదుమధురమైన మాటల పూలజల్లు



కురిసే కమలాదేవి జాతీయ భావాలతో ఎదుగుతూ, ఇతరులకు ఏదైనా సాయంచేయాలని నిరంతరం తపనపడేది. తనలాగే తన ఊరి జనులు చదువుకోవాలని ఆకాంక్షించింది. కొలనుపాకలో పాఠశాల స్థాపించాలని అనుకున్నది. అప్పుడు ఊరిలో బడిలేదు. అది జాగీర్ గ్రామం. బడిపెట్టాలన్నా, గ్రంథాలయం నడపాలన్నా ఆంక్షలు ఉండేవి. వంటశాల పేరుతో తలుపులూ, కిటికీలూ లేని స్థలంలో విద్యార్థులను పోగుచేసి కమలాదేవి బడిని, గ్రంథాలయాన్ని నడిపింది. కొంతకాలానికి ఈ విషయం జాగీర్దారులకు తెలిసిపోయింది. వారు ఈ కేంద్రాన్ని మూసివేయించారు. కొలనుపాకలో పురాతన జైన దేవాలయమున్నది. ఆ నిర్వాహికులనడిగి అక్కడ ఒక ఏడాదిపాటు బడి నడిపి గ్రామీణ వయోజనులను అక్షరాస్యులుగా మార్చింది. దానితోపాటు రానున్న మహాసంగ్రామానికి రైతుకూలీలను సమరోన్ముఖులను గావించింది.

## ఉద్యమంలో కాళిక :

నిజాం నిరంకుశత్వంపై పిడికిలెత్తిన సబల!
శత్రువుపై విరుచుకుపడిన వీరనారి!!


రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులవి. ఒకవైపు ప్రపంచయుద్ధాలు, రెండవవైపు తెలంగాణలో ప్రజోద్యమజ్వాలలు. ఆంధ్రమహాసభ ఒక ఉద్యమంగా రూపొందుతున్న సందర్భం. ఇటువంటి సమయంలో స్త్రీలకు ఆత్మరక్షణ అవసరమని భావించింది కమలాదేవి. కమ్యూనిస్టుపార్టీవారు నిర్వహించిన "మహిళా ఆత్మరక్షణ శిక్షణ శిబిరం"లో సైనిక శిక్షణ పొందింది. తుపాకి పట్టింది. భర్తతోపాటు తెలంగాణ సాయుధ సమరంలో అడుగుపెట్టింది. రజాకార్లతో, నిజాం పోలీసులతో జరిగిన ప్రతిఘటన పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నది. చల్లూరు గుట్టల్లో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అపరకాళికవలె విజృంభించింది. పరాక్రమాన్ని ప్రదర్శించింది. అమెరికన్ రైఫిల్‌తో శత్రువులను తిప్పికొడుతూ దళానికి నష్టం వాటిల్లకుండా కాపాడింది.

ఈ పోరాటంలో జబ్బుపడింది. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నిజాం పోలీసులు కమలాదేవిని అరెస్టుచేశారు. వరంగల్, ఔరంగాబాద్, సికింద్రాబాద్ మొదలైన జైళ్ళలో శిక్షలను భరించింది. వేలాదిమంది బలిదానంతో, వీరుల త్యాగాలతో నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి చెందింది. తెలంగాణ విమోచన స్వర్ణోత్సవాల సందర్భంగా అనేక సంస్థలు ఆరుట్ల కమలాదేవిని సత్కరించాయి. ఆరుట్ల కమలాదేవి నిజంగా...


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22
SCERT TELANGANA

అరణ్య, అజ్ఞాతవాసాలు భరించిన సాహసి
జైల్లోనూ హక్కులకోసం పోరాడిన ధీశాలి
భూస్వాముల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించిన విప్లవయోధ
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎగిసిన అగ్నిజ్వాల!!

### రాజకీయ చైతన్యం :



1952 మొదటి సాధారణ ఎన్నికలలో ఆలేరునుండి అత్యధిక ఓట్ల మెజారిటీతో శాసనసభకు ఎన్నికైంది. 1967 వరకు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి ప్రజల ఆదరాభిమానాలను పొందింది. 1964 లో శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు నిర్వహించింది. స్వతంత్ర భారతదేశంలోని రాష్ట్రాల్లో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకురాలుగా చరిత్ర సృష్టించింది. ప్రజల దైనందిన సమస్యలపై అసెంబ్లీ లోపల, బయట క్రియాశీలంగా పోరాడింది. పలు సమస్యలపై శాసనసభలో చర్చలు జరిగి నప్పుడు వారి ప్రసంగంలో హుందాతనం, ఉన్నతభావాలు, ప్రజల సమస్యలపై అవగాహన, స్పష్టంగా కనిపించేది. 1998లో కాకతీయ విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

### విశిష్ట వ్యక్తిత్వం :

కమలాదేవిది సహృదయం. సత్యాన్వేషి ఆమె. కష్టజీవుల కడగండ్లు చూస్తూ కన్నీరుపెట్టే కరుణామయి. కష్టాలనుండి శాశ్వత విముక్తిని సాధించేవరకు నిద్రపోని వ్యక్తిత్వం ఆమెది. ఆమె ధన్యజీవి. తెలుగు మహిళలకు వెలుగుబాట చూపిన పుణ్యమూర్తి. గొప్ప మానవతావాది.

కమలాదేవి కార్యశీలతలో నాయకత్వ లక్షణాలు అడుగడుగునా కనిపించేవి. ఆమె చూపులోను, నడుముకు కట్టిన కొంగులోను, కత్తిలాగ పట్టుకునే కలంలోనూ అవి కనిపించేవి. ఆమెను కొత్తగా చూసినవారికి ఒక గృహిణిగా, ఒక మాతృమూర్తిగా, ఒక సాధారణ మధ్యతరగతి మహిళగా కనిపించేది. ఆమె ఎవ్వరితోనూ మహానాయకురాలిగా ప్రవర్తించలేదు.

ఉన్నతాశయాలతో ఉత్తమ వ్యక్తిత్వంతో పరిపూర్ణమైన జీవితాన్ని గడిపిన ఆరుట్ల కమలాదేవి జనవరి 1వ తేది 2001న ఈలోకం విడిచింది. కాని తెలంగాణ పల్లె తల్లుల చిరునవ్వుల్లో బతికే ఉన్నది.

# పదాలు - అర్థాలు

**అ**

అంబరం = వస్త్రం / బట్ట
అంబలి = రాగుల (తైదలు) పిండితో వండిన ద్రవాహారం
అంతరిక్షం = ఆకాశం
అంతరించిపోవు = నశించిపోవు
అతిశయోక్తి = ఎక్కువచేసి చెప్పడం
అతివేల = చాలా
అదృశ్యం = కనిపించకుండ ఉన్నది / కనిపించనిది
అద్భుతం = ఆశ్చర్యం కలిగించేది
అద్దకం = వస్త్రానికి రంగువేసే విధానం
అనిశం = ఎల్లప్పుడు

**ఆ**

ఆంగికం = అవయవ సంబంధమైనది
ఆకర్షించు = ఆకట్టుకొను
ఆకాంక్ష = కోరిక
ఆత్మజుడు = పుత్రుడు, కొడుకు
ఆదరణీయం = ఆదరించదగినది, గౌరవించదగినది
ఆపాదమస్తకం = పాదం నుండి తలదాకా
ఆవాసం = ఇల్లు / నివాసం

**ఈ**

ఈర్ష్య = అసూయ, ఓర్వలేనితనం, కండ్లమంటతనం

**ఉ**

ఉపేక్ష = అశ్రద్ధ, లెక్కచేయక పోవడం
ఉభయతారకం = ఇరువురికి మేలు జరగడం
ఉవ్విళ్ళూరు = తహతహలాడు
ఉషస్సు = తెల్లవారుజాము

**ఏ**

ఏకాగ్రత = ఒకే విషయంపై మనస్సు నిల్పడం
ఏది = ఎవరి

**ఒ**

ఒండె = కాని, అటుకాని పక్షాన
ఒరులు = ఇతరులు

**ఔ**

ఔషధం = మందు

**క**

కంఠీరవం = సింగం, సింహం
కబుర్లు = ముచ్చట్లు, మాటలు
కరి = ఏనుగు
కలిమి = సంపద, సొమ్ము
కల్ల = అబద్ధం
కలకాలం = ఎల్లప్పుడు, ఎల్లకాలం
కాలుష్యం = మలినం, మురికి
కూడు = బువ్వ
కెరటాలు = అలలు
కొలిమి = కమ్మరివారు ఇనుమును కాల్చే స్థలం (జాగా)
కొట్టం = పశువుల పాక, చపారం
కొండ్ర = దున్నిన సాలు
కోలాటం = కోలలు పట్టుకొని ఆడే ఆట

**గ**

గణించి = ఎంచి, లెక్కపెట్టి
గహ్వరం = గుహ
గోదలు = ఎద్దు

**ఘ**

ఘటించు = కలుగు

**చ**

చిద్విలాసం = జ్ఞానప్రకాశం
చిల్వ (చిలువ) = పాము
చెలిమి = సోపతి, స్నేహం
చేటు = ముప్పు, ఆపద
చేవ = శక్తి

SCERT TELANGANA

**జ**

జడాశయుడు = జడమైన మనస్సుకలవాడు
జపమాల = జపం చేస్తున్నప్పుడు లెక్కపెట్టే పూసలదండ
జమీందార్లు = భూస్వాములు, కొన్ని గ్రామాలకు ఏలికలు
జిజ్ఞాస = తెలుసుకోవాలనే కోరిక
జీవగడ్డ = చైతన్యంతో తొణికిసలాడుతున్న భూమి

**డ**

డొక్క = కడుపు

**త**

తస్కరులు = దొంగలు
తావి = సువాసన
తృణం = గడ్డి
తృష్ణ = కోరిక
తెలిఱాతి = తెల్లరాతి
తెహజీబ్ (ఉర్దూ) = సంస్కృతి
తేటి = తేనెటీగ
త్యజించు = వదిలిపెట్టు / విడిచిపెట్టు

**ద**

దానవుడు = రాక్షసుడు
దాస్యం = బానిసతనం
దీప్తి = కాంతి
దేవస్థలాలు = దేవాలయాలు
దేహం = శరీరం, పెయ్యి
ద్విజుడు = బ్రాహ్మణుడు

**ధ**

ధరణి = భూమి
ధ్యానం = ఏకాగ్రత

**న**

నిందించు = తిట్టు
నిర్మితి = నిర్మాణం
నెలవంక = చంద్రవంక
నేర్పరులు = నైపుణ్యంగలవారు
నేర్పు = నైపుణ్యం

**ప**

పడిషం = జలుబు, సర్ది
పయోనిధి = సముద్రం
పరోపకారం = ఇతరులకు మేలు చేయడం
పసవు = పసుపు (రంగు)
పాషాణం = బండ
పెంద్యూలం = లోలకం
ప్రతిమ = బొమ్మ
ప్రతిష్ఠ = కీర్తి
ప్రసిద్ధి = ఖ్యాతి
ప్రాంగణం = ముంగిలి (వాకిలి)

**బ**

బాదరాయణుడు = వ్యాసుడు

**భ**

భంగాలు = అలలు
భయద = భయాన్ని కల్గించేది

**మ**

మత్స్యకారులు = చేపలుపట్టేవారు
మధువు = తేనె
మనోరంజనం = మనస్సును సంతోషపెట్టేది
మనోహరం = ఇంపైనది, చక్కనైనది
మాగాణం = తరిపొలం
మావులు = మామిడితోటలు
మీను = చేప
ముట్టె = పందిముక్కు, పాత్రం
ముప్పు = ప్రమాదం
మేలుకొలుపు = నిద్రలేపు
మైనస = మేని దురద

**ల**

లుప్తం = లోపించింది
ల్యాగ = దూడ

**వ**

వలగొను = అల్లుకొను
వసుధ = భూమి, నేల
వక్త్రం = మొగం, ముఖం
వాచవి = నోటి రుచి

SCERT TELANGANA

| | | | | | |
|---|---|---|---|---|---|
| వాలం | = | తోక | | | |
| వాగ్దానం | = | మాట ఇవ్వడం | | | స |
| విపినం | = | అడవి | సంజ్ఞ | = | పేరు, గురుతు |
| వీనులవిందు | = | వినడానికి నచ్చిన | సమరం | = | ఓర్పు |
| వెరుగు | = | భయం, బుగులు | సాదృశ్యం | = | పోలిక |
| వేడుక | = | పండుగ | సాంగత్యం | = | సోపతి, స్నేహం |
| వ్యాఖ్యానించు | = | వివరించు, చెప్పు | సున్నితం | = | మెత్తని, సుకుమారం |
| | | శ | సృజన | = | సృష్టి |
| శిరం | = | తల, నెత్తి | సైన్యపాలి | = | సైన్యపాలకుడు, సేనాని |
| శృంగం | = | కొమ్ము | సౌజన్యం | = | మంచితనం |
| శోభ | = | కాంతి, వెలుగు | స్పందన | = | కదలిక |
| శౌర్యం | = | శూరత్వం | స్వప్నం | = | కల |
| | | | | | హ |
| శ్రేష్ఠం | = | ఉత్తమం, గొప్పది | హరిత్తు | = | సింహం |

## పర్యాయ పదాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అల | = | కెరటం, తరంగం | చెట్టు | = | తరువు, భూరుహం, వృక్షం |
| అంగడి | = | దుకాణం, విపణి, మడిగె | చెఱువు | = | తటాకం, సరస్సు |
| అమ్మ | = | తల్లి, మాత, జనని | చేప | = | మీనం, మత్స్యం |
| ఆత్మజుడు | = | కుమారుడు, కొడుకు, పుత్రుడు, తనయుడు, సుతుడు | దాత | = | త్యాగి, వితరణశీలి, ఉదారుడు |
| | | | దూడ | = | లేగ, క్రేపు, పెయ్య |
| ఆనందం | = | సంతోషం, హాయి, సుఖం | నీరు | = | జలం, సలిలం, ఉదకం |
| ఆశ | = | కోరిక, కాంక్ష, వాంఛ | పల్లె | = | గ్రామం, ఊరు, జనపదం |
| ఆసక్తి | = | అపేక్ష, అనురక్తి, శ్రద్ధ | పసిడి | = | కాంచనం, పుత్తడి, బంగారం, హేమం, కనకం |
| ఇల్లు | = | గృహం, సదనం, నివాసం, ఆవాసం | | | |
| | | | పక్షి | = | పులుగు, విహంగం, ఖగం |
| ఈర్ష్య | = | అసూయ, ఈసు, మత్సరం | పిల్లి | = | బిడాలము, మార్జాలం |
| ఏనుగు | = | కరి, హస్తి, ఇభం, గజం | పులి | = | శార్దూలం, వ్యాఘ్రం |
| కంచు | = | కంచం, కాంస్యం | పూజ | = | అర్చన, సపర్య |
| కిరణం | = | రశ్మి, వెలుగు, శిఖ | భర్త | = | పతి, నాథుడు, మగడు, మొగుడు, పెనిమిటి |
| కుందేలు | = | చెవులపిల్లి, శశం, శరభం | | | |
| గోవు | = | ఆవు, ధేనువు, సురభి | భార్య | = | పత్ని, ఆలు, ఇల్లాలు, పెండ్లం |

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

| | | | | | |
|---|---|---|---|---|---|
| మైత్రి | = | స్నేహం, నెయ్యం, సాంగత్యం, సోపతి | వ్యవసాయం | = | కృషి, సేద్యం, కాపుదనం |
| రణం | = | యుద్ధం, సమరం, ఆజి | విగ్రహం | = | ప్రతిమ, ప్రతిబింబం, ప్రతికృతి, ప్రతినిధి |
| రథము | = | తేరు, స్యందనం, అరదము | శరీరము | = | దేహం, తనువు, పెయ్యి |
| రైతు | = | కర్షకుడు, కృషీవలుడు | సన్న్యాసి | = | భిక్షువు, జడధారి, యతి, ముని |
| వసుధ | = | భూమి, ధరణి, ధరిత్రి, అవని, నేల | సూక్తి | = | మంచిమాట, సుభాషితం |

## నానార్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| అంగడి | = | సంత, మడిగె | పశువు | = | గొఱ్ఱె, బలికి ఇచ్చు మృగం, మేడిచెట్టు, ప్రమథగణం, |
| కంఠీరవం | = | మదగజం, పావురం, సింహం | పాదము | = | పద్యపాదం, కాలిఅడుగు భాగం, కిరణం, పాతికభాగం, వేరు |
| కులం | = | వంశం, జాతి, శరీరం, ఊరు, ఇల్లు, నేతిపొట్ల, దేశం, పిల్లి | బలి | = | బలిచక్రవర్తి, గంధకం, చర్మపు ముడుతలు, దున్నపోతు, బలవంతుడు, అర్పణం, పన్ను |
| కేసరి | = | సింహం, గుఱ్ఱం, శ్రేష్ఠుడు, హనుమంతుని తండ్రి, మాదీఫలం, పున్నాగం | భంగము | = | ఆటంకము, అల |
| చైతన్యం | = | జ్ఞానం, జీవం | వాలం | = | తోక, తలవెంట్రుక, కత్తి, పులి |
| తగవు | = | జగడం, వ్యాజ్యం, పద్ధతి, మేలు, యుక్తం, న్యాయం, తీర్పు | వెరవు | = | ఉపాయం, విధం, వశం |
| ధనం | = | విత్తం, ఆస్తి, ఆవులమంద, ధనియం, ధనిష్ఠా నక్షత్రం | వ్యవసాయం | = | కృషి, పరిశ్రమ, ప్రయత్నం, పాటుపడుట, నిశ్చలబుద్ధి |
| ద్విజుడు | = | బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు | శాఖ | = | కొమ్మ, వేదభాగం |
| నేర్పు | = | అభ్యసించు, సామర్థ్యం, విజ్ఞానం | శ్రీ | = | సాలెపురుగు, బుద్ధి, సరస్వతి, లక్ష్మి, పార్వతి, అలంకారం, ఒకరాగం, విషం, సంపద |
| పద్మం | = | కమలం, పాము, ఒకనిధి, సంఖ్యావిశేషం | | | |
| ప్రతిష్ఠ | = | కీర్తి, స్థాపన | హాస్యం | = | నవ్వు, పరిహాసం |

SCERT TELANGANA

## ప్రకృతి-వికృతులు

| ప్రకృతి | - | వికృతి | ప్రకృతి | - | వికృతి |
|---|---|---|---|---|---|
| ఆశ | - | ఆస | పుణ్యం | - | పున్నెం |
| ఆకాశం | - | ఆకసం | పుస్తకం | - | పొత్తం |
| ఆశ్చర్యం | - | అచ్చెరువు | పూర్ణిమ | - | పున్నమ |
| ఆహారం | - | ఓగిరం | భక్తి | - | బత్తి |
| కథ | - | కత | భాగవతం | - | బాగోతం |
| కవిత | - | కైత | ముఖం | - | మొగం |
| కార్యం | - | కర్జం | రాత్రి | - | రాతిరి |
| కుల్య | - | కాలువ | వర్ణం | - | వన్నె |
| చిత్రం | - | చిత్తరువు | శిఖ | - | సిగ |
| దిశ | - | దెస | సంతోషం | - | సంతసం |
| నిద్ర | - | నిద్దుర | సంధ్య | - | సంజ |
| పర్వం | - | పబ్బం | సింహం | - | సింగం |
| పక్షి | - | పక్కి | స్తంభం | - | కంబం |
| పశువు | - | పసరం | స్నానం | - | తానం |

## వ్యుత్పత్త్యర్థాలు

కమలాకరం = కమలాలకు ఆకరమైనది - కొలను

తటాకం = జలంచే కొట్టబడినది (నిండినది) - చెఱువు

పద్మాకరం = పద్మాలకు నెలవైనది - కొలను (చెఱువు)

వసుధ = ద్రవ్యాదులను ధరించునది - భూమి

రమానాథుడు = రమ (లక్ష్మికి) భర్త అయినవాడు - విష్ణువు

పయోనిధి = నీటికి నిధివంటిది - సముద్రం

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

# విశేషాంశాలు

## చదువు

**సారస్వతం :** సరస్వతీ సంబంధమైనది సారస్వతం. చదువును, జ్ఞానాన్ని, పాండిత్యాన్ని, సాహిత్యాన్ని సారస్వతమని వ్యవహరిస్తున్నాం.

**ధ్రువా ప్రబంధం :** ప్రబంధ విశేషం. గీత ప్రబంధ కావ్యం. (సంగీత నాట్య సాహితీ విశేషం)

**కళలు :** మానవ జీవన పరిణామంలో నైపుణ్యంతో, సౌందర్యదృష్టితో సాధించిన ప్రజ్ఞావిశేషమే కళ. ఇది మానసిక ఆనందాన్నిస్తుంది. కళలు అరవై నాలుగు.

## శతక పద్యాలు

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అని శ్రీరాముడు చెప్పాడు అని ప్రతీతి. కన్నతల్లి, జన్మభూమి స్వర్గంకన్నా మిన్న అని భావం.

## అమ్మ జ్ఞాపకాలు

**ఆయుర్వేదం :** వనమూలికల ఔషధాల ద్వారా చికిత్స చేసి ఆయుష్షును పెంచే వైద్యవిధానం ఇది.

**జమీందారు :** జమీన్ అంటే ఉర్దూభాషలో భూమి అని అర్థం. భూమితోపాటు పాలనాధికారాలు కూడా వీరి సొంతం. వీరినే భూస్వాములు అంటారు.

**వరాహావతారం :** దశావతారాల్లో మూడో అవతారం. హిరణ్యాక్షుడనే రాక్షసుణ్ణి వధించడానికి విష్ణుమూర్తి ఎత్తిన అవతారమే వరాహావతారం.

## పల్లె అందాలు

**అర్ఘ్యం :** చేతులు కడుక్కోవడానికి ఇచ్చే నీళ్ళు. సూర్యుని కోసం సమర్పించే నీళ్ళను కూడా అర్ఘ్యం అని వ్యవహరిస్తారు.

**ముత్తైదువ :** ముత్తులు (పసుపు కుంకుమ, మాంగల్యం, మట్టెలు, ముక్కెర, గాజులు) అయిదు కల్గిన స్త్రీ. సుమంగళి అయిన స్త్రీగా జనవ్యవహారం. (ముక్కెరకు బదులు 'పూలు', 'పాపిట సింధూరం' లను చెప్తున్నారు)

**పద్మశాలీయులు :** ప్రాచీనకాలంలో పద్మపు తూడునుండి తీసిన నారతో వస్త్రాలు తయారుచేసే వారిని పద్మశాలీయులు అనేవారు. ఆధునికకాలంలో వీరు అన్నిరకాల వస్త్రాలు నేస్తున్నారు.

## ప్రేరణ

**ఏరోనాటికల్ ఇంజనీరింగ్ :** విమానాల తయారీకి సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం.

**హెచ్.ఏ.యల్. :** హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (భారతీయ విమానయాన నిర్మాణ సంబంధిత సంస్థ)

**ఎం.ఐ.టి. :** మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.

## శిల్పి

**అజంతా గుహలు :** మహారాష్ట్రలో ఔరంగాబాదుకు 55 మైళ్ళ దూరంలో ఉన్న గుహలివి. జాతక కథలు కుడ్య చిత్రాలుగా ఉన్న అజంతా గుహలన్నీ భారతీయ చిత్రకళకు నిదర్శనాలు.

SCERT TELANGANA

## శ్రీలు పొంగిన జీవగడ్డ

**నవరసాలు :** శృంగారం, వీరం, కరుణం, అద్భుతం, హాస్యం, భయానకం, బీభత్సం, రౌద్రం, శాంతం. వీటిని నవరసాలు అంటారు.

**ఆపస్తంబ, అశ్వలాయన సూత్రాలు :** ఆపస్తంబుడు, అశ్వలాయనుడు మానవ జీవన విధానానికి సంబంధించిన ధర్మాలను (సూత్రాలను) తెలిపారు.

## గ్రామాలలో వేడుకలు – క్రీడలు, వినోదాలు

**ఇంద్రజాలం :** ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కనికట్టు చేసి చూపే ప్రదర్శనావిద్య. ఆంగ్లంలో దీనిని మ్యాజిక్ అంటాం.

**మల్లయుద్ధం :** దేహదారుఢ్యం కలిగిన వస్తాదులు ఒకరితో ఒకరు కలెబడే బాహుసంబంధ యుద్ధవిద్య.

**యక్షగానం :** జక్కులు అనే తెగవారు ఆడుతూ పాడేవి యక్షగానాలు. ఇదొక ప్రదర్శనాకళ. ఇది నాటకానికి పూర్వరూపం.

**కొరవి జాతర :** వరంగల్ జిల్లా మానుకోట సమీపంలోని కొరవి గ్రామంలో జరిగే జాతర. ఇక్కడ వీరభద్రస్వామి పూజలందుకొంటాడు.

**ఐనవోలు జాతర :** వరంగల్ జిల్లా మామునూరు సమీపంలోని ఐనవోలు గ్రామంలో ప్రతి సంవత్సరం శివరాత్రికి మల్లన్న జాతర జరుగుతుంది. ఐలోని మల్లన్న జాతరగా జనవ్యవహారం.

**మేడారం జాతర :** ప్రతి రెండు సంవత్సరాల కొకసారి వరంగల్ జిల్లాలో జరిగే జాతర. ఇక్కడ గిరిజన దేవతలైన సమ్మక్క, సారలమ్మలను కొలుస్తారు. భారతదేశంలో జరిగే అతిపెద్ద జాతర ఇది.

**కోలాటం :** రెండు చేతుల్లో రెండు కోలలు (కర్రలు) పట్టుకుని, వాటిని లయబద్ధంగా తాకిస్తూ పాటపాడుతూ ఆడే ఆట కోలాటం. ఇదొక బృంద నాట్య విశేషం.

## రాణి శంకరమ్మ

**మెతుకు సీమ :** నేటి మెదక్ జిల్లా. ఒకప్పుడు ఇక్కడ (వరి అధికంగా పండించేవారు) మెతుకులు అధికంగా దొరికేవి కాబట్టి మెతుకుసీమ అన్నారు. మంజీరకదేశం, గుల్షనాబాద్ అని కూడ గతంలో పిలిచేవారు.

**రాయబాగిన్ :** రాయబాగిన్ అంటే రాజసహోదరి అని అర్థం. నిజాం పాలకుడు రాణీ శంకరమ్మకు ఇచ్చిన బిరుదు ఇది.

**అన్నపూర్ణ :** కాశీలోని విశ్వనాథుని ఇల్లాలుపేరు అన్నపూర్ణ. అందరికీ ఆహారం (అన్నం) పెట్టేదే అన్నపూర్ణ.

**అందోలు :** గతంలో ఒక సంస్థానం. ప్రస్తుతం మెదక్ జిల్లాలో ఉన్నది.

**నైజాం రాజులు :** తెలంగాణను గతంలో పరిపాలించిన నిజాం వంశీయులైన మహ్మదీయ రాజులు.

**పీష్వాలు :** ఒకప్పుడు మహారాష్ట్రను పరిపాలించిన రాజులు.

SCERT TELANGANA